సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50


సంపుటి: 18 సంచిక: 1

సోమవారం 24-3-2025

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'



ఇషాన్‌దార్ రైజర్స్

ఐపీఎల్‌లో ఆదివారం రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 44 పరుగుల తేడాతో గెలిచింది. ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 106 నాటౌట్; 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. తొలుత సన్‌రైజర్స్ 6 వికెట్లకు 286 పరుగులు చేయగా...రాజస్తాన్ 6 వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసి ఓడిపోయింది.

12 లో



నాపై కుట్రలు: జస్టిస్ వర్మ

తనకు వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తేల్చిచెప్పారు.

- వివరాలు 6లో▶



అవి రాజ్యాంగ ఉల్లంఘనే...

మత ప్రాతిపదికన రిజర్వేషన్లను రాజ్యాంగం అనుమతించలేదని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలె తెలిపారు.


- వివరాలు 6లో▶



గాజా మృతులు 50 వేలు

గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి బలైన వారి సంఖ్య 50 వేలు దాటిందని అక్కడి ఆరోగ్య విభాగం ప్రకటించింది.

- వివరాలు 6లో▶



పోప్‌కు పూర్తి స్వస్థత

ప్రాణాంతక నిమోనియా బారినపడి ఐదు వారాలపాటు ఆస్పత్రిపాలైన పోప్ ఫ్రాన్సిస్ (88) పూర్తిగా కోలుకొని డిశ్చార్జి అయ్యారు.

- వివరాలు 6లో▶

పల్లెల్లో పడకేసిన పాలన

14 నెలలుగా సర్పంచులు లేక.. కేంద్ర, రాష్ట్ర నిధులు రాక అవస్థలు

- డ్రైనేజీలు పూడుకుపోయి, రోడ్లపైనే చెత్త పేరుకుపోయి.. పారిశుధ్యం అస్తవ్యస్తం.. గ్రామాలన్నీ దుర్గంధ భరితం
- ట్రాక్టర్ల లోన్ వాయిదాలు కట్టలేక ఇబ్బంది.. డీజిల్, డ్రైవర్ జీతానికీ సమస్యే..
- వెలగని వీధి దీపాలు.. ఎండిపోతున్న మొక్కలు... పర్యవేక్షణను పట్టించుకోని ప్రత్యేకాధికారులు
- పంచాయతీల నిర్వహణ కోసం కిందా మీదా పడుతున్న కార్యదర్శులు
- 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెలుగులోకి ఆందోళనకర అంశాలు



చెత్తాచెదారంతో నిండిన ఈ ప్రదేశం ఓ వ్యవసాయ బావి. యాదగిరిగుట్ట మండలం చిన్నగౌరయపల్లి గ్రామంలోనిది ఈ దృశ్యం. సర్పంచులు ఉన్నప్పుడు గ్రామంలోని చెత్తా చెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించేవారు, కంపోస్ట్ ఎరువులు తయారుచేసేవారు. కానీ ప్రత్యేకాధికారుల పాలనలో పర్యవేక్షణ కొరవడటం, నిధులు లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యాన్ని పట్టించుకునేవారే లేకుండా పోయారు. దానికి నిదర్శనం ఈ చిత్రం.

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీ పాలక మండళ్ల పదవీకాలం ముగియడంతో గతేడాది ఫిబ్రవరి నుంచి అంటే దాదాపు 14 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. వారికి ఇతర బాధ్యతలు ఉండటంతో పంచాయతీలపై దృష్టిపెట్టే పరిస్థితి లేదు. పైగా కేంద్ర, రాష్ట్రాల నిధులు ఆగిపోయాయి. దీనితో మెజారిటీ పల్లెల్లో పాలన పడకేసింది. మొత్తం 12,754 గ్రామ పంచాయతీల్లో 30శాతం వరకు జనాభాపరంగా పెద్ద పంచాయతీలు. వాటిలో పన్నుల వసూలు, ఇతర రూపాల్లో కొంత ఆదాయ వనరులు ఉండటంతో.. నెలవారీ ఖర్చులు కొంతవరకు వెళ్లదీసుకోగలిగే స్థితిలో ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణ వంటివి చేపట్టగలుగుతున్నాయి. మిగతా 70శాతం పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఆదాయం సరిపోక పంచాయతీ సెక్రెటరీలు, ఇతర అధికారులు అప్పోసప్పో చేసి బండి లాగాల్సి వస్తోంది. అదీ రోజువారీ నిర్వహణ కోసమే ఇబ్బంది ఎదురవుతోంది. అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా కుంటుపడ్డాయి.

అప్పులు చేసి నడిపించిన సర్పంచులు..

గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చెత్త సేకరణ, ఇతర అవసరాల కోసం ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్ ఉండాలనే నిబంధన అమలుచేశారు. దానితో బ్యాంకు రుణాలతో ట్రాక్టర్లు కొన్నారు. ఇప్పుడు వాటి వాయిదాలు చెల్లించలేక, డీజిల్, డ్రైవర్ జీతం, ఇతర నిర్వహణ ఖర్చులకు డబ్బుల్లేక ఇబ్బంది ఎదురవుతోంది. సర్పంచులు ఉన్నప్పుడు తమ సొంత నిధులు ఉపయోగించి, తమ పరపతితో అప్పులు తీసుకుని వచ్చి పారిశుధ్యం, ఇతర పనులు నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి క్రమం తప్పకుండా నిధులు అందేవి. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు వచ్చినా, రాకపోయినా గ్రామాల్లో నెలవారీ ఖర్చులతోపాటు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగేవి. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిశాక ఎన్నికలు జరగకపోవడంతో

మిగతా 2వ పేజీలో ▶

ఏప్రిల్ 1 నుంచి

సన్న బియ్యం!

రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌షాపుల ద్వారా పేదలకు పంపిణీ

- ఉగాదిని పురస్కరించుకుని ఈ నెల 30న హుజూర్‌నగర్‌లో లాంఛనంగా ప్రారంభం
- మండల స్థాయి స్టాక్ పాయింట్లకు బియ్యం తరలింపు ఏర్పాట్లు షురూ
- నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని తేల్చిన పౌరసరఫరాల శాఖ



సాక్షి, హైదరాబాద్: రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఏప్రిల్ నెల కోటా కింద అదే నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. అయితే ఉగాది సందర్భంగా ఈ నెల 30న పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గం హుజూర్‌నగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. తొలుత సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో ప్రారంభించాలని భావించినప్పటికీ, తర్వాత హుజూర్‌నగర్‌ను ఖరారు చేసినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. కాగా బియ్యం పంపిణీకి పౌరసరఫరాల శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ గోడౌన్ (స్టేజ్–1 స్టాక్ పాయింట్)ల నుంచి మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లకు సన్న బియ్యం తరలించే ఏర్పాట్లు ఇప్పటికే మొదలయ్యాయి. వాటిని రేషన్ దుకాణాల ద్వారా ఆహార భద్రత కార్డులు కలిగిన వారికి ఒక్కో యూనిట్‌కు (ఒక్కరికి) 6 కిలోల చొప్పున పంపిణీ చేస్తారు.

ఏటా 24 ఎల్ఎంటీల బియ్యం అవసరం

రాష్ట్రంలో పౌరసరఫరాల శాఖ పరిధిలోని రేషన్ దుకాణాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ఇప్పటివరకు దొడ్డు బియ్యమే అందుతున్నాయి. రాష్ట్రంలో 90 లక్షల వరకు ఆహార భద్రతా కార్డులు ఉండగా, ఇందులో జాతీయ ఆహార భద్రత చట్టం కింద కేంద్రం ఇచ్చిన కార్డులు (ఐఎఫ్ఎస్‌సీ) 54.48 లక్షలు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జారీ అయిన కార్డులు 35.66 లక్షలు ఉన్నాయి. ఇవి కాకుండా అంత్యోదయ అన్న యోజన కింద 5.62 లక్షల కార్డులు ఉండగా, అన్నపూర్ణ పథకం కింద 5,211 కార్డులు ఉన్నాయి. మొత్తంగా

మిగతా 10వ పేజీలో ▶

న్యూస్‌రీల్

డీలిమిటేషన్‌పై కేంద్రం నిర్ణయం తీసుకోలేదు



కేంద్రం డీలిమిటేషన్‌పై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందాక నియోజకవర్గాల పునర్విభజనపై చర్చలు మొదలవుతాయన్నారు.

- వివరాలు 3లో▶

ఆర్టీసీపై 'రాయితీ' బండ!



రాయితీ బస్‌పాస్‌లు ఇకపై ఉంటాయో ఉండవో తెలియని పరిస్థితి నెలకొంది. ఇంతకాలం ఈ పాస్‌ల ద్వారా ఆర్టీసీ కోల్పోతున్న ఆదాయాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తూ వచ్చింది. కానీ తాజా బడ్జెట్‌లో రాయితీ బస్‌పాస్‌లకు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రస్తావించలేదు.

- వివరాలు 14లో▶

మాకూ సైబర్ ముప్పుంది



సైబర్ ముప్పునకు గురవుతున్న వారిలో సామాన్యుల నుంచి అన్ని రంగాల్లోని ప్రముఖులు సైతం ఉంటున్నారు. సాధారణ వ్యక్తులను టార్గెట్ చేయడం కంటే పెద్ద పెద్ద కంపెనీల్లోని కీలక వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటే ఎక్కువ డబ్బులు కొట్టేయొచ్చన్న ధోరణిలో ఆన్‌లైన్ మోసగాళ్లు ఉంటున్నారు.

- వివరాలు 14లో▶

మీ స్కోర్ ఎంత?



మనలో కొందరు ఏటా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటూ ఉంటారు. అదే మాదిరి క్రెడిట్ రిపోర్ట్‌ను ఏడాదికోసారైనా తనిఖీ చేసుకోవడం ద్వారా మెరుగైన క్రెడిట్ స్కోర్‌తో రుణ పరపతిని గణనీయంగా పెంచుకోవచ్చు.

- వివరాలు 13లో▶



ఎవ్వరినీ వదలం

మా కార్యకర్తలను వేధిస్తున్న అందరి పేర్లు రాస్తున్నాం

నేను కేసీఆర్ అంత మంచోడిని కాదు

- రిటైరైనా, విదేశాలకు వెళ్లినా వదిలిపెట్టం
- పార్టీపై విష ప్రచారం, చిన్న తప్పుల వల్లే ఓడిపోయాం
- బీఆర్ఎస్ గెలుపు చారిత్రక అవసరం
- గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేస్తాం
- ఏప్రిల్ 27న వరంగల్ సభతో సత్తా చాటుదాం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ క్రైం: బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్న ఏ ఒక్క అధికారిని వదిలిపెట్టబోమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హెచ్చరించారు. అందరి పేర్లు రాస్తున్నామని, విదేశాలకు వెళ్లినా వదిలిపెట్టేది లేదని అన్నారు. తాను కేసీఆర్ అంత మంచివాడిని కాదని స్పష్టంచేశారు. ఆదివారం కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో ఎవరిని కదిపినా కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె అని యాది జేసుకుంటున్నారు. ఎప్పుడెప్పుడు బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందా? అని ఎదురుచూస్తున్నారు. అందుకే, రాష్ట్రంలో బీఆర్ఎస్ గెలుపు చారిత్రక అవసరం. పార్టీపై విష ప్రచారం, అంతర్గత పొరపాట్ల వల్లనే ఓడిపోయాం. వాటిని పునరావృతం కానివ్వం. కేడర్‌ను సంస్థాగతంగా నిర్మించి బలోపేతం చేస్తాం. జిల్లా పార్టీ కార్యాలయాల్లో శిక్షణా శిబిరాలు నిర్వహిస్తాం. నేను కేసీఆర్ అంత మంచోడిని కాను. మా కార్యకర్తలపై కేసులు పెడుతున్న ప్రతి అధికారి పేరు రాసుకుంటున్నాం. వాళ్లు రిటైరైనా, విదేశాలకు వెళ్లినా వదిలే ప్రసక్తే లేదు. ఏప్రిల్ 27న వరంగల్ సభలో మన బలం చూపిద్దాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతల్ని గెలిపించుకుని సత్తా చాటుదాం'అని పిలుపునిచ్చారు.

జానెడు ఉన్నోడు కూడా ఎగిరిపడుతుండు

పదేళ్ల అధికారంలో ఉండి ప్రజల తలరాతలు మార్చామని కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష హోదాలో ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తున్నామని చెప్పారు. 'కేసీఆర్ పోరాడి

మిగతా 10వ పేజీలో ▶



సొరంగంలోని ప్రమాదస్థలంలో మట్టి, శిథిలాలను తొలగిస్తున్న సహాయక బృందాలు

సొ'రంగం' వదిలేస్తారా?

నెల రోజులైనా కానరాని గల్లంతైన కార్మికుల జాడ

- ఇప్పటివరకు ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిన చోటుకు ముందు తవ్వకాలు
- ఇక మిగిలింది సరిగ్గా ప్రమాదం జరిగిన చోట తవ్వకాలు జరపడమే
- అక్కడ తవ్వితే మళ్లీ సొరంగం కూలుతుందనే భయాందోళనలు
- నేడు సీఎం నేతృత్వంలో సమీక్ష.. సహాయక చర్యల కొనసాగింపుపై నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్/నాగర్‌కర్నూల్: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం సరిగ్గా ఎక్కడ కుప్పకూలిందో అక్కడ తవ్వకాలు జరిపేందుకు అవకాశాలు లేవా?.. సహాయక చర్యల్లో పాల్గొంటున్న కొందరు అధికారులు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమిస్తున్నారు. ఇప్పటివరకు సొరంగం పైకప్పు కూలిన ప్రాంతం నుంచి ముందుకు కొట్టుకువచ్చిన బండరాళ్లు, మట్టి, బురద, తుక్కును తొలగించారు. ఇక సొరంగం ఎక్కడైతే కూలిందో అక్కడ శిథిలాలను తొలగించాల్సి ఉండగా, అక్కడ తవ్వకాలు జరిపితే మళ్లీ సొరంగం కుప్పకూలి సహాయక సిబ్బందికి ప్రమాదం వాటిల్లవచ్చనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సహాయక చర్యలు కొనసాగించాలా? లేక నిలుపుదల చేయాలా? అన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. మొత్తం 12 ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాల్గొంటుండగా, వారికి తోడుగా రాడార్లు, డ్రోన్లు, రోబోలు, ఎక్స్‌కవేటర్లను

మిగతా 5వ పేజీలో ▶

మహిళా రైతులకే వ్యవసాయ యాంత్రీకరణ

- ఈ నెలాఖరులోగా 10,812 యూనిట్లు అందజేసేందుకు ఆదేశాలు
- 14 రకాల వ్యవసాయ పనిముట్లు ఇచ్చేందుకు రూ.24.90 కోట్ల నిధులు విడుదల
- క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపికకు వ్యవసాయ అధికారుల ఉరుకులు..పరుగులు

- వివరాలు 3లో



చివరి ఎకరాకూ సాగునీరు

- కృష్ణా జలాల్లో వాటా పెరిగేలా సర్కారు కృషి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- వివరాలు 10లో

రూ. 1,500 కోట్లే చివరి రుణం

- ఈ నెల 25న బాండ్ల వేలం ద్వారా సమకూర్చుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఇదే ఆఖరు బహిరంగ మార్కెట్ రుణం
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ ద్వారా రూ. 56 వేల కోట్ల సమీకరణ
- చివరి మూడు నెలల్లో రూ.30 వేల కోట్లకు షెడ్యూల్ ఇచ్చినా రూ. 15 వేల కోట్లకే పరిమితం

2 లో





'దోస్త్'కు కటీఫ్!

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించిన ఆన్‌లైన్ వ్యవస్థ ఎత్తివేతకు రంగం సిద్ధం!

- ఇంటర్ పరీక్షలు పూర్తయినా ఇంతవరకు కన్వీనర్‌ను నియమించని వైనం
- ఎత్తివేతకు ఉన్నత విద్యా మండలి కూడా సుముఖంగా ఉందనే అనుమానాలు
- ప్రైవేటు కాలేజీల ఒత్తిడే కారణమంటున్న విద్యార్థి సంఘాలు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏకీకృత ఆన్‌లైన్ వ్యవస్థ 'దోస్త్'(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ)ను ఎత్తివేసేందుకు రంగం సిద్ధమైందా? ఇంటర్ పరీక్షలు పూర్తయినా ఇంతవరకూ దోస్త్ కన్వీనర్ నియామకం చేపట్టకపోవడం ఈ అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిగ్రీ కళాశాలలను ఒకే గొడుగు కిందకు తెచ్చేలా ప్రవేశపెట్టిన 'దోస్త్'పై మొదట్నుంచీ ఉన్నత విద్యా మండలిలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ విధానం లోపభూయిష్టంగా ఉందని కొందరు ఉన్నతాధికారులు బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. కొన్నిరోజులు ఇందులో మార్పులు తేవాలనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల అసలీ విధానం ఎత్తివేస్తే బాగుంటుందనే వాదనలూ బలపడ్డాయి. దీనిపై మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి కూడా స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. కన్వీనర్ నియామకంపై వివరణ కోరగా.. 'కొన్ని మార్పులు అవసరం. ప్రభుత్వ నిర్ణయం మేరకు వ్యవహరిస్తాం'అని చెప్పారు. అడ్మిషన్ల విధానాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి నాన్ 'దోస్త్'కాలేజీలతో పాటు పలు ప్రైవేటు

మిగతా 10వ పేజీలో ▶

అందరికీ ఒకే విధానం ఉండాలి



'దోస్త్'పరిధిలోని కాలేజీలకు ఫీజులపై నియంత్రణ ఉంది. మిగతా కాలేజీలు మాత్రం ఇష్టానుసారంగా ప్రవేశాలు చేపడుతున్నాయి. ఇలాఎందుకు? అందరికీ ఒకే విధానం అమలు చేయాలి.

– గౌరి సతీష్ (ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)

నెయ్యి రోజుకు 10 గ్రాములు చాలు!



- నెయ్యిలో కొవ్వు పదార్థాలే ఎక్కువ విటమిన్లు తక్కువే
- మొత్తంగా కొవ్వు పదార్థాలు రోజుకు 30 గ్రాములకు మించకూడదు
- ఆవు నెయ్యిలో గేదె నెయ్యి కంటే తక్కువ శాతం కొవ్వు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ అహ్మద్ ఇబ్రహీం

- వివరాలు 2లో

రోజుకు 10 గ్రాములు చాలు!



నెయ్యిలో కొవ్వు పదార్థాలే ఎక్కువ.. విటమిన్ల మోతాదు తక్కువే

మొత్తంగా కొవ్వు పదార్థాలు రోజుకు 30 గ్రాములకు మించకూడదు

ఆవు నెయ్యిలో గేదె నెయ్యి కంటే తక్కువ శాతం కొవ్వు

'సాక్షి' ఇంటర్వ్యూలో ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ అహ్మద్ ఇబ్రహీం



సాక్షి, స్పెషల్ డెస్క్: అమ్మ చేతి గోరు ముద్దను నెయ్యి కమ్మదనం లేకుండా ఊహించలేం. నేతి రుచి తగలకపోతే భోజనమైనా, అల్పాహారమైనా, పిండి వంటలైనా సంతృప్తికరం, సంపూర్ణమూ కావంటే అతిశయోక్తి కాదు. వివిధ రకాల పచ్చళ్లు, పొడులకు కాస్త నెయ్యి జోడించి తింటే ఆ మజాయే వేరు. 3 వేల ఏళ్ల క్రితం నుంచే నెయ్యి వాడకం ఉందని చరిత్ర చెబుతోంది. అయితే నెయ్యి వినియోగంపై భిన్నాభిప్రాయాలున్నాయి. మంచిదని కొందరంటుంటే, మితిమీరి వాడితే రక్తనాళాల్లో అవరోధాలేర్పడతాయని కొందరంటున్నారు. ఇంతకీ నిపుణులేమంటున్నారు? భారతీయులు సగటున రోజుకు 10 గ్రాముల వరకు నెయ్యి/వెన్న తీసుకోవచ్చని హైదరాబాద్‌లోని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) అనుబంధ సంస్థ జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్)లో లిపిడ్ కెమిస్ట్రీ డివిజన్ సైంటిస్ట్ (జి)గా ఉన్న డాక్టర్ అహ్మద్ ఇబ్రహీం తెలిపారు.

'సాక్షి' ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే..

ఔషధ విలువలపై పరిశోధనలు జరగలేదు..

నెయ్యిలో ఎక్కువ వరకు కొవ్వు పదార్థాలే ఉంటాయి. విటమిన్ ఎ, ఇ, కె కూడా కొంతవరకు ఉంటాయి కానీ, అవి పరిగణనలోకి తీసుకోదగినంత ఎక్కువగా ఉండవు. అందుకని ఈ విటమిన్లను పొందటం కోసం నెయ్యిని వనరుగా చూడకూడదు. ఆవు నెయ్యిలో గేదె నెయ్యి కంటే తక్కువ శాతం కొవ్వు ఉంటుంది. మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్ అనే ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థం ఆవు నెయ్యిలో కొంచెం ఎక్కువగా ఉంటుంది.. అంతే తేడా. నెయ్యిలో ఔషధ విలువల గురించి ఎన్ఐఎన్‌లో పరిశోధనలేమీ చెయ్యలేదు. అలాగే వేసవిలో ఎంత నెయ్యి తీసుకోవాలి? అనే విషయంపై కూడా పరిశోధనలేమీ జరగలేదు. అయితే నెయ్యిని నిర్దేశిత మోతాదుకు మించకుండా తీసుకోవాలి.

నెయ్యిలో పోషకాలు (100 గ్రాములకు)

శక్తి	870 కిలోకేలరీలు
పిండి పదార్థం	0 గ్రా.
కొవ్వు	99.5 గ్రా.
శాచ్యురేటెడ్ ఫ్యాట్	61.9 గ్రా.
మోనో శాచ్యురేటెడ్ ఫ్యాట్	28.7 గ్రా.
పాలీ అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాట్	3.69 గ్రా.
మాంసకృత్తులు	0.3 గ్రా.
కొలెస్ట్రాల్	256 మిల్లీ గ్రాములు
కాల్షియం	4 మిల్లీ గ్రాములు

వేర్వేరు వంట నూనెలు మంచిది

ఒకరు సగటున రోజుకు సుమారు 2,000 కిలో కేలరీల ఆహారం తీసుకోవాలి. అందులో 30% కేలరీల మేరకు కొవ్వు పదార్థాలు ఉండాలి. అందులో 'ఇన్‌విజిబుల్ ఫ్యాట్'సగం, 'విజిబుల్ ఫ్యాట్'సగం ఉండాలి. మనం రోజూ తినే అనేక ఆహార పదార్థాల్లో అంతర్లీనంగా కలిసి ఉండే కొవ్వు పదార్థాలనే 'ఇన్‌విజిబుల్ ఫ్యాట్'అంటున్నాం. 2,000 కిలో కేలరీల ఆహారం తీసుకునే వ్యక్తి రోజుకు సుమారు 30 గ్రాముల 'విజిబుల్ ఫ్యాట్'అంటే.. వంట నూనెలు, నెయ్యి/వెన్న వంటివి తీసుకోవచ్చు. వీటిలో మూడింట ఒక వంతు మాత్రమే నెయ్యి/వెన్న ఉండాలి. వంట నూనెలు ఒకే రకం కాకుండా అనేక రకాలను తీసుకోవటం చాలా మంచిది. ఒక్కో నూనెలో ఒక్కో రకం ఫ్యాటీ యాసిడ్ పాళ్లు అధికంగా ఉంటాయి. అందుకే అనేక రకాల నూనెలను రోజుకు 20 గ్రాముల వరకు తీసుకోవచ్చు. 10 గ్రాములకు మించకుండా నెయ్యి / వెన్న వంటి శాచ్యురేటెడ్ ఫ్యాట్ అధికంగా ఉన్న పదార్థాలను తీసుకోవచ్చు. అయితే, 30 గ్రాముల వరకు నూనెలు తీసుకునే వారు కూడా నెయ్యి తప్పకుండా తీసుకోవాలనేమీ లేదు. మొత్తం కలిపి కొవ్వు పదార్థాలు రోజుకు 30 గ్రాములకు మించకుండా తీసుకోవాలి. దీన్ని ఎన్ఐఎన్ విడుదల చేసిన 'భారతీయులకు ఆహార సంబంధ మార్గదర్శక సూత్రాలు'లోనూ పొందుపరిచాం.

పిల్లలు ఇలా తీసుకోవాలి

పిల్లలు వారి వయసు, బరువు ఆధారంగా ఎన్ని కేలరీలను రోజువారీ ఆహారం తీసుకోవాలో ఎన్ఐఎన్ నిర్దేశించింది.

- 10–12 ఏళ్ల మగ పిల్లలు రోజుకు 2,200 కేలరీల ఆహారం తినాలి. వీరు 24 గ్రాముల నూనెలు, 12 గ్రాముల నెయ్యి/వెన్న వాడొచ్చు.
- 10–12 ఏళ్ల ఆడ పిల్లలు రోజుకు 2,000 కేలరీల ఆహారం తినాలి. 22 గ్రాముల నూనెలు, 11 గ్రాముల నెయ్యి/వెన్న వాడొచ్చు.
- 13–15 ఏళ్ల మగ పిల్లలు రోజుకు 2,800 కేలరీల ఆహారం తినాలి. వీరు 30 గ్రాముల నూనెలు, 15 గ్రాముల నెయ్యి/వెన్న వాడొచ్చు.
- 13–15 ఏళ్ల ఆడ పిల్లలు రోజుకు 2,400 కేలరీల ఆహారం తినాలి. 27 గ్రాముల నూనెలు, 13 గ్రాముల నెయ్యి/వెన్న వాడొచ్చు.
- 16–18 ఏళ్ల మగ పిల్లలు రోజుకు 3,300 కేలరీల ఆహారం తినాలి. వీరు 37 గ్రాముల నూనెలు, 18 గ్రాముల నెయ్యి/వెన్న వాడొచ్చు.
- 16–18 ఏళ్ల ఆడ పిల్లలు రోజుకు 2,500 కేలరీల ఆహారం తినాలి. వీరు 28 గ్రాముల నూనెలు, 13 గ్రాముల నెయ్యి వాడొచ్చు.

వ్యాయామం చేసే వారికి నెయ్యితో మేలు!



నెయ్యి మన శరీరంలో ఉష్ణోగ్రతను సమస్థితిలో ఉంచుతుంది. మెదడును శక్తిమంతం చేస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది. వాతాన్ని, పైత్యాన్ని, కఫాన్ని సమస్థితిలో ఉంచుతుంది. చర్మానికి కాంతినిస్తుంది. లైంగిక సామర్థ్యాన్ని పెంచుతుంది. నేతిలోని బుటిరేట్ జఠరాగ్నిని ప్రజ్వలింపజేస్తుంది. విష దోషాల్ని, పేగుల్లో పుళ్లు, వాపుల్ని, గడ్డల్ని నివారిస్తుంది. నెయ్యి తినే అలవాటున్న వారిలో పేగు కేన్సర్ తక్కువ. భారతీయ గోసంతతి విదేశీ గోసంతతి కన్నా భిన్నమైనది. మన ఆవుల వెన్నలో అపకారక ఎల్‌డీఎల్ కొవ్వు కన్నా ఉపకారక హెచ్‌డీఎల్ కొవ్వు ఎక్కువగా ఉంటుంది. బాగా వ్యాయామం చేసే వారికి నెయ్యి మేలే చేస్తుంది.

– డా. జీవీ పూర్ణచందు
ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు

పది పద్దులు... రెండు బిల్లులు

- నేడు అసెంబ్లీలో వార్షిక బడ్జెట్‌పై చర్చ
- డీలిమిటేషన్‌పై తీర్మానం కూడా..
- మున్సిపల్, పంచాయతీరాజ్ బిల్లులకు సవరణల ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ఎనిమిదోరోజు సోమవారం 2025–26 వార్షిక బడ్జెట్ పద్దులపై చర్చ కొనసాగనుంది. పురపాలక, సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమం, పరిశ్రమలు, ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా,శిశు సంక్షేమం, వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖల కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పద్దులపై సభ్యులు చర్చించనున్నారు. ఈ పద్దులపై చర్చతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రెండు బిల్లులను ప్రవేశపెట్టనుంది. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన రెండు బిల్లుల్లో సవరణలను ప్రతిపాదించనుంది. దీంతో పాటు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంలో కూడా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్టు తెలుస్తోంది. మరో 25 ఏళ్ల వరకు పాత పద్ధతినే కొనసాగించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెడతారని, దీనిపై చర్చ అనంతరం ఆమోదించి కేంద్రానికి పంపుతామని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

పౌరసరఫరాల శాఖను అగ్రగామిగా తీర్చిదిద్దాం

కమిషనర్ డీఎస్ చౌహాన్



సాక్షి, హైదరాబాద్: ప్రణాళికాబద్ధమైన నిర్ణయాలతో తెలంగాణలో పౌరసరఫరాల శాఖను అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేసినట్లు ఆ శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ పేర్కొన్నారు. ఆదివారం ఐఐఎం రాయ్‌పూర్‌లో జరిగిన 'ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ ప్రోగ్రాం'లో పాల్గొని తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలను ఆయన వివరించారు. పౌరసరఫరాల శాఖలో పారదర్శకత, సామర్థ్యం, సాంకేతిక ఆవిష్కరణలలో సాధించిన ముఖ్యమైన విజయాలను ఈ సందర్భంగా వెల్లడించారు. 100 శాతం రూట్ ఆప్టిమైజేషన్‌తో భారతదేశంలో మొదటి స్థానం సాధించామని, తద్వారా సంవత్సరానికి రూ. 12–15 కోట్ల మేర ఆదా చేసినట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, వడ్ల సేకరణలో సాంకేతికత వినియోగం, అక్రమాలపై కఠిన చర్యలతో రూ.409 కోట్ల విలువైన బియ్యం రికవరీ, ఫిలిప్పీన్స్‌తో బియ్యం ఎగుమతి ఒప్పందం వంటి విజయాలను ఆయన విశదీకరించారు. ఈ సాఫల్యాలు తెలంగాణను ఆహార భద్రత, ప్రజా పంపిణీ వ్యవస్థలో దేశానికి ఆదర్శంగా నిలిపాయని ఆయన వెల్లడించారు.

'రాష్ట్రాల ప్రాతిపదికన ఎంపీ సీట్లు కేటాయించాలి'

బంజారాహిల్స్: డీలిమిటేషన్‌లో జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్రాల ప్రాతిపదికన ఎంపీ సీట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెన్నైలో జరిగిన డీలిమిటేషన్ సమావేశంలో దాదాపు అన్ని పార్టీలు పాల్గొన్నాయన్నారు. 2006లో డీలిమిటేషన్ జరిగిందని, ఆ సమయంలో అనేక సమస్యలు ఎదురయ్యాయన్నారు. కేంద్రానికి రాష్ట్రం పంపించే నిధులపై, రాష్ట్ర అధికారాలపై తాము మాట్లాడుతున్నామన్నారు. కొన్నేళ్లుగా దక్షిణాదిన జనాభా తగ్గుతోందని, ఉత్తరాదిన మాత్రం జనాభా పెరుగుతోందన్నారు. ఆ విధంగా దక్షిణాదికి అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రాల సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. అమిత్ షా పార్లమెంట్‌లో దిగజారి మాట్లాడారన్నారు. దక్షిణాదికి 33 శాతం సీట్లు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరినట్లు చెప్పారు.

పల్లెల్లో పడకేసిన పాలన

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సుమారు రూ.1,600 కోట్లు ఆగిపోయాయి. దీనితో సొంత ఆదాయ వనరులు లేని గ్రామాల పరిస్థితి అధ్వానంగా మారిపోయింది.

రాష్ట్ర ప్రభుత్వ నిధులూ అందక..

గత ప్రభుత్వం అధికారంలో ఉన్న చివరి కొన్ని నెలలతోపాటు కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్ని నెలలుగా గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు సరిగా విడుదల కావడం లేదు. పంచాయతీలకు ప్రతినెలా కేంద్ర ఆర్థిక సంఘం ఇచ్చే నిధులకు సమానంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదల చేస్తామని గత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రతినెలా కేంద్రం ఇచ్చే రూ.220 కోట్లకు మ్యాచింగ్‌గా రూ.220 కోట్లను కొన్నినెలల పాటు ఇచ్చింది. క్రమంగా రాష్ట్ర సర్కారు ఇచ్చే మొత్తం రూ.150 కోట్లకు తగ్గించింది. ఆ తర్వాత మొత్తంగా నిలిచిపోయింది. పంచాయతీలకు ఇవ్వాల్సిన మొత్తం సుమారు రూ.వెయ్యి కోట్లకుపైనే ఉంటుందని అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ సందర్భాల్లో గ్రామ పంచాయతీలకు రూ.700 కోట్ల దాకా విడుదల అధికారవర్గాలు చెబుతున్నాయి. దీనితోపాటు పంచాయతీ సిబ్బంది వేతనాలను గ్రీన్ చానెల్‌లో చెల్లించేలా చర్యలు చేపడుతున్నట్టు ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. దీంతో పంచాయతీలపై కొంతమేర అయినా ఆర్థిక భారం తగ్గొచ్చునని భావిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల పాట్లు

గ్రామాల్లో సర్పంచులు లేకపోవడం, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ నామమాత్రంగానే ఉంటుండటంతో.. పూర్తి బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శులపైనే పడుతోంది. దాదాపు 14 నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులేమీ రాకపోవడంతో.. పంచాయతీ పరిధిలో సమకూరే అరకొర ఆదాయంతోనే నెట్టుకొస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సిబ్బందికి జీతాలు, గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ, మొక్కలకు నీళ్లు పోయడం, తాగునీటి పైపులైన్ల లీకేజీ మరమ్మతులకు, మోటార్లు పాడైతే మరమ్మతులు చేయించడం, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు చేయించడానికి కూడా ఇబ్బంది ఎదురవుతున్న పరిస్థితి. గ్రామాల్లోని వీధుల్లో చెత్తాచెదారాన్ని తీసుకెళ్లి ఊరవతల ఇష్టమొచ్చినట్టుగా పడేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

అప్పులు తెచ్చి నడిపిస్తున్నా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 844 గ్రామ పంచాయతీలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పైసా కూడా అందక అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. రోజువారీ నిర్వహణ కోసం కూడా ఇబ్బంది ఎదురవుతుండటంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి నడిపిస్తున్న పరిస్థితి ఉంది. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పులు తెచ్చి గ్రామాలను నడుపుతున్నామని, పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని కార్యదర్శులు కోరగా.. పరిశీలిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.





యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బుడగ జంగాల కాలనీలో మురుగుతో నిండిన డ్రైనేజీ

రోడ్ల నిండా మురుగు పారుతూ..

ఉమ్మడి నల్లగొండ జిల్లా వలిగొండ మండల కేంద్రంలో పారిశుద్యం దుస్థితి ఇది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు నిండిపోయి, మోరీల పైపులు పగిలిపోయి రోడ్లపైన మురుగు పారుతోందని ప్రజలు ఫిర్యాదు చేసినా.. నిధులు లేక ఏమీ చేయలేకపోతున్నామంటూ పంచాయతీ అధికారులు చేతులెత్తేస్తున్న పరిస్థితి ఉంది. గ్రామంలో సుమారు 50 వీధి దీపాలు పని చేయడం లేదని, రాత్రయితే వీధులన్నీ చీకటేనని స్థానికులు చెబుతున్నారు. "సర్పంచులు పోయినప్పటి నుంచి ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్లపై మురుగు పారుతున్నా, వీధి దీపాలు వెలగకున్నా.. నిధులు వచ్చాక పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు ఇచ్చి ప్రజల సమస్యలు పరిష్కరించాలి" అని గ్రామానికి చెందిన నానచర్ల రమేష్ డిమాండ్ చేస్తున్నారు.



ఈ ఫోటోలో ట్రాక్టర్‌ను తీసుకెళుతున్న వ్యక్తి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టి గూడెం గ్రామ మాజీ సర్పంచ్ గుగులోత్ నెహ్రూ నాయక్. ఆయన సర్పంచిగా ఉన్న సమయంలో గ్రామ పంచాయతీ కోసం ఈ ట్రాక్టర్‌ను తన పేరిట లోన్ తీసుకుని కొనుగోలు చేశారు. సర్పంచుల పదవీకాలం అయిపోయిన తర్వాత గ్రామ పంచాయతీలకు నిధులు ఆగిపోయాయి. ట్రాక్టర్ లోన్‌కు సంబంధించిన నెలవారీ వాయిదాలను పంచాయతీ నుంచి చెల్లించడం లేదు. దీనితో తన సిబిల్ స్కోర్ పడిపోతోందని, బ్యాంకులు అప్పు ఇవ్వడం లేదని ఆగ్రహించిన ఆయన.. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను తన ఇంటికి తీసుకెళ్లారు.

రూ.7లక్షలు అప్పు తెచ్చి పెట్టిన..

ప్రస్తుతం గ్రామాల్లో పాలకవర్గాలు లేవు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావడం లేదు. ఏడాదిన్నరగా ప్రజల సమస్యలను తీర్చేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇప్పటివరకు ఏడు లక్షల రూపాయలు అప్పుగా తెచ్చి వివిధ పనులకు ఖర్చు చేశాను.

– సోమయ్య, అనంతారం గ్రామ కార్యదర్శి, నల్లగొండ

వీధి లైట్లు వెలగక.. ఇబ్బందిగా..

హనుమకొండ జిల్లా కమలాపూర్ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల నుంచి ఎస్సీ హాస్టల్ మీదుగా కాసీంపల్లికి వెళ్లే మార్గంలో సుమారు 20 రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. లైట్లు పెట్టించాలని పంచాయతీ అధికారులకు చెబితే.. నిధుల కొరతతో ఇబ్బంది ఉందంటూ జాప్యం చేస్తున్నారు. చీకటి పడిందంటే చాలు ఆ మార్గంలో వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది ఎదురవుతోందని స్థానికుడు శనిగరపు రంజిత్ పేర్కొన్నారు.

నాలుగైదు లక్షల చొప్పున అప్పులు తెచ్చి పెట్టాం



గార్ల మండల కేంద్రంలో రహదారి పక్కన పేరుకు పోయిన చెత్తా చెదారం

గ్రామ పంచాయతీలకు రెండేళ్లుగా నిధులు రాకపోవడంతో ఒక్కో పంచాయతీ నిర్వహణ కోసం ఇప్పటివరకు రూ. నాలుగైదు లక్షలు అప్పులు తెచ్చి పెట్టాం. ట్రాక్టర్ డీజిల్, తాగునీటి ఎద్దడి నివారణకు మోటార్లు, పైపులైన్ల రిపేర్లకు అప్పులు తెచ్చి పెడుతున్నాం. నిధులు లేక సక్రమంగా నిర్వహణ చేయలేకపోతున్నాం. రాష్ట్ర ప్రభుత్వమైనా గ్రాంటు విడుదల చేసి సమస్యను పరిష్కరించాలి.

– బానోత్ రమేశ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శుల సంఘం గార్ల మండల అధ్యక్షుడు, మహబూబాబాద్ జిల్లా

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామంలో డ్రైనేజీ దుస్థితి



ఊరంతా కంపు కొడుతోంది

మేజర్ గ్రామపంచాయతీ అయిన ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. మురుగు కాల్వలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. పాలకవర్గాలు లేక, నిధులు లేక అధికారులు పనులేవీ చేయించడం లేదు. ఇక నేలకొండపల్లి మండలంలోని భైరవునిపల్లి గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. డ్రైనేజీలకు మరమ్మతులు చేయించలేని దుస్థితి నెలకొంది. గ్రామస్తులు ఇదేమిటని నిలదీస్తే.. రోజువారీ నిర్వహణ కోసమే అప్పులు చేయాల్సి వస్తోందని గ్రామ కార్యదర్శి తలపట్టుకుంటున్నారు. పంచాయతీ కోసం నియమించిన స్పెషలాఫీసర్ ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. చెత్త చెదారం నిండి, డ్రెయినేజీలు పూడుకుపోయి గ్రామంతా కంపు కొడుతోందని వాపోతున్నారు.

జనగామ జిల్లా పాలకుర్తి మండలం అయ్యంగారిపల్లి గ్రామంలో 1,500 జనాభా ఉన్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటి నుంచి పంచాయతీలో పాలన అస్తవ్యస్తంగా మారింది. తాగునీటి మోటార్ల మరమ్మతులు, బ్లీచింగ్ కొనుగోలు, వీధి దీపాల నిర్వహణ, చెత్త తరలింపు, ట్రాక్టర్ కిస్తీ, డీజిల్ ఖర్చులకు కూడా ఇబ్బంది ఎదురవుతోంది. ఇప్పటివరకు లక్షకుపైగా అప్పులు తెచ్చి, రోజువారీ నిర్వహణను నెట్టుకొస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి చెబుతున్నారు.

రూ.1,500 కోట్లే చివరి రుణం

ఈ నెల 25న బాండ్ల వేలం ద్వారా సమకూర్చుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం

- ఈ ఆర్థిక సంవత్సరంలో ఇదే ఆఖరు బహిరంగ మార్కెట్ రుణం
- 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ ద్వారా రూ.56 వేల కోట్ల సమీకరణ
- చివరి మూడు నెలల్లో రూ.30 వేల కోట్లకు షెడ్యూల్ ఇచ్చినా రూ.15వేల కోట్లకే పరిమితం



సాక్షి, హైదరాబాద్: ఈ ఆర్థిక సంవత్సరంలో చివరి రుణాన్ని ఈనెల 25న రాష్ట్ర ప్రభుత్వం సేకరించుకోనుంది. సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి ఈ అప్పును సమకూర్చుకోనుంది. ఈ మేరకు ఆర్‌బీఐ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం 27 సంవత్సరాల కాలపరిమితితో రూ.1000 కోట్లు, 30 సంవత్సరాల కాలపరిమితితో మరో రూ.500 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోనుంది. కాగా, ఈ రూ.1500 కోట్ల రుణంతో బహిరంగ మార్కెట్‌లో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.55,800 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకున్నట్టు అవుతుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా గత ఏడాది జూలై నెలలో రూ.8 వేల కోట్లు, ఆగస్టులో రూ.6 వేల కోట్లు, ఈ ఏడాది జనవరిలో రూ.5,800 కోట్లు ఆర్‌బీఐ ద్వారా రుణంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, మార్చి నెలలో ఇప్పటికే రూ. 5 వేల కోట్లను సమకూర్చుకుంది. ఈనెల 4న రూ.2 వేల కోట్లు, 11న రూ.3 వేల కోట్లు తీసుకున్న ప్రభుత్వం.. ఈనెల 25న మరో రూ.1,500 కోట్లు తీసుకోనుంది.

షెడ్యూల్‌లో సగమే!

అయితే, తొలి మూడు త్రైమాసికాల్లో రూ. 40వేల కోట్లకు పైగా రుణాన్ని ఆర్‌బీఐ ద్వారా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. చివరి త్రైమాసికంలో మరో రూ.30 వేల కోట్లు తీసుకోవాలని భావించింది. ఈ మేరకు గత ఏడాది డిసెంబర్‌లోనే ఆర్‌బీఐకి షెడ్యూల్ ఇచ్చింది. కానీ, చివరి మూడు నెలల్లో కేవలం రూ.15,300 కోట్ల రుణాలకు మాత్రమే పరిమితమైంది. అదే షెడ్యూల్ మేరకు రుణాలు తీసుకొని ఉంటే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై మరో రూ.14,700 కోట్ల రుణ భారం పడేది. కానీ, ప్రభుత్వం మాత్రం ఆ మేరకు రుణ సేకరణ జరపలేదు. ఈ విషయమై ఆర్థికశాఖ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ 'చివరి మూడు నెలల అవసరాలను బట్టి రూ.30 వేల కోట్లు అప్పులు అనివార్యమనే ఉద్దేశంతో ఆర్‌బీఐకి షెడ్యూల్ ఇచ్చాం. కానీ అనివార్యం కాకపోవడంతో తీసుకోలేదు. షెడ్యూల్‌లో పెట్టినా అవసరమైనప్పుడు మాత్రమే బిడ్డింగ్‌కు వెళ్లే వెసులుబాటు ఆర్‌బీఐ కల్పిస్తుంది.' అని వెల్లడించారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏ నెలలో ఎంత అప్పు అంటే..!

నెల	బహిరంగ మార్కెట్ రుణం (రూ.కోట్లలో)
ఏప్రిల్-2024	4,000
మే-2024	4,000
జూన్-2024	5,000
జూలై-2024	8,000
ఆగస్టు-2024	6,000
సెప్టెంబర్-2024	4,500
అక్టోబర్-2024	4,500
నవంబర్-2024	1,000
డిసెంబర్-2024	3,500
జనవరి-20205	5,800
ఫిబ్రవరి-2025	3,000
మార్చి-2025	6,500
మొత్తం	55,800

ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశాం: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో అస్తవ్యస్త ఆర్థిక పరిస్థితులు ఉన్నప్పటికి రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకున్న పంట రుణాలన్నింటినీ మాఫీ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పునరుద్ఘాటించారు. 25,35,964 మంది రైతులకు సంబంధించిన రూ.20,616.89 కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాల వల్ల రుణమాఫీకి నోచుకోని అర్హులైన రైతులను ఈ పథకం కిందకి తీసుకొచ్చే విధంగా 3 నెలల పాటు అధికారులు ఇంటింటికి తిరిగి సమాచారం సేకరించి, చివరి విడతగా 3,13,896 మంది రైతులకు రూ. 2,747.67 కోట్లు రుణమాఫీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో రెండుసార్లు రుణమాఫీ పేరుతో రైతులను వంచించిన తీరును తెలంగాణ సమాజం గుర్తించిందని పేర్కొన్నారు. 2014లో రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చి, అందు కోసం నాలుగు సంవత్సరాల సమయం తీసుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని అన్నారు. విడతల వారీగా రుణమాఫీ చేయడం వల్ల రైతులపై రూ. 2,630 కోట్ల అధిక వడ్డీ భారం పడిందని గుర్తు చేశారు.

గ్రామాలవారీ పంట నష్టం వివరాలివ్వండి

రాష్ట్ర వ్యాప్తంగా శుక్ర, శనివారాల్లో సంభవించిన వడగండ్ల వాన, ఈదురు గాలుల కారణంగా జరిగిన పంటనష్టంపై వివరాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు వెంటనే గ్రామాలవారీ పంట నష్టంపై సర్వే చేసి వివరాలు అందజేయాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. కాగా, ప్రస్తుతానికి అందిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని 11వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు ప్రాథమికంగా తేల్చారు. తుమ్మల తాజా ఆదేశాలతో పూర్తి స్థాయి పంటనష్టం వివరాలు సేకరించే పనిలో వ్యవసాయ శాఖ యంత్రాంగం నిమగ్నం కానుంది.

క్లుప్తంగా...

వాగ్దానాలకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వ ఆచరణ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



ప్రజాచైతన్య పాదయాత్రలో జాన్‌వెస్లీ తదితరులు

రామన్నపేట: ఎన్నికల్లో ఓట్లకోసం చేసిన వాగ్దానాలకు, రాష్ట్రప్రభుత్వం ఆచరిస్తున్న విధానం పూర్తిగా భిన్నంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట సీపీఎం మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ప్రజాచైతన్య పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక వాగ్దానాలు చేసిందని, వాటి అమలు కోసం బడ్జెట్‌లో తగిన నిధులు మాత్రం కేటాయించలేదని ఆయన ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే విధమైన ఆర్థిక విధానాలను అవలంభిస్తున్నాయని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు నెలకు రూ 2,500 ఇవ్వాలని, భూమిలేని ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాగా సంవత్సరానికి రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలుకు నెలరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాచైతన్య పాదయాత్రలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

చిన్నచూపు చూస్తే దక్షిణాది తిరుగుబాటు

- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తే తిరుగుబాటు తప్పదని, ప్రత్యేక తెలంగాణ తరహాలోనే ప్రత్యేక దక్షిణాది దేశం ఉద్యమం వస్తుందని మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఉదయం బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముందు ఆయన 'సాక్షి' చానల్‌తో మాట్లాడారు. బీజేపీపై డీలిమిటేషన్, బీసీ రిజర్వేషన్ల కత్తులు వేలాడుతున్నాయని, వాటి విషయంలో సమర్థంగా వ్యవహరించకుంటే రాబోయే రోజుల్లో ఆ పార్టీకి భంగపాటు తప్పదని తెలిపారు. డీలిమిటేషన్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ దక్షిణాది రాష్ట్రాల నేతల సమావేశాన్ని దొంగల ముఠాగా బీజేపీ నేతలు అభివర్ణించడాన్ని గంగుల తప్పుబట్టారు. రాష్ట్రంలో కులగణన జరిగింది.. దానిని కేంద్రంలో అమలు చేయకపోతే ఇక్కడున్న బీజేపీ మంత్రులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల ముందు చావు డప్పు కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బీసీ బిల్లును మోదీ పార్లమెంటులో ఆమోదించకపోతే ప్రజల ముందు దోషిగా మారతారని, ప్రధానిని రాష్ట్ర బీజేపీ నేతలు ఒప్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. డీలిమిటేషన్ విషయంలో దక్షిణాదికి అన్యాయం జరిగితే నష్టపోయేది బీజేపీనే అని స్పష్టం చేశారు.

మూడు బ్యాంకులకు ఆర్‌బీఐ జరిమానా

సాక్షి, హైదరాబాద్: నిబంధనలను ఉల్లంఘించినందుకు రాష్ట్రంలోని మూడు అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జరిమానా విధించింది. ఈ మేరకు ది కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, సింధ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, శ్రీనివాస పద్మావతి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌లకు రూ.3.10 లక్షలు, 1.30 లక్షలు, 1.20 లక్షల చొప్పున పెనాల్టీ విధిస్తూ ఆర్‌బీఐ ఉత్తర్వులు జారీ చేసింది. చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ)కు మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ రీఫైనాన్స్ ఫండ్‌ను జమ చేయాలని నిర్దేశించినప్పటికీ సకాలంలో చెల్లించనందుకు గాను ఈ జరిమానా విధిస్తున్నట్టు ఆర్‌బీఐ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

నేటి భవితలో..

- టాప్‌స్టోరీ: ఏపీ పాలిసెట్ 2025: సత్వర ఉపాధికి పాలిటెక్నిక్ డిప్లొమా
పదో తరగతి నుంచే ఇంజనీరింగ్ కోర్సుల వైపు అడుగుపెట్టాలనుకునే వారికి సరైన వేదికలుగా పాలిటెక్నిక్స్‌ను పేర్కొనొచ్చు. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకుంటే.. ఉద్యోగ అవకాశాలతోపాటు ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరే అవకాశం లభిస్తుంది. పాలిసెట్(పాలిటెక్నిక్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)లో ర్యాంకు ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ పాలిసెట్ 2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. పాలిసెట్ పరీక్ష, అందుబాటులో ఉన్న కోర్సులు, ఈ డిప్లొమా కోర్సులతో ఉన్నత విద్య, ఉపాధి మార్గాలపై ప్రత్యేక కథనం.. దీంతోపాటు విద్యా, ఉద్యోగ సమాచారం..

నేటి భవిత పేజీ కోసం సాక్షి ఫ్లస్ (ఈ పేపర్) ను చూడండి

మహిళా రైతులకే వ్యవసాయ యాంత్రీకరణ

- ఈ నెలాఖరులోగా 10,812 యూనిట్ల అందజేసేందుకు ఆదేశాలు
- 14 రకాల వ్యవసాయ పనిముట్లు ఇచ్చేందుకు రూ.24.90 కోట్ల నిధులు విడుదల
- క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపికకు వ్యవసాయ అధికారుల ఉరుకులు..పరుగులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'వ్యవసాయ యాంత్రీకరణ'లో తొలిసారిగా మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్రవ్యాప్తంగా 10,812 యూనిట్లు అందజేసేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు మార్గదర్శకాలతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. రూ.24.90 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే అంటే...ఈనెల 31వ తేదీలోగా పథకాన్ని అమలు చేయాలని ఆదేశించింది. మొత్తంగా 14 రకాల పరికరాలను వ్యవసాయ యాంత్రీకరణ కింద అందజేయాలని నిర్ణయించింది. దీంతో క్షేత్రస్థాయిలో జిల్లాల్లో వ్యవసాయశాఖ లబ్ధిదారులను గుర్తించేందుకు కసరత్తు ప్రారంభించింది.

ఏడేళ్ల తర్వాత పునరుద్ధరణ

రాష్ట్రంలో రైతుబంధు అమల్లోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయ యాంత్రీకరణతోపాటు విత్తనాలపై సబ్సిడీలు ఆగిపోయాయి. 2018 నుంచి రైతులకు యాంత్రీకరణ పనిముట్లను అందజేసే కార్యక్రమాన్ని నిలిపివేసింది. గతంలో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 50 శాతం సబ్సిడీ ఉండేది. ప్రస్తుతం అందరికీ 50 శాతం సబ్సిడీతో ఈ యాంత్రీకరణ పరికరాలను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతేకాదు వాటిని విక్రయించే సంస్థలను కూడా ఖరారు చేసింది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించిన రైతులు 50 శాతం సబ్సిడీతో ఆయా పరికరాలను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించింది. అయితే ప్రస్తుతం సమయం తక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు తలనొప్పిగా మారింది.

14 రకాల యాంత్రీకరణ పరికరాలు

వ్యవసాయ పనుల్లో రైతులకు దోహదపడే 14 రకాల యంత్ర పరికరాలను 50 శాతం సబ్సిడీతో మహిళా రైతులకు అందజేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా చేతిపంపులు, పవర్ స్ప్రేయర్లు, డ్రోన్‌లు, రోటోవేటర్లు, విత్తనాలు/ఎరువులు వేసే పరికరాలు, ట్రాక్టర్‌తో దమ్ము చేసే పరికరాలు, పవర్‌టిల్లర్లు, ఎద్దులతో బోదలు పోసే పరికరాలు, ట్రాక్టర్లతో బోదలుపోసే పరికరాలు, పవర్‌వీడర్స్, బ్రష్‌కట్టర్స్, ట్రాక్టర్లు, మొక్కజొన్న కోత పరికరాలు, గడ్డిచుట్టే పరికరాలను సబ్సిడీతో కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టింది.



జిల్లాల వారీగా యాంత్రీకరణ యూనిట్లు, నిధుల మంజూరు ఇలా (రూ. లక్షల్లో)

జిల్లా	పరికరాల సంఖ్య	నిధులు	జిల్లా	పరికరాల సంఖ్య	నిధులు
ఆదిలాబాద్	434	92.19	మహబూబాబాద్	318	67.38
ఆసిఫాబాద్	315	72.51	ములుగు	60	35.60
మంచిర్యాల	292	67.90	మెదక్	234	69.27
నిర్మల్	397	80.92	సంగారెడ్డి	630	131.17
కరీంనగర్	333	73.69	సిద్దిపేట	459	100.69
జగిత్యాల	353	78.79	మహబూబ్‌నగర్	252	71.20
రాజన్నసిరిసిల్ల	198	50.02	జోగులాంబగద్వాల	236	56.88
పెద్దపల్లి	242	58.84	వనపర్తి	178	42.47
నిజామాబాద్	534	117.84	నారాయణపేట	310	73.85
కామారెడ్డి	453	97.30	నాగర్‌కర్నూలు	365	86.31
ఖమ్మం	462	111.93	నల్లగొండ	820	181.36
కొత్తగూడెం	448	100.32	సూర్యాపేట	457	106.01
వరంగల్	224	54.62	యాదాద్రి	275	72.05
హనుమకొండ	230	55.30	రంగారెడ్డి	371	75.26
భూపాల్‌పల్లి	155	38.51	వికారాబాద్	454	90.79
జనగామ	290	69.98	మేడ్చల్	33	9.05

డీలిమిటేషన్‌పై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

- జనాభా లెక్కలు, పార్లమెంట్‌లో చట్టం తర్వాతే చర్చ ప్రారంభిస్తాం
- ఈ ప్రక్రియలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కీలకంగా ఉంటుంది
- తమిళనాడు ఎన్నికల కోసం డీఎంకే, కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయి
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్‌పై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ముందుగా జనగణన ప్రక్రియ జరగాల్సి ఉందని, ఆ తర్వాత పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపజేసుకున్న తర్వాత నియోజకవర్గాల పునర్విభజనపైన చర్యలు మొదలవుతాయని వెల్లడించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డీలిమిటేషన్ అంశంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందన్నారు. ఇప్పటివరకు కేంద్ర కేబినెట్‌లోనూ కనీసం డీలిమిటేషన్‌పై చర్చ జరగలేదని చెప్పారు. కొన్ని అవకాశవాద పార్టీలు దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని..తప్పుడు ప్రచారం చేస్తూ దిగజారుడు రాజకీయాలకు తెరలేపుతున్నాయని మండిపడ్డారు. తమిళనాడులో డీఎంకే పాలన అవినీతి, కుంభకోణాలమయమైందని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ కుటుంబంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. దక్షిణాది ప్రజల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటకలో, తెలంగాణలో బీజేపీ గెలుస్తుందని, తమిళనాడులో మరింత పట్టు సాధిస్తుందని తెలిపారు. దక్షిణాదిలో బీజేపీ బలపడకూడదని కాంగ్రెస్, డీఎంకే, బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే అంశంపై సీఎం రేవంత్ దృష్టి పెట్టాలని సూచించారు. అసలు పని వదిలేసి కేంద్రంపై డీలిమిటేషన్ పేరుతో విమర్శలు చేస్తూ కాలం గడుపుతున్నారని, ఇలాంటి విమర్శలు చేసినంత మాత్రాన ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి పోదని గుర్తు చేశారు. చెన్నైలో జరిగిన డీలిమిటేషన్ సదస్సులో ఆయా రాజకీయ పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం, తమ అస్తిత్వం కోసం డీలిమిటేషన్ అంశాన్ని భూతద్దంలో చూపిస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌తోపాటు మరికొన్ని రాజకీయ పార్టీలు.. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ తప్పుడు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందే ప్రయత్నం చేశాయని, ఇప్పుడు ఎన్నికలు రాగానే కొత్త అంశాలను తెరపైకి తీసుకొస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ మధ్య సయోధ్య కుదిర్చేందుకు మజ్లిస్ పార్టీ తీవ్రంగా ప్రయత్నం చేస్తోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు ఒక్కటైనా తెలంగాణ ప్రజల మద్దతుతో ఆ మూడు పార్టీలను సమర్థవంతంగా బీజేపీ ఎదుర్కొంటుందని ఆయన చెప్పారు.

జీడీపీకి, డీలిమిటేషన్‌కు ఏం సంబంధం ?

- లిక్కర్ దొంగలంతా మోదీపై దక్షిణాది పేరుతో డ్రామాలాడుతున్నరు
- బీదర్‌లో దొంగనోట్ల ప్రెస్ నడిపింది బీఆర్ఎస్ నాయకుడే
- కరీంనగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్



కరీంనగర్‌టౌన్: జీడీపీకి, డీలిమిటేషన్‌కు ఏం సంబంధమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. ఆదివారం కరీంనగర్‌లోని శుభం గార్డెన్‌లో తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై బండి సంజయ్ మాట్లాడారు. 'స్టాలిన్ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల లిక్కర్ స్కాం చేసింది. కేరళలోనూ లిక్కర్ స్కాం బయటపడింది. ఆప్, బీఆర్ఎస్ నేతలు ఆల్రెడీ లిక్కర్ స్కాం చేసి జైలుకు పోయిండ్రు. వీరంతా కలిసి డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతూ మోదీ ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో తెలంగాణ అప్పుల పాలైంది. కేసీఆర్ కుటుంబ పాలనతో సర్వనాశనమైంది. గతంలో కేసీఆర్ మనుషులు బీదర్‌లో ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో దొంగ నోట్లు ముద్రించారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో పంచిన నోట్లన్నీ దొంగనోట్లే. వీరంతా కలిసి జీడీపీకి, పార్లమెంట్‌లో ప్రాతినిధ్యానికి లింకు పెడుతున్నారు. దేశ జీడీపీలో దక్షిణాది వాటా 36 శాతం ఉన్నందున పార్లమెంట్‌లో కూడా దక్షిణాదికి 36 శాతం దాకా వాటా ఇవ్వాలని అడుగుతూ కుట్ర చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలుంటే అవేమీ పట్టని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చెట్టాపట్టాలేసుకుని చెన్నై పోయి డీలిమిటేషన్ పేరుతో రాజకీయాలు చేస్తారా? మోదీ ప్రభుత్వంపై విషం కక్కడం తప్ప ప్రజలకు ఈ రెండు పార్టీలు చేస్తున్నదేమిటి ? ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు'అని బండి సంజయ్ హెచ్చరించారు.

పనిచేసే వారికే టికెట్లు ఇస్తాం

- త్వరలో 24 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయి
- ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకునేవారు ప్రజల్లో ఉండాలి
- 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్'లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకే కాంగ్రెస్ టికెట్లు ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన 'జైబాపు.. జైభీమ్..జై సంవిధాన్ అభియాన్'కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో త్వరలో మరో 24 అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పడతాయని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పెద్ద సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉందన్నారు. కొత్తగా ఏర్పాటు కాబోయే ఆయా నియోజకవర్గాల్లో ఆశావహులందరికీ కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించే వారు ఇప్పటి నుంచే సీరియస్‌గా పార్టీ కోసం పనిచేయాలని, నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలుపించుకోవాలన్నారు. మతవాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్‌పేరుతో గ్రామాల్లో పర్యటించి, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కార్యకర్తలకు సూచించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు.

జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే

ఉమ్మడి రంగారెడ్డి నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో స్థానం కల్పించకపోవడంతో జిల్లా ప్రజలు నష్టపోవాల్సి వస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై జిల్లా ముఖ్య నేతలంతా ఓ తీర్మానం చేసి, పార్టీ అధిష్టానానికి పంపారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలెయాదయ్య, అరికెపూడి గాంధీ ఈ సమావేశానికి హాజరుకాలేదు.

కాంగ్రెస్ ఇచ్చింది 7 వేల ఉద్యోగాలే

- ప్రచారం మాత్రం 57 వేలు ఇచ్చామని..
- పరీక్ష, సెలక్షన్ మాది.. పంపిణీ వాళ్లది
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపాటు



సిద్దిపేట జోన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు 7 వేలు మాత్రమేనని, కానీ 57 వేలు ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటోందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీచేయటం, పరీక్షల నిర్వహణ, సెలక్షన్ ప్రక్రియ మొత్తం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఆదివారం సిద్దిపేటలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో 1.62 లక్షల ఉద్యోగాలు భర్తీచేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని యువతను మోసం చేసిందని ఆరోపించారు. ఎనుముల రేవంత్‌రెడ్డిని నమ్ముకుంటే ఎగవేతలు తప్ప ఏమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు కానీ.. అసెంబ్లీలో అన్నీ అబద్ధాలు చెప్పిందని విమర్శించారు. వడగళ్ల వానలకు పంటలు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మైనార్టీ విద్యార్థుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఇంటిగ్రేటెడ్‌లో విలీనం చేయాలని చూస్తోందని, ఇది సరికాదని అన్నారు. బెట్టింగ్ యాప్స్ వల్ల యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రభుత్వం ఈ బెట్టింగ్ యాప్స్‌పై కఠినంగా వ్యవహరించాలని హరీశ్‌రావు సూచించారు. నిర్వాహకులపై పీడీ యాక్ట్ విధించి అరెస్టు చేయాలని కోరారు.



“ అబద్ధాల కంటే కూడా సత్యానికి నిర్ధారణలు ఎక్కువ హాని చేస్తాయి.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 24 మార్చి 2025

యవ్వనోత్సవం

జీవితంలో బాల్యం ఆటపాటల్లో శరవేగంగా గడచిపోతుంది. శరీరంలో శక్తులన్నీ ఉడిగిపోయినప్పుడు మీదపడే వార్ధక్యం కుంటినడకన సాగుతుంది. బాల్యంలో ఊహ తెలిసే దశకు వచ్చినప్పుడు త్వరగా యువకులుగా మారిపోవాలని కోరుకోవడం సహజం. నడివయసు కూడలికి వచ్చే సరికి యవ్వనం కొద్దిరోజుల్లోనే కరిగిపోతుందనే బెంగ మనసును పీడించడం కూడా అంతే సహజం. జీవితంలోని బాల్య వార్ధక్యాల మధ్య వచ్చే యవ్వనం ఒక కీలక దశ. అంతేకాదు, ఉత్పాదక దశ కూడా! బాల్య వార్ధక్య దశల్లో జీవనభారాన్ని మోసే శక్తి ఉండదు. ఒంట్లోని జవసత్త్వాలు ఉండే యవ్వనంలోనే జీవితాన్ని ఎంతోకొంత తీర్చిదిద్దుకోవడానికి కుదురుతుంది. జీవితంలో అందుబాటులో ఉన్న స్వేచ్ఛా సౌఖ్యాలను తనివితీరా అనుభవించడానికి వీలవుతుంది.

యవ్వనాన్ని సార్థకం చేసుకోగలిగిన మనుషులు లోకంలో తక్కువగానే ఉంటారు. చాలామంది యవ్వనాన్ని నిరర్థకంగా గడిపేసి, వార్ధక్యంలో గడచిపోయిన రోజులను తలచుకుంటూ వగచి వలపోస్తారు. ‘లడక్‌పన్ ఖేల్ మే ఖోయా/ జవానీ నీంద్‌భర్ సోయా/ బుఢాపా దేఖ్‌కర్ రోయా’ అన్నాడు హిందీ సినీకవి శైలేంద్ర. బాల్యాన్ని ఆటపాటల్లో పోగొట్టుకుని, యవ్వనాన్ని ఒళ్లెరుగని నిద్రలో పోగొట్టుకుని, వార్ధక్యంలో వాటిని తలచుకుని రోదించే మనుషుల తీరును ఆయన మూడు ముక్కల్లో తేల్చేశాడు. ఇదే విషయాన్ని శంకరాచార్యుడు ‘బాల స్తావ త్క్రీడాసక్తః తరుణ స్తావ త్తరుణీసక్తః/ వృద్ధ స్తావ చ్చింతాసక్తః పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః’ అని ఏనాడో చెప్పాడు.

బాల్య వార్ధక్యాలను ఎక్కువ కాలం కొనసాగించాలని ఎవరూ కోరుకోరు గాని, యవ్వనాన్ని వీలైనంతగా పొడిగించుకోవాలని, కుదిరితే గిదిరితే జీవితాంతం నిత్యయవ్వనులుగా కొనసాగాలని కోరుకోనివారు ఉండరు. నిత్యయవ్వనం మానవమాత్రులకు అసాధ్యమని అందరికీ తెలుసు. ఇది తీరే కోరిక కాదని తెలిసినా, కోరుకుంటారు. తీరని కోరికలను కూడా కోరుకోవడమే కదా మానవ స్వభావం. శుక్రాచార్యుడి శాపం వల్ల ముదిమి పొందిన యయాతి తన కొడుకు పురుడి ద్వారా పునఃయవ్వనం పొందాడు. సుకన్యను చేపట్టిన చ్యవనుడు అశ్వినీ దేవతల అనుగ్రహంతో పునఃయవ్వనం పొందాడు. జరా మరణాలను జయించి అమరులు కావడానికి దేవతలు అమృతం తాగారు. అమృతం కోసం దానవులతో కలసి క్షీరసాగర మథనం చేశారు. అమృతం దానవులకు దక్కకుండా ఉండటానికి శ్రీమహావిష్ణువు జగన్మోహిని అవతారం దాల్చి, దేవతలకు అమృతం పంచిపెట్టాడు. మన పురాణాల్లో ఉన్న ఈ గాథలు అందరికీ తెలిసినవే! ఇలాంటి గాథలు ప్రాచీన గ్రీకు పురాణాల్లోనూ ఉన్నాయి. గ్రీకుల యవ్వన దేవత హీబీ దేవతలకు ‘ఆంబ్రోజా’ అనే దివ్య ఫలహారాన్ని, ‘నెక్టర్’ అనే అమృతం వంటి పానీయాన్ని పంచిపెట్టిందట! ‘ఆంబ్రోజా’, ‘నెక్టర్’ల మహిమ వల్లనే దేవతలు నిత్య యవ్వనులు కాగలిగారని గ్రీకు పురాణాల కథనం.

‘జీవితం మధుశాల యవ్వనం రసలీల/ రేపటి మాటేల? నవ్వుకో ఈవేళ’ అన్నారు వీటూరి. ‘పాడు జీవితము యవ్వనము మూడునాళ్ల ముచ్చటలోయి/ అయ్యయ్యో నీదు పరుగులెచ్చటకోయి’ అన్నారు ఆరుద్ర. జీవితం క్షణభంగురం అని వేదాంతులు చెబుతారు. కోరికలు దుఃఖహేతువులని, వాటిని జయించాలని ప్రవచనాలు చెబుతారు. ఎవరు ఎన్ని చెప్పినా, జీవితాన్ని ఆస్వాదించడానికి యవ్వనం ముఖ్య సాధనమనే ఎరుక కలిగినవారే ఏ క్షణానికి ఆ క్షణమే యవ్వనోద్ధృతితో జీవితాన్ని నిండుగా ఆస్వాదిస్తారు. వెర్రి వేదాంతుల మాటలను తలకెక్కించుకునే అర్భకులు– క్షణభంగుర సిద్ధాంతం బుర్రలో బొంగరంలా గింగిరాలు తిరుగుతుంటే, యవ్వనాన్ని అనవసరంగా వృథా చేసుకుని, నిష్ప్రయోజకులుగా బతుకు చాలిస్తారు.

పునఃయవ్వనం పొందినవాళ్లు మనకు పురాణాల్లోను, కాల్పనిక సాహిత్యంలోను తప్ప నిజజీవితంలో కనిపించరు. నిత్యయవ్వనం మానవాళి సామూహిక ఆకాంక్ష. దీనిని నెరవేర్చడానికే ఆధునిక వైద్య పరిశోధకులు కూడా శక్తివంచన లేకుండా పరిశోధనలు సాగిస్తున్నారు. వారి వైద్య పరిశోధనలు ఫలించినట్లయితే, పునఃయవ్వనం పొందడానికి జనాలు ఎగబడి మరీ పోటీలు పడతారు. పరిశోధనలు ప్రాథమిక దశలో ఉండగానే, కొందరు అపర కుబేరులు ఖర్చుకు వెనుకాడకుండా తమ యవ్వనాన్ని పొడిగించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్న ఉదంతాలు అడపాదడపా కథనాలుగా వెలువడుతూనే ఉన్నాయి.

యవ్వనం ఉడిగి వయసుమళ్లి వార్ధక్యం ముంచుకు రావడాన్ని సహజ పరిణామంగానే చాలా కాలంగా భావిస్తూ వస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటి వరకు వార్ధక్యాన్ని వ్యాధిగా గుర్తించ లేదు గాని, వార్ధక్యం కూడా ఒక వ్యాధేనని కొందరు వైద్యపరిశోధకుల వాదన. వార్ధక్యాన్ని నివారించి, వయసును వెనక్కు మళ్లించే దిశగా వైద్య పరిశోధనలు ఇటీవలి కాలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. వయసును వెనక్కు మళ్లించడానికి అమృతం వంటిదేదీ అవసరం లేదని, అసలైన యవ్వన కీలకం మానవ దేహంలోనే ఉందని తాజాగా జపాన్‌లోని ఒసాకా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు గుర్తించారు. మానవ శరీరంలో ఒత్తిడికి లోనయ్యే కణాలకు ‘ఏపీ2ఏ1’ అనే ప్రొటీన్ సరఫరాను నిలిపివేసినట్లయితే, శరీరంలోని ప్రతి కణం పునఃయవ్వనాన్ని పొందగలుగుతుందని చెబుతున్నారు. ‘ఏపీ2ఏ1’ ప్రొటీన్‌ను నియంత్రించడానికి చేపట్టే చికిత్స పద్ధతులే పునఃయవ్వన చికిత్స పద్ధతులు కాగలవని అంటున్నారు. వారి ప్రయోగాలే గనుక ఫలిస్తే, ముందుండేది ముసళ్ల పండుగ కాదు, మానవాళికి అది యవ్వనోత్సవమే అవుతుంది.

ఉత్తర – దక్షిణ సంకటం

కామెంట్



కరణ్ థాపర్

ఊహించినట్లే జరుగుతోంది. ‘డీలిమిటేషన్’ భూతం మనల్ని వెంటాడుతోంది. జనాభా లెక్కలు దగ్గర పడిన కొద్దీ అది మనకు ఇంకా చేరువ అవుతోంది. అయినా మోదీ ప్రభుత్వం ఈ సమస్యను తేలిగ్గా తీసుకుంటోంది. కానీ ‘నియోజక వర్గాల పునర్విభజన’ భయాలు అలా కొట్టేయదగినవి కావు. ఎందుకని?

కారణం వెరీ సింపుల్. ఇందులో బుర్ర బద్దలు కొట్టుకోవల్సిందేమీ లేదు. నియోజక వర్గాలు జనాభాపరంగా సైజులో సమానంగా ఉండాలి. ఇప్పుడలా లేవు. కాబట్టి దేశ వ్యాప్తంగా నియోజక వర్గాలు ఒకే సైజులో ఉండేట్లు వాటిని పునర్విభజించాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో, జనసంఖ్య వేగంగా పెరిగిన రాష్ట్రాల్లో ఇతర రాష్ట్రాల్లో కంటే ఎక్కువ నియోజక వర్గాలు ఏర్పడతాయి. మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్యను 543 వద్దే స్థిరంగా ఉంచేట్లయితే, జనాభా నియంత్రణ పటిష్ఠంగా అమలు చేసిన రాష్ట్రాల్లో సహజంగానే నియోజకవర్గాల సంఖ్య తగ్గుతుంది. ఆ మేరకు ఇతర రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతాయి. ఒకరి నష్టం మరొకరికి లాభం అవుతుంది.

సంఖ్య పెరిగినా ఒరిగేదేంటి?

మిలన్ వైష్ణవ్, జేమీ హింట్సన్‌ల అధ్యయనం సూచించిందిదే! అన్ని దక్షిణాది రాష్ట్రాల్లోనూ పార్లమెంటు నియోజకవర్గాలు తగ్గుతాయి. ఉదాహరణకు కేరళ, తమిళనాడు చెరో 8 సీట్లు కోల్పోతాయి. ఆంధ్ర, తెలంగాణలు రెంటికీ కలిపి చూస్తే అవీ ఇన్ని స్థానాలు నష్టపోతాయి. కర్ణాటక నుంచి 2 స్థానాలు ఎగిరిపోతాయి. జనాభాను నియంత్రించిన ఇతర రాష్ట్రాలూ ఇలాగే దెబ్బతింటాయి. పశ్చిమ బెంగాల్ నాలుగు, ఒడిషా మూడు, పంజాబ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ ఒక్కో నియోజకవర్గం పోగొట్టుకుంటాయి.

ఇక అనేక ఉత్తరాది రాష్ట్రాల స్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఉత్తర ప్రదేశ్ జాబితాకు 11 స్థానాలు అదనంగా కలుస్తాయి. బిహార్ 10, రాజస్థాన్ 6, మధ్యప్రదేశ్ 4 సీట్లు పెంచుకుంటాయి. ఫలితంగా, 543లో 226 సీట్లతో ఇప్పటికే ఆధిపత్యం చలాయిస్తున్న ‘హిందీ హార్ట్‌ల్యాండ్’ డీలిమిటేషన్ అనంతరం తన ప్రాబల్యాన్ని విశేషంగా 259కి పెంచుకుంటుందని యోగేంద్ర యాదవ్ తేల్చారు. దక్షిణాది రాష్ట్రాలు అన్నిటికీ కలిపి ప్రస్తుతం 129 సీట్లు ఉన్నాయి. పునర్విభజన అనంతరం ఇవి 26 సీట్లు కోల్పోతాయని యోగేంద్ర యాదవ్ లెక్క గట్టారు. దీంతో పార్లమెంటులో వాటి ప్రాతినిధ్యం, పలుకుబడి గణనీయంగా క్షీణిస్తాయని వేరే చెప్పనక్కర్లేదు.

డీలిమిటేషన్ సమయంలో దీన్ని దృష్టిలో పెట్టుకుని లోక్ సభ సీట్ల సంఖ్య పెంచే వీలుందని అంటున్నారు. ఇది కొంచెం నయం. కానీ అలా చేస్తే సమస్య తీవ్రత తగ్గుతుందా? మొత్తం స్థానాల సంఖ్య పెంచినా, ప్రతి రాష్ట్ర నియోజకవర్గాలూ అదే నిష్పత్తిలో పెరుగుతాయి. అదీ ఉత్తరాదికే అనుకూలిస్తుంది. ఉత్తరాది–దక్షిణాది నిష్పత్తి ప్రకారం చూస్తే, దక్షిణాది రాష్ట్రాలకు ఒరిగేదే ఉండదు. వాటి సీట్ల సంఖ్య పెరిగినా ప్రయోజనం ఉండదు. వాటి ప్రాతినిధ్యం, పలుకుబడి పూర్వస్థితికి అంటే ఇప్పటి స్థాయికి చేరుకోవు. కాబట్టి, ఈ చర్య కూడా దక్షిణాది భయాలను తొలగించేది కాదు. పరిస్థితి ఏమీ మారదు.

ఆ మధ్య ‘టైమ్స్ ఆఫ్ ఇండియా’ ఓ లెక్క వేసింది. సమస్యను ఈ గణాంక విశ్లేషణ తేటతెల్లం చేస్తుంది. ఇప్పటికిప్పుడు ఐదు దక్షిణాది రాష్ట్రాలకు కలిపి మొత్తం 543లో 129 సీట్లు ఉన్నాయి. అంటే 24 శాతం. ప్రస్తుత లోక్ సభ సీట్ల సంఖ్యను 790కి పెంచారే అనుకుందాం. అప్పుడు ఈ రాష్ట్రాల నియోజకవర్గాలు 152కి పెరుగుతాయి. నిజమే. కానీ మొత్తంలో వాటి వాటా కేవలం 19 శాతానికి కుదించుకు పోతుంది. తమిళనాడు విషయం చూస్తే, దాని వాటా ఇప్పుడున్న 7.2 నుంచి 5.4 శాతానికి పడిపోతుంది.

ఏ విధంగా చూసినా దక్షిణాది రాష్ట్రాల క్షోభ అర్థం చేసుకోదగినదే!

ఉత్తరాది బాధ

కానీ రెండో వైపు నుంచి చూస్తే, ఉత్తరాదిదీ సంకట స్థితే!

ఆర్. జగన్నాథన్ గణాంక విశ్లేషణ ప్రకారం, మారిన జనాభా నేపథ్యంలో కేరళ పార్లమెంటు సభ్యుడు సగటున 18 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అదే రాజస్థాన్ ఎంపీ సగటున 33 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ రకంగా చూసుకుంటే తమకు ఉండవలసిన వారి కంటే చాలా తక్కువ మంది ఎంపీలు ఉన్నారని, ఇది అన్యాయమని హిందీ బెల్టు కూడా వాదించగలదని జగన్నాథన్ అభిప్రాయపడుతున్నారు. ఇది నిజంగా భారత ప్రజాస్వామ్యానికే డైలమా!

అసలు సమస్య ఇది: నియోజకవర్గాల పునర్విభజన చేస్తే ఉత్తరాది ఆందోళన పరిష్కారం అవుతుంది. అయితే, ఈ చర్య దక్షిణాదికి క్షోభ కలిగిస్తుంది. యోగేంద్ర యాదవ్ వాదిస్తున్నట్లు డీలిమిటేషన్‌ను వాయిదా వేయడం – లేదా శాశ్వతంగా రద్దు చేయడం ద్వారా యథాతథ స్థితి కొనసాగించవచ్చు. దక్షిణాది భయాలు తొలగిపోతాయి. మరి ఉత్తరాది వారు తమకు జరుగుతుందని భావిస్తున్న అన్యాయం మాటేమిటి? అది అలాగే మిగిలిపోతుంది. కాబట్టి, ఎలా చేసినా ఏదో ఒక పక్షం నష్టపోవడం తప్పదు.

మరి దీనికి పరిష్కారం లేదా? ఇది చిటికేసినంత సులభంగా పరిష్కరించే సమస్య అయితే కాదు. నిజం చెప్పాలంటే, మన ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాళ్లలో కచ్చితంగా ఇదొకటి. వాస్తవానికి వ్యవస్థలో పెను ఉపద్రవానికి దారి తీయగల ఒక నిర్మాణలోపం ఇది. దీన్ని తేలిగ్గా తీసిపారేయడమో, దాటవేయడమో సరైన వైఖరి కాదు. సవాలును సవాలుగా స్వీకరించి అమీతుమీ తేల్చుకోవాల్సిందే. ఇదంత సులభం కాకపోవచ్చు. పోనీ మరొక ప్రత్యామ్నాయం ఉందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్



◆ దక్షిణాది రాష్ట్రాలు నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఇవి 26 సీట్లు కోల్పోతాయని లెక్క. దీంతో పార్లమెంటులో వాటి ప్రాతినిధ్యం, పలుకుబడి గణనీయంగా క్షీణిస్తాయి.

◆ ఒక అంచనా ప్రకారం, మొత్తం స్థానాల సంఖ్య 790కి పెరిగినా, అదీ ఉత్తరాదికే అనుకూలిస్తుంది. ఉత్తరాది–దక్షిణాది నిష్పత్తి ప్రకారం చూస్తే, దక్షిణాది రాష్ట్రాలకు ఒరిగేం ఉండదు.

◆ కేరళ పార్లమెంటు సభ్యుడు సగటున 18 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తుండగా, రాజస్థాన్ ఎంపీ సగటున 33 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇది అన్యాయమని హిందీ బెల్టు కూడా వాదించగలదు.

సోషల్ మీడియా

ఉపాధి భాషలు



ఎవరో అంటుండగా విన్నాను: “ఉత్తర భారతదేశ విద్యార్థులు కన్నడం, తమిళం నేర్చుకోవటాన్ని ప్రోత్సహించాలి. ఎందుకంటే వారిలో ఎక్కువ మంది ఉపాధి కోసం బెంగళూరు, చెన్నై వస్తున్నారు కాబట్టి.” నిజమే కదా! ఇందులో లాజిక్ ఉంది.

– డాక్టర్ ప్రిషా సర్గమ్, హ్యూమనిస్ట్

చూస్తే సరిపోదు!



‘గీతా ప్రెస్’ను సందర్శించే భాగ్యం నాకు కలిగింది! ఇది భారతదేశంలోని అతి పెద్ద, పురాతన ముద్రణాలయాలలో ఒకటి. ఇలాంటి పుస్తక సంస్థలు సాంస్కృతిక పరిరక్షణను, జ్ఞానవ్యాప్తిని ఎలా చేయగలవో అర్థం చేసుకోవటానికి సాధారణ ప్రయత్నాలు సరిపోవు. విస్తృత అధ్యయనమే జరగాలి.

– వివేక్ రంజన్ అగ్నిహోత్రి, సినీ దర్శకుడు

లోకం తీరు



ఇండియాలో నైతికంగా వర్తించేవారిని జనం మూర్ఖులు అనుకుంటారు. లోకం అలా ఉంది.

– అనిరుద్ధ మాల్పానీ, వైద్యుడు

కనీసం చాలు



వ్యాపారాలను కనీస మూలధనంతో నడిపేందుకు ఏఐ, బ్లాక్ చెయిన్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు తోడ్పడితే కనుక, భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థను శక్తిమంతం చేయటంలో ఇప్పటి వరకు తమకున్న భాగస్వామ్యం నుండి సంప్రదాయ వ్యాపార భారీ పెట్టుబడి విధానాలు దూరం జరుగుతాయి.

– ఆశీష్ కుమార్ చౌహాన్, ఎన్ఎస్ఇ సీఈవో

స్లో పాయిజన్



మనం చూసే దాని లోనే కాదు, మనం చూసేందుకు అనుమతి లేని దానిలో కూడా ప్రమాదం ఉంది. మీడియా స్వాతంత్ర్యం మరణించటం అన్నది రాత్రికి రాత్రి జరిగేది కాదు. అది దేశభక్తి, ఆర్థిక విధానం, సాంస్కృతిక రక్షణల ముసుగులో జరిగే వాటి వల్ల క్రమంగా చనిపోతుంది.

– మాన్సి అనిల్ కుమార్, కాలమిస్ట్

మనకేమైంది?



బెంగళూరులోని వీల్ ఫ్యాక్టరీలో వీల్ మేకింగ్‌కు అవసరమైన ఇరుసుల ఉత్పత్తి ఆగిపోవటంతో భారతీయ రైల్వే చైనా నుంచి 70,000 ఇరుసులను దిగుమతి చేసుకోబోతోంది! ‘మేక్ ఇన్ ఇండియా’కు ఏమైంది?

– మినీ నాయర్, రచయిత్రి

ఎడారి వర్ణచిత్రం



ఆఫ్రికాలోని నమీబియా ఎడారిలో ఇటీవలి వారాల్లో కురిసిన భారీ వర్షాలు అద్భుత స్వర్గలోక దృశ్యాన్ని ఆవిష్కరించాయి. మూడేళ్లుగా పూర్తిగా ఎండిపోయి ఉన్న నేలను కప్పినట్లు పది కిలోమీటర్ల మేర లక్షల కొద్దీ మొక్కలు భూమి బీట్లు చీల్చుకుని వచ్చి, రంగురంగుల పూలను విరబూశాయి.

– జోహాన్ వాన్, కేప్‌టౌన్ ఆంట్రప్రెన్యూర్

మానవవాద విప్లవకారుడు


సందర్భం



డా॥ దేవరాజు మహారాజు

ఒక వ్యక్తి శక్తిగా ఎలా మారగలడో తెలుసుకోవాలంటే ఎం.ఎన్. రాయ్ జీవితాన్ని అధ్యయనం చేయాలి. భారతీయుడైన రాయ్, మెక్సికన్ కమ్యూనిస్ట్ పార్టీ స్థాపకుడు (1917) కావడమేమిటీ? ఆయనలోని నిరంతర భావజాల సంఘర్షణ ఆయనను ఏదో ఒక ఆలోచనా ధోరణికి కట్టుబడి ఉండనివ్వలేదు. ర్యాడికల్ డెమొక్రటిక్ పార్టీ స్థాపనతో పాటు భారత రాజ్యాంగ చిత్తుప్రతిని తయారు చేసి ప్రచురించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన సమయానికే ఆయన ‘నూతన మానవ వాదానికి మేనిఫెస్టో’ని (న్యూ హ్యూమనిస్ట్ మేనిఫెస్టో) రూపొందించి విడుదల చేశారు.

తను స్థాపించిన ఇండియన్ రినైజాన్స్ ఇనిస్టిట్యూట్ ద్వారా దేశాన్నే కదిలించారు. డెహ్రాడూన్‌లో ఆయన నివాసమున్న చోటు నుండే ఆ సంస్థను నిర్వ హించారు. అది ఆ కాలంలో ‘హ్యూమనిస్ట్ హౌస్’గా పేరు పొందింది. ఉత్తర భారత దేశం నుండే కాకుండా దక్షిణాది రాష్ట్రాల నుండి కూడా ఆయన అనుచరులు, అభిమా నులు అక్కడికి తరలి వెళ్ళారు. మతతత్వ భావనకు వ్యతిరేకంగా పనిచేయడమే తన సంస్థ ప్రథమ కర్తవ్యమన్నారు రాయ్. అందుకే ‘ఎడ్యుకేట్ ద ఎడ్యుకేటెడ్’ – విజ్ఞానవంతుల్ని వివేకవంతుల్ని చేద్దామన్న ఆలోచనని వ్యాప్తి చేశారు.



ఎం.ఎన్. రాయ్

1887 మార్చ్ 21న పశ్చిమ బెంగాల్‌లో రాయ్ పుట్టినప్పుడు పెట్టిన పేరు నరేంద్ర నాథ్ భట్టాచార్య. క్యాలిఫోర్నియాలో ఉండగా అక్కడి నిఘా విభాగాల దృష్టి మరల్చడానికి మానవేంద్ర నాథ్ రాయ్‌గా పేరు మార్చుకున్నారు. 14వ ఏటే అనుశీలన్ సమితిలో చేరారు. అది రహస్యంగా పని చేసే ఒక విప్లవ సంఘం. కొద్ది కాలానికే ఆ సంఘం నిషేధానికి గురయ్యింది. ఆ తర్వాత జతిన్ ముఖర్జీ నిర్వహణలో నడిచే జుగాంతర్ గ్రూపులో చేరారు. ‘జతిన్ ముఖర్జీని కలవడమే తన జీవితంలో ఒక గొప్ప మలుపు’ అని తన గ్రంథం (చైనాలో నా అనుభావాలు)లో రాసుకున్నారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జుగాంతర్ సభ్యులు ఎన్నో కార్యక్రమాలు చేస్తుండేవారు. ఆ కాలంలో రాయ్ జర్మన్ల సహాయంతో ఇండోనేషియాకు వెళ్ళి వస్తుండేవారు. ఆయుధాలు సమకూర్చుకుని, బ్రిటిష్ పాలకుల్ని తరిమి కొట్టాలన్నది ఆయన ఉద్దేశం.

రహస్యంగా అమెరికాలో ఉన్నప్పుడు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ విద్యార్థిని ఎవిలిన్ ట్రెంట్‌తో స్నేహం పెరిగి పెండ్లి చేసుకున్నారు. తప్పనిసరై అక్కడి నుండి మెక్సికో చేరుకున్నారు. అక్కడ ఆయనకు తగిన భద్రత, గుర్తింపు లభించాయి. అందుకే ఆయన ‘జ్ఞాపకాల పుస్తకం’లో – మెక్సికో తనకు కొత్త జన్మ నిచ్చిందని రాసుకున్నారు. అక్కడ ఉన్న రోజుల్లోనే మెక్సికన్ కమ్యూనిస్ట్ పార్టీని స్థాపించారు. ఆ తర్వాత మూడేళ్ళకు 1920లో మరో ఆరుగురు నాయకులతో కలిసి భారత కమ్యూనిస్ట్ పార్టీని స్థాపించగలిగారు.

మానవేంద్ర నాథ్ రాయ్ తర్వాత కాలంలో వ్లాదిమిర్ లెనిన్, జోసెఫ్ స్టాలిన్‌ను కలిసి కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌లో భాగస్వాములయ్యారు. 1926లో దాని విధి విధానాల రూపకల్పనలో పాలు పంచుకున్నారు. ఆ విధి విధానాల్ని చైనా కమ్యూనిస్ట్ పార్టీ అవలంబించేట్లు ఒప్పించ డానికి రాయ్ 1927లో చైనా వెళ్ళారు. కానీ, ఆ ప్రయత్నం విఫలమైంది. రాయ్ ఒప్పించలేక పోయారని కాబోలు, 1929లో ఆయనను కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ నుండి బహిష్కరించారు. 1930లో రాయ్ భారత్‌కు తిరిగి రాగానే, ఆయన కోసం గాలిస్తున్న బ్రిటిషు ప్రభుత్వం 1924 నాటి కాన్పూర్ బోల్షివిక్ కుట్ర కేసుతో అరెస్ట్ చేసి ఆరేళ్ల జైలు శిక్ష విధించింది.

జైలు నుండి విడుదలై వచ్చాక రాయ్ నాలుగేళ్ళ పాటు ఇండి యన్ నేషనల్ కాంగ్రెస్‌లో సభ్యుడిగా ఉండి బయటపడ్డారు. 1946లో డెహ్రాడూన్‌లో భారతీయ సాంస్కృతిక పునర్వికాస కేంద్రాన్ని స్థాపించారు. ఆ సంస్థ ఆధునిక భౌతిక దృక్కోణంలో మానవవాదాన్ని ప్రచారం చేసింది. చార్వాక, లోకాయత, బౌద్ధ దర్శనాల అధ్యయనానికి వేదిక అయ్యింది.

రాయ్ జీవితం నుండి, ఆయన ప్రతిపాదించిన ర్యాడికల్ హ్యూమనిజం నుండి దేశంలోని సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాదులు, పార్టీరహిత కార్యకర్తలు ఎంతోమంది ప్రేరణ పొందారు. 1954 జనవరి 25న తన 67వ ఏట గుండెపోటుతో ఆయన కన్నుమూశారు. ‘ఉత్పత్తి చేస్తున్న వారికి ఆర్థిక స్వాతంత్ర్య సాధన’ అన్నది రాయ్ ఆశయాలలో ఒకటి.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత

సమ సమాజమా? సంక్షేమ రాజ్యమా?

అభిప్రాయం



డానీ

సామ్యవాద సమాజాన్ని నిర్మించడానికి ఇండియా కమ్యూనిస్టు పార్టీలు రెండు మార్గాలను ఎంచుకున్నాయి. మొదటిది– సాయుధ పోరాటం. రెండోది– పార్లమెంటరీ ఎన్నికలు. ఆ యా పార్టీల నాయకులు అభిమానులు ఒప్పుకోవచ్చు ఒప్పుకోకపోనూవచ్చు గానీ, అవి ఎంచుకున్న రెండు మార్గాలూ ఇప్పుడు దాదాపు మూసుకునిపోయాయి.

‘‘దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని, ప్రజలు విప్లవాన్ని కోరుకుంటున్నారు’’ అంటూ కమ్యూనిస్టు పార్టీలు ఓ యాభై ఏళ్ళ క్రితం చాలా గట్టిగా మాట్లాడేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఉద్యమాల్లో పాతవాళ్ళు తగ్గిపోతున్నారు; కొత్తవాళ్ళు రావడం లేదు. ఇది నేటి వాస్తవ స్థితి. దీనికి కారణం ఆ యా పార్టీలు అనుసరించిన విధానాలా? మరొకటా? అనే చర్చల వల్ల ఇప్పుడు ప్రయోజనం లేదు. చరిత్రలో జరిగిందేదో జరిగి పోయింది. జరగాల్సిందేమిటీ? అనేదే చర్చనీయాంశం కావాలి.

ప్రత్యామ్నాయ మార్గాలు

సోషలిస్టు కలను సాకారం చేసుకోవడానికి అభిమానులు వందేళ్ళు ఎదురుచూడటమే మహత్తర విషయం. దీర్ఘకాల పోరాటం కనుక ఇంకో వందేళ్ళు ఆగాలి అని ఎవరయినా చెప్పవచ్చు. వందేళ్ళు గడిచిపోయాయి కనుక సహజంగానే ఒక ప్రశ్న తలెత్తుతుంది. సమ సమాజం కుదరకపోతే దానికి దగ్గరి ప్రత్యామ్నాయాలు ఏమిటీ? అనేది. దానికి వెంటనే స్ఫురించే సమాధానం సంక్షేమ రాజ్యం. నార్డిక్ దేశాలయిన స్వీడన్, నార్వే, డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్‌లాండ్ సంక్షేమ దేశాలని చాలామందికి తెలుసు. పశ్చిమ యూరప్‌లో జర్మనీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, బెల్జియం, స్విట్జర్లాండ్ కూడా తమవైన పద్ధతుల్లో సంక్షేమ రాజ్యాలని బయటికి అంత తెలీదు. వీటిల్లో జర్మనీ రాజకీయార్థిక పరిణామాలతో ఇండియాకు పోలికలున్నాయి.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత 1919 నుండి 1933 వరకు జర్మనీలో కొనసాగిన ‘వైమర్ రిపబ్లిక్’ను స్థూలంగా ప్రజాస్వామ్యయుత పాలన అనవచ్చు. 1933 నుండి 1945 వరకు అడాల్ఫ్ హిట్లర్ ‘నేషనల్ సోషలిస్ట్ జర్మన్ వర్కర్స్ పార్టీ’ పేరిట ‘నాజీ’ పాలన సాగించాడు. కార్పొరేట్ మతతత్త్వ నియంతృత్వానికి గరిష్ఠ రూపం... నాజీజం. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ఓడిపోయిన తరువాత జర్మనీ ‘మిత్రరాజ్యాల’ అధీనంలో వలస దేశంగా మారిపోయింది. ఆ దేశాన్ని నాలుగు ముక్కలు చేసి యూకే, ఫ్రాన్స్, అమెరికా, రష్యాలు తలో భాగాన్ని తమ అధీనంలోనికి తీసుకున్నాయి.



ఓ నాలుగేళ్ళు ప్రత్యక్ష వలస పాలన సాగాక జర్మనీ రెండుగా విడిపోయింది. అమెరికా, యూకే, ఫ్రాన్స్‌ల ప్రాబల్యంలోని పశ్చిమ ప్రాంతం 1949 మే 23న ‘ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ’ (ఎఫ్ఆర్‌జీ)గా అవతరించింది. అదే ఏడాది అక్టోబరు 7న రష్యా ప్రాబల్యంలోని తూర్పు ప్రాంతం ‘జర్మన్ డెమొక్రాటిక్ రిపబ్లిక్’గా ఏర్పడింది. అప్పట్లో పశ్చిమ జర్మనీని పెట్టుబడిదారీ దేశంగానూ, తూర్పు జర్మనీని సోషలిస్టు దేశంగానూ చెప్పు కునేవారు.

కారణాలు ఏమైనాగానీ, తూర్పు జర్మనీవాళ్ళకు పశ్చిమ జర్మనీ మీద గొప్ప మోజు వుండేది. వాళ్ళు పెద్ద ఎత్తున పశ్చిమ జర్మనీకి వలస పోయేవారు. దీనిని అరికట్టడానికి బెర్లిన్ నగరాన్ని రెండు ముక్కలు చేసి 1961 ఆగస్టు నెలలో అడ్డంగా భారీ గోడ కట్టింది తూర్పు జర్మనీ. దీనికి ‘ఫాసిస్టు వ్యతిరేక రక్షణ గోడ’ అని గొప్ప పేరు పెట్టారు. అయినా జీడీఆర్ నుండి వలసలు ఆగలేదు. హంగేరీ, జకోస్లోవేకియాల మీదుగా పశ్చిమ జర్మనీకి చేరుకోవడం మొదలెట్టారు. 1980ల చివర్లో తూర్పు జర్మనీతో పాటు పోలాండ్, హంగేరి, చెకోస్లావియా, రొమేనియా, బల్గేరియా తదితర తూర్పు యూరోప్ దేశాల్లోనూ సోషలిస్టు పాలకులకు వ్యతిరేకంగా నిరసనలు మొదలయ్యాయి. ఇవి ముదిరి 1989 నవంబరు 9న బెర్లిన్ గోడను కూల్చేశారు. ఆ తరువాత ఆరు దేశాలు సంయుక్తంగా చర్చించి 1990 అక్టోబరు 3న తూర్పు జర్మనీని ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీలో విలీనం చేశాయి.

జర్మనీ, ఇండియాల సామ్యం...

రెండు జర్మనీల విలీనం అంటే విధానపరంగా పెట్టుబడిదారీ, సోషలిస్టు సమాజాల సంకీర్ణం అని అర్థం. ఇప్పటి జర్మనీలో ఈ రెండు ధోరణులేగాక ఉదారవాదం, మతవాదం తదితర అనేక ధోరణులు కనిపిస్తాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మితవాదులు పుంజుకున్నప్పటికీ మధ్యేవాదులకు అధికారం దక్కింది. మనలాగే ప్రజాస్వామిక, నాజీయిస్టు, వలస, సోషలిస్టు, పెట్టుబడిదారీ దశలన్నింటినీ చవిచూసిన జర్మనీ ఇప్పుడు పశ్చిమ యూరప్‌లో ఒక మెరుగయిన సంక్షేమ రాజ్యంగా కొనసాగుతోంది. ఇండియా, జర్మనీ స్థూల జాతీయోత్పత్తులు కూడా దాదాపు సమానం.

ఇప్పటి ఇండియా ప్రభుత్వ స్వభావం మీద ఫాసిస్టా? కొత్త ఫాసిస్టా? సగం ఫాసిస్టా? అంటూ చర్చ సాగుతోంది. మన దేశంలో కార్పొరేట్ మతతత్త్వ నియంతృత్వం కొనసాగుతోందనే అభిప్రాయం బలపడుతోంది. దేశంలోని సహజ వనరుల్ని, మౌలికరంగాలను ఎలాగూ కార్పొరేట్ల పరం చేసేస్తారు. మనం గతంలో ఎన్నడూ ఊహించనంతటి భీకర విస్థాపన సాగు తుంది. దానిని ఇప్పట్లో ఎవరూ ఆపలేరు. సోషలిజం సాధించగల సత్తాగల పార్టీ ఒక్కటీ కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆచరణాత్మకంగా ఒక సంక్షేమ రాజ్యాన్ని ఆశించడం ఒక్కటే సమంజసంగా ఉంటుంది. మనం ఆ దిశగా ఆలోచించాలి. దానికోసం ప్రయత్నించాలి.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు ı 90107 57776

గమనిక: మార్చి 23 సంచికలోని ‘రంగంలోకి అంగడి చదువు’ వ్యాసంలో పొరపాటు దొర్లింది. ‘ఆంధ్ర మహాభాగవత కర్త బమ్మెర పోతన’ అని చదువుకోగలరు. – ఎడిటర్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.దశమి రా.12.33 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.12.25 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.8.07 నుండి 9.44 వరకు, తిరిగి తె.4.24 నుండి 5.58 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.19 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** సా.5.53 నుండి 7.30 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.05, **సూర్యాస్తమయం:** 6.07.

క్లుప్తంగా...

డప్పు కొట్టిన 'విప్'



ధర్మారం(ధర్మపురి): అసెంబ్లీలో బీసీల కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదం తర్వాత తొలిసారి ధర్మపురి నియోజకవర్గానికి చేరుకున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌కు ఆదివారం వేలాది మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పత్తిపాక క్రాస్‌రోడ్డు వద్ద ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కటికనపల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆయన డప్పు కొట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను చట్టసభల్లో ఆమోదించడం చరిత్రాత్మకమని లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అనంతరం ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కృతజ్ఞత సభ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఆదుకునేవారు లేక అనాథగా మాజీ సర్పంచ్



అనాథగా మారిన కన్నాపూర్ మాజీ సర్పంచ్ బాల్‌రాజవ్వ

రామారెడ్డి: కొందరు ప్రజాప్రతినిధుల్లా పర్సంటేజీలకు ఆశపడలేదు..ఆస్తులు అంతస్తులు కూడగట్టుకోలేదు ఆ మాజీ మహిళా సర్పంచ్. గ్రామాభివృద్ధి కోసం తన సొంత నిధులను కూడా వెచ్చించింది. ప్రస్తుతం ఆదుకునేవారు లేక అనాథగా మారింది. రామారెడ్డి మండలం కన్నాపూర్ సర్పంచ్‌గా బాల్‌రాజవ్వ 2006 నుంచి 2011 వరకు పనిచేసింది నీటి సమస్య పరిష్కారానికి బోరుబావులను తవ్వించింది. ఇటీవల కాలంలో భర్త చనిపోయాడు. ఉన్న ఇల్లు కాస్త కాలిపోవడంతో గ్రామ కచేరీ ఆ మాజీ సర్పంచ్‌కు నివాస గృహంగా మారింది. ఆ ఊరి ప్రజలే అన్నం పెట్టి సాదుతున్నారు. భర్త చనిపోయిన తర్వాత బాల్‌రాజవ్వ మానసిక పరిస్థితి బాగాలేదని గ్రామస్తులు చెబుతున్నారు. బాల్‌రాజవ్వ ఇద్దరు కూతుళ్లలో ఓ కూతురు చనిపోగా, మరో కూతురు ఉన్నా, పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అండగా నిలిచి బాల్‌రాజవ్వకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వమే వైద్యం అందించాలని కోరుతున్నారు.


ధర్మ పరిరక్షణే బజరంగ్‌దళ్ లక్ష్యం: వీహెచ్‌పీ



సమావేశంలో పాల్గొన్న వీహెచ్‌పీ నాయకులు

సంగారెడ్డి: హిందూ ధర్మ పరిరక్షణ లక్ష్యంగానే బజరంగ్‌దళ్ ఆవిర్భవించిందని విశ్వహిందూపరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్‌సింగ్ స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని వైకుంఠపురం శ్రీ వేంకటేశ్వరస్వామి మందిరంలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవాలయాల భూములు కబ్జాకు గురవుతున్నాయని, ఈ విషయంలో పాలకులు వివక్షను ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ, పట్టుదలతో జీవితంలో రాణించాలని సూచించారు. అనంతరం 600 మంది కార్యకర్తలు త్రిశూల్ దీక్ష తీసుకున్నారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర ప్రశిక్షణ ప్రముఖ్ ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుమల: శ్రీవారి ఆలయంలో 30న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని మార్చి 25 మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ఆరోజు ఉదయం 6 నుంచి 11 గంటల వరకు అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. ఈ కారణంగా 25న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాద పద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. 24న ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది.



మల్లన్నకు మహా పెద్దపట్నం

ఐనవోలు: హనుమకొండ జిల్లా ఐనవోలులో ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు 50 అడుగుల పొడవు, వెడల్పులతో 60 మంది ఒగ్గు పూజారులు 6 గంటలపాటు శ్రమించి మహా పెద్దపట్నం వేశారు. మధ్యాహ్నం శ్రీమల్లికార్జునస్వామి, గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ ఉత్సవ విగ్రహాలను వేదికపైకి తీసుకువచ్చి వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణం నిర్వహించారు. పూజల అనంతరం శివసత్తులు, ఒగ్గు పూజారులు, భక్తులు తన్మయత్వంతో బండారి (పసుపు) చల్లుకుంటూ మహా పెద్దపట్నంపై నృత్యం చేశారు.

సొ'రంగం' వదిలేస్తారా?

▶ మొదటి పేజీ తరువాయి

వాడినా ఆశించిన ఫలితాలు రాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆలోచనలో పడినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఉన్నత స్థాయి సమీక్షలో సహాయక చర్యల కొనసాగింపుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నెలరోజులు గడిచినా..

ఎస్మార్పీ-ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట (ఇన్‌లెట్) వద్ద నుంచి 13.94 కిలోమీటర్ల లోపలి వరకు సొరంగం-1 తవ్వకాలు పూర్తయ్యాయి. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం)తో తవ్వకాలను అక్కడి నుంచి ముందుకు కొనసాగిస్తుండగా గత నెల 22న సొరంగం పైకప్పు కూలి 8 మంది కార్మికులు/ఉద్యోగులు గల్లంతైన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగి నెల రోజులు గడిచిపోగా ఇప్పటివరకు ఒక కార్మికుడి మృత దేహాన్ని మాత్రమే వెలికితీయగలిగారు. భూగర్భంలో 400 మీటర్ల దిగువన సొరంగాన్ని నిర్మిస్తున్నారు. దీంతో పైకప్పు కూలినప్పుడు భారీ పరిమాణంలో బండరాళ్లు, మట్టి, శిథిలాలు ప్రమాద స్థలానికి రెండువైపులా గుట్టల్లా ఏర్పడ్డాయి. బయటికి వెళ్లే మార్గం వైపు పేరుకుపోయిన శిథిలాల తొలగింపు పనులు మాత్రమే చేపట్టగా, శనివారం నాటికి కార్మికుల ఆచూకీకి సంబంధించి డీ1 నుంచి డీ2గా గుర్తించిన ప్రాంతాల వరకు తవ్వకాలు పూర్తయ్యాయి. దీంతో ఆదివారం కన్వేయర్ బెల్ట్ నుంచి డీ2 ప్రాంతం దిశగా తవ్వకాలు ప్రారంభించారు. ఈ ప్రాంతాల్లో తవ్వకాలు కొంత ప్రమాదకరమైనా కొన్ని జాగ్రత్తలు తీసుకుని సింగరేణి రెస్క్యూ బృందాలు సాహసించి పనులు కొనసాగిస్తున్నాయి.

కూలిన చోట శిథిలాల కిందే మిగతా కార్మికులు!

కేరళ నుంచి రప్పించిన కడావర్ డాగ్స్ పసిగట్టిన ప్రాంతాలన్నింటిలో తవ్వకాలు పూర్తి చేయగా, డీ2 ప్రాంతంలో ఓ మృతదేహం లభ్యమైంది. మిగిలిన ప్రాంతాల్లో తవ్వకాలు జరిపినా ఇతర కార్మికుల జాడ తెలియరాలేదు. దీంతో గల్లంతైన మిగతా కార్మికులు కచ్చితంగా సొరంగం కూలిన ప్రాంతంలో భారీ బండరాళ్లు, బురద, మట్టి శిథిలాల కిందే ఉండవచ్చని సహాయ చర్యల్లో పాల్గొంటున్న అధికారులు అనుమానిస్తున్నారు. అయితే అక్కడ తవ్వకాలు జరిపితే సొరంగానికి పైన 400 మీటర్ల వరకు ఉన్న బండరాళ్లు, మట్టి మళ్లీ కూలి పడతాయా అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. సొరంగానికి రక్షణలో భాగంగా కాంక్రీట్ సెగ్మెంట్లతో లైనింగ్ చేశారు. అయితే డీ1 ప్రాంతం నుంచి ఆవలి వైపు ఏర్పాటు చేసిన ఓ కాంక్రీట్ సెగ్మెంట్‌కి పగుళ్లు వచ్చాయి. రెండు వైపులా పేరుకుపోయిన ఉక్కు, ఇతర శిథిలాలు సపోర్టుగా ఉండడంతో ప్రస్తుతానికి ఆ సెగ్మెంట్ కూలిపోకుండా ఉంది. ఒక వేళ శిథిలాలను తొలగిస్తే వెంటనే దానితో పాటు సొరంగం కుప్పకూలే ప్రమాదం ఉంటుందని, సహాయక సిబ్బంది ప్రాణాలకు ముప్పు వాటిల్లవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సహాయక చర్యలు ఒకట్రెండు రోజులు నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలనే భావనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది.

ఎన్జీఆర్ఐ నివేదిక కోసం నిరీక్షణ

సొరంగం కూలిన ప్రాంతంలో ఉపరితల భాగం ఎంత మేర పటిష్టంగా ఉంది? ఎక్కడ బలహీనంగా ఉంది? తవ్వకాలను ముందుకు కొనసాగించవచ్చా? అనే అంశాలపై స్పష్టత వస్తేనే సహాయక చర్యలు ముందుకు కొనసాగనున్నాయి. దీనిపై ఇప్పటికే ఉపగ్రహ సహాయంతో అధ్యయనాలు నిర్వహించిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ) నిపుణులు ఈ నెల 25 లేదా 26న నివేదిక ఇస్తామని పేర్కొన్నట్టు తెలిసింది. కాగా ప్రత్యామ్నాయంగా సొరంగానికి ఉపరితలం నుంచి బోర్ హోల్ చేసి గల్లంతైన కార్మికులను బయటకి తెచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్జీఆర్ఐ ఇవ్వనున్న నివేదికపై ఈ నిర్ణయం ఆధారపడి ఉంది. సోమవారం నాటి సమీక్షకు ఎన్జీఆర్ఐ నిపుణులను సైతం ప్రభుత్వం ఆహ్వానించింది.

ప్రమాదం నుంచి రక్షణ కోసం ఫెన్సింగ్

సహాయక చర్యలు చేపడుతున్న సమయంలో సొరంగంలో పేరుకుపోయిన బురద, మట్టి శిథిలాలు ఒక్కసారిగా కొట్టుకువచ్చి సిబ్బందిని ముంచెత్తే ప్రమాదం ఉంది. అలాంటి పరిస్థితి ఏర్పడితే తప్పించుకోవడానికి బురదకు ఫెన్సింగ్ చేస్తున్నారు. బురద లోపల ఒత్తిడి పెరిగినప్పుడు ఫెన్సింగ్ ఉబ్బినట్టు అవుతుంది. దీనిని సంకేతంగా భావించి సహాయక సిబ్బంది అక్కడినుంచి తప్పించుకోవాల్సి ఉంటుంది. అలాగే ఫెన్సింగ్ వల్ల బురద ఒక్కసారిగా జారిపడకుండా సిబ్బందికి కొంత సమయం లభిస్తుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం డీ2 ప్రాంతంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

రాములోరి కల్యాణానికి రండి

- సీఎంకు భద్రాచల ఆలయ అర్చకుల ఆహ్వానం



శ్రీరామనవమి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్/భద్రాచలంఅర్బన్: వచ్చే నెల 6, 7వ తేదీల్లో జరగనున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆలయ వేదపండితులు కోరారు. ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి రామయ్య వివాహ ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను తనకు వెంటనే అందజేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి సీఎం వస్తారు: పొంగులేటి

శ్రీరామనవమి వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాచలంలో ఆదివారం ఆయన పలు అభివృద్ధి పనులు ప్రారంభించడంతోపాటు శ్రీరామనవమి వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూడు రోజుల్లో బాధితులకు పరిహారం చెల్లించి మాడవీధుల విస్తరణ పనులను శ్రీరామనవమి రోజు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ

ధర్మాన్ని కాపాడుతూ ముందుకు సాగాలి

- గీతా పారాయణంలో మంత్రి శ్రీధర్‌బాబు
- ఐదు వేల మంది మహిళల హాజరు

మంథని: భక్తిభావాన్ని పెంపొందించి..ధర్మాన్ని కాపాడుతూ ముందుకు సాగాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం పెద్దపల్లి జిల్లా మంథనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం నుంచి పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించిన అనంతరం లక్ష్మీ నృసింహ గార్డెన్‌లో సామూహిక గీతా పారాయణం నిర్వహించారు. ప్రవచకులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. 5 వేల మందితో సామూహిక గీతా పారాయణం, ఇంటింటా పారాయణం నిర్వహించారు. సనాతన ధర్మ ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన శ్రీనివాస్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పార్వతీ టీచర్‌కు ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించినట్టు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.



సామూహిక పారాయణంలో పాల్గొన్న మహిళలు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మాతృభాషను విస్మరించకూడదు

- హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్

రామన్నపేట: పరభాష మోజులోపడి కన్నతల్లిలాంటి మాతృభాషను విస్మరించకూడదని హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ సూచించారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకిలో ఆచార్య కూరెళ్ల గ్రంథాలయ దాతల సన్మానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనకు తెలుగు అంటే చాలా ఇష్టమని అన్నారు. తెలుగు కళ్లయితే పరభాషలు కళ్లద్దాలని, కళ్లుంటేనే కళ్లద్దాలు పని చేస్తాయని చెప్పారు. తెలుగుభాష పరిరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ఒక పల్లెటూరిలో రెండులక్షలకు పైగా పుస్తకాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అత్యంత సాహసోపేతమైన నిర్ణయమని అన్నారు. యువతీ యువకులు ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆచార్య కూరెళ్ల గ్రంథాలయంలో అధ్యయనం చేసిన పలువురు విద్యార్థులు పీహెచ్‌డీలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. గ్రంథాలయ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, రాబోయే రోజుల్లో ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం రాష్ట్రానికే తలమానికంగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య మాట్లాడుతూ దాతల సహకారం వల్లనే కోటి రూపాయల వ్యయంతో అధునాతన భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి యువతీ, యువకులు, విద్యార్థులు జ్ఞాన సంపన్నులు కావాలన్నదే సంస్థ ఏర్పాటు ఉద్దేశమని తెలిపారు.



తన సతీమణితో కలసి సైకిల్‌పై రామయంపేట వెళ్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ సైకిల్ సవారీ

- మెదక్ నుంచి రామాయంపేట వరకు ప్రయాణం
- ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలపై ఆరా
- అనంతరం బస్సులో మెదక్‌కు పయనం

రామాయంపేట(మెదక్): మెదక్ జిల్లా రామాయంపేటలో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా పర్యటించారు. ఆదివారం ఉదయం మెదక్ జిల్లా కేంద్రం నుంచి 20 కిలోమీటర్ల మేర సైకిల్‌పై ప్రయాణం చేసిన కలెక్టర్ రామాయంపేట ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించారు. బస్టాండ్‌లో ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రయాణ ప్రాంగణంలో అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సామాన్య ప్రయాణికుడిలా తన భార్య శ్రీజతో కలసి ఆర్టీసీ బస్సులో మెదక్‌కు వెళ్లారు. ఆయన వెంట మెదక్ ఆర్టీసీ డీఎం, మున్సిపల్ సిబ్బంది, ఇతర అధికారులు ఉన్నారు.

కుటుంబాన్ని చిదిమేసిన నిర్లక్ష్యం

- అతివేగంతో కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- భార్యాభర్త, కుమార్తె మృతి.. కుమారుడి పరిస్థితి విషమం
- కారులోని మరో ఏడుగురికి తీవ్ర గాయాలు
- చివ్వెంల మండలం బీబీగూడెం శివారులో ఘటన



రేణుక



రిషిత



రవీందర్

చివ్వెంల (సూర్యాపేట): బంధువులందరితో కలిసి సంతోషంగా ఉప్పలమ్మ పండుగ జరుపుకున్నారు.. పిల్లాపాపలతో కలిసి ఉల్లాసంగా గడిపారు. వారి సంతోషాన్ని చూసి మృత్యువుకు కన్నుకుట్టిందేమో.. కుటుంబాన్ని మొత్తం ఒకేసారి కబలించింది. బంధువుల ఇంట్లో పండుగకు వెళ్లి తిరుగు ప్రయాణమైన ఓ కుటుంబం ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణంపాలైంది. తీవ్ర గాయాలపాలైన ఓ బాలుడు అనాథగా మిగిలాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై ఆదివారం జరిగింది.

నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్‌తో..

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం కంటయపాలెం గ్రామానికి చెందిన గడ్డం రవీందర్ (34) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య రేణుక (29), కుమార్తె రిషిత (7), కుమారుడు రిషిక్రిష్ణ ఉన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామంలో రేణుక మేనమామ కోతి జనార్దన్ ఇంట్లో ఉప్పలమ్మ పండుగ కోసం రవీందర్ కుటుంబంతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి కోటపహాడ్‌కు వచ్చాడు. పండుగ ముగిసిన అనంతరం ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో పాటు అతడి బావమరిది గంధం మధు, అతడి కుమార్తె సాన్విక, కుమారులు గగన్ చందర్, మల్లికార్జున్, అర్వపల్లి మండలం పర్సాయిపల్లి గ్రామానికి చెందిన రవీందర్ బంధువు కడారి పుష్ప, ఆమె కుమారులు హర్షిత్, జాగ్వన్ కలిసి కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. కారు బీబీగూడెం గ్రామ శివారులోకి రాగానే సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న రవీందర్, అతడి భార్య రేణుక, కుమార్తె రిషిత అక్కడికక్కడే మృతిచెందారు. రవీందర్ కుమారుడు రిషిక్రిష్ణతోపాటు మరో ఇద్దరు చిన్నారులు హర్షిత్, గగన్ చందర్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. రవీందర్, రేణుక తలలు ఛిద్రం కావడంతో పోస్టుమార్టం సోమవారం చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఒక్కపూట ఉండమన్నా ఉండలే..

ఒక్కపూట ఉండి వెళ్లమని చెప్పినా వినకుండా హైదరాబాద్‌కు బయల్దేరిన అరగంట లోపే తమవారి మరణవార్త తెలియడంతో మృతుల బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కపూట గ్రామంలో ఆగినా ఈ ఘోర ప్రమాదం తప్పేదని వాపోయారు.



మయూరం.. వయ్యారం...!

వేసవి ప్రారంభం కావడంతో అటవీ ప్రాంతాల్లో నుంచి నెమళ్లు జనావాసాల్లోకి వస్తున్నాయి. గ్రామాల సమీపంలోకి వచ్చి సందడి చేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా మేత, మంచినీటి కోసం సంచరిస్తున్నాయి. ఏపీలోని అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం ఎగువమిట్టామ్రి సమీపంలోని మొరంకిందపల్లెలో ఆదివారం నెమళ్లు వచ్చి సందడి చేసిన దృశ్యాలను ట్రెక్కింగ్ గ్రూప్ సభ్యులు తమ కెమెరాల్లో బంధించారు. – మదనపల్లె సిటీ

గాజా మృతులు 50 వేలు

తాజా దాడుల్లో 23 మంది మృతి ● మృతుల్లో హమాస్ సీనియర్ నేత

డెయిర్ అల్–బలాహ్: గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి బలైన వారి సంఖ్య 50 వేలు దాటింది! ఆదివారం గాజా ఆరోగ్య విభాగం ఈ మేరకు ప్రకటించింది. ''మృతుల్లో సగానికి పైగా మహిళలు, చిన్నారులే. 1.13 లక్షల మందికి పైగా క్షతగాత్రులుగా మారారు. ఇజ్రాయెల్ దాడుల వల్ల గాజా జనాభాలో 90 శాతం మంది నిలువనీడ కోల్పోయారు'' అని ఆవేదన వెలిబుచ్చింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఇజ్రాయెల్ చేపట్టిన తాజా వైమానిక దాడుల్లో హమాస్ రాజకీయ విభాగం సీనియర్ నేత సహా 23 మంది చనిపోయారు. ఖాన్‌యూనిస్ సమీపంలో దాడుల్లో పాలస్తీనా పార్లమెంట్ సభ్యుడు, తమ రాజకీయ విభాగం సభ్యుడు సలాహ్ బర్దావిల్, ఆయన భార్య చనిపోయినట్లు హమాస్ వర్గాలు ప్రకటించాయి. టెంట్లో ప్రార్థనలు చేస్తున్న సమయంలో వీరిపై దాడి జరిగిందని పేర్కొన్నాయి. హమాస్ రాజకీయ వ్యవహారాలపై తరచూ మీడియాకు బర్దావిల్ ఇంటర్వ్యూలిస్తుంటారు. ఖాన్ యూనిస్‌పై జరిగిన దాడిలో దంపతులతో పాటు వారి ఐదుగురు సంతానం చనిపోయారు. మరో దాడిలో దంపతులు, ఇద్దరు కుమార్తెలు



ప్రాణాలు కోల్పోయినట్టు యూరోపియన్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మరో దాడిలో చనిపోయిన మహిళ, చిన్నారి మృతదేహాలను ఆస్పత్రికి తీసుకొచ్చినట్టు కువైటీ ఆస్పత్రి నిర్వాహకులు చెప్పారు.

మారణహోమమే

హమాస్ సాయుధులు 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై మెరుపు దాడులు చేసి 1,200 మందిని చంపడం, 250 మందికి పైగా బందీలుగా తీసుకెళ్లడం తెలిసిందే. అప్పటి నుంచి గాజాపై ఇజ్రాయెల్ భీకర యుద్ధానికి దిగింది. ఆ ప్రాంతాన్ని శ్మశానసదృశంగా మార్చేసింది. జనవరిలో కుదిరిన కాల్పుల విరమణ రెండు నెలల ముచ్చటే అయింది. వారం రోజులుగా మళ్లీ గాజాపై దాడులతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది.

పోప్ ఫ్రాన్సిస్‌కు పూర్తి స్వస్థత

ఆస్పత్రి నుంచి వాటికన్ నివాసానికి

వాటికన్ సిటీ: ప్రాణాంతక నిమోనియాతో ఐదు వారాల పాటు పోరాడిన పోప్ ఫ్రాన్సిస్ (88) పూర్తి ఆరోగ్యం సంతరించుకున్నారు. జెమెల్లీ ఆసుపత్రి నుంచి ఆదివారం వాటికన్‌లోని నివాసానికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం వందలాది మంది ఆస్పత్రి దగ్గర గుమిగూడి ఆయనకు వీడ్కోలు పలికారు. ఆసుపత్రి ప్రధాన ప్రవేశం ఎదురుగా ఉన్న బాల్కనీ నుంచి వారికి పోప్ అభివాదం చేశారు. ఆయనను చూడటానికి రోగులు కూడా బయటికొచ్చారు. అనంతరం పోప్ఆక్సిజన్ పైపులను ధరించి తెల్ల ఫియట్ కారులో వాటికన్ చేరుకున్నారు. తన నివాసానికి వెళ్లడానికి ముందు ఆనవాయితీ మేరకు సెయింట్ మేరీ మేజర్ బాసిలికాకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పోప్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద ప్రజలు భారీగా గుమిగూడారు. ఊపిరితిత్తులు, శ్వాసకోశ కండరాలు దెబ్బతినడంతో పోప్ ఇప్పటికీ మాట్లాడేందుకు ఇబ్బంది పడుతున్నారని వైద్యులు తెలిపారు. ''వృద్ధులైన రోగుల్లో ఇవి మామూలే. గొంతు త్వరలో సాధారణ స్థితికి చేరుకుంటుంది. అప్పటిదాకా శ్రమ పడకూడదు. ఎక్కువమందిని కలవకూడదు'' అని సూచించారు. దాంతో ఆయన కార్యక్రమాలన్నింటినీ రద్దు చేశారు. పోప్ దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధితో ఫిబ్రవరి 14న ఆస్పత్రిలో చేరడం తెలిసిందే. రెండు ఊపిరితిత్తుల్లో నిమోనియా ఉన్నట్టు నిర్ధారించి 38



రోజులపాటు చికిత్స అందించారు. 12 ఏళ్ల పదవీకాలంలో పోప్‌కు ఇదే అతిపెద్ద విరామం. ఒకానొక దశలో ఆయన వారుసుడు ఎవరన్న చర్చ కూడా జరిగింది. అంత పెద్ద వయసులో డబుల్ నిమోనియాతో బాధపడే రోగులు ఆరోగ్యంగా బయటపడటం చాలా అరుదు. కానీ పోప్ మాత్రం ఇంత సమస్యలోనూ నిబ్బరంగా వ్యవహరించారు. ఎలా ఉందన్న వైద్యులతో బతికే ఉన్నానంటూ చెణుకులు విసిరారు.

అమెరికాలో పేలిన తూటా...

భారత సంతతి తండ్రీకూతుళ్ల మృతి

స్టోర్‌లో విధుల్లో ఉండగా నల్లజాతీయుని కాల్పులు

న్యూయార్క్: అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో ఓ నల్లజాతి యువకుడు జరిపిన కాల్పుల్లో భారత సంతతికి చెందిన తండ్రి, కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అకోమాక్ కౌంటీలోని లాంక్‌ఫోర్డ్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న డిపార్టుమెంటల్ స్టోర్‌లో ఈ నెల 21వ తేదీన ఉదయం ఐదున్నర గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గుజరాత్ నుంచి వలస వెళ్లిన ప్రదీప్‌కుమార్ పటేల్ (56), ఆయన కుమార్తె ఊర్మి (24) ఈ స్టోర్‌లో పనిచేస్తున్నారు. జార్జి ఫ్రెజీర్ డెవాన్ వార్టన్ (44) అనే నల్ల జాతీయుడు ఉదయాన్నే స్టోర్‌కు వచ్చి తండ్రి కుమార్తెలతో ఘర్షణకు దిగాడు. విచక్షణ కోల్పోయి వారిద్దరిపై తుపాకీతో కాల్పులు జరిపి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన పటేల్ అక్కడికక్కడే మరణించారు. అపస్మారక స్థితికి చేరుకున్న ఊర్మిని పోలీసులు సమీపంలోని సెంతారా నార్‌ఫోక్ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. వార్టన్‌ను పోలీసులు అరెస్టు చేసి అకోమాక్



జైలుకు తరలించారు. అతడిపై ఫస్ట్ డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేశారు. ఎందుకు కాల్పులు జరిపాడన్నది ఇంకా తెలియరాలేదు. అయితే అతడు రాత్రంతా స్టోర్ ఎదుటే పడిగాపులు కాశాడని, తండ్రి కుమార్తె ఉదయం స్టోర్ తెరవగానే వారితో గొడవకు దిగాడని తెలిసింది. రాత్రి స్టోర్ ఎందుకు మూసేశారని ప్రశ్నిస్తూ కాల్పులు జరిపినట్లు సమాచారం. పటేల్, ఊర్మి పని చేస్తున్న స్టోర్ యజమాని భారత సంతతికి చెందిన పరేశ్ పటేల్ వారి బంధువేనని స్థానిక మీడియా వెల్లడించింది. పటేల్ తన భార్య హంసాబెన్, చిన్న కూతురు ఊర్మితో కలిసి ఆరేళ్ల క్రితం విజిటర్ వీసాపై అమెరికాకు వచ్చారు. మరో ఇద్దరు కుమార్తెలు కెనడాలో, అహ్మదాబాద్‌లో ఉంటారు.

జస్టిస్ వర్మపై దర్యాప్తు...

కీలక దశకు

త్వరలో సీజేఐకి నివేదిక ● ఆరోపణలు తేలితే ఉద్వాసన!

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నగదు దొరికిన ఘటనపై దర్యాప్తు కోసం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ చురుగ్గా వ్యవహరిస్తోంది. తొలి దశ దర్యాప్తును ఇప్పటికే పూర్తిచేసింది. విచారణ కీలకమైన రెండో దశకు చేరినట్లు తెలిసింది. ఈ దశలో లభించే సాక్ష్యాధారాలే జస్టిస్ వర్మ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి. త్రిసభ్య కమిటీలో పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ షీల్ నాగు, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ జీఎస్ సంధావాలియా, కర్నాటక హైకోర్టు సీజే జస్టిస్ అనూ శివరామన్ ఉన్న విషయం తెలిసిందే. కమిటీ దర్యాప్తును సీజేఐ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. తొలి దశ దర్యాప్తులో ఫిర్యాదు ఆధారంగా కొందరు సాక్షులను మాత్రమే ప్రశ్నించారు. అందులో తేలిన అంశాల ఆధారంగా రెండో దశలో మరింత లోతుగా విచారిస్తున్నారు. విచారణ పూర్తవగానే సీజేఐకి కమిటీ నివేదిక సమర్పించనుంది. ఇందుకు గడువేమీ నిర్దేశించలేదు. జస్టిస్ వర్మ ఇంట్లో భారీగా నగదు దొరికిందన్న వార్తలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడం తెలిసిందే. కాలిపోయినట్లు చెబుతున్న నోట్ల కట్టల వీడియోలు, ఫొటోలను ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉపాధ్యాయకు పోలీసు కమిషనర్ అందజేశారు. వాటిని ఆయన సుప్రీంకోర్టుకు సమర్పించారు. ఇందుకు సంబంధించి శనివారం రాత్రి సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలు, ఫొటోలు సంచలనం సృష్టించాయి. సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నెల 14న జస్టిస్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం సందర్భంగా తమ సిబ్బందికి అక్కడ నోట్ల కట్టలేవీ దొరకలేదని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ తొలుత ప్రకటించారు. తానలా అనలేదంటూ మర్నాడే వివరణ ఇచ్చారు. నోట్ల కట్టల విషయం నిజమేనని తేలితే జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి సీజేఐ సిఫార్సు చేయవచ్చు. అనంతరం పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ఆమోదించడం ద్వారా హైకోర్టు న్యాయమూర్తి పదవి నుంచి ఆయనను శాశ్వతంగా తొలగించవచ్చు.



జస్టిస్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదానికి సంబంధించి శనివారం సుప్రీంకోర్టు విడుదల చేసిన వీడియోలో చోటుచేసుకున్న దృశ్యాలు

సీజేఐ ఖన్నాపై ప్రశంసల వర్షం

జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో దొరికిన నగదుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, కీలక డాక్యుమెంట్లను సుప్రీంకోర్టు ప్రజా బాహుళ్యంలోకి తీసుకురావడం గొప్ప విషయమని న్యాయ నిపుణులు అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాపై ప్రశంసల వర్షం కురిపించారు. ''ఇది చాలా అరుదైన ఘటన. ఇలాంటి ఉదంతాల్లో వివరాలను సాధారణంగా గోప్యంగా ఉంచుతుంటారు. కానీ వాటిని వెబ్‌సైట్‌లో అందరికీ అందుబాటులో తేవడం ద్వారా గొప్ప సంస్కరణకు సీజేఐ శ్రీకారం చుట్టారు. ఆయనకు మా సెల్యూట్'' అని సీనియర్ అడ్వొకేట్లు సంజయ్ హెగ్డే, ఇందిరా జైసింగ్, ఆదిష్ సి.అగర్వాల్ తదితరులు అభినందించారు. జస్టిస్ వర్మపై అంతర్గత విచారణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటును కూడా ప్రశంసించారు. జస్టిస్ వర్మ ఇంట్లో దొరికిన డబ్బు కట్టల వీడియోను చూసి ఆందోళన చెందానని ఆదిష్ చెప్పారు. పెద్ద మొత్తంలో నగదు కాలిపోయిన స్థితిలో దొరకడం పట్ల పలు అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయంలో నిజానిజాలు నిగ్గుతేలాలని సీనియర్ న్యాయవాది మార్కండేయ ఖట్జూ అన్నారు.

నాపై కుట్రలు: జస్టిస్ వర్మ

- నా ఇంట్లో ఎలాంటి నగదూ దొరకలేదు
- కాలిపోయాయంటున్న నోట్లతో సంబంధం లేదు
- నా ప్రతిష్టను దెబ్బతీసేందుకే నిరాధార ఆరోపణలు

న్యూఢిల్లీ: తన అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం తర్వాత నోట్ల కట్టలేవీ లభించలేదని, తనకు వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తేల్చిచెప్పారు. పెద్ద ఎత్తున నగదు లభ్యమైనట్లు జరుగుతున్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. నిరాధార ఆరోపణలతో తన ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కె.ఉపాధ్యాయకు ఆయన లేఖ రాశారు. ఆ నోట్లతో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అవి అక్కడికెలా వచ్చాయో తనకు తెలియదన్నారు. ''అగ్నిప్రమాదం జరిగిన రోజు నేను ఇంట్లో లేను. ప్రమాదం తర్వాత స్టోర్‌రూంలో కాలిన కరెన్సీ నోట్ల కట్టలను అధికారులు తొలగించడం గానీ, స్వాధీనం చేసుకోవడం గానీ జరగలేదని నా కుమార్తె, సిబ్బంది చెప్పారు. కాలిన నోట్లను అధికారులు నా కుటుంబసభ్యులకు చూపలేదు. ఆ నోట్లను వారు బయటకు తీసుకెళ్లినట్లు నా కుటుంబీకులు చూడలేదు. నాకు గానీ, నా కుటుంబీకులకు గానీ స్టోర్‌రూంలో నగదు భద్రపర్చే అలవాటు లేదు. ఆ గదిలో మంటల్లో పాక్షికంగా కాలిన నగదు దొరికినట్లు చెప్పడం పూర్తిగా అర్థరహితం, అసంబద్ధం. దీని వెనక కుట్ర ఉంది'' అని ఆరోపించారు. అందరూ స్వేచ్ఛగా తిరిగే స్టోర్‌రూంలో ఎవరైనా భారీగా నగదు దాస్తారా అని ప్రశ్నించారు. ప్రమాదం జరిగినప్పుడు లేని నోట్లు తర్వాత అక్కడెలా ప్రత్యక్షమయ్యాయో దర్యాప్తు అధికారులే తేల్చాలన్నారు. ''మేం బ్యాంకు ఖాతాల నుంచే ఆర్థిక లావాదేవీలు చేస్తుంటాం. నగదు అవసరమైనప్పుడు బ్యాంకు నుంచి విత్‌డ్రా చేస్తుంటాం. వాటికి అన్ని లెక్కలూ ఉన్నాయి'' అని చెప్పారు.



ప్రేమచిహ్నం చెంత...
అందాల రాణులు

ఆదివారం తాజ్‌మహల్ ముందు పోజిస్తున్న మిస్ యూనివర్స్ విక్టోరియా, మిస్ ఇండియా (యూనివర్స్) రియా సింఘా

మతాధారిత రిజర్వేషన్లు...

రాజ్యాంగ ఉల్లంఘనే

ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలె

బెంగళూరు: మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడాన్ని రాజ్యాంగం అనుమతించలేదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలె తెలిపారు. ఇలాంటి రిజర్వేషన్లు రాజ్యాంగానికి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం కేటాయించాలంటూ కర్ణాటక ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయంపై చర్చ జరుగుతున్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆర్‌ఎస్‌ఎస్ అత్యున్నత నిర్ణాయక విభాగం అఖిల భారతీయ ప్రతినిధి సభ మూడు రోజుల భేటీ ముగిసిన అనంతరం ఆదివారం హొసబలె బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర గతంలో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకు చేసిన ప్రయత్నాలను హైకోర్టులతో పాటు సుప్రీంకోర్టు అడ్డుకున్నాయని గుర్తుచేశారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్‌ను ఆదర్శమూర్తిగా మార్చారే తప్ప, పరమత సహనాన్ని బోధించిన ఆయన పెద్ద సోదరుడు దారా షికోను పట్టించుకోవడం లేదన్నారు. భారతీయ సంప్రదాయానికి వ్యతిరేకంగా నడుచుకున్న వారిని కీర్తించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 'దురాక్రమణదారు మనస్తత్వం కలిగిన వారు దేశానికి ప్రమాదకరం, భారతీయ సంప్రదాయాన్ని గౌరవించే వారికి మనం మద్దతుగా నిలుద్దాం'అని హొసబలె పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ కొన్ని అంశాలపై తన అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని భావిస్తున్నారా అన్న ప్రశ్నకు హొసబలె.. ప్రతిదీ సజావుగానే నడుస్తున్నందున ఆ



అవసరమే లేదని స్పష్టం చేశారు. 'ప్రభుత్వానికి నిత్యం జరిగే అంశాల గురించి సంఘ్ ఏమీ చెప్పదు. ప్రజలేవైనా కొన్ని విషయాలపై ఆందోళన వ్యక్తం చేసిన సమయాల్లో మాత్రమే ఆ పనిచేస్తుంది. వివిధ సంస్థలు, రంగాల్లో పనిచేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలే ఈ పనిని నెరవేరుస్తారు. వీటిపై చర్చించే యంత్రాంగం మాకుంది'అంటూ హొసబలె వివరించారు. ''అయోధ్య రామాలయ నిర్మాణం ఆర్‌ఎస్‌ఎస్ ఘనత కాదు.యావత్తు హిందూ సమాజం ఘనత. హిందువనే గుర్తింపు సిగ్గుపడే విషయం కాదు. అది గర్వకారణం. హిందువంటే మతపరమైన గుర్తింపే కాదు. జాతీయత, ఆధ్యాత్మికత, నాగరికతకు కూడా సంబంధించిన గుర్తింపు'' అన్నారు.

ఏప్రిల్ 28న కెనడాలో ఎన్నికలు

పార్లమెంట్ రద్దుకు ప్రధాని కార్నీ సిఫార్సు

ఒట్టావా: కెనడాలో ఎన్నికల నగారా మోగింది. ఏప్రిల్ 28న ముందస్తు పోలింగ్ జరపనున్నట్లు ఆదివారం కెనడా ప్రధానమంత్రి కార్నీ ప్రకటించారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక అగ్రరాజ్యం అమెరికాతో సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న వేళ ఆయనీ ప్రకటన చేయడం గమనార్హం. జస్టిన్ ట్రూడో పదవి నుంచి వైదొలగడంతో రెండు వారాల క్రితమే కార్నీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ముందస్తు ఎన్నికలపై ఊహాగానాలు వెలువడుతున్న వేళ ఆదివారం ఆయన గవర్నర్ జనరల్‌తో భేటీ అయి పార్లమెంట్‌ను రద్దు చేయాలని కోరారు. అక్టోబర్ 20న ఎన్నికలు జరగాల్సి ఉంది. అధికార లిబరల్ పార్టీకి అనుకూల పవనాలు వీస్తుండటంతో కార్నీ ముందస్తు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

కశ్మీర్‌లోని కథువాలో ఎన్‌కౌంటర్

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య ఆదివారం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలోని సన్యాస్ గ్రామ నర్సరీలో దాక్కున్న ఐదుగురు ఉగ్రవాదుల బృందాన్ని కట్టెలు ఏరుకునేందుకు వెళ్లిన స్థానిక మహిళలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న బలగాలపైకి ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. బలగాలు దీటుగా స్పందిస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గాయపడిన ఏడేళ్ల చిన్నారిని ఆస్పత్రికి తరలించామన్నారు. కాల్పులు కొనసాగుతున్నాయని, అదనంగా బలగాలను అక్కడికి రప్పించామని తెలిపారు.

'భారత్ ఫస్ట్'కే అగ్రతాంబూలం: జై శంకర్

న్యూఢిల్లీ: అమెరికా తదితర దేశాలతో జరిగే వాణిజ్య చర్చల్లో లాభనష్టాల అంచనా కంటే 'భారత్ ఫస్ట్' విధానానికే తొలి ప్రాధాన్యమిస్తామని విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ స్పష్టం చేశారు. భారత్‌కూ సుంకాల మోత తప్పదన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఆయన స్పందించారు. ''అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. అయితే ఈ విషయంలో కచ్చితంగా మన దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తాం'' అన్నారు. ఆదివారం బిజినెస్ ఇండియా మైండ్‌రష్–2025 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

భగత్, లోహియాకు మోదీ నివాళులు

న్యూఢిల్లీ: విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ప్రధాని మోదీ ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అత్యున్నత త్యాగాలు చేసిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఈ రోజు జాతి స్మరించుకుంటోంది. స్వేచ్ఛ, న్యాయం కోసం వారి నిర్భయమైన ప్రయత్నం మనందరికీ స్ఫూర్తినిస్తూనే ఉంటుంది'అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. దేశానికి బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించేందుకు విప్లవ బాట పట్టిన ఈ ముగ్గురినీ బ్రిటిష్ పాలకులు లాహోర్ కుట్ర కేసులో ఉరి శిక్ష విధించారు. ఢిల్లీలోని సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలోకి భగత్ సింగ్ బాంబు విసిరారు. బ్రిటిష్ పాలనపై వ్యతిరేకతను తెలియజేయడమే తప్ప, ఎవరినీ చంపడం వారి ఉద్దేశం కాదు. అయినప్పటికీ పాలకులు వీరికి 1931 మార్చి 23వ తేదీన ఉరిశిక్ష అమలు చేశారు. అప్పటికి వీరి వయస్సు 25 ఏళ్ల లోపే. అదేవిధంగా, సోషలిస్ట్ నేత రాం మనోహర్ లోహియా జయంతిని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఆయనకు నివాళులర్పించారు. సామాజిక న్యాయ సాధనకు ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు.

కేరళ బీజేపీ చీఫ్‌గా రాజీవ్ చంద్రశేఖర్!

తిరువనంతపురం: బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్(60) కేరళ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులు కానున్నారు. ఈ పోస్టు కోసం ఆయనొక్కరే దరఖాస్తు చేసుకోవడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. సోమవారం జరిగే పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అనంతరం ఇందుకు సంబంధించిన ప్రకటన అధికారికంగా వెలువడనుంది. పార్టీ కేంద్ర పరిశీలకుడిగా సమావేశానికి హాజరుకానున్న ప్రహ్లాద్ జోషి ఈ నియామకాన్ని ధ్రువీకరించనున్నారు. పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్ష పదవి కోసం ఆదివారం రాజధాని తిరువనంతపురంలోని పార్టీ కార్యాలయంలో రాజీవ్ చంద్ర శేఖర్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

రష్యా డ్రోన్ల దాడిలో తొమ్మిది మంది మృతి

కీవ్: ఓవైపు కాల్పుల విరమణ చర్చలకు సిద్ధమవుతూనే ఉక్రెయిన్‌పై రష్యా దాడులను కొనసాగిస్తోంది. తాజాగా ఆదివారం తెల్లవారుజామున జరిపిన డ్రోన్ల దాడిలో తొమ్మిది మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఖార్కివ్, సుమి, చెర్నిహివ్, ఒడెసా, డొనెట్స్క్ ప్రాంతాలతోపాటు రాజధాని కీవ్‌పైనా ఐదు గంటలకు పైగా రష్యా దాడులు కొనసాగాయని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. గగనతల రక్షణ వ్యవస్థల నుంచి తప్పించుకునేందుకు తక్కువ ఎత్తులో ఎగిరిన రష్యా డ్రోన్లు నివాస భవనాలపై పడ్డాయి. కీవ్‌పై జరిపిన డ్రోన్ దాడిలో ఐదేళ్ల చిన్నారి సహా ముగ్గురు మృతి చెందారు. మరో 10 మంది గాయపడ్డారు. డ్రోన్ శిథిలాలు పడటంతో డ్నిప్రో జిల్లాలోని రెండు నివాస భవనాలకు మంటలు అంటుకున్నాయి. 9 అంతస్తుల భవనంపై అంతస్తులో మంటలు చెలరేగడంతో ఒక మహిళ మృతి చెందింది. పొదిల్ జిల్లాలో 25 అంతస్తుల భవనంలోని 20వ అంతస్తులో అగ్నిప్రమాదం సంభవించింది. హోలోసివ్‌స్కీలో గోదాము, కార్యాలయ భవనంలో మంటలు చెలరేగి ఒకరు మృతి చెందారు. డొనెట్స్క్ ప్రాంతంపై జరిపిన దాడుల్లో నలుగురు చనిపోయారు.

ఈ వారమే లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు..!

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న వక్ఫ్ సవరణ బిల్లు–2024ను ఈ వారంలోనే లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఏప్రిల్ 4వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగియనున్న దృష్ట్యా, అంతకుముందే ఈ వారంలోనే బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసుకోవాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ నివేదికను ఇప్పటికే స్పీకర్ ఓం బిర్లాకు అందించింది. వక్ఫ్ బోర్డుల్లో కనీసం నలుగురు ముస్లిమేతరులను చేర్చుకోవచ్చని భూ వివాదాలపై దర్యాప్తు అధికారాన్ని కలెక్టర్ల నుంచి సీనియర్ రాష్ట్ర ప్రభుత్వ నియామకాలకు బదిలీ చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. ముస్లిమేతరులు వక్ఫ్ బోర్డుల్లో సభ్యులుగా ఉండేందుకు వీలు కల్పించడం, కలెక్టర్లకు అదనపు అధికారాల వంటివాటిని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

అనంత దూరంలోని...

ఆ గెలాక్సీలో ఆక్సిజన్!

అనంతమైన విశ్వంలో మన భూమిపై తప్ప ఇంకెక్కడా ప్రాణవాయువు(ఆక్సిజన్) ఉండక పోవచ్చని శాస్త్రజ్ఞులు ఇప్పటిదాకా భావించే వారు. కానీ మనకు అత్యంత సుదూరంలో ఉన్న ఒక నక్షత్ర మండలం (గెలాక్సీ)లో ఆక్సిజన్ ఆనవాళ్లను గుర్తించారు. అంతేగాక భారీ లోహాల జాడను సైతం కనిపెట్టారు. ఈ గెలాక్సీ భూమి నుంచి ఏకంగా 1,340 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది! విశ్వం ఏర్పడిన తొలినాళ్లలోనే ఇది ఏర్పడి ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. విశ్వం పుట్టుకకు కారణమైన బిగ్‌బ్యాంగ్ 1,380 కోట్ల ఏళ్ల క్రితం సంభవించిందన్న వాదనలు ఇప్పటికే ఉన్నాయి. ఈ నక్షత్ర మండలానికి జేడ్స్–జీఎస్–జెడ్14–0 అని నామకరణం చేశారు. నిజానికి దీన్ని 2024 జనవరిలోనే ప్రాథమికంగా గుర్తించారు. జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ ఈ గెలాక్సీ ఉనికిని వెలుగులోకి తెచ్చింది. కాకపోతే దానిపై ప్రాణవాయువు



ఉన్నట్టు కనిపెట్టడం కీలక పరిణామమని సైంటిస్టులు చెబుతున్నారు. ఆ ఆక్సిజన్ ఏ రూపంలో, ఎంత పరిమాణంలో ఉందన్నది తేల్చడానికి పరిశోధనలు కొనసాగిస్తున్నారు. పరిమాణంలో అత్యంత భారీగా ఉన్న ఈ నక్షత్ర మండలం కాంతివంతమైనది కూడా. మన భూగోళమున్న గెలాక్సీకి సమీపంలో ఇప్పటిదాకా మరో 700 గెలాక్సీలను జేమ్స్ వెబ్ టెలిస్కోప్ గుర్తించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ట్విట్టర్ పిట్టకు రూ.30 లక్షలు!

సామాజిక మాధ్యమం ట్విట్టర్ లోగో బ్లూబర్డ్ గుర్తుంది కదా. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఆ సంస్థను కొనుగోలు చేశాక ఎక్స్‌గా పేరు మార్చినా ఇంకా అంతా ట్విట్టర్ అనే పిలుస్తారంటే దాని ప్రభావం అర్థం చేసుకోవచ్చు! ట్విట్టర్ కార్యాలయంపై 2012 నుంచి 2023 వరకూ సగర్వంగా వేలాడిన బ్లూ బర్డ్ లోగో తాజా వేలంలో రూ.30లక్షలకు అమ్ముడు పోయింది. 560 పౌండ్ల బరువున్న ఈ లోగోను ఓ అజ్ఞాత వ్యక్తి కొనుగోలు చేశాడు. మస్క్ 2022లో ట్విట్టర్‌ను టేకోవర్ చేయగానే శాన్‌ఫ్రాన్సిస్కో ప్రధాన కార్యాలయం నుంచి ట్విట్టర్ ఐకానిక్ బ్లూ బర్డ్‌ను తొలగించడం తెలిసిందే. ప్రధాన కార్యాలయాన్ని కూడా టెక్సాస్‌కు మార్చారు. ట్విట్టర్‌కు సంబంధించిన వస్తువులు, ఆఫీస్ ఫర్నీచర్‌తో పాటు లోగోను కూడా 2023 ఆగస్టులో మస్క్ వేలం వేశారు. అప్పుడు దాన్ని దక్కించుకున్న ఆర్ఆర్ సంస్థ తాజాగా తిరిగి వేలం వేసింది.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

వేములవాడఅర్బన్: మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌కు చెందిన సున్నపు మోహన్(32) ఆదివారం మూలవాగులోని ఓ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మోహన్ మద్యానికి బానిసై ఉరివేసుకున్నట్లు తెలిపారు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. మృతునికి భార్య, పిల్ల లు ఉన్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



గాయపడ్డ రాములు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్(కొంతంవాడ) ప్రాంతానికి చెందిన రాములు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డాడు. అదే సమయంలో రాములుకు గుండెపోటు రాగా స్థానికులు సీపీఆర్ చేసిన అనంతరం స్థానిక ఆస్పత్రికి తరలించారు. స్థానికంగా ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు.. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. దీంతో బాధితుడిని హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు.

శివంగాలపల్లిలో..



గాయపడ్డ కనకవ్వ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని శివంగాలపల్లి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వెంకట్రావుపేటకు చెందిన సందు రంజిత్, అతని తల్లి కనకవ్వ శివంగాలపల్లి నుంచి బైక్‌పై వస్తున్నారు. సబ్‌స్టేషన్ సమీపంలో వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కనకవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ వెంటనే 108 అంబులెన్స్‌లో సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వ్యాన్, లారీ ఢీకొని డ్రైవర్లకు..



పడిపోయిన కర్బూజలు

మేడిపల్లి: కర్బూజ లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌ను లారీ ఢీకొట్టింది. మేడిపల్లి, మోహన్‌రావుపేట ప్రధాన రహదారిపై జరిగిన ఈ ఘటనలో వ్యాన్ బోల్తా పడి కాయలన్నీ కిందపడిపోయాయి. రెండు వాహనాల డ్రైవర్లకు గాయాలయ్యాయి. ఎస్సై శ్యాంరాజ్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. పడిపోయిన వాహనాలను క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

అవగాహన లోపం.. లేబర్ కార్డుకు దూరం

- ఉమ్మడి జిల్లాలో 3.3 లక్షలకు మించని కార్డులు
- ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న కార్మికులు
- అవగాహన కల్పిస్తే మరింత మందికి ప్రయోజనం

కరీంనగర్	1,15,705
పెద్దపల్లి	84,974
జగిత్యాల	76,146
సిరిసిల్ల	54,739
మొత్తం	3,31,564

2014 నుంచి ఇప్పటి వరకు..
క్లెయిమ్‌లు: 49,795
చెల్లించిన డబ్బు: రూ.22,76,82,588

కరీంనగర్‌టౌన్: ఉమ్మడి జిల్లాలో కార్మికులకు తమ హక్కుల గురించి అవగాహన లేకపోవడంతో లేబర్ కార్డులకు దూరమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం చాలా పథకాలు అమలులోకి తెస్తుండడంతో ఇప్పుడిప్పుడే కార్డులు పొందేందుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ.. ప్రభుత్వం తరఫున కూడా అవగాహన కల్పించడంలో విఫలం అవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో కార్మికులు సాధారణంగా లేబర్ కార్డుల గురించి అవగాహన పొందడం చాలా కష్టంగా ఉంటుంది. ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లాలో 3.3 లక్షల కార్డులే..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 లక్షల పైగా జనాభా ఉండగా, ఇందులో 70 శాతం మంది వివిధ రంగాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. అంటే దాదాపు 20 లక్షల పైచిలుకు కార్మికులు ఉండగా కేవలం 3.3 లక్షల మంది మాత్రమే లేబర్ కార్డులు పొందడం గమనార్హం. ఈ గణాంకాలను చూస్తే కేవలం 10 శాతం లోపు మాత్రమే ఈ కార్డులు పొందారని తెలుస్తోంది.



నమూనా లేబర్‌కార్డులు

లేబర్ కార్డు పొందితే ప్రయోజనాలు

- లేబర్ కార్డు ఉన్న వ్యక్తి కూతుళ్ల పెళ్లికి రూ.30,000, ప్రసవానికి రూ.30,000 (ఇద్దరు కూతుళ్లకు మాత్రమే) ఒక సంవత్సరం ముందు బోర్డు నందు కార్మికుడు /కార్మికురాలుగా నమోదైనవారికి మాత్రమే ఇది వర్తిస్తుంది.
- ప్రమాదం వల్ల చనిపోతే బాధిత కుటుంబానికి రూ.6,30,000, సాధారణ మరణానికి రూ.1,30,000 ఆర్థికసాయం అందుతుంది.
- కార్మికునికి దహన సంస్కార ఖర్చుల కోసం రూ.30,000 అందిస్తారు.
- ప్రమాదవశాత్తు అంగవైకల్యం కలిగినవారికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పరిహారం అందజేస్తారు.
- తాత్కాలిక వైద్య ఖర్చుల కింద కార్మికులకు నెలకు రూ.4,500 చొప్పున గరిష్టంగా రూ.13,500 సహాయం అందుతుంది.

అర్హులు తీసుకోవాలి



వివిధ రంగాల్లో కార్మికులుగా పనిచేస్తున్న అర్హులందరూ లేబర్ కార్డులు తీసుకోవాలి. కార్డులు లేని చాలా మంది అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లేబర్ కార్డులపై ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేసి, కార్మికులందరికీ కార్డులు అందేలా చర్యలు చేపట్టాలి.
– కన్నం లక్ష్మణ్, కార్మిక సంఘం నాయకుడు

నిరంతరం అందజేస్తున్నాం



లేబర్ కార్డు పొందేందుకు నిర్ణీత గడువు అంటూ ఏమీ లేదు. కార్మికులుగా పనిచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ వెబ్ సైట్‌లో నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరి దరఖాస్తును పరిశీలించి అర్హులందరికీ లేబర్ కార్డులు అందజేయడం జరుగుతుంది. 3.3 లక్షల మంది ఇప్పటి వరకు కార్డులు కలిగి ఉన్నారు. మిగతా జిల్లాలతో పోల్చితే మనం మెరుగ్గా ఉన్నాం. కార్మికులకు అవగాహన కల్పించి మరింత మంది కార్డులు పొందేలా ప్రోత్సహిస్తాం.
– వెంకటరమణ, డిప్యూటీ లేబర్ కమిషనర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

ప్రజాస్వామ్య విలువలకు పెద్దపీట



మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్, పక్కన కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్‌అర్బన్: తమ ప్రభుత్వం రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్యానికి కట్టుబడి పని చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం తరఫున జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఇఫ్తార్ విందు కార్యక్రమం జరగగా మంత్రి హాజరై మాట్లాడారు. తమతోపాటు సమాజం బాగుండాలన్న కోరికతో రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్ష పాటిస్తారని తెలిపారు. ఈద్ వేడుకలకు ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజాపాలన కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు విజయవంతం అయ్యేలా ముస్లింలు ప్రార్థించాలని కోరారు. ఈ నెల 25న ముఖ్యమంత్రి హైదరాబాదులో ఇఫ్తార్ విందులో పాల్గొంటారని పేర్కొన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, కరీంనగర్‌లో ఎలాంటి భేదభావాలు లేకుండా అందరూ కలిసి ఉంటారని, భవిష్యత్తులోనూ ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు. రంజాన్ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ట్రైనీ ఐపీఎస్ వసుంధర, ఆర్డీవో మహేశ్వర్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

కేడీసీసీబీ సేవలు భేష్



మాట్లాడుతున్న సురేంద్రమోహన్

- సహకార శాఖ కమిషనర్ సురేంద్రమోహన్

కరీంనగర్‌అర్బన్: కేడీసీసీబీ సేవలు ప్రశంసనీయమని, మరింత పురోగతి సాధించాలని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ కె.సురేంద్రమోహన్ అన్నారు. ఆదివారం నుస్తులాపూర్ ప్యాక్స్‌తో పాటు కేడీసీసీబీలను సందర్శించారు. 2025 అంతర్జాతీయ సహకార సంవత్సర ప్రాధాన్యతతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, వివిధ సహకార రంగ సంస్థలు చేపట్టాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. పెద్దమొత్తంలో రుణాలిచ్చే స్థాయికి ఎదగడం హర్షణీయమని, దేశానికే తలమానికంగా కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిలుస్తోందని కొనియాడారు. ఇక్కడి మంచి విధానాలను రాష్ట్రమంతా పాటించేలా చూడాలన్నారు. రాష్ట్రంలోని కృషి విజ్ఞాన కేంద్రాలు, ఉద్యానవన శాఖలు, మార్కెటింగ్ శాఖ, వివిధ సహకార రంగ సంస్థలను అనుసంధానం చేసి రైతుల ఉత్పత్తులను సమీకరించి, అధిక లాభాలు అందేలా పనిచేయించాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రజానీకానికి నగదు రహిత లావాదేవీల నిర్వహణ, బ్యాంకులు అందించే వివిధ సేవల గురించి విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సంఘాల ద్వారా జన ఔషధి కేంద్రాలను ప్రతీ మండల కేంద్రంలో స్థాపించి సభ్యులకు, ప్రజలకు చౌకగా లభించే మందులు విక్రయించాలని వివరించారు. కేడీసీసీ బ్యాంకు ముఖ్యకార్య నిర్వాణాధికారి సత్యనారాయణరావు మాట్లాడుతూ, ఇటీవల నిర్మించిన గోదాముల్లో మిగులు సామర్థ్యాన్ని ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయి, మార్కెటింగ్ శాఖ, రైస్ మిల్లులు ఉపయోగించుకొనుటకు ప్రభుత్వపరంగా అనుమతులు ఇచ్చి సంఘాలకు అద్దెల రూపంగా డబ్బు వచ్చేలా చూడాలన్నారు. అదనపు కమిషనర్ జి.శ్రీనివాస్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహకార అధికారులు, ఎస్.రామానుజచార్యులు, సి.శ్రీమాల, మనోజ్‌కుమార్, రామకృష్ణ, సహకార అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు, డీసీఎంఎస్ అధికారులు, బ్యాంకు జనరల్ మేనేజర్లు, సీనియర్ అధికారులు, బ్రాంచ్ మేనేజర్లు, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్‌కట్టర్‌లో చేయి ఇరుక్కుని..



గాయపడిన బాలుడు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో గ్రాస్‌కట్టర్‌లో ఇరుక్కొని చేయి తెగిన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన నిమ్మత్తుల మధుకర్‌రెడ్డి-రజిత దంపతుల పెద్ద కుమారుడు సుదర్శన్‌రెడ్డి(11) ఆదివారం సెలవు కావడంతో తన తాతతో కలిసి ఆవుల షెడ్డు వద్దకు వెళ్లాడు. ఆవుల కోసం పచ్చిగడ్డిని తన తాత కట్టర్‌లో వేస్తుండగా పక్కనే ఉన్న బాలుడు సైతం వేసేందుకు ప్రయత్నించగా చేయి ఇరుక్కుంది. బాలుడు కేకలు వేయడంతో అప్రమత్తమైన తాత మిషన్‌ను ఆపివేసి బాలుడి చేతిని బయటకు తీశాడు. అయితే అప్పటికే మోచేతి కింది భాగం వరకు నుజ్జునుజ్జు అయ్యింది. వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. మోచేతి వరకు తొలగించారు.

పుణ్యస్నానానికి వెళ్లి పరలోకాలకు..

- గోదావరిలో మునిగి యువకుడి మృతి



విఘ్నేష్ (ఫైల్)

వెల్గటూర్: గోదావరిలో పుణ్యస్నానాలకు వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన వెల్గటూర్ మండలం కోటిలింగాలలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కరీంనగర్‌కు చెందిన శ్రీమంతుల విఘ్నేష్ (32) ఆదివారం సెలవు దినం కావడంతో తన భార్యతో కలిసి కోటిలింగాల వద్దగల గోదావరిలో పుణ్యస్నానాలకు వచ్చారు. గోదావరిలో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందాడు. భార్య కళ్ల ముందే భర్త నదిలో మునిగి మృతి చెందడంతో భార్య కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతుడి భార్య శ్రీలత ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

పాలకుర్తి(రామగుండం): కొత్తపల్లి గ్రామంలో వేల్పుగొండ కొమురయ్యకు చెందిన గూన పెంకుటిల్లు ఆదివారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. కొమురయ్యతోపాటు కుటుంబసభ్యులు ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఇంట్లోంచి పొగ, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు.. కొమురయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆ తర్వాత పెద్దపల్లిలోని అగ్నిమాపక సిబ్బందికీ సమాచారం చేరవేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రమాదంలో ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న రూ.2లక్షలతోపాటు 5తులాల బంగారం, గృహోపకరణాలు, బట్టలు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు రోదిస్తూ తెలిపాడు.

రేషన్‌బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

వీణవంక(హుజూరాబాద్): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా మండలంలోని రెడ్డిపల్లి గ్రామ శివారులో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు.. ఇద్దరు వ్యక్తులు వ్యాన్‌లో రేషన్ బియ్యం తీసుకొని కరీంనగర్ వైపు వస్తుండగా వాహనాన్ని తనిఖీ చేయడంతో 160క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. హుజూరాబాద్ మండలం శాలపల్లికి చెందిన వ్యాన్ డ్రైవర్ గద్దల రవి, జమ్మికుంటకు చెందిన తాడేం రమేశ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

- 11 రోజుల్లో 98.26 లక్షల ఆదాయం



ధర్మపురి దేవస్థానం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. స్వామివారి ఆలయంలో ఈనెల 10 నుంచి 22వరకు వైభవంగా నిర్వహించారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. 11 రోజులపాటు సాగిన బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా చెత్తాచెదారం కనిపించకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు.

రూ.98.26 లక్షల ఆదాయం

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి రూ.98.26 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 70 వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేశామని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, రైస్‌మిల్లర్స్, దాతలు, మున్సిపల్, పోలీస్, ట్రాన్స్‌కో సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మూడునెలల కష్టం బుగ్గిపాలు



వాహనంలో కాలిపోయిన వస్తువులు తీస్తున్న బాధితులు

వీణవంక(హుజూరాబాద్): జాతరలో స్వీట్ దుకాణం పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్న ఆ కుటుంబం రోడ్డునపడింది. మూడునెలల పాటు వివిధ జాతరలు తిరిగి వచ్చిన డబ్బుతో తమ వాహనంలో ఇంటికి రాగా షార్ట్‌సర్క్యూట్‌తో మూడునెలల కష్టం బుగ్గిపాలైన ఘటన వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామంలో జరిగింది. వివరాలు.. నిదానం మహేందర్ వివిధ జిల్లాల్లో ఎక్కడ జాతర జరిగినా అక్కడ స్వీట్ దుకాణం పెట్టి బతుకు వెళ్లదీస్తున్నాడు. మూడునెలల క్రితం తన ట్రాలీ ఆటోలో కుటుంబ సభ్యులతో కలిసి జాతర్లకు వెళ్లాడు. తిమ్మాపూర్ మండలం నల్లగొండ జాతర చూసుకొని శనివారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికి మహేందర్ కుటుంబం అలిసిపోవడంతో స్వీట్‌కు సంబంధించిన ముడిసరుకులతో పాటు, రూ.2.16లక్షలు తన ఆటోలో ఉంచి ఇంట్లో నిద్రపోయాడు. ఆటో పైన ఉన్న విద్యుత్ వైరు గాలికి తెగి ఆటోలో ఉన్న వస్తువుల మీద పడటంతో ముడి సరుకులతో పాటు నగదు కాలిపోయాయి. వేకువ జామున చూసేసరికి అప్పటికే నష్టం జరిగిపోయిందని బాధితుడు విలపించాడు. ఉన్న ఆధారం బుగ్గిపాలైందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ



పగులగొట్టి ఉన్న బీరువా తలుపులు

వెల్గటూర్: తాళంవేసిన ఇళ్లలో దొంగలు దొంగతనం చేసిన ఘటన మండలంలోని పైడిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని గుడికందుల తిరుపతి, రాజేశం ఇళ్లలో శనివారం రాత్రి దొంగలు పడి బీరువా తాళాలు పగులగొట్టారు. తిరుపతి ఇంట్లో రెండున్నర తులాల బంగారం, రాజేశం ఇంట్లో నుంచి రూ.80వేలు ఎత్తుకెళ్లారు. తిరుపతి వ్యాపార నిమిత్తం కరీంనగర్‌లో, రాజేశం ముంబయిలో ఉంటున్నారు. వారిళ్లలో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు చొరబడి బంగారం, నగదు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇరుగుపొరుగు వారు చూసి ఇంటి యజమానులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి చూసి బీరువా తాళాలు పగుల గొట్టి ఉండడం, అందులో బంగారం, నగలు దొంగలు దోచుకెళ్లినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్‌ను, క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు.

గొడ్డలితో దాడి చేసిన సంఘటనలో వ్యక్తికి గాయాలు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన నేరేళ్ల రాజుగౌడ్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి జరిగిన గొడ్డలి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు. చందుర్తి మండలంలోని సనుగుల గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. సమావేశం ముగిసి ఇంటికి వెళ్తుండగా ఏగోళపు ప్రభాకర్‌గౌడ్‌కు, నేరేళ్ల రాజుగౌడ్‌కు మధ్య వివాదం తలెత్తింది. ఈ గొడవలో ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకున్నారు. ఆవేశానికి లోనైనా ప్రభాకర్ గౌడ్ అక్కడే ఉన్న గొడ్డలితో రాజుగౌడ్‌పై దాడిచేశాడు. ఈ దాడిలో చేతికి, వీపులో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వేములవాడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి చేయి విరిగిందని తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన మడపతి గంగారాం ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు పట్టుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం. దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో సీసీ ఫుటేజీలో ఓ వ్యక్తి రికార్డు కావడంతో సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించినట్లు తెల్సింది.

మే 20న సింగరేణిలో టోకెన్ సమ్మె

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థపై కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మే 20న టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం గోదావరిఖనిలోని బీ- గెస్ట్‌హౌస్‌లో జరిగిన యూనియన్ కేంద్ర ఆఫీస్ బేరర్లు, బ్రాంచి కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిపడ్డ రూ.35 వేల కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. కొత్త గనులు వస్తేనే సింగరేణికి మనుగడ ఉంటుందని, అందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేయాలన్నారు. సింగరేణికి నూతన గనులు వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అలవెన్సులపై ఆదాయపు పన్ను మినహాయింపు, సొంతింటి పథకం అమలు, 11 రకాల అలవెన్సులను పెంచడం, డిస్మిస్ కార్మికులకు మళ్లీ ఉద్యోగాలు ఇచ్చేందుకు, మారుపేర్లు, విజిలెన్స్ బాధితుల డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలనే డిమాండ్ల పరిష్కారానికి వెంటనే కమిటీ వేయాలని అన్నారు. సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లాగౌడ్, ప్రకాశ్, కవ్వంపల్లి స్వామి, అక్బర్‌అలీ, జూపాక రాంచందర్, ఆరెల్లి పోశం, జీగురు రవీందర్, మందల రాంచంద్రారెడ్డి, బాజీసైదా, ఎస్.తిరుపతి, వై.రాంగోపాల్, కొట్టె కిషన్‌రావు, ఎం.కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజన్నా శరణు..శరణు







వేములవాడ: రాజన్నను ఆదివారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

కేటీఆర్‌కు స్వాగతం



కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న హరిశంకర్

కరీంనగర్: కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆదివారం బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఘన స్వాగతం పలికారు.

స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్‌లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కొత్తపల్లి: శీతాకాల శిబిరంలో భాగంగా వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం బద్దిపల్లి, కమాన్‌పూర్ గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ప్రముఖ గాయకుడు కొండ రవి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ప్రోగ్రాం అధికారి కె.సత్యనారాయణ, అధ్యాపకులు సత్యనారాయణ, అపర్ణ, ప్రసన్న, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎంపిక



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ఆదివారం మ్యాజిక్ బస్ అనుసంధానంతో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 87 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. క్వస్ క్రాప్, ఫ్లిప్‌కార్టులోని వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.మాలతి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ సమత, పద్మజ, సంధ్యారాణి, మ్యాజిక్ బస్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పవిత్ర, శివకుమార్ అభినందించారు.

గ్రాడ్యుయేషన్ డే



సప్తగిరికాలనీ: భగత్‌నగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల్లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. యూకేజీ విద్యార్థులను పైతరగతికి ప్రమోట్ చేస్తూ కాన్వకేషన్ పట్టాలను సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత దాసరి శ్రీపాల్ రెడ్డి అందించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

'వెలుగుపూల ఆకాశం' ఆవిష్కరణ



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో కవి వాసాల వరప్రసాద్ రచించిన వెలుగుపూల ఆకాశం పుస్తకాన్ని బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. సమాజంలోని దుఃఖాన్ని ఆవిష్కరించుకునే మార్గంగా కవిత్వాన్ని వరప్రసాద్ స్వీకరించాడన్నారు. పెనుగొండ బసవేశ్వర్ పుస్తకాన్ని సమీక్షించారు. తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తలు అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, పీఎస్ రవీంద్ర, గాజోజు నాగభూషణం, లక్ష్మయ్య, అంజయ్య, శంకర్, శంకరయ్య, తిరుపతి, సంగీత, సరసిజ, శ్రీరాం, చైతన్య తదితరులు పుస్తకాన్ని విశ్లేషించారు.

రంజాన్ జోష్.. అత్తర్లకు క్రేజ్



- రంజాన్ నెలలో అత్తర్లకు ఎంతో ప్రాధాన్యం
- నగరంలో జోరుగా కొనుగోళ్లు

విద్యానగర్(కరీంనగర్): రంజాన్ పండుగకు సువాసనలు వెదజల్లే అత్తర్లు మరింత వన్నె తెస్తాయి. విభిన్న పరిమళాలు వెదజల్లే అత్తర్లు ఈ మాస ఆధ్యాత్మిక శోభకు మరింత ఆహ్లాదకరాన్ని జోడిస్తున్నాయి. పలువురు వ్యాపారులు గుంటూరు ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు వచ్చి అమ్మకాలు సాగిస్తుండగా.. నగరంలో ముస్లిం కమ్యూనిటీ వారు ఏర్పాటు చేసిన దుకాణాల్లో అత్తర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో నగరంలో అత్తర్ల కొనుగోలుదారులతో దుకాణాలు కళకళలాడుతున్నాయి.

రంజాన్ మాసంలో ఫుల్ డిమాండ్

మామూలు రోజుల్లో కంటే రంజాన్ పండుగ రోజుల్లో అత్తర్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. అత్తర్లకు ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ పాతబస్తీ నుంచి ఇక్కడి వ్యాపారులు అత్తర్లను తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తారు.

ఎంతో ప్రాధాన్యత

రంజాన్ నెలలో అత్తర్లకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అత్తర్ వాడందే ముస్లింలు బయటకు వెళ్లరు. దీంతో అత్తర్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ముస్లిం కమ్యూనిటీలో పండుగలు,, పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలో అత్తరు గుభాలిస్తూనే ఉంటుంది. రంజాన్ నెలలో మాత్రం అత్తర్‌కు చాలా ఎక్కువ గిరాకీ ఉంటుంది. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా ప్రతిఒక్కరూ వాడుతారు.



ఆధ్యాత్మికత పెంచుతుంది



పండుగలు, షాదీ, ఇతర వేడుకల్లో అత్తర్ వాడకం ఉన్నా రంజాన్ నెలలో ముస్లిం కమ్యూనిటీలో ప్రతిఒక్కరు అత్తరు రాసుకుంటారు. ఈనెలలో శుభ్రంగా ఉంటూ అత్తరు వాడడంతో ఆధ్యాత్మిక భావన పెరుగుతుంది.

– ఎండీ. ఖాసీద్, హుస్సేనీపురా, కరీంనగర్

మనసుకు ఆహ్లాదం



రంజాన్ రోజా సమయాల్లో అత్తరు వాసన మనసును ఆహ్లాదంగా, ఉల్లాస భరితం చేస్తుంది. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడే దైవచింతన పెరుగుతుంది. అందుకే ఈనెల రోజులు అత్తర్లను ఎక్కువగా వాడుతాం.

– ఎండీ. ఆరీఫ్ హమ్మద్, కార్ఖానగడ్డ, కరీంనగర్

గుంటూరు అత్తర్లకు ఆదరణ



ఇక్కడ గుంటూరు అత్తర్లకు మంచి ఆదరణ ఉంది. అందుకే అక్కడ తయారు చేసిన వివిధ సువాసనల అత్తర్లను తీసుకొచ్చి ఇక్కడ అమ్మకాలు సాగిస్తాం. రంజాన్ నెల రోజూ అత్తర్లు అమ్మకాలు బాగుంటాయి.

– సైదులు, అత్తర్ల వ్యాపారి, గుంటూరు

ఉల్లాసభరితం



సుగంధాలు మనసును పవిత్రమైన భావనతో నింపి ఆధ్యాత్మిక చింతన వైపు మళ్లిస్తాయి. అత్తరు సువాసనలతో ఆందోళనలు, చికాకులు తొలగిపోయి మనసుకు ప్రశాంతత చేకూరుస్తాయి. ఢిల్లీ, ముంబయి, కోల్‌కత్తా, హైదరాబాద్ తదితర మహానగరాలకు చెందిన అంతర్జాతీయ బ్రాండ్లు కూడా కరీంనగర్‌లో దొరుకుతున్నాయి.

– సయ్యద్ ఇర్ఫాన్, నాఖా చౌరస్తా, కరీంనగర్

అమ్మకాలు బాగుంటాయి



మామూలు రోజుల కంటే రంజాన్ రోజుల్లో అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. మామూలు అత్తర్ల నుంచి అతి ఖరీదైన అత్తర్లను ఉపయోగిస్తారు. వ్యాపారం సాఫీగా సాగుతుంది. అరబ్ దేశాల నుంచి తెప్పించిన అత్తర్లకు కాస్త ఎక్కువ ధర ఉన్నప్పటికీ వాటి నాణ్యత బాగుంటుంది. వాటిని ధనిక వర్గాలు ఎక్కువగా కోనుగోలు చేస్తాయి.

– జుబేర్ అహ్మద్, అత్తర్ల అమ్మకందారుడు, రాజీవ్‌చౌక్, కరీంనగర్

అనునిత్యం పోరాడే ఏకైక పార్టీ సీపీఐ



మాట్లాడుతున్న కసిరెడ్డి సురేందర్‌రెడ్డి

కరీంనగర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనునిత్యం పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో గామినేని సత్తయ్య అధ్యక్షతన జరిగిన సీపీఐ మారుతీనగర్ శాఖ సమావేశంలో మాట్లాడారు. నగరంలో ఇళ్లు లేని వేలాది మందికి ఇళ్లు ఇప్పించిన పార్టీ అన్నారు. రేషన్‌కార్డులు, వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ల కోసం అనేక పోరాటాల్లో ప్రజలను భాగస్వామ్యం చేసి పెన్షన్లను సాధించిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. మారుతీనగర్‌లో డ్రైనేజీ సమస్య ఉందని, పాతకాలపు డ్రైనేజీలు ఉండటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైడిపల్లి రాజు, తోట కృష్ణయ్య, నాంపల్లి శంకర్, శ్రీనివాస్, నగునూరి రమేశ్, హ్మద్ ఆరిఫ్, కొట్టే రమేశ్, రవి, తోటస్వామి, రాజు, నానవేణి రాజు, తిరుమల స్వామి, నర్సయ్య,ర కలీం, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ వెకేషన్‌లో బీపీఈడీ, ఎంపీడీ చేసేలా కృషి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రంలోని 2013 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు అప్ గ్రేడేషన్ ఇప్పించిన ఘనత పేటా టీఎస్ దేనని, సమ్మర్ వేకేషన్‌లో పీఈటీలు బీపీఈడీ, ఎంపీఈడీ వృత్తి విద్య కోర్సులు చేసేలా కృషి చేయనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి అన్నారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను అర్హత గల వ్యాయామ ఉపాధ్యాయులతో భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమవేశంలో వివిధ జిల్లాల వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం బాధ్యులు, ఫిజికల్ డైరెక్టర్లు, వేల్పుల సురేందర్, దాసరి రమేశ్, కడారి రవి, బాబు శ్రీనివాస్, అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ యూనిష్ పాష, గిన్నె లక్ష్మణ్, బిట్ర శ్రీనివాస్, ఎల్వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కాలిన వీధిలైట్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో శుక్రవారం రాత్రి కురిసిన వర్షంలో పిడుగుపడటంతో గ్రామపంచాయతీకి చెందిన 45 వీధిలైట్లు కాలిపోయాయి. ఆదివారం కాలిపోయిన వీధిలైట్లను పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో తొలగించారు. కొత్త లైట్లను కొనుగోలు చేసి సిబ్బందితో బిగించారు. సుమారు రూ.60వేల వరకు విద్యుత్‌లైట్లకు నష్టం జరిగినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

కవి వేదంతాచారి మృతి

కరీంనగర్‌కల్చరల్: కవి, పండితులు, ఆధ్యాత్మిక వేత్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కలకుంట్ల వేదంతాచార్యులు ఆదివారం పరమపదించారు. ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి తదనంతరం ప్రభుత్వ సేవలందించారు. సమైక్య సాహితీ ప్రారంభం నుంచి కార్యవర్గంలో బాధ్యతలు స్వీకరించి సాహిత్య కార్యక్రమాలతో పాటు నాటక ప్రదర్శనలో కూడా నటుడిగా పాల్గొన్నారు. ఆయన మృతికి సమైక్య సాహితీ అధ్యక్ష కార్యదర్శులు మాడిశెట్టి గోపాల్, ఆనంతచార్య, పలు కవులు, రచయితలు సంతాపం ప్రకటించారు.

సమాచారం

నేడు కరీంనగర్ సొసైటీ సమావేశం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు సొసైటీ సీఈవో ఎం.రమేశ్ తెలిపారు. సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు నాయీబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

కరీంనగర్: నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం తీగలగుట్టపల్లిలోని నాయీబ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంపాల సంపత్, కంది వెంకటేశ్ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి శ్రీవామన, నారద మహాపురాణములు

విద్యానగర్(కరీంనగర్): నగరంలోని జ్యోతినగర్‌లో గల గోలి అశోక్‌కుమార్ రెసిడెన్సిలో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు పురాణ వాచస్పతి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మతో శ్రీమాన, నారద మహాపురాణములు జరుగుతాయని నిర్వాహకులు గోలి శ్రీవాణి అశోక్ కుమార్ తెలిపారు. భక్తులు ఈ పురాణ ప్రవచనాల్లో పాల్గొని భగవంతుడి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నియామకం

రేషన్ డీలర్ల సంఘం అర్బన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

కరీంనగర్ అర్బన్: రేషన్ డీలర్ల సంఘం కరీంనగర్ అర్బన్ అధ్యక్షుడిగా రొడ్డ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికవడం గమనార్హం. ఎన్నికల అధికారిగా ధర్మరాజు వ్యవహరించగా సంఘం నేతలు గాలి గట్టయ్య, శ్రీనివాస్ రావు, హైదర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల తిరస్కరణ

- రాజీవ్ యువ వికాసంలో సాంకేతిక సమస్య
- ఆందోళనలో నిరుద్యోగులు
- నేటి నుంచి ఈబీసీ వర్గాలకూ అవకాశం



దుర్శేడ్‌లో మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు

కరీంనగర్‌రూరల్: రాజీవ్ యువ వికాసం పథకానికి ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. సాంకేతిక సమస్యలతో అర్హులైన నిరుద్యోగుల దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో పలువురు నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టింది. నిర్దేశిత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు రుణాలు మంజూరు చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఈనెల 18నుంచి మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టం(ఓబీఎంఎంఎస్) దరఖాస్తులు స్వీకరిస్తోంది. అయితే పలువురు నిరుద్యోగుల దరఖాస్తులు సాంకేతిక సమస్యతో తిరస్కరించబడుతున్నాయి. గతంలో కార్పొరేషన్ రుణాలతో పాటు బీసీ బంధు, దళితబంధు పథకాల కింద దరఖాస్తు చేసుకుని లబ్ధిపొందని నిరుద్యోగులు ప్రస్తుతం రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. ఓబీఎంఎంఎస్‌లో ఆధార్, రేషన్‌కార్డు నంబర్లు నమోదు చేయడంతో బెనిఫిషర్ నంబర్ వచ్చి దరఖాస్తు తిరస్కరించబడుతోంది.

'బంధు'తోనే సమస్య

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వందశాతం సబ్సిడీతో దళితబంధు, బీసీ బంధు పథకాలను అమలు చేసింది. మొదటి విడతలో 2021లో హుజురాబాద్ నియోజకవర్గంలో దళితబంధు పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి రూ.10 లక్షలు మంజూరు చేసింది. అనంతరం మిగతా కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల్లోని కొన్ని గ్రామాల్లో దళితబంధు కింద ఆర్థికసాయం అందించింది. అదే విధంగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీ బంధు పథకంలో మొదటి విడతలో నియోజకవర్గానికి వంద మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఆర్థికసాయం చెక్కులు పంపిణీ చేశారు. రెండో విడతలో నియోజకవర్గానికి 3వేల మందికి బీసీబంధు, ఒక్కో గ్రామంలో 15 మందికి దళితబంధు పంపిణీ చేస్తామని ప్రకటించడంతో పలువురు నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. గతంలో బీసీ బంధు, దళితబంధు పథకాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగుల ఆర్జీలు ప్రస్తుతం రాజీవ్ యువవికాసం పథకంలో తిరస్కరణకు గురవుతున్నాయి. దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సంక్షేమశాఖల అధికారులు పేర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించినట్లయితే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునే వీలుంటుంది.

నేటి నుంచి ఈబీసీ దరఖాస్తుల స్వీకరణ

రాజీవ్ యువ వికాసం కింద ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (ఈబీసీ) సోమవారం నుంచి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ముందుగా కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నిరుద్యోగ యువతకు మాత్రమే అవకాశం కల్పించగా ప్రస్తుతం ఈబీసీలకు ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని నిర్ణయించింది. అయితే పథకంపై ప్రభుత్వం ఇప్పటివరకు గైడ్‌లైన్స్ జారీ చేయకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే గైడ్‌లైన్స్ విడుదల చేస్తే నిరుద్యోగుల్లో గందరగోళానికి చెక్ పెట్టే అవకాశముంటుంది.

ఘనంగా మల్లన్న పట్నాలు



గుంటూరుపల్లిలో పట్నం వేసి ఒగ్గుకథ ప్రదర్శిస్తున్న కళాకారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం గుంటూరుపల్లిలోని శ్రీనాగుల మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం మల్లన్న పట్నాలు ఘనంగా నిర్వహించారు. ఒగ్గుపూజారులు సాయిల్ల శివయ్య ఆధ్వర్యంలో వివిధ రంగులతో లగ్నం పట్నం వేశారు. అనంతరం మల్లన్నతో భ్రమరంభాదేవి, కేతమ్మలతో కల్యాణం నిర్వహించి మల్లన్న చరిత్ర ఒగ్గుకథను ప్రదర్శించారు. అదేవిధంగా మొగ్దుంపూర్‌లోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఒగ్గుపూజారులు తిరుగు పట్నాల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనం చేసి మొక్కులు చెల్లించారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు బండి మల్లయ్య, మల్లేశ్, కొండ రవి, కాల్వ శ్రీనివాస్, బండి సంపత్, రాజు, కొమురయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మకు బోనాలు



ఆరెపల్లిలో బోనాలతో మహిళలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లి, గోపాల్‌పూర్, ఆరెపల్లిలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ ఊరేగింపుగా పోచమ్మ గుడికి తరలివెళ్లారు. పోచమ్మకు నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ ఊరడి మంజుల, మల్లారెడ్డి, గోనె నర్సయ్య, ఆరె శ్రీకాంత్, ఎర్ర శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

సినారె వాగ్భూషణ పురస్కారం ప్రదానం



అనురాధకు పురస్కారం అందజేస్తున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని శుభంగార్డెన్‌లో ఆదివారం తెలంగాణ కళావేదిక ఆధ్వర్యంలో హన్మకొండకు చెందిన కవయిత్రి మెరుగు అనురాధకు రాష్ట్రస్థాయి సినారే వాగ్భూషణ పురస్కారాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ సాహిత్యం, విద్యారంగం, వ్యాఖ్యాన రంగంలో అనురాధ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, పురస్కార కమిటీ చైర్మన్ దాస్యం సేనాధిపతి, తెలంగాణ కళావేదిక అధ్యక్షుడు అనుముల దయాకర్, దాస్యం గీతారాణి, ఉదయసాహితీ బాధ్యులు దాస్యం లక్ష్మయ్య, ఎర్రం రాజారెడ్డి, బుర్ర విజయలక్ష్మి నాగరాజ్, చిందం సునీత, తోట సాగర్, ప్రవీణ్, లక్ష్మణ్ సుధాకర్, సతీశ్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు



మాట్లాడుతున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

కరీంనగర్: ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, ఉపాధ్యాయులు తమ బాధ్యతలను సమున్నతంగా నెరవేరిస్తేనే ఆదర్శవంతమైన సమాజం ఏర్పడుతుందని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కటకం రవికుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మానేటి ప్రతాపరెడ్డి అధ్యక్షతన నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన జిల్లా విద్యా సదస్సులో మాట్లాడారు. సమాజ అభివృద్ధి ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం రవికుమార్‌ను సన్మానించారు. ది హిందూ పత్రిక సబ్ ఎడిటర్ మంత్రి రాము, టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, ఐసియా జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కరీంనగర్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఫోరం ఆధ్వర్యంలో ఏప్రిల్ 21న సికింద్రాబాద్‌లో నిర్వహించే ప్లీనరీ సమావేశం విజయవంతం చేయాలని చేపట్టిన యాత్ర ఆదివారం కరీంనగర్ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకోగా ఫోరం జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ మాట్లాడుతూ, ప్లీనరీ కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యమకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి, ఐల ప్రసన్న, ఉమారాణి, జంగపల్లి కుమార్, విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో 'ఆరోహన్' వార్షికోత్సవ సంబరాలు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

కొత్తపల్లి: కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్‌లో ×ఆరోహన్‌* పేరుతో ఆదివారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. రిటైర్డ్ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డితో కలిసి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.





భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ, ఏఐవైఎఫ్ నాయకులు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు



నివాళి అర్పిస్తున్న నరేందర్‌రెడ్డి

భగత్‌సింగ్‌కు నివాళి

భగత్‌సింగ్ వర్ధంతిని నగరంలో పలు పార్టీలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలు సంఘాలు బ్యాక్ ర్యాలీ నిర్వహించాయి. భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఆయా పార్టీల, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– కరీంనగర్/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌కార్పొరేషన్

కేంద్ర మంత్రిని కలిసిన టీజీవో నేతలు



మంత్రి బండి సంజయ్‌తో టీజీవో అధ్యక్షుడు కాళిచరణ్

కరీంనగర్ అర్బన్: కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) నేతలు కలిసి జిల్లా డైరీని అందజేశారు. ఆదివారం నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రులను వేర్వేరుగా కలిసి శాలువాతో సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళిచరణ్‌గౌడ్, జిల్లా కార్యదర్శి అరవింద్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు అభినవ్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, రాజు నాయక్, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీలో 14 మందిపై కేసు

ఆరుగురికి రిమాండ్.

మిగతావారి కోసం పోలీసుల గాలింపు

నకిరేకల్: నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో పదో తరగతి తెలుగు ప్రశ్నపత్రం లీకేజీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మొత్తం 14 మందిపై కేసు నమోదు చేశారు. ఐదుగురు యువకులు, ఒక బాలుడిని ఆదివారం నకిరేకల్ మున్సిఫ్ కోర్టులో రిమాండ్ చేశారు. మరో ఆరుగురు యువకులు, ఇద్దరు బాలుర కోసం గాలిస్తున్నారు. వీరితోపాటు మరికొంత మంది కూడా ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. నకిరేకల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని టెన్త్ పరీక్ష కేంద్రం వద్దకు శుక్రవారం ముగ్గురు యువకులు, బాలురు వచ్చారు. వారిలో చిట్ల ఆకాశ్ పరీక్ష హాల్ దగ్గర గోడ ఎక్కి పరీక్ష రాస్తున్న విద్యార్థిని తెలుగు ప్రశ్నపత్రం ఫొటో తీశాడు. ఆ ఫొటోను అక్కడ ఉన్న యువకులు మరికొందరి వాట్సాప్ నంబర్లకు పంపారు. దీంతోపాటు నకిరేకల్‌లోని ఓ మీసేవ కేంద్రం వద్ద జవాబు పత్రాలను జిరాక్స్ తీసుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో ఎంఈఓ నాగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరిపారు. మీసేవ కేంద్రంలో జిరాక్స్ మెషీన్, కంప్యూటర్‌ను సీజ్ చేశారు. ఈ ఆరుగురిలో మేజర్ అయిన ఐదుగురిని నల్లగొండ జైలుకు, బాలుడిని హైదరాబాద్‌లోని జువెనైల్ హోంకు తరలించారు. మరో ఐదుగురిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం!

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 90.14 లక్షల కార్డుల్లోని 2.83 కోట్ల యూనిట్లకు (మందికి) ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. తాజాగా ఏప్రిల్ 1 నుంచి 90.14 లక్షల కార్డులకు సన్న బియ్యాన్ని సరఫరా చేయనున్నారు. వీటికి తోడు ఇప్పటికే అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకం, హాస్టళ్లు, విద్యా సంస్థలకు కేటాయిస్తున్న బియ్యం కూడా కలిపి నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) చొప్పున సన్నబియ్యం అవసరం ఉంది. అంటే సంవత్సరానికి 24 ఎల్‌ఎంటీలు అవసరమన్నమాట.

వానాకాలం సీఎంఆర్ సిద్ధం

వానాకాలంలో సేకరించిన సుమారు 55 ఎల్‌ఎంటీల ధాన్యంలో 24 ఎల్‌ఎంటీల మేర సన్న ధాన్యం ఉంది. ఈ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం మిల్లులకు పంపిన ప్రభుత్వం గత నవంబర్ నెలాఖరు నుంచే సన్న బియ్యాన్ని సేకరించే పనిలో ఉంది. తొలుత జనవరి (సంక్రాంతి) నుంచే సన్న బియ్యం ఇవ్వాలని భావించినప్పటికీ, కొత్తగా వచ్చిన బియ్యాన్ని పంపిణీ చేస్తే అన్నం ముద్దగా అవడం, అడుగంటడం వంటి పరిణామాలు ఉంటాయనే భావనతో రెండు మూడు నెలలు మాగపెట్టాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు మిల్లింగ్ అయిన బియ్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్‌లలో భద్రపరుస్తూ కొత్త బియ్యం పాతబడేలా చూశారు. ఈ నేపథ్యంలో జనవరి వరకు మిల్లింగ్ చేసి సేకరించిన సుమారు 5 ఎల్‌ఎంటీల బియ్యాన్ని ఉగాది నుంచి పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఏప్రిల్ కోటా కింద సన్న బియ్యం మాత్రమే ఇవ్వాలని పేర్కొంటూ మంత్రి ఉత్తమ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

బియ్యం అక్రమ దందాకు కళ్లెం!

రేషన్ షాపుల ద్వారా ఇప్పటివరకు అందుకుంటున్న దొడ్డు బియ్యంలో 60 నుంచి 70 శాతం వరకు దుర్వినియోగం అవుతున్నట్లు పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ విభాగం గుర్తించింది. దొడ్డు బియ్యాన్ని ఉచితంగా తీసుకుంటూ రూ.10కి కిలో చొప్పున రేషన్‌షాపుల్లోనే విక్రయించే పద్ధతి దాదాపుగా అన్ని జిల్లాల్లో ఉంది. ఇక ఇంటికి తీసుకెళ్లినా వంటకు వినియోగించకుండా దళారులకు కిలో రూ.10 నుంచి రూ.13 చొప్పున విక్రయించడం, దాన్ని దళారులు రాష్ట్రాలు దాటించడమో లేక రీసైక్లింగ్ కోసం రైస్ మిల్లులకు విక్రయించడమో చేయడం పరిపాటిగా మారింది. అయితే పేదలకు సన్న బియ్యం ఇవ్వడం ద్వారా దీనికి చెక్ పెట్టవచ్చని కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టింది.

సిండికేటు లూటీ!

ఏపీ రాజధాని టెండర్లలో సన్నిహితులైన కాంట్రాక్టర్లతో కూటమి ప్రభుత్వ పెద్దల కుమ్మక్కు

సిండికేట్‌కు పనులు కట్టబెట్టేలా బిడ్ కెపాసిటీని ఫిబ్రవరి 10న పెంచేసిన సర్కార్

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని ప్రాంతంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు కాజేసిన ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు తమకు సన్నిహితులైన కాంట్రాక్టర్లతో సిండికేట్‌ను ఏర్పాటు చేసి రాజధాని నిర్మాణ పనులను అధిక ధరలకు కట్టబెడుతున్నారు. మొన్న.. రూ.10,696.79 కోట్ల వ్యయంతో 37 ప్యాకేజీల కింద రాజధాని ముంపు నివారణ, రహదారుల నిర్మాణంలో మిగిలిన పనులకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏడీసీఎల్) నిర్వహించిన టెండర్లలో సిండికేట్ బాగోతం బట్టబయలైంది. నేడు.. రూ.16,463.83 కోట్ల వ్యయంతో 22 ప్యాకేజీల కింద భూసమీకరణ ద్వారా భూములిచ్చిన రైతులకు ప్లాట్లు ఇచ్చేందుకు లేఅవుట్ల అభివృద్ధి.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్స్.. మంత్రులు, జడ్జిలు, ఐఏఎస్ అధికారులకు బంగ్లాల నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ) ఖరారు చేసిన టెండర్లలోనూ ప్రభుత్వ పెద్దల లాలూచీ బాగోతం మరోసారి బట్టబయలైంది. ఏడీసీఎల్, సీఆర్‌డీఏ రెండు కలిసి రూ. రూ.27,160.62 కోట్ల కాంట్రాక్టు విలువతో 59 ప్యాకేజీల కింద పనులకు టెండర్లు పిలిచాయి. ఈ పనులను రూ.28,209.62 కోట్లకు సిండికేట్‌లోని ఎనిమిది కాంట్రాక్టు సంస్థలకు ప్రభుత్వ పెద్దలు పంచి పెట్టారు. కాంట్రాక్టు విలువ కంటే సగటున 3.94 నుంచి 4.34 శాతం అధిక ధరలకు కట్టబెట్టడం ద్వారా ఖజానాపై రూ.1,049 కోట్లు భారం మోపారు. అదే రివర్స్ టెండరింగ్ విధానం అమల్లో ఉండి ఉంటే కాంట్రాక్టర్ల మధ్య పోటీ పెరిగి కనీసం 8 శాతం తక్కువ ధరకే పనులు చేయడానికి ముందుకొచ్చేవారని.. దీనివల్ల ఖజానాకు రూ.2,500 కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల మేర ఆదా అయ్యేదని



అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

సిండి'కేటు'రాజ్యం..!

రాజధాని నిర్మాణ పనులకు టెండర్లు పిలవక ముందే సన్నిహిత కాంట్రాక్టు సంస్థలతో ప్రభుత్వ పెద్దలు చర్చలు జరిపారు. ఆ కాంట్రాక్టర్లతో సిండికేట్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 2014–19 మధ్య షాపూర్‌జీ పల్లోంజీ కాంట్రాక్టు సంస్థ నుంచి ముఖ్యనేత తరఫున కమీషన్లు వసూలు చేసి ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సాక్ష్యాధారాలతో పట్టుబడిన అధికారే ఇప్పుడూ ప్రభుత్వ పెద్దల తరఫున సిండికేట్ కాంట్రాక్టర్లతో చక్రం తిప్పుతున్నారు. సిండికేట్‌లోని కాంట్రాక్టర్ల ప్రతిపాదన మేరకే వారికి అధికంగా పనులు కట్టబెట్టేందుకు వీలుగా బిడ్ కెపాసిటీని 2 ఎస్ఎన్–బీ నుంచి 3 ఏఎన్–బీకి పెంచుతూ ఫిబ్రవరి 10న ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయించారు. అంతకు ముందే అంచనాలను ఇష్టారాజ్యంగా పెంచుకోవడానికి, సిండికేట్ కాంట్రాక్టర్లకే పనులు దక్కేలా నిబంధనలతో టెండర్ జారీ చేయడానికి వీలుగా జ్యుడీషియల్ ప్రివ్యూ విధానాన్ని కూడా రద్దు చేశారు.

పూలింగ్ లేఅవుట్ల అభివృద్ధికి రూ.14,887.64 కోట్లు

భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) పథకం కింద రాజధానికి రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారు. ఆ పథకం కింద రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలి. రాజధానికి భూసమీకరణ కింద భూములిచ్చిన రైతులకు ప్లాట్లు ఇవ్వడానికే 17 వేల ఎకరాలు భూమి అవసరం. ఇందులో లేఅవుట్ల అభివృద్ధి పనులకు 18 ప్యాకేజీల కింద సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. ఈ పనులన్నింటినీ కాంట్రాక్టు విలువ కంటే అధిక ధరకే సిండికేట్ కాంట్రాక్టర్లకు అప్పగించారు. రూ.14,887.64 కోట్లకు ఆ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ తదితర పన్నుల రూపంలో కాంట్రాక్టర్లకు అదనంగా ఇస్తామని సీఆర్‌డీఏ చెప్పిన మొత్తాన్ని కూడా కలిపితే ఈ పనుల వ్యయం రూ.17 వేల కోట్లకు చేరుతుంది. అంటే ఎకరం భూమిలో లేఅవుట్ అభివృద్ధి చేయడానికే సగటున రూ.కోటి చొప్పున వ్యయం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలే చెబుతున్నాయి. వాస్తవానికి అత్యాధునిక సదుపాయాలతో లేఅవుట్‌ను అభివృద్ధి చేయడానికి ఎకరానికి రూ.50 లక్షలకు మించి వ్యయం కాదని స్పష్టం చేస్తున్నారు.

నీకింత.. నాకింత..

సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ 59 ప్యాకేజీల కింద పనులకు పిలిచిన టెండర్లను ప్రభుత్వం ఆమోదించింది. ఆ పనులను రూ.28,209.62 కోట్లకు ఎనిమిది కాంట్రాక్టు సంస్థలకు ప్రభుత్వ పెద్దలు పంచి పెట్టారు. ఆ పనులను అప్పగిస్తూ సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ వాటితో ఒప్పందం చేసుకున్న వెంటనే కాంట్రాక్టు విలువలో పది శాతం అంటే రూ.2,820.96 కోట్లను ఆ సంస్థలకు మొబిలైజేషన్ అడ్వాన్సుగా ముట్టజెబుతాయి. అందులో 8 శాతం అంటే.. రూ.2,256 కోట్లను ప్రభుత్వ పెద్దలు తొలి విడత కమీషన్లుగా రాబట్టుకోనున్నారు. ఇందుకోసమే గత ప్రభుత్వం రద్దు చేసిన మొబిలైజేషన్ అడ్వాన్సుల విధానాన్ని పునరుద్ధరించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



జాన్‌పహాడ్ దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు

చివరి ఎకరాకూ సాగునీరు

- కృష్ణా జలాల్లో వాటా పెరిగేలా సర్కారు కృషి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, పాలకవీడు: శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 5 టీఎంసీల నీటిని నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు తరలించి ఆయకట్టులోని చివరి ఎకరానికీ సాగునీరు అందిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఆదివారం సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా వద్ద నిర్వహించిన కందూరు కార్యక్రమంలో ఉత్తమ్‌తోపాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. దర్గాలో ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక డెక్కన్ సిమెంట్ పరిశ్రమ అతిథి గృహంలో మంత్రి వెంకట్‌రెడ్డి తదితరులతో కలిసి అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎస్ఎస్‌పీ, ఏఎంఆర్‌పీ ద్వారా సాగునీరు విడుదల చేసి రబీ సీజన్‌లో చివరి ఆయకట్టులో వేసిన ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఉత్తమ్ చెప్పారు. కృష్ణా జలాల్లో రాష్ట్రం వాటా పెంచేలా తమ ప్రభుత్వం పోరాడుతోందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ కార్డుదారులకు ఉగాది నుంచి సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేసే పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

నేటి సమావేశంలో ఎస్ఎల్‌బీసీ పనులపై నిర్ణయం: కోమటిరెడ్డి

మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని ప్రారంభించి 30 కిలోమీటర్ల పనులు పూర్తి చేశామన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వం పదేళ్లు కాళేశ్వరం పేరుతో కాలయాపన చేసి, మిగిలిన ప్రాజెక్టులను వదిలేసిందని విమర్శించారు. ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ సొరంగం నిర్మాణం పూర్తి చేసేందుకు పనులు ప్రారంభించామని, కానీ దురదృష్టవశాత్తూ ప్రమాదం చోటు చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీఎంతో జరిగే సమావేశంలో దీనిపై ఎలా ముందుకు వెళ్లాలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతి రెడ్డి, బి.లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మందుల సామ్యేల్, వేముల వీరేశం, బాలునాయక్, బీర్ల ఐలయ్య, అనిల్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, తెలంగాణ డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పాల్గొన్నారు. ఇలావుండగా సీఎం హుజూర్‌నగర్‌కు రానున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. అంతకుముందు హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరి గుట్టకు వెళ్లే రోడ్డులో ఉన్న స్థలాన్ని సభ ఏర్పాటు కోసం పరిశీలించారు.

వస్తారా? వాదిస్తారా?

- 'రెడ్‌కార్నర్'పై టి.ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు ఏ నిర్ణయం తీసుకుంటారో..
- ఆయా కోర్టుల్లో ఈ నోటీసులు చాలెంజ్‌కు అవకాశం
- అన్ని అస్త్రాలు సిద్ధం చేస్తున్న నగర పోలీసు విభాగం
- ఎంఈఏకు అవసరమైన సమాచారం ఇవ్వాలని నిర్ణయం



టి.ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు

సాక్షి, హైదరాబాద్ : ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, మీడియా చానల్ అధినేత శ్రవణ్‌రావులు ఇండియాకు వస్తారా? లేకపోతే వారు ఉంటున్న దేశాల్లోని కోర్టులను ఆశ్రయిస్తారా? అనేది తేలాల్సి ఉంది. అయితే ఈ కేసు దర్యాప్తులో ఇప్పటివరకు ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న హైదరాబాద్ పోలీసులు ఆ ఇద్దరూ ఆయా దేశాల్లోని కోర్టులను ఆశ్రయించే అవకాశముందని భావిస్తున్నారు. అదే జరిగితే అంతర్జాతీయ వేదికపై కూడా న్యాయపోరాటం చేయడానికి నగర పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనిపై ఓ ప్రత్యేక బృందాన్ని ఢిల్లీకి పంపి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో (ఎంఈఏ) సమావేశమవుతారు. గత ఏడాది మార్చిలో పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో అక్రమ ఫోన్‌ట్యాపింగ్‌పై కేసు నమోదైంది. ఆ వెంటనే ప్రభాకర్‌రావు, ఆపై శ్రవణ్‌రావు విదేశాలకు పారిపోయారు. ప్రభాకర్‌రావు మెడికల్ గ్రౌండ్స్‌పై అమెరికాలో, శ్రవణ్‌రావు కెనడాలో ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిని వెనక్కి రప్పించడానికి చేసిన అన్ని ప్రయత్నాలను తమ న్యాయవాదుల ద్వారా అడ్డుకుంటూనే వచ్చారు. అరెస్టు వారెంట్లకు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, వద్దంటూ కౌంటర్లు వేశారు. ఇద్దరి పాస్‌పోర్టుల్నీ నగర పోలీసులు తొలుత తాత్కాలిక రద్దు (ఇంపౌండ్) చేయించారు. ఆపై శాశ్వత రద్దు (క్యాన్సిల్) చేయాలని కోరుతూ రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయానికి లేఖ రాశారు. అయితే అప్పటికే ఈ ద్వయం తమ లాయర్ల ద్వారా పాస్‌పోర్టులు ఇంపౌండ్ చేయడాన్ని ఢిల్లీలో ఉన్న చీఫ్ పాస్‌పోర్టు ఆఫీసర్ వద్ద సవాల్ చేశారు. ఈ పిటిషన్ ఓ కొలిక్కి వస్తే తప్ప.. పాస్‌పోర్టుల రద్దు వ్యవహారం తేలదు. తాజాగా హైదరాబాద్ పోలీసులు ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులపై ఇంటర్‌పోల్ ద్వారా రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయించారు. వీటిని జారీ చేసినట్టు ఆ విభాగం సీబీఐ ద్వారా తెలంగాణ సీఐడీకి సమాచారం ఇచ్చింది. అయితే తమ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచడంతో పాటు సభ్య దేశాలకు పంపిస్తూ పబ్లిష్ చేయాల్సి ఉంది. ఈలోపు ప్రభాకర్‌రావు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ శనివారం పిటిషన్ దాఖలు చేశారు. రెడ్‌కార్నర్ నోటీసులను ఎంఈఏ ఆయా దేశాల్లో ఉన్న ఏజెన్సీలకు అధికారికంగా పంపించాలి. ఈ రెడ్‌కార్నర్ జారీ అయిన వెంటనే ఇంటర్‌పోల్ ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావుల ఆచూకీ కనిపెట్టి, తక్షణం డిపోర్టేషన్ (బలవంతంగా తిప్పి పంపడం) చేయడానికి ఆస్కారం లేదు.

అక్కడి కోర్టులను ఆశ్రయిస్తే...

నిందితులు తాము ఉంటున్న దేశాల్లోనే ఉన్నత న్యాయస్థానాల్లో రెడ్‌కార్నర్ నోటీసులను చాలెంజ్ చేసే అవకాశం ఉంది. కేవలం రాజకీయ కారణాలతోనే కేసులు పెట్టి వేధిస్తున్నారని, అనారోగ్య కారణాలు చెబుతూ తమ డిపోర్టేషన్‌ను ఆపాలని నిందితులు కోరతారని పోలీసులు భావిస్తున్నారు. ఇదే జరిగితే ఆయా కోర్టుల్లో అక్కడ ఉన్న భారత రాయబార కార్యాలయాలు ఏర్పాటు చేసే న్యాయవాదులు తమ వాదనలు వినిపించాల్సి ఉంటుంది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానాలు తీసుకునే తుది నిర్ణయంపైనే డిపోర్టేషన్ ప్రక్రియ ఆధారపడి ఉంటుంది. ఈ పరిణామాలను, నిందితుల వ్యవహారశైలిని దృష్టిలో పెట్టుకున్న నగర పోలీసులు సమగ్ర విధానం రూపొందిస్తున్నారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు మొదలైన నాటి నుంచి ఇక్కడ ఉన్న ఆయా కోర్టుల్లో నిందితులు దాఖలు చేసిన పిటిషన్లు, వాటికి పోలీసులు ఇచ్చిన కౌంటర్లను సమగ్రంగా అధ్యయనం చేస్తున్నారు. ఈ వివరాలన్నీ ఎంఈఏ ద్వారా ఆయా దేశాల్లో ఉన్న రాయబార కార్యాలయాలకు పంపనున్నారు. ఫలితంగా అక్కడి కోర్టుల్లో వాదనలు బలంగా వినిపించడమే కాకుండా డిపోర్టేషన్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చేయాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీనికోసం త్వరలో ఓ ప్రత్యేక బృందం ఢిల్లీ వెళ్లనుంది. అక్కడి ఎంఈఏ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్టు తెలిసింది.

మీరు అభివృద్ధి చేస్తే.. అడ్డుకున్నదెవరు?

- రాజకీయ భిక్ష పెట్టిన కరీంనగర్‌కు మెడికల్ కాలేజీ ఎందుకు రాలె..?
- మధ్యమానేరుకు ముందే కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ఎలా పూర్తయ్యాయి?
- కేటీఆర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

తిమ్మాపూర్: కరీంనగర్ బీఆర్ఎస్‌కు జన్మనిచ్చింది..కరీంనగర్‌ను ఉద్ధరించాం అంటున్న కేటీఆర్.. జిల్లా ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ పర్యటనకు వచ్చిన కేటీఆర్ బీఆర్ఎస్ సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు పొన్నం కౌంటర్ ఇచ్చారు. 2004 పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నినాదాన్ని కాపాడడానికి, 2006లో జరిగిన ఉపఎన్నికలో తెలంగాణ నినాదాన్ని బతికించడానికి కేసీఆర్‌ను కరీంనగర్ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. ఇందుకు గడియారం సాక్షిగా తన చర్మం ఒలిచి చెప్పులు కుట్టిస్తానన్న కేసీఆర్.. ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని విమర్శించారు. మెడికల్ కాలేజీలు సిద్దిపేట, జగిత్యాల, గోదావరిఖని ప్రాంతాల్లో ఇచ్చేవరకూ కరీంనగర్‌కు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. మధ్యమానేరు పూర్తి కాకుండానే రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ఎందుకు పూర్తయ్యాయని ప్రశ్నించారు. కరీంనగర్ ప్రజలు రాజకీయ పునర్జన్మ ఇస్తే కరీంనగర్ –రామగుండం రోడ్డును ఎందుకు 8 లేన్ల రోడ్డుగా మార్చలేదని నిలదీశారు. శాతవాహన యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కాలేజీ పెట్టాలని తీర్మానం చేసి ఎందుకు పెట్టలేదో చెప్పాలన్నారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు పార్టీలతో సంబంధం లేకుండా పనిచేస్తారని, వారిని విమర్శించి, వారి ఆత్మస్థైర్యం దెబ్బతీయొద్దని సూచించారు.



'దోస్త్'కు కటీఫ్!

▶ మొదటి పేజీ తరువాయి

కాలేజీలు చేస్తున్న ఒత్తిడే 'దోస్త్'కొనసాగింపుపై పునరాలోచనకు కారణమనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ఏమిటీ 'దోస్త్'?

'దోస్త్'ను 2016–17లో తీసుకొచ్చారు. ఈ విధానంలో ఒకే ఒక్క దరఖాస్తుతో రాష్ట్రంలోని ఏ కాలేజీలోనైనా మెరిట్ ప్రకారం డిగ్రీలో ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. గతంలో ప్రతి కాలేజీకి విడివిడిగా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. దరఖాస్తు ఫీజు కూడా విడివిడిగా చెల్లించాలి. కానీ 'దోస్త్'అమల్లోకి వచ్చిన తర్వాత కేవలం రూ. 200 ఫీజుతో అన్ని కాలేజీలకు అప్లై చేసుకునే వెసులుబాటు లభించింది. ఆన్‌లైన్‌తో పాటు మొబైల్ యాప్ కూడా అందుబాటులోకి రావడంతో విద్యార్థులు సులభంగా, తక్కువ ఖర్చుతో డిగ్రీ ప్రవేశాలు పొందే అవకాశం చిక్కింది.

మరేమిటి ఇబ్బంది?

ఆన్‌లైన్ వ్యవస్థ మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులను గందరగోళ పరుస్తోందనే విమర్శలున్నాయి. అవగాహన లేమివల్ల దరఖాస్తులు నింపడంలో పొరపాట్లు దొర్లుతున్నాయి. మరోవైపు మెరిట్ ప్రకారం సీట్ల కేటాయింపు వల్ల విద్యార్థికి కొన్నిసార్లు దూరంగా ఉన్న కాలేజీల్లో సీట్లు వస్తున్నాయి. ఫలితంగా సీటు వచ్చినా విద్యార్థి చేరడం లేదు. ఇంకోవైపు ప్రైవేటు కాలేజీలు ముందే విద్యార్థుల చేత తమ కాలేజీలో చేరేలా ప్రాధాన్యత ఆప్షన్లు పెట్టిస్తున్నాయి. ప్రైవేటు కాలేజీల వ్యవహారం, విద్యార్థులు కేటాయించిన కాలేజీల్లో చేరకపోవడం వల్ల 'దోస్త్'ప్రవేశాల ప్రక్రియను పలు దఫాలుగా నిర్వహించాల్సి వస్తోంది. దీంతో అకడమిక్ సంవత్సరం ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు.

అసలు వాస్తవాలేంటి?

రాష్ట్రంలో ప్రతి ఏటా సగటున 3.90 లక్షల మంది ఇంటర్ పాసవుతున్నారు. వీరిలో 45 శాతం మంది మాత్రమే డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. కానీ రాష్ట్రంలో 1,055 కాలేజీల్లో 4.62 లక్షల డిగ్రీ సీట్లున్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులంతా డిగ్రీలో చేరినా ఇంకా 70 వేలకుపైగా సీట్లు మిగిలిపోక తప్పని పరిస్థితి. 416 గ్రామీణ కాలేజీల్లో ప్రవేశాలు 30 శాతం మించడం లేదు. వంద కాలేజీల్లో కొన్ని బ్రాంచీల్లో జీరో అడ్మిషన్లు నమోదవుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి రాజధానికి ఆనుకుని ఉన్న కాలేజీల్లో మాత్రం ప్రవేశాలు 70 శాతం ఉంటున్నాయి. 'దోస్త్'జాబితాలో ఉన్న కాలేజీల్లో డిగ్రీకి రూ.5 వేల నుంచి రూ.12 వేల వరకు ఫీజులున్నాయి. కానీ అందులో లేని 60 కాలేజీల్లో ('దోస్త్'పై కోర్టును ఆశ్రయించిన కాలేజీలు) నాణ్యత, వసతులు పేరిట రూ.1.25 లక్షల వరకు ఫీజు ఉంటోంది. ఈ నేపథ్యంలోనే నాణ్యత లేని కాలేజీల్లో గత ఏడాది లక్షకుపైగా సీట్లు తగ్గించారు. ఇదే క్రమంలో అసలు 'దోస్త్'ఎత్తివేయాలని, ఫీజులు, ప్రవేశాలపై తమకు స్వేచ్ఛ ఇవ్వాలని ప్రైవేటు కాలేజీలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. అంతేకాకుండా ఈ దిశగా ఈసారి బలమైన లాబీయింగ్ చేసినట్టు తెలుస్తోంది. ఫలితంగా 'దోస్త్'ఎత్తివేతకు రంగం సిద్ధమైందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఆన్‌లైన్ విధానం కొనసాగించినా అవసరమైన మార్పులు చేయాలని మండలి భావిస్తున్నట్లు సమాచారం.

డిగ్రీలో ప్రవేశాల సంఖ్య ఇలా..

సంవత్సరం	ప్రవేశాలు
2021-22	255132
2022-23	212818
2023-24	205495
2023-25	196442

బలహీనవర్గాలకు అన్యాయం జరగొద్దు



ఆన్‌లైన్ విధానంలో లోపాలుంటే సరిచేయాలి. ఫీజులు, ప్రవేశాలపై అధికారాన్ని కార్పొరేట్ కాలేజీలకు అప్పగించ కూడదు. వారి ఒత్తిళ్లకు లొంగి ఐదుగు, బలహీనవర్గాలకు ఉన్నత విద్యను దూరం చేసే ప్రయత్నాలు మానుకోవాలి.

– టి.నాగరాజు
(ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

అందరి ఆమోదం మేరకే మార్పులు చేయాలి



పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే చర్యలు సరికాదు. దోస్త్‌లో లోపాలుంటే వాటిని ముందుగా విద్యార్థి, మేధావి వర్గానికి వివరించాలి. అందరి ఆమోదం మేరకు మార్పులు చేయాలి.

– మాచర్ల రాంబాబు
(ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి)

ఎవ్వరినీ వదలం

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్రం సాధిస్తే.. ఇప్పుడు ఎవరు పడితే వారు.. భూమికి జానెడు ఉన్నోడు, మూడు ఫీట్లు ఉన్నోడు కూడా ఎగిరిపడుతుండు. కేసీఆర్ ఏం జేసిండు అని మాట్లాడుతున్నారు. కాలం మనది కానప్పుడు వానపాములు కూడా నాగుపాముల్లా బుస కొడతాయి. గ్రామసింహాలు కూడా సింహాల్లా గర్జిస్తాయి'అని అన్నారు. బీఆర్ఎస్ విజయాలు నేటి తరానికి తెలిసేలా ప్రతి జిల్లాలో ఏడాదిపాటు ఫొటో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తామని, డాక్యుమెంటరీలు ప్రదర్శిస్తామని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలూ ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. 'తెలంగాణలో బీజేపీకి నూకలు చెల్లినయ్. పదేళ్లలో ఏం చేశారని బండి సంజయ్‌ని అడగండి. ఆయనకు మసీదు కూల్చడం.. శివం, శవం, ఈ రోజు ఏం వారం, రేపు ఏం వారం అడగడం మాత్రమే తెలుసు'అని ఎద్దేవా చేశారు.

గుడి కట్టినా, బడి కట్టినా కేసీఆర్ ఘనతే..

రాష్ట్రంలో గుడికట్టినా, బడి కట్టినా, కాళేశ్వరంలాంటి ప్రాజెక్టులు కట్టినా ఆ ఘనత కేసీఆర్‌దేనని కేటీఆర్ అన్నారు. 'కేసీఆర్ హ యాంలో టైమ్‌కు రైతు ఖాతాల్లో డబ్బులు పడుతుండె. ఇప్పుడు రాహుల్, ప్రియాంకల ఖాతాల్లో పైసల్ పడుతున్నయ్. లేకపోతే సీఎం రేవంత్ సీటు పోతుంది కదా! ప్రజలు అన్నా.. ఇంకెన్ని రో జులు భరించాలి అని అడుగుతున్నరు. ఒక్క ఓటుకు శిక్ష ఐదేళ్లు. ఏం చేయలేం.. తప్పుడు పాలకులను ఎన్నుకుంటే ఈ పరిస్థితి వచ్చింది. 2028– 2029లో కేసీఆర్‌ను తిరిగి సీఎంను చేసే వరకు విశ్రమించేది లేదని శపథం చేద్దాం'అని పిలుపునిచ్చారు.

సభలో అపశ్రుతి

బీఆర్ఎస్ రజతోత్సవ సభలో అపశ్రుతి చోటుచేసుకుంది. అల్గునూర్ నుంచి సభాస్థలి వద్దకు చేపట్టిన బైక్ ర్యాలీలో తూండ్ల శ్రీకాంత్ అనే యువకుడు తన బుల్లెట్ వాహనంపై వేగంగా వ చ్చి అక్కడ బందోబస్తు విధుల్లో ఉన్న రూరల్ పో లీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్ పద్మజను ఢీకొట్టాడు. దీంతో పద్మజకు తీవ్ర గాయాలయ్యా యి. ఆమెను హుటాహుటిన నగరంలోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు. పద్మజను కేటీఆర్, ఆ పార్టీ నేతలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, వినోద్‌కుమార్ పరామర్శించారు.

ఓయూలో విద్యార్థినుల మెరుపు ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో లేడీస్ హాస్టల్ విద్యార్థినులు ఆదివారం రాత్రి మెరుపు ధర్నా చేపట్టారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, నాసిరకం ఆహారం పెడుతున్నారని ఆరోపి స్తూ రాత్రి భోజన సమయంలో క్యాంపస్‌లోని సెంటినరీ హాస్టల్ నుంచి ర్యాలీగా బయలుదేరి.. ఆర్ట్స్ కాలేజీ వద్ద ధర్నా చేపట్టారు. హాస్టల్‌లో చాలా రో జులుగా నీటి సమస్య,



రుచించని ఆహారంతో ఇ బ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. రెండు రోజులు గా తాగునీరు రావడం లేదని వాపోయారు. విద్యార్థినుల ధర్నా అర్ధరాత్రి వరకు కొనసాగింది. వీసీ బయటకు రావాలని, వెంటనే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని వారు భీష్మించుకుని రోడ్డుపై బైఠాయించారు. భోజనం చేయకుండా ఆందోళనలో పాల్గొన్న లావణ్య అనే విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది. మరోవైపు వీరి ఆందోళనకు బీఆర్ఎస్ నాయకురాలు, ఓయూ పూర్వ విద్యార్థినేత డాక్టర్ సత్యవతి మద్దతు పలికారు. అర్ధరాత్రి తర్వాత విద్యార్థినులు తాత్కాలికంగా ఆందోళనను విరమిస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. కాగా సెంటినరి లేడీస్ హాస్టల్‌లో కరెంట్ మోటార్ కాలిపోవడంతో నీటి సమస్య తలెత్తిందని హాస్టల్ వర్గాలు వెల్లడించాయి. సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించాయి.

ఇది 'కేటీఆర్.. ఓ టీస్టాల్' కథా చిత్రం!

- ఇటీవల ఎన్నికల కోడ్‌తో టీడబ్బా తొలగింపు
- సిరిసిల్ల నడిబొడ్డున మళ్లీ బాధితుడి టీస్టాల్‌ను ప్రారంభించిన కేటీఆర్

సిరిసిల్ల: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ చిరు వ్యాపారి.. కేటీఆర్ పేరుతో నడుపుకుంటున్న టీ కొట్టు డబ్బాను అధికారులు ఇటీవల ఎన్నికల సమయంలో మూసివేయించిన విషయం తెలిసిందే. దీంతో ఆ వ్యాపారికి కేటీఆర్ అండగా నిలిచారు. మళ్లీ టీకొట్టు పెట్టిస్తానని భరోసా ఇచ్చారు. గత నెలలో రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బతుకమ్మఘాట్ వద్ద కేటీఆర్ పేరు, ఫొటోతో ఉన్న టీస్టాల్‌ను అధికారులు మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ లేదన్న సాకుతో ఫిబ్రవరి 19న మూయించారు. అయితే బీఆర్ఎస్ అభిమానులు, కేటీఆర్ అనుచరులు అదే రోజు సాయంత్రమే హోటల్ నిర్వాహకుడు బత్తుల శ్రీనివాస్‌తో టీస్టాల్‌ను తెరిపించారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 21న సాయంత్రం టీస్టాల్ డబ్బాకు అనుమతి లేదని పేర్కొంటూ మున్సిపల్ అధికారులు ఆ డబ్బాను పోలీస్ రక్షణ మధ్య తొలగించి, ట్రాక్టర్‌పై మరోచోటికి తరలించారు. ఈ చర్యతో శ్రీనివాస్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి



టీస్టాల్ ప్రారంభిస్తున్న కేటీఆర్, ఎమ్మెల్సీ రమణ

కన్నీరు పెట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేటీఆర్, బత్తుల శ్రీనివాస్‌కు ఫోన్ చేసి తాను అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఇటీవల సిరిసిల్లకు వచ్చిన సందర్భంగా శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం చేశారు. ఆ డబ్బులతో మరోచోట హోటల్ పెట్టుకోవాలని కేటీఆర్ సలహా ఇచ్చారు. కేటీఆర్ సలహాతో పట్టణంలోని గాంధీచౌక్‌లో శ్రీనివాస్ కొత్తగా టీస్టాల్‌ను కేటీఆర్ పేరుతో ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం కేటీఆర్, ఎమ్మెల్సీ రమణతో కలసి శ్రీనివాస్ టీస్టాల్‌ను ప్రారంభించారు.

సన్నిధి

మంచిమాట



మనకు మేలు చేసిన వారికి కృతజ్ఞులై ఉండడం మన కనీస ధర్మం... మనం ఎవరి నుంచైతే మేలు పొందుతున్నామో, వారు ప్రత్యుపకారాన్ని ఆశించకపోయినా, వారి ఉదారతను గుర్తించి వారికి కృతజ్ఞతలు తెలుపుకోవడం మన విధిగా భావించాలి. ఎందుకంటే అలా కృతజ్ఞతలు తెలియ చేసినపుడే మన సంస్కారం ఏమిటో ఇతరులకు అర్థమవుతుంది. అంతేకాదు అది మనసుకు కూడా ఎంతో సంతోషాన్ని, ఆనందాన్ని ఇస్తుంది.

కృతజ్ఞత కనీస సంస్కారం

మనం ఇతరుల నుంచి ఎలాంటి సహాయం పొందినా వారికి కృతజ్ఞులై ఉండాలి. తల్లితండ్రులు మనకి జన్మనిస్తారు.. మన భవిష్యత్ కు పునాదులు వేస్తారు.. అందువల్ల మనం వారికి జీవితాంతం కృతజ్ఞులై ఉండాలి. మన గురువులు మన భవిష్యత్‌కు దిశానిర్దేశం చేస్తారు, మన స్నేహితులు మనకు చేదోడు వాదోడుగా ఉంటారు, ఇలా అనేక మంది పరోక్షంగా మన భవిష్యత్‌కు ఎంతగానో సహకరిస్తున్నారన్నమాట.. మన భవిష్యత్‌ను వారంతా తీర్చి దిద్దుతున్నపుడు వారికి మనం కృతజ్ఞతలు చూపించుకోవాలి కదా.. కృతజ్ఞతలు తెలియ చేయడం మన వ్యక్తిత్వాన్ని చాటి చెబుతుంది.. మనం ఎవరి దగ్గర నుంచైనా సహాయం పొందినపుడు నవ్వుతూ థాంక్సండీ.. మీ మేలు మరచి పోలేను అని చెప్పి వారి కళ్లలోకి ఒక్కసారి తొంగి చూస్తే, వారి కళ్ళల్లో ఏదో తెలియని ఆనందం మనకు కనిపిస్తుంది.. వారికి మన పట్ల మంచి అభిప్రాయం కూడా ఏర్పడుతుంది. దానివల్ల అవతలి వారు భవిష్యత్‌లో వారితో మనకేదైనా పని పడ్డప్పుడు, వారు ఇక ఆలోచించకుండా మనకు సహాయం చేస్తారు.

> ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకూ, మన నిత్య జీవితంలో అనేకానేకం మనకు ఉపయోగపడుతూంటాయి. వాటన్నింటి పట్ల, మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు పట్ల, విద్య నేర్పిన గురువుల పట్ల, అందరి పట్ల కృతజ్ఞతతో వుండాలి.

శ్రీరామచంద్రుడ్ని మనం దేవుడిగా పూజిస్తాం.. అయితే రామచంద్రుడు సాక్షాత్తు పరమాత్ముడే అయినా 'ఆత్మానాం మానుషం మన్యే' అన్నట్లు తనను ఒక మానవమాత్రునిగానే భావించుకున్నాడు. అందరిలో తాను ఒకడిగా, అందరికోసం తాను అన్నట్లుగా మెలిగాడు. మానవతా విలువలకు, కృతజ్ఞతా భావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచాడు. అలా రాముడు ప్రతీ విషయంలోనూ కృతజ్ఞతను చాటుకోవడం వల్లనే ఆయనను మనం పూజిస్తున్నాం.. ఆరాధిస్తున్నాం... మనం భూమి మీద నడుస్తున్నాం. పంటలను పండించుకుంటున్నాం... కనుక భూమిని భూదేవి' అనీ, మనం బతికుండడానికి ముఖ్య పాత్ర వహిస్తున్న నీటిని 'గంగాదేవి' అనీ, గాలిని వాయుదేవుడు అనీ పిలుస్తూ కృతజ్ఞతలు అర్పిస్తున్నాం. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకూ, మన నిత్య జీవితంలో అనేకానేకం మనకు ఉపయోగపడుతూంటాయి. వాటన్నింటి పట్ల, మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు పట్ల, విద్య నేర్పిన గురువుల పట్ల, అందరి పట్ల కృతజ్ఞతతో వుండాలి. సమస్త ప్రకృతి మన భావాలను గ్రహించి తదనుగుణంగా స్పందిస్తుంది కనుక మనకు చక్కగా ఆక్సిజన్ ఇస్తున్న చెట్లకూ, నీటికీ కృతజ్ఞతలు చెప్పాలి. మన జీవితానికి ఉపయోగపడే ప్రతి వ్యక్తికీ, వస్తువుకు, జీవికి మనం కృతజ్ఞులై ఉంటే, అదే మన భావి జీవితానికి కొత్త బాటలు వేస్తుంది. మన జీవితాన్ని నందనవనం చేస్తుంది.

– దాసరి దుర్గా ప్రసాద్, ఆధ్యాత్మిక పర్యాటకులు

ఆత్మదర్శిని

ఆత్మచైతన్యానికే ధ్యానం

దైవం అనేది బయట వెదికే విషయమే కాదు. సమాజంలోని నియమాలతో, నమ్మకాలతో పద్ధతులతో దానికి సంబంధమే లేదు. ఇప్పుడు సమాజంలో కనిపిస్తున్న ఆధ్యాత్మికత అంతా సమాజానికి చూపించుకోవడానికి, నలుగురిలో మంచి అనిపించుకోవడానికి చేసే ప్రయత్నాలు. నిజానికి ఆధ్యాత్మిక ప్రయాణం నీలోనికి నీవుచేసే ప్రయాణం. గర్భగుడిలోనికి ఒక్కరినే అనుమతించడంలోని అంతరార్థం ఇదే. సత్యాన్ని తెలుసుకోవడానికి బయటి వ్యక్తులు, మధ్యవర్తుల ప్రమేయమే అవసరం లేదు. సత్యం ఒకరు చెబితే అర్థమయ్యే విషయం కాదు. నీకు నీవుగానే సత్యాన్ని తెలుసుకోవాలి. నీ నమ్మకాల నుండి, అహం నుండి పూర్తిగా బయట పడాలి. నేను శరీరం కాదు. వీటికి సాక్షిగా ఉన్న దివ్య చైతన్యాన్ని అని తెలుసుకోవాలి. ఆత్మ చైతన్యవంతమవ్వడమే ధ్యానం.

విజ్ఞాన భైరవ తంత్రంలో శివుడు పార్వతికి 112 ధ్యానపద్ధతులను బోధిస్తాడు. మనం వాటిని పాటిస్తే దైవత్వాన్ని పొందుతామేమో గాని ఆరాధించడం వల్ల కాదు. శివుడు, బుద్ధుడు మొదలైన వారందరూ తాము దైవమని తెలుసుకొని ద్రష్టలైనారు. వారు తమలోని దైవత్వాన్ని తెలుసుకుని ఆ మార్గాన్ని మనకు బోధించారు. కానీ మనం ఆ మార్గాలను అనుసరించకుండా కేవలం వారిని ఆరాధించటం చేస్తున్నాము. దేవుడు భౌతికం కానే కాదు. శుద్ధచైతన్య స్థితిలోనే దైవగుణాలు ఉంటాయి. అది చావు పుట్టుకలు లేని స్థితి. తనను తాను తెలుసుకున్నవాడేస్వామి. నీ నిజస్థితిలో కేంద్రీకృతమై ఉంటే నీవే స్వామి. ఈ నిజమైన అర్థాలు తెలియకపోవడం వల్లనే కొందరు గడ్డాలు పెంచి విచిత్ర వేషాలతోగురువులుగా, స్వాములుగా చలామణి ఔతున్నారు. అసలు దైవత్వానికి భౌతిక వేషధారణతో సంబంధమే లేదు. సంసారాన్ని భౌతికంగావదలవలసిన అవసరం అస్సలు లేదు. సామాన్య జీవితంలో ఉంటూ,రోజువారీ పనులు చేస్తూనే నీ ఆత్మలో నీవు కేంద్రీకృతమై సాక్షిగా ఉండ




> దేవుణ్ణి నమ్ముతున్నాను అన్నంతమాత్రాన దేవునికి దగ్గర ఉన్నట్టు కాదు. నమ్మకాలకు అతీతమైన స్థితే దైవత్వం. మనస్సుకు అతీతమైన స్థితే దైవత్వం. అందుకు మార్గమే ధ్యానం.దేవుడు ఒక మనిషి కాదు. దైవత్వం ఒక స్థితి, నీ నిజస్థితి. తనను తాను తెలుసుకున్నవాడే దేవుడు. నీ నిజస్థితిని తెలుసుకుంటే నీవే దైవం.

డానికి రూపంతో పనిఏముంది? భాషతో, మాయలతో, అద్భుతాలతో మతంతో దైవత్వాన్ని ముడిపెట్టినంతవరకు ఎన్నటికీ దైవత్వాన్ని చేరలేవు. వీటన్నింటికీ అంటని స్వచ్ఛమైన చైతన్యస్థితే దైవత్వమని తెలుసుకో. సాక్షీభూతుడవై ఉండు. ఆ స్థితిని చేరుకున్నారు కనుకే కృష్ణుడిని, బుద్ధుడిని, క్రీస్తును దేవుళ్ళన్నారు. నీలోని కల్మషాలను తొలగించుకొని స్వచ్ఛమైన చైతన్యంగా మిగిలిపో. ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ఒంటరిగానే చేయాలి. మధ్యవర్తులెవ్వరూ నీకు సహాయం చేయలేరు. యాంత్రికమైన పద్ధతులను పాటిస్తూ, గుడ్డి నమ్మకాలతో ఉంటే మనస్సు ఉచ్చులో చిక్కుకుపోతావు కానీ ఆత్మవైపు వెళ్ళలేవు. ఆత్మ చైతన్యాన్ని మాత్రం పొందలేవు.



– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు



కోవిడ్ రోజులు

క్యాన్సర్‌తో పోరాడుతూ చివరిదశలో ఉన్నవారికి స్వస్థత చేకూర్చుతుంది హైదరాబాద్‌లోని స్పర్శ్ హాస్పిస్. కోవిడ్ టైమ్‌లో క్యాన్సర్ పేషంట్లకు సేవలు అందించడానికి, బయటి నుంచి వచ్చిన పేషంట్లను అడ్మిట్ చేసుకోవడానికి, భయాందోళనలో ఉన్న వారికి ధైర్యం చెప్పడానికి ఒక బృందంగా తామంతా ఎలా సిద్ధమయ్యారో హాస్పిస్ అడ్మినిస్ట్రేటర్ శారద లింగరాజు వివరించారు.

ఇళ్లకు వెళ్లి మరీ సేవలు చేశాం



శారద లింగరాజు

''ఇలాంటి సందర్భం వచ్చినప్పుడే ఒకరికొకరు ఉన్నామా, మన వరకే బతుకుతున్నామా.. అనే నిజాలు వెలుగులోకి వచ్చేది. మేం అందించేది ఎమర్జెన్సీ కేర్ కాదు. చనిపోయేదశలో ఉన్నవారికి ఉపశమనాన్ని ఇవ్వడం. కోవిడ్ సమయంలో అప్పటికే అంతటా భయాందోళనలు. ఎవరి వల్ల ఎవరికి కోవిడ్ వస్తుందో చెప్పలేం. ఎవరికి ఎవరు సాయంగా ఉంటారో తెలియదు. అలాంటప్పుడు రిస్క్ ఎందుకని, మేం 'చేయలేం' అని చెప్పవచ్చు. చేయూతనివ్వలేమని వదిలేయచ్చు. హాస్పిస్ తలుపులు మూసేయచ్చు. కానీ, మానవతా ధర్మంగా చూస్తే వారిని అలా వదిలేయడం సరికాదు అనిపించింది. అందుకే, క్యాన్సర్‌తో పోరాటం చేస్తూ కొన ఊపిరితో ఉన్నవారిని తీసుకువస్తే వారికి 'లేదు' అనకుండా కోవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ మాకు చేతనైన సేవలు అందించాం.

నేరుగా వారి ఇళ్లకే..

క్యాన్సర్ పేషంట్స్‌కి వారి స్టేజీలను బట్టి పెయిన్ ఉంటుంది. సరైన మందులు అందక వారు బాధపడిన సందర్భాలు ఎన్నో. వారు మమ్మల్ని కాంటాక్ట్ చేసినప్పుడు ఆ మందులను వారి ఇళ్లకే వెళ్లి అందజేశాం. వారికి కావల్సిన స్వస్థతను ఇంటికే వెళ్లి అందించాం. ఈ సేవలో పాలిచ్చే తల్లులైన నర్సులూ పాల్గొన్నారు. ఆయాలు పేషంట్స్‌కు దగ్గరగా ఉండి, సేవలు అందించారు. పేషంట్స్ చనిపోతే అప్పటికప్పుడు బాడీ తీసేయమని చెప్పిన వారున్నారు. కనీసం వారి పిల్లలు వచ్చేంత టైమ్ ఇవ్వమన్నా కుదరదనేవారు. వాళ్ల కోవిడ్‌తో కాదు క్యాన్సర్‌తో చనిపోయారు అని కన్విన్స్ చేయడానికి టైమ్ పట్టేది.

వీడియోలలో దహన సంస్కారాలు..

ఒక బెంగాలియన్ క్యాన్సర్ చివరి దశలో చనిపోయాడు. మృతదేహాన్ని హాస్పిస్ నుంచి వారి స్వస్థలానికి తీసుకువెళ్లాలి. కోవిడ్ కాకుండా క్యాన్సర్‌తో చనిపోయాడనే లెటర్‌తో పాటు అంబులెన్స్‌ను సిద్ధం చేయించి పంపాం. వాళ్లు కూడా ఏమీ ఆలోచించకుండా అప్పటికప్పుడు వెళ్లి దహనసంస్కారాలు చేయించి వచ్చారు. మా దగ్గర సేవ పొందుతున్న వారు చనిపోతే కనీసం చివరి చూపు చూడటానికి కూడా వారి పిల్లలు రాలేని పరిస్థితి. అందువల్ల దహన సంస్కారాలు చేసే సమయంలోనూ, ఆ తర్వాత వారికి వీడియోలు చూపించేవాళ్లం. పసుపు, కుంకుమలు, చెట్లకు ఉన్న కాసిన్ని పూలు పెట్టి సాగనంపేవాళ్లం. వారి ఏడుపులు, మేం సమాధాన పరచడం.. ఆ బాధ.. ఆ సందర్భంలో ఎలా తట్టుకున్నామో.. ఇప్పుడు తలుచుకుంటే అదంతా ఒక యజ్ఞంలా చేశామనిపిస్తోంది.

ప్రతి వారిలోనూ మంచితనాన్నే చూశాం..

ఒక తల్లి చనిపోయే చివరి దశ. ఆమె కొడుకు తల్లిని చూడటానికి జార్ఖండ్ నుంచి వచ్చాడు. గచ్చిబౌలిలో ఉండేవాడు. రెండు మూడుసార్లు బైక్ మీద వచ్చాడు. కొడుకును చూడాలని ఆ తల్లి ప్రాణం కొట్టుకులాడేది. కొడుకు చూసి వెళ్లిన పది నిమిషాల్లో ఆమె చనిపోయింది. నిజంగా జబ్బు ముదిరిపోయి చివరిదశలో ఉంటే ఆ కష్టాన్ని ఒకలా చూస్తాం. కానీ, కోవిడ్ భయంతో చుట్టూ ఉన్న మానవసంబంధాల కష్టం అప్పుడే చూశాం. తమ వారిని చూసుకోవడానికే కాదు, బాడీని తమ స్వస్థలాలకు చేర్చుకోవడానికి వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చేది.

డబ్బు కాదు బంధాలే ముఖ్యం అనిపించాయి ఆ రోజులు. చివరి రోజుల్లో ఉన్న క్యాన్సర్ పేషంట్లకు కోవిడ్ టైమ్‌లో ఏ దారీ లేదనే పరిస్థితుల్లో కూడా 'మేం ఉన్నాం' అనే ధైర్యాన్ని ఇచ్చాం. ప్రతి వాళ్లలో మంచితనాన్ని చూశాం' అని గడిచిన కాలపు జ్ఞాపకాలలోని మానవతను కళ్లకు కట్టారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సాక్షి సినిమా

జపాన్‌లో దేవర

జపాన్ వెళ్లారు ఎన్టీఆర్. ఆయన హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దేవర'. కల్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మించిన ఈ సినిమాలోని తొలి భాగం 'దేవర: పార్ట్ 1' 2024 సెప్టెంబరు 27న విడుదలైంది. ఈ చిత్రంలో తండ్రీకొడుకులుగా (తండ్రి పాత్ర దేవర, కొడుకు పాత్ర వర) నటించి, ప్రేక్షకులను మెప్పించారు ఎన్టీఆర్. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 500 కోట్లు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించినట్లుగా మేకర్స్ పేర్కొన్నారు. ఇక ఈ నెల 28న 'దేవర: పార్ట్ 1' సినిమా జపాన్‌లో రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రమోషనల్ టూర్‌లో భాగంగా ఎన్టీఆర్ జపాన్ వెళ్లారు. ఈ ప్రమోషనల్ టూర్ నుంచి తిరిగొచ్చిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తాను హీరోగా చేస్తున్న 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా షూట్‌లో ఎన్టీఆర్ పాల్గొంటారని సమాచారం. అలాగే ఎన్టీఆర్, హృతిక్ రోషన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న 'వార్ 2' సినిమా ఆగస్టు 14న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇక ఎన్టీఆర్ ప్రస్తుత కమిట్‌మెంట్స్ పూర్తయ్యాక 'దేవర 2' సినిమా షూట్‌లో పాల్గొంటారని, ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనుల్లో కొరటాల శివ బిజీగా ఉన్నారని సమాచారం.



● ఎన్టీఆర్



● వెంకీ కుడుముల, కేతికా శర్మ, డేవిడ్ వార్నర్, నితిన్, శ్రీలీల, వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని

మీ ఫ్యామిలీలోకి ఆహ్వానించినందుకు థ్యాంక్స్ - డేవిడ్ వార్నర్


''నమస్కారం... 'రాబిన్ హుడ్'లో నటించే చాన్స్ రావడాన్ని గౌరవంగా ఫీలవుతున్నా. మీ ఫ్యామిలీలోకి నన్ను ఆహ్వానించినందుకు థ్యాంక్స్. ఈ సినిమాలోని నా కోస్టార్స్ చాలా కష్టపడ్డారు. సినిమా అద్భుతంగా వచ్చింది. 'రాబిన్ హుడ్' పెద్ద సక్సెస్ కావాలి'' అని ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ పేర్కొన్నారు. నితిన్, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'రాబిన్ హుడ్'. రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ ముఖ్య పాత్రల్లో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ సినిమాలో అతిథి పాత్ర చేసిన ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ వేడుకకు అతిథిగా హాజరై, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా **నితిన్ మాట్లాడుతూ–** ''రాబిన్ హుడ్ విజయంపై కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. ఒక సినిమాకు రియల్ హీరోలు నిర్మాతలే. ఇండియాలో మైత్రీ టాప్ ప్రొడక్షన్ హౌస్ అని 'పుష్ప' సినిమాతో నిరూపితమైంది. 'రాబిన్ హుడ్'ని మైత్రీ వాళ్లు కాబట్టే ఇంత భారీగా తీశారు. నాపై ఉన్న ప్రేమను వెంకీ ఈ సినిమా రూపంలో చూపించాడు. డేవిడ్ వార్నర్‌గారి వల్ల ఈ సినిమా నెక్ట్స్ లెవల్‌కి వెళ్లింది. ప్రపంచ క్రికెట్‌లో ఆయన పెద్ద లెజెండ్ క్రికెటర్. కానీ తెలుగువారికి వార్నర్‌గారు.. డేవిడ్ భాయ్... వార్నర్ మామానే'' అన్నారు.

''రాబిన్ హుడ్' మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఈ ట్రైలర్ చూడగానే ఈ సినిమా ష్యూర్ షాట్ బ్లాక్‌బస్టర్ అని వెంకీతో చెప్పాను'' అన్నారు **నవీన్ ఎర్నేని.** ''నితిన్, డేవిడ్ వార్నర్ గార్లు, చాలా బిజీగా ఉండి కూడా ఈ సినిమా చేసిన శ్రీలీల, 'అదిదా సర్‌ప్రైజ్' పాట చేసిన కేతికా, ఇతర టీమ్‌కి థ్యాంక్స్'' అని తెలిపారు **వై. రవిశంకర్.** ''భీష్మ' తర్వాత నితిన్ అన్న, నేను 'రాబిన్ హుడ్'తో వస్తున్నాం. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం నితిన్ అన్న, బాగా తీయడానికి కారణం నవీన్, రవిగార్లు. ఈ సినిమాకు బజ్ రావడానికి ఒక కారణం కేతికా 'అదిదా సర్‌ప్రైజ్' సాంగ్.. రెండోది డేవిడ్ వార్నర్‌గారు ఇండియన్ సినిమాకు రావడం'' అని చెప్పారు **వెంకీ కుడుముల.** ''రాబిన్ హుడ్'తో హీరోగా కమర్షియల్ స్పేస్‌లో నితిన్ మరో లెవల్‌కి వెళ్తాడు. ఇలాంటి మరిన్ని సినిమాలు చేసి, వెంకీ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నాను. మైత్రీ మూవీ మేకర్స్ లిస్ట్‌లోని పెద్ద హిట్స్ మూవీలో 'రాబిన్ హుడ్' ఉండాలని కోరుకుంటున్నా'' అని తెలిపారు **రాజేంద్రప్రసాద్.** ''ఆల్మోస్ట్ ఏడాది తర్వాత నేను హీరోయిన్‌గా వస్తున్న 'రాబిన్ హుడ్'ని ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు **శ్రీలీల.** ఈ వేడుకలో 'పుష్ప' సినిమాలోని ఫుట్ స్టెప్, 'రాబిన్ హుడ్'లోని 'అదిదా సర్‌ప్రైజ్' పాట హుక్ స్టెప్స్ ట్రై చేసి, అలరించారు డేవిడ్ వార్నర్.

బ్రిటిష్ పాత్రలో...

సాయిదుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల యేటిగట్టు'. ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. నూతన దర్శకుడు కేపీ రోహిత్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాను కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ సినిమాలో బ్రిటిష్ అనే పాత్రలో శ్రీకాంత్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్‌ను ఆదివారం రిలీజ్ చేశారు. రగ్డ్ హెయిర్, బ్లాక్ కోట్‌తో బ్రిటిష్ పాత్రలో శ్రీకాంత్ లుక్ వినూత్నంగా ఉంది. ఆదివారం (మార్చి 23) శ్రీకాంత్ బర్త్ డే సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో 'సంబరాల ఏటి గట్టు' చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కానుంది.



● శ్రీకాంత్



● అనుపమా పరమేశ్వరన్

అందాల సిరి

'మా అందాల సిరి మీద పడనీకు ఏ కళ్లు... ఆ చిరునవ్వే పచ్చంగా ఉండాలి నూరేళ్లు... వేయాలి పరదాలు... చేయాలి సరదాలు... అమ్మా... నీ దీవెనలు తోడుంటే అంతే చాలు... మా ఊరి పొలిమేర దాటవుగా సంతోషాలు' అంటూ సాగుతుంది 'పరదా' సినిమాలోని 'మా అందాల సిరి' పాట. అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత లీడ్ రోల్స్‌లో నటించిన 'పరదా' సినిమాలోని పాట ఇది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో ఆనంద మీడియా పతాకంపై విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ ఈ సినిమాను నిర్మించారు. త్వరలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమాలోని 'మా అందాల సిరి...' పాట లిరికల్ వీడియోను ఆదివారం రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు గోపీసుందర్ స్వరపరచిన ఈ పాటకు వనమాలి సాహిత్యం అందించగా, శ్రీ కృష్ణ, రమ్య బెహరా పాడారు.

రాజకీయం... సందేశం

ఇంద్రజ, అజయ్, జయసుధ, సుమన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సీఎం పెళ్లాం'. గడ్డం రమణా రెడ్డి దర్శకత్వంలో బొల్లా రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషనల్ సాంగ్ లాంచ్ కార్యక్రమంలో ఇంద్రజ మాట్లాడుతూ– ''మీ రియల్ లైఫ్‌లో చూసినవి, విన్నవి, జరిగిన కొన్ని సంఘటనలను ఈ సినిమాలో దర్శకుడు చక్కగా చూపించారు. ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తూనే ఆలోచింపజేసే చిత్రం ఇది'' అన్నారు. ''ఈ సినిమాలో నేను సీఎంగా నటిస్తే, నా భార్య పాత్రలో ఇంద్రజ నటించారు. ఈ ప్రమోషనల్ సాంగ్ చూసి ఎమోషనల్ అయ్యాను'' అని తెలిపారు అజయ్. ''రాజకీయ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రం ఇది'' అని పేర్కొన్నారు బొల్లా రామకృష్ణ. ''మన నగరం ఎలా ఉంది? అనేది ఈ పాటలో చూపించాను. నేను అమెరికాలో ఉంటాను. కుండపోత వర్షం వచ్చినా చుక్క నీరు నిలవదు. ఇక్కడ వర్షం వస్తే అంతే. నేను ఎవరినీ విమర్శించడం లేదు. నగరం బాగుండాలనే తపనతో చెబుతున్నాను. సామాజిక నేపథ్యం ఉన్న చిత్రం 'సీఎం పెళ్లాం'' అని అన్నారు గడ్డం రమణారెడ్డి.



● అజయ్, ఇంద్రజ

ఓటీటీ

ఇది చూడొచ్చు

అప్పు ఎప్పుడైనా నిప్పే

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం పాన్ మేన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ రోజుల్లో అప్పు చేయని వాళ్లు చాలా తక్కువ. మరీ మధ్యతరగతి వాళ్లు అవసరాల కోసం అప్పులకై తిప్పలు పడతారు. ఒకవేళ అప్పు దొరికినా దానిని తీర్చడం మరో ఎత్తు. ఈ కసరత్తు మీదనే 'పాన్ మేన్' సినిమా రూపొందింది.

ఇదో మలయాళ సినిమా. జియో హాట్ స్టార్ వేదికగా తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా లభ్యమవుతోంది. జ్యోతిష్ శంకర్ దీనికి దర్శకత్వం వహించారు. ప్రముఖ మలయాళ నటుడు బసిల్ జోసెఫ్ ప్రధాన పాత్రలో నటించిన ఫ్యామిలీ డ్రామా ఇది. జీవితంలో అప్పు చేసిన ప్రతివారూ చూడవలసిన సినిమా. అలా అని ఇదేదో మెసేజ్ ఓరియంటెడ్ సినిమా కాదు, ఓ ఫ్యామిలీ థ్రిల్లింగ్ డ్రామా అని చెప్పుకోవచ్చు. ఇక 'పాన్ మేన్' కథ విషయానికొస్తే... కేరళ రాష్ట్రంలోని తీర ప్రాంతమైన కొల్లమ్‌లో బ్రూనో అనే వ్యక్తితో ఈ కథ మొదలవుతుంది. చెల్లెలు స్టెఫీ, తల్లితో పాటు ఓ చిన్న కుటుంబం బ్రూనోది. సంపాదన లేకున్నా రాజకీయాలపై ఇష్టంతో ఓ పార్టీలో చేరతాడు బ్రూనో. తన నోటి దురుసుతనం వల్ల పార్టీ నుంచి సస్పెండ్ కూడా అవుతాడు. బ్రూనో తల్లి తన కూతురు స్టెఫీకి త్వరగా పెళ్లి చేయాలన్న తాపత్రయంలో పక్క ఊరిలోని మరియానోతో 25 సవర్ల బంగారం కట్నకానుకాలు ఇచ్చే విధంగా సంబంధం కుదురుస్తుంది. దానికి గాను అజేష్ అనే బంగారు బ్రోకర్‌ను సంప్రదించి పెళ్లికి ముందు బంగారం తీసుకుని... పెళ్లిలో వచ్చే చదివింపులతో తిరిగి అప్పు తీర్చే విధంగా ఏర్పాటు చేస్తుంది. అజేష్ ఇచ్చిన నగలతో స్టెఫీ, మరియానో పెళ్లి అంగరంగ వైభవంగా జరుగుతుంది. కానీ అనుకోకుండా అంత డబ్బులు రావు. దీనితో అజేష్ తానిచ్చిన బంగారం కోసం పెళ్లి వారితో పాటు స్టెఫీ అత్తగారింటికి వెళతాడు. స్టెఫీ వేసుకున్న బంగారం అప్పుకు తెచ్చిందన్న విషయం అత్తవారింట్లో ఎవరికీ తెలియదు. ఈ పరిస్థితిలో అజేష్ తన బంగారం స్టెఫీ నుండి తీసుకోగలడా? లేదా అన్నది మాత్రం 'పాన్ మేన్' చూస్తేనే తెలుస్తుంది. ఈ సినిమా మొత్తం థ్రిల్లర్ జోనర్‌తో ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్‌లో నడుస్తుంది. అప్పు తీసుకునే ప్రతి వాళ్లూ తీసుకునేటపుడు బరువుగాను తిరిగి ఇచ్చేటపుడు బాధ్యతగాను ఉంటే ఏ సమస్యా ఉండదు. అలా కాని పక్షంలో ఈ సినిమాలో చూపిన ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వర్త్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.

– హరికృష్ణ ఇంటూరు

286 ఐపీఎల్‌లో ఇది రెండో అత్యధిక స్కోరు. గత ఏడాది రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై సన్‌రైజర్స్ చేసిన 287 పరుగుల స్కోరు అగ్రస్థానంలో ఉంది. ఐపీఎల్ చరిత్రలో టాప్-5 అత్యధిక టీమ్ స్కోర్లలో నాలుగు సన్‌రైజర్స్ పేరిటే ఉండటం విశేషం.

76 జోఫ్రా ఆర్చర్ ఇచ్చిన పరుగులు. ఐపీఎల్‌లోని ఒక మ్యాచ్‌లో ఒక బౌలర్ ఇచ్చిన అత్యధిక పరుగులు ఇవే. గత ఏడాది ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ బౌలర్ మోహిత్ శర్మ అత్యధికంగా 73 పరుగులు ఇచ్చాడు. మోహిత్ పేరిట ఉన్న రికార్డును ఆర్చర్ తన పేరిట లిఖించుకున్నాడు.

34 టి20 ఫార్మాట్‌లో ఒక మ్యాచ్ ఇన్నింగ్స్‌లో అత్యధిక ఫోర్లు (34) కొట్టిన జట్టుగా సన్‌రైజర్స్ రికార్డు నెలకొల్పింది. గతంలో ఈ రికార్డు మిడిల్‌సెక్స్ కౌంటీ (33 ఫోర్లు; సర్రే జట్టుపై 2023లో) జట్టు పేరిట ఉంది. ఐపీఎల్ టోర్నీ మ్యాచ్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక బౌండరీలు కొట్టిన రికార్డు ఢిల్లీ డేర్‌డెవిల్స్ (31 ఫోర్లు; 2017లో గుజరాత్ లయన్స్‌పై) జట్టు పేరిట ఉంది. దానిని కూడా సన్‌రైజర్స్ బ్రేక్ చేసింది.

3 ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన మూడో భారత ప్లేయర్‌గా ఇషాన్ కిషన్ (45 బంతుల్లో) గుర్తింపు పొందాడు. తొలి స్థానంలో యూసుఫ్ పఠాన్ (37 బంతుల్లో ముంబై ఇండియన్స్‌పై 2010లో) ఉన్నాడు. తాజా ఇన్నింగ్స్‌తో మయాంక్ అగర్వాల్ (45 బంతుల్లో; రాజస్తాన్ రాయల్స్‌పై 2020లో) సరసన ఇషాన్ కిషన్ చేరాడు.

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ X లక్నో
వేదిక: విశాఖపట్నం
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



ఇషాన్‌దార్ రైజర్స్

హైదరాబాద్ సూపర్ బ్యాటింగ్

- 286 పరుగుల స్కోరు నమోదు
- 44 పరుగులతో రాజస్తాన్‌పై గెలుపు
- ఇషాన్ కిషన్ అజేయ సెంచరీ
- చెలరేగిన ట్రావిస్ హెడ్
- సామ్సన్, జురేల్ మెరుపులు వృథా

ఇషాన్ కిషన్
పరుగులు 106
బంతులు 47
ఫోర్లు 11
సిక్స్‌లు 6
స్ట్రయిక్‌రేట్ 225.53

తొలి 42 బంతుల్లో 100 పరుగులు... 87 బంతుల్లో 200 పరుగులు... ఇక మిగిలింది 300 లక్ష్యమే... ఐపీఎల్‌లో 300 పరుగులు సాధ్యమా అనే ప్రశ్నకు జవాబిచ్చేలా ఆడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు దానిని ఈసారి అందుకోలేకపోయినా దాదాపు చేరువగా వచ్చింది. తమ అత్యధిక టీమ్ స్కోరుకు ఒక పరుగు మాత్రమే తక్కువ చేసి ఐపీఎల్ టోర్నీ చరిత్రలో రెండో అత్యధిక స్కోరును తమ పేరిటే లిఖించుకుంది. మారింది సీజన్ మాత్రమే తాము కాదు అంటూ సన్‌రైజర్స్ బ్యాటర్లు చెలరేగిపోయారు. గత ఏడాది లాగే అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ మెరుపులకు తోడు ఈసారి కొత్తగా జట్టులో చేరిన ఇషాన్ కిషన్ కూడా దూకుడుగా ఆడడంతో జట్టు ఆకాశమే హద్దుగా చెలరేగింది. ఛేదనకు ముందే ఓటమిని అంగీకరించినట్లు కనిపించిన రాజస్తాన్ కొంత పోరాడినా లక్ష్యం మరీ పెద్దది కావడంతో చివరకు ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. మొత్తానికి 528 పరుగుల మ్యాచ్‌తో హైదరాబాద్ అభిమానులు ఆదివారం పండుగ చేసుకున్నారు.

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్-18 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమదైన రీతిలో మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగింది. ఘన విజయంతో టోర్నీని మొదలు పెట్టింది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో గత ఏడాది రన్నరప్ సన్‌రైజర్స్ 44 పరుగుల తేడాతో మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 106 నాటౌట్; 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీతో కదం తొక్కాడు. ట్రావిస్ హెడ్ (31 బంతుల్లో 67; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. హెన్రిచ్ క్లాసెన్ (14 బంతుల్లో 34; 5 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (15 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) కూడా దూకుడుగా ఆడారు. సన్‌రైజర్స్ టాప్-5 బ్యాటర్లంతా 200కు పైగా స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధించడం విశేషం. అనంతరం 287 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులు చేసి ఓడిపోయింది. ధ్రువ్ జురేల్ (35 బంతుల్లో 70; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (37 బంతుల్లో 66; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. సన్‌రైజర్స్ బౌలర్లలో సిమర్‌జీత్ సింగ్, హర్షల్ పటేల్ రెండు వికెట్లు చొప్పున తీశారు. సన్‌రైజర్స్ జట్టు తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 27న ఉప్పల్ స్టేడియంలోనే లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో ఆడుతుంది.



హెడ్

మెరుపు బ్యాటింగ్...

అభిషేక్ శర్మ (11 బంతుల్లో 24; 5 ఫోర్లు), హెడ్ ఎప్పటిలాగే రైజర్స్‌కు శుభారంభం అందించారు. ఫారుఖీ ఓవర్లో అభిషేక్ మూడు ఫోర్లు కొట్టగా, అదే ఓవర్లో హెడ్ సిక్స్ కొట్టాడు. తొలి వికెట్‌కు 19 బంతుల్లో 45 పరుగుల భాగస్వామ్యం తర్వాత అభిషేక్ వెనుదిరిగాడు. అభిషేక్ స్థానంలో వచ్చిన ఇషాన్ కిషన్ కూడా అదే జోరును కొనసాగించాడు. ఆర్చర్ వేసిన ఐదో ఓవర్లో హెడ్ చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో అతను 4 ఫోర్లు, సిక్స్ బాదడంతో మొత్తం 23 పరుగులు వచ్చాయి. పవర్‌ప్లే ముగిసే సరికి సన్‌రైజర్స్ స్కోరు 94 పరుగులకు చేరగా, 21 బంతుల్లోనే హెడ్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఎట్టకేలకు హెడ్‌ను తుషార్ అవుట్ చేసినా... కిషన్ తనదైన శైలిలో ధాటిగా ఆడాడు. హెడ్, కిషన్ రెండో వికెట్‌కు 39 బంతుల్లోనే 85 పరుగులు జోడించారు. ఆర్చర్ ఓవర్లో రెండు వరుస సిక్స్‌లతో కిషన్ 25 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. అదే ఓవర్లో అతను మరో సిక్సర్ బాదాడు. మరోవైపు నితీశ్ రెడ్డి, క్లాసెన్ ఎక్కడా తగ్గలేదు. వీరిద్దరు దూకుడుతో స్కోరు వేగంగా దూసుకుపోయింది. సందీప్ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన క్లాసెన్, ఆర్చర్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టాడు. సందీప్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు బాది 98కి చేరిన కిషన్ తర్వాతి బంతికి రెండు పరుగులు చేసి సెంచరీ (45 బంతుల్లో)తో విజయనాదం చేశాడు.

శతక భాగస్వామ్యం...

దాదాపు అసాధ్యమైన లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన రాజస్తాన్ 50 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయింది. యశస్వి జైస్వాల్ (1), రియాన్ పరాగ్ (4), నితీశ్ రాణా (11) వెనుదిరగడంతో జట్టు ఛేదనావకాశాలు తగ్గిపోయాయి. అయితే సామ్సన్, జురేల్ కొద్దిగా ప్రయత్నం చేశారు. సిమర్‌జీత్ ఓవర్లో సామ్సన్ 2 ఫోర్లు, సిక్స్ కొట్టగా, కమిన్స్ ఓవర్లో జురేల్ 3 ఫోర్లు, సిక్స్ కొట్టడం హైలైట్‌గా నిలిచాయి. రాయల్స్ బ్యాటర్లు కూడా అక్కడక్కడా మెరుపులు మెరిపించినా హైదరాబాద్ ఇన్నింగ్స్ ముందు అవన్నీ దిగదుడుపుగా కనిపించాయి. నాలుగో వికెట్‌కు 60 బంతుల్లో 111 పరుగులు జత చేసిన అనంతరం ఒకే స్కోరు వద్ద సామ్సన్, జురేల్ అవుట్ కావడంతో రాజస్తాన్ ఆశలు అడుగంటాయి. చివర్లో హెట్‌మైర్ (23 బంతుల్లో 42; 1 ఫోర్, 4 సిక్స్‌లు), శుభమ్ దూబే (11 బంతుల్లో 34 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) పోరాడినా లాభం లేకపోయింది.



సామ్సన్



జురేల్

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) యశస్వి జైస్వాల్ (బి) తీక్షణ 24; హెడ్ (సి) హెట్‌మైర్ (బి) తుషార్ దేశ్‌పాండే 67; ఇషాన్ కిషన్ (నాటౌట్) 106; నితీశ్ కుమార్ రెడ్డి (సి) యశస్వి జైస్వాల్ (బి) తీక్షణ 30; క్లాసెన్ (సి) పరాగ్ (బి) సందీప్ 34; అనికేత్ (సి) ఆర్చర్ (బి) తుషార్ దేశ్‌పాండే 7; అభినవ్ మనోహర్ (సి) పరాగ్ (బి) తుషార్ దేశ్‌పాండే 0; కమిన్స్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 286. **వికెట్ల పతనం:** 1-45, 2-130, 3-202, 4-258, 5-279, 6-279. **బౌలింగ్:** ఫారుఖీ 3-0-49-0, తీక్షణ 4-0-52-2, ఆర్చర్ 4-0-76-0, సందీప్ శర్మ 4-0-51-1, నితీశ్ రాణా 1-0-9-0, తుషార్ దేశ్‌పాండే 4-0-44-3.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) మనోహర్ (బి) సిమర్‌జీత్ 1; సంజూ సామ్సన్ (సి) క్లాసెన్ (బి) హర్షల్ పటేల్ 66; పరాగ్ (సి) కమిన్స్ (బి) సిమర్‌జీత్ 4; నితీశ్ రాణా (సి) కమిన్స్ (బి) షమీ 11; ధ్రువ్ జురేల్ (సి) ఇషాన్ కిషన్ (బి) ఆడమ్ జంపా 70; హెట్‌మైర్ (సి) మనోహర్ (బి) హర్షల్ పటేల్ 42; శుభమ్ దూబే (నాటౌట్) 34; ఆర్చర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 242. **వికెట్ల పతనం:** 1-20, 2-24, 3-50, 4-161, 5-161, 6-241. **బౌలింగ్:** మొహమ్మద్ షమీ 3-0-33-1, సిమర్‌జీత్ సింగ్ 3-0-46-2, కమిన్స్ 4-0-60-0, అభిషేక్ 2-0-17-0, ఆడమ్ జంపా 4-0-48-1, హర్షల్ పటేల్ 4-0-34-2.


ఐపీఎల్-2025: అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి

లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో శార్దుల్ ఠాకూర్



న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో తన ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్‌ను ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ) తీసుకుంది. లెఫ్టార్మ్ పేసర్ మొహసిన్ ఖాన్ గాయంతో ఈ సీజన్‌కు దూరం కావడంతో అతడి స్థానంలో శార్దుల్ ఠాకూర్‌ను ఎంపిక చేసుకుంది. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో 5 వేర్వేరు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించి 95 మ్యాచ్‌లాడిన ఈ ముంబైకర్‌ను లక్నో కనీస ధర రూ. 2 కోట్లకు తీసుకుంది. మూడు ఫార్మాట్లలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 33 ఏళ్ల శార్దుల్... ఇటీవల రంజీ ట్రోఫీలో అటు బ్యాట్‌తో, ఇటు బంతితో ఆకట్టుకున్నాడు. మీడియం పేస్‌తో 35 వికెట్లు పడగొట్టడంతో పాటు... లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి 505 పరుగులు సాధించాడు. కాగా, గత ఏడాది జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో శార్దుల్ ఠాకూర్‌ను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసుకోలేదు. దీంతో కౌంటీ క్రికెట్ ఆడేందుకు మొగ్గు చూపిన ఈ ముంబైకర్... రిజిస్టర్డ్ అవైలబుల్ ప్లేయర్ పూల్ (ఆర్‌ఏపీపీ)లో తన పేరు నమోదు చేసుకున్నాడు. 'మోకాలి గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి అందుబాటులో లేకుండా పోయిన ఎడంచేతి వాటం పేసర్ మొహసిన్ ఖాన్ స్థానంలో లక్నో జట్టు శార్దుల్ ఠాకూర్‌ను ఎంపిక చేసుకుంది' అని ఐపీఎల్ పాలక మండలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

డబుల్స్‌లో భారత నంబర్‌వన్‌గా యూకీ



న్యూఢిల్లీ: మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత అగ్రశ్రేణి ప్లేయర్ యూకీ బాంబ్రీ శుభారంభం చేశాడు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఈ టోర్నీ జరుగుతోంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-నూనో బోర్జెస్ (పోర్చుగల్) ద్వయం 4-6, 6-3, 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో రోహన్ బోపన్న (భారత్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఈ గెలుపుతో యూకీ బాంబ్రీ డబుల్స్‌లో భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా అవతరించనున్నాడు. 32 ఏళ్ల యూకీ వచ్చే ఈనెల 31న విడుదలయ్యే ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 29వ స్థానానికి చేరుకొని భారత నంబర్‌వన్‌గా నిలుస్తాడు. 2019 నుంచి పురుషుల డబుల్స్‌లో భారత నంబర్‌వన్‌గా కొనసాగుతున్న రోహన్ బోపన్న 22 స్థానాలు దిగజారి 43వ ర్యాంక్‌కు చేరుకుంటాడు. గత ఏడాది మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి బోపన్న మయామి ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ సాధించాడు. ఈ ఏడాది బోపన్న తొలి రౌండ్‌లోనే ఓడిపోవడంతో అతని ర్యాంక్‌పై ప్రభావం చూపింది.



నూర్ అహ్మద్

వరుసగా 13వ ఏడాది...

సీజన్ ఆరంభ మ్యాచ్‌లో పరాజయం పాలయ్యే ఆనవాయితీని ముంబై ఇండియన్స్ మరోసారి కొనసాగించింది. వరుసగా 13వ ఏడాది ముంబై జట్టు ఐపీఎల్‌లో తాము ఆడిన తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైంది. గతేడాది పాయింట్ల పట్టిక అట్టడుగున నిలిచిన ముంబై ఇండియన్స్ ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో నాలుగు వికెట్ల తేడాతో ఓడింది. బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించలేకపోయిన ముంబై... బౌలింగ్‌లోనూ ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది.

- ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో ఓడిన ముంబై ఇండియన్స్
- 4 వికెట్లతో చెన్నై సూపర్ కింగ్స్ గెలుపు
- తిప్పేసిన నూర్ అహ్మద్
- రాణించిన రచిన్, రుతురాజ్

చెన్నై: ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ 18వ సీజన్‌లో శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో చెన్నై నాలుగు వికెట్ల తేడాతో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌పై గెలిచింది. 2012 ఐపీఎల్‌లో చివరిసారి తాము ఆడిన తొలి మ్యాచ్‌లో నెగ్గిన ముంబై జట్టు ఆ తర్వాత ఇప్పటి వరకు మొదటి పోరులో శుభారంభం చేయలేకపోయింది. మొదట ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. హైదరాబాద్ యువతార ఠాకూర్ తిలక్ వర్మ (25 బంతుల్లో 31; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్), దీపక్ చాహర్ (15 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) తలా కొన్ని పరుగులు చేశారు. స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ (0) డకౌట్ కాగా... రికెల్టన్ (13), విల్ జాక్స్ (11) ఎక్కువసేపు నిలవలేకపోయారు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నూర్ అహ్మద్ 4, ఖలీల్ అహ్మద్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం చెన్నై 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (45 బంతుల్లో 65 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (26 బంతుల్లో 53; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకాలతో రాణించారు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) దూబే (బి) ఖలీల్ 0; రికెల్టన్ (బి) ఖలీల్ 13; జాక్స్ (సి) దూబే (బి) అశ్విన్ 11; సూర్యకుమార్ (స్టంప్డ్) ధోని (బి) నూర్ 29; తిలక్ వర్మ (ఎల్బీ) (బి) నూర్ 31; రాబిన్ (సి) జడేజా (బి) నూర్ 3; నమన్ (బి) నూర్ 17; సాంట్నర్ (ఎల్బీ) (బి) ఎలీస్ 11; దీపక్ చాహర్ (నాటౌట్) 28; బౌల్ట్ (సి) రుతురాజ్ (బి) ఖలీల్ 1; సత్యనారాయణ రాజు (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం** (20 ఓవర్లలో 9 వికెట్లకు) 155. **వికెట్ల పతనం:** 1-0, 2-21, 3-36, 4-87, 5-95, 6-96, 7-118, 8-128, 9-141. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-29-3; స్యామ్ కరన్ 1-0-13-0; ఎలీస్ 4-0-38-1; అశ్విన్ 4-0-31-1; జడేజా 3-0-21-0; నూర్ అహ్మద్ 4-0-18-4. **చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్:** రచిన్ (నాటౌట్) 65; రాహుల్ త్రిపాఠి (సి) రికెల్టన్ (బి) చాహర్ 2; రుతురాజ్ (సి) జాక్స్ (బి) విఘ్నేశ్ 53; దూబే (సి) తిలక్ వర్మ (బి) విఘ్నేశ్ 9; దీపక్ హుడా (సి) సత్యనారాయణ (బి) విఘ్నేశ్ 3; కరన్ (బి) జాక్స్ 4; జడేజా (రనౌట్) 17; ధోని (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (19.1 ఓవర్లలో 6 వికెట్లకు) 158. **వికెట్ల పతనం:** 1-11, 2-78, 3-95, 4-107, 5-116, 6-152. **బౌలింగ్:** బౌల్ట్ 3-0-27-0; చాహర్ 2-0-18-1; సత్యనారాయణ 1-0-13-0; సాంట్నర్ 2.1-0-24-0; జాక్స్ 4-0-32-1; విఘ్నేశ్ 4-0-32-3; నమన్ 3-0-12-0.



సూర్యకుమార్ యాదవ్‌ను స్టంపౌట్ చేస్తున్న ధోని

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	557	76,906
నిఫ్టీ ▲	160	23,350

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,784	▲	92
డోజోన్స్	41,985	▲	32
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,647	▼	55
డాక్స్	22,892	▼	107
షాంఘై	3,365	▼	44
నికాయ్	37,677	▼	75

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.80	86.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.40	113.24
€	యూరో	ఎస్‌బీఐ	92.23	94.89
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.17	58.64
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.68	56.54
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.13	66.80
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.03	23.58
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.52	24.30
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.98	12.81


మీ స్కోర్ ఎంత..?


రుణ అర్హతలకి క్రెడిట్ స్కోర్ ప్రామాణికం
క్రెడిట్ రిపోర్ట్‌లో తప్పులతో తగ్గిపోవచ్చు
లోపాలు, మోసపూరిత లావాదేవీ ఎంట్రీలు
అందుకే ఏటా రుణ చరిత్రను తిరగేయాలి
తప్పులుంటే సరిచేసుకోవాలి
చివరిగా అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించాలి

ముంబైకి చెందిన అజయ్ వర్మ (31) తన పర్సనల్ లోన్‌ను పూర్తిగా తీర్చేసి నాలుగు నెలలు గడిచిపోయింది. ఇటీవలే క్రెడిట్ రిపోర్ట్‌ను పరిశీలించగా.. ఆ రుణం ముగిసిపోయిన విషయం తన రుణ చరిత్రలోకి చేరలేదన్న విషయం అర్థమైంది. క్రెడిట్ స్కోర్‌ను తెలుసుకోండంటూ 'పైసాబజార్' నుంచి వచ్చిన సందేశం చూసి, హైదరాబాద్‌కు చెందిన అఖిలేశ్ (45) లింక్‌పై క్లిక్ చేశాడు. మొబైల్ నంబర్, ఓటీపీతో లాగిన్ అయిన తర్వాత క్రెడిట్ రిపోర్ట్ తెరుచుకుంది. అందులో తాను తీసుకోని రుణాల సమాచారం ఉండడాన్ని చూసి ఆందోళన చెందాడు. ఆర్జించే ప్రతి వ్యక్తి క్రెడిట్ రిపోర్ట్‌ను తరచుగా ఎందుకు తనిఖీ చేసుకోవాలి? అన్న దానికి ఇవి నిదర్శనాలుగా నిలుస్తాయి.

మనలో కొందరు ఏటా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటూ ఉంటారు. అనారోగ్యాలు ఏవైనా ఉంటే ఆరంభంలోనే గుర్తించి నయం చేసుకునేందుకు ఈ పరీక్షలు వీలు కల్పిస్తాయి. అదే మాదిరి క్రెడిట్ రిపోర్ట్‌ను ఏడాదికోసారి అయినా తనిఖీ చేసుకోవడం ద్వారా అందులో తప్పులు, పొరపాట్లు, మోసపూరిత లావాదేవీలకు చోటు లేకుండా చూసుకోవచ్చు. మెరుగైన క్రెడిట్ స్కోర్‌తో రుణ పరపతిని గణనీయంగా పెంచుకోవచ్చు.

– సాక్షి, బిజినెస్ డెస్క్





గతంలో ఎంతో ముఖ్యమైన అవసరం ఉంటేనే అరువు తీసుకునేవారు. కానీ, నేడు మెరుగైన జీవనం కోసం, కోరికలు తీర్చుకోవడానికి, సొంతింటి కల సాకారానికి ఇలా ఒకటేమిటి.. అన్ని అవసరాలకు రుణాలను ఆశ్రయించే సంస్కృతి విస్తరిస్తోంది. 2024 ఫిబ్రవరి నాటికి మన దేశంలో 10 కోట్ల మందికి పైగా క్రెడిట్ కార్డులున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇల్లు, కారు, ఇంట్లో ఖరీదైన ఎల్రక్టానిక్ పరికరాలను ఈఎంఐలపై తీసుకోవడానికి ఎంత మాత్రం సంకోచించడం లేదు. ప్రతి రుణానికి గీటురాయి మెరుగైన క్రెడిట్ స్కోరే. తీరా రుణం అవసరమైన పరిస్థితుల్లో క్రెడిట్ రిపోర్ట్‌లో లోపాలు అడ్డంకిగా మారొచ్చు. అందుకే క్రెడిట్ రిపోర్ట్‌ను అప్పుడప్పుడూ పరిశీలించుకోవడం అవసరం. 'గతంలో రుణం తీసుకుని, అన్ని ఈఎంఐలను సకాలంలో చెల్లించేశాను. కనుక, భవిష్యత్తులో సులభంగా రుణం లభిస్తుంది' అని అనుకోవడానికి లేదు. మీకున్న క్రెడిట్ స్కోర్? మీ అర్హతలను నిర్ణయిస్తుంది.

క్రెడిట్ రిపోర్ట్..

వ్యక్తులు, వ్యాపార సంస్థల పేరిట (పాన్ ఆధారంగా) అన్ని రుణాలు, వాటి చెల్లింపుల వివరాలతో కూడిన సెంట్రల్ డేటాను నిర్వహించేవే క్రెడిట్ బ్యూరోలు. బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు ప్రతీ రుణానికి సంబంధించి చెల్లింపుల వివరాలను ఎప్పటికప్పుడు క్రెడిట్ బ్యూరోలకు తెలియజేస్తుంటాయి. ట్రాన్స్‌యూనియన్ సిబిల్, ఎక్స్‌పీరియన్, ఈక్విఫాక్స్, క్రిఫ్ హైమార్క్ సంస్థలు ప్రస్తుతం ఈ సేవలను అందిస్తున్నాయి. రుణం కోరుతూ చేసే విచారణలు, రుణానికి చేసే దరఖాస్తులు, రుణాల జారీ, వాటికి చెల్లింపులు, ఈఎంఐలను సకాలంలో చెల్లించలేకపోవడం, రుణ చెల్లింపులను ఎగవేయడం ఇలా ప్రతీ సమాచారం క్రెడిట్ బ్యూరో రికార్డుల్లో నమోదవుతుంటుంది. ఇప్పటి వరకు ఒక వ్యక్తి లేదా సంస్థ ఎన్ని రుణాలు తీసుకున్నారు, వాటిని పూర్తిగా చెల్లించారా? లేదా? అన్న సంపూర్ణ సమాచారం ఉంటుంది.

ప్రతి రుణ ఖాతాకు సంబంధించి తాజా సమాచారాన్ని 15 రోజులకు ఒకసారి (గతంలో నెలకోసారి) క్రెడిట్ బ్యూరోలకు అందించాలని ఆర్థిక సంస్థలు, బ్యాంక్‌లను ఇటీవలే ఆర్‌బీఐ ఆదేశించడం గమనార్హం. ఇలా అన్ని మార్గాల ద్వారా వచ్చే సమాచారం ఆధారంగానే ప్రతి వ్యక్తి/సంస్థ పేరిట క్రెడిట్ రిపోర్ట్‌ను క్రెడిట్ బ్యూరోలు రూపొందిస్తుంటాయి. ఈ సమాచారం ఆధారంగానే స్కోర్‌ను కేటాయిస్తుంటాయి. వివిధ రకాల రుణ సాధనాలను వినియోగించుకోవడం.. వాయిదాలను సకాలంలో చెల్లిస్తూ ఆర్థిక క్రమశిక్షణ చూపించే వారికి బలమైన స్కోర్ లభిస్తుంది. రుణం మంజూరు చేస్తే ఎంత రిస్క్ ఉంటుందన్న విషయాన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు క్రెడిట్ రిపోర్ట్, స్కోర్ ఆధారంగా సులభంగా అంచనాకు వస్తాయి. కేవలం రుణదాతలే క్రెడిట్ స్కోర్/రిపోర్ట్‌కు పరిమితం కావడం లేదు. బీమా కంపెనీలు పాలసీల జారీకి ముందు సంబంధిత దరఖాస్తుదారుడి క్రెడిట్ స్కోర్‌ను ఇటీవలి కాలంలో పరిశీలిస్తున్నాయి. కంపెనీలు ఉద్యోగ నియామకాల సమయంలోనూ అభ్యర్థుల క్రెడిట్ స్కోర్‌ను గమనిస్తున్నాయి. తద్వారా వారు ఆర్థిక విషయాల్లో ఎంత క్రమశిక్షణగా ఉంటున్నారో తెలుసుకోవాలని అనుకుంటున్నాయి. క్రెడిట్ రిపోర్ట్‌లో ఒక్కోసారి తప్పులు, పొరపాట్లకు అవకాశం లేకపోలేదు. ప్రతి ఒక్కరూ తమ క్రెడిట్ రిపోర్ట్‌ను పరిశీలించుకోవడం ద్వారానే వీటి గురించి తెలుస్తుంది. లేదంటే రుణ దరఖాస్తు తిరస్కారానికి గురైనప్పుడే వాటి గురించి తెలుస్తుంటుంది.

మెరుగైన స్కోర్‌తో లాభాలు..



■ చక్కని ఆర్థిక క్రమశిక్షణ, సకాలంలో రుణ చెల్లింపులతో క్రెడిట్ స్కోర్‌ను మెరుగ్గా కాపాడుకోవచ్చు. దీనివల్ల రుణాలను ఇతరులతో పోల్చితే తక్కువ రేటుకే సొంతం చేసుకోవచ్చు. వ్యాపార సంస్థల విషయంలోనూ ఇంతే. రుణ షరతుల్లో వెసులుబాటు లభిస్తుంది.

■ ఒకేసారి ఒకటికి మించిన రుణాలు తీసుకోవడం క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. అలాగే, తరచూ రుణాల కోసం చేసే విచారణలు సైతం క్రెడిట్ స్కోర్‌ను తగ్గించేస్తాయి.

■ రుణ బకాయిలను జాప్యం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో తీర్చేయాలి. ఒక్క రుణ వాయిదా చెల్లింపులోనూ ఆలస్యం లేకుండా చూసుకోవాలి. చెల్లించడం కష్టమని భావిస్తే రుణ కాల వ్యవధిని పెంచుకుని, ఈఎంఐ తగ్గించుకోవాలి.

■ ఒకేసారి ఒకటికి మించి ఒకే తరహా రుణాలు తీసుకోకూడదు. ఒకటికి మించిన పర్సనల్ లోన్‌లు, వాహన రుణాలు స్కోర్‌ను తగ్గించేస్తాయి. దీనికి బదులు క్రెడిట్ కార్డ్, పర్సనల్ లోన్, వెహికల్ లోన్, హౌసింగ్ లోన్ ఇలా రుణాలు మిశ్రమంగా ఉంటే స్కోర్‌కు నష్టం చేయదు.

■ క్రెడిట్ కార్డుపై క్రెడిట్ లిమిట్‌లో వినియోగం (యుటిలైజేషన్ రేషియో) 30–40 శాతం మించకుండా చూసుకోవాలి.

తప్పులు సరిచేసుకోవడం ఎలా?

■ రుణాలకు సంబంధించి ఏవైనా తప్పులను గుర్తించినట్టయితే, క్రెడిట్ బ్యూరో దృష్టికి తీసుకెళ్లాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేయొచ్చు. తమ క్లెయిమ్‌కు ఆధారాలను కూడా జత చేయాలి.

■ రుణాలను సరిగ్గానే చెల్లించినప్పటికీ తప్పులు చోటుచేసుకుంటే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ దృష్టికి తీసుకెళ్లాలి. క్రెడిట్ బ్యూరోలోని సమాచారం అప్‌డేట్‌కు బ్యాంక్, ఎన్‌బీఎఫ్‌సీ సహకరిస్తాయి.

■ అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ వద్ద ఫిర్యాదు దాఖలు చేయాలి.

■ క్రెడిట్ రిపోర్ట్‌లో మీ పేరు, చిరునామా, డేట్ ఆఫ్ బర్త్, గుర్తింపు వివరాల్లో పొరపాట్లు ఉంటే అదే విషయాన్ని సంబంధిత క్రెడిట్ బ్యూరో దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవచ్చు.





ఏమి చూడాలి..?

క్రెడిట్ స్కోర్‌ను సరిగ్గా అర్థం చేసుకోవడం, మెరుగైన స్కోర్ కొనసాగేలా చూసుకోవడం ఎంతో ముఖ్యమని సిబిల్ మాజీ ఎండీ, అథేనా క్రెడ్‌ఎక్స్‌పర్ట్ వ్యవస్థాపకుడు సతీష్ మెహతా పేర్కొన్నారు. నాలుగు క్రెడిట్ బ్యూరోల నుంచి ఏడాదికోసారి ఉచితంగా క్రెడిట్ రిపోర్ట్‌ను పొందొచ్చు. అంటే ప్రతి బ్యూరో నుంచి ఒకటి పొందే అవకాశం ఉంటుంది. ప్రతి మూడు నెలలకు ఒక బ్యూరో నుంచి రిపోర్ట్‌ను ఉచితంగా పొందడం ద్వారా అందులో సమాచారం సరిగ్గా ఉందా? లేదా అన్నది నిర్ధారించుకోవచ్చు. మరీ ముఖ్యంగా ఏదైనా రుణం తీసుకోవాలని అనుకుంటుంటే, దానికంటే ముందుగానే క్రెడిట్ రిపోర్ట్‌ను పరిశీలించుకుని, అందులోని సమాచారం అంతా సవ్యంగా ఉందో లేదో అన్నది ధ్రువీకరించుకోవాలి. లేదంటే రుణ అర్హతపై ప్రభావం పడుతుంది. కనీసం ఏడాదిలో ఒకసారి పరిశీలించుకోవడం ద్వారా తప్పులు సరిదిద్దుకునేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

■ గతంలో ఎప్పుడో వాడి పడేసిన క్రెడిట్ కార్డ్‌పై రూ.100 బకాయి ఉన్నా సరే అది ఏళ్లపాటు క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేస్తుంది.

■ రుణం పూర్తిగా చెల్లించినప్పటికీ.. సంబంధిత రుణ ఖాతాను 'ఓపెన్' అని (ఇంకా తీరిపోలేదు) చూపించొచ్చు. బాకీ మొత్తాన్ని తప్పుగా చూపించొచ్చు. తాము తీసుకోని రుణాలు తీసుకున్నట్టుగా క్రెడిట్ రిపోర్ట్‌లోకి చేరొచ్చు.

■ మోసపూరిత రుణ ఖాతాలు సైతం ఒకరి రుణ చరిత్రను దెబ్బ తీసే ప్రమాదం ఉంది. అంటే ఒకరి పాన్‌పై వేరొకరు/సంస్థలు మోసపూరితంగా రుణాలు తీసుకుని ఎగ్గొట్టడం వంటివి చోటు చేసుకోవచ్చు.


■ రుణ ఖాతా వర్గీకరణను చూడాలి. అన్ని రుణ ఖాతాలకూ 'స్టాండర్డ్'అనే ఉండాలి. 'ఓవర్ డ్యూ', 'ఎస్ఎంఏ' అన్న ట్యాగ్‌లు ఉండకూడదు.

■ ఒక్కోసారి ఒకే రుణం రెండు రుణ ఖాతాలుగా క్రెడిట్ రిపోర్ట్‌లో నమోదు కావచ్చు.

■ వ్యక్తిగత రుణాన్ని వ్యాపార రుణంగా పేర్కొనే అవకాశం లేకపోలేదు.

■ క్రెడిట్ రిపోర్ట్‌లో ప్రతి లోపం మోసం కాకపోవచ్చు. రుణ గ్రహీత సకాలంలోనే చెల్లించినప్పటికీ, బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ జాప్యం అయినట్టు పొరపాటుగా క్రెడిట్ బ్యూరోలకు సమాచారం ఇవ్వొచ్చు. అలాంటి అవాస్తవ, తప్పులు/లోపాలు/మోసాలకు సంబంధించిన సమాచారాన్ని తొలగించుకునే హక్కు రుణ గ్రహీతలకు ఉంటుంది.

బంగారు ఆభరణాలు విక్రయిస్తే పన్ను చెల్లించాలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

పన్ను చెల్లింపుదారులకు స్వల్ప ఉపశమనం కల్పించినట్టు విన్నాను. కానీ, అదేమిటో అర్థం కాలేదు. వివరించగలరా? – ఉదిత్

ప్రభుత్వం ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 87ఏ కింద పన్ను రాయితీ ఇస్తోంది. మీ పన్ను వర్తించే ఆదాయం ఒక పరిమితికి మించకుండా ఉంటే ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. ఈ పరిమితి దాటి రూపాయి ఆదాయం ఉన్నాసరే ఈ రాయితీని కోల్పోవాల్సి వస్తుంది. దాంతో పెద్ద మొత్తంలో పన్ను చెల్లించాలి. సెక్షన్ 87ఏ కింద పూర్తి పన్ను రాయితీకి ఆదాయ పరిమితులు ఇలా ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి కొత్త విధానంలో.. రూ.7లక్షలు అంతకంటే తక్కువ ఆదాయం ఉంటే, సెక్షన్ 87ఏ కింద రూ.25,000 రాయితీ ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకుని పన్ను కట్టక్కర్లేదు. పాత పన్ను విధానంలో అయితే ఈ సెక్షన్ కింద రాయితీ రూ.12,500కే పరిమితం. ఈ ప్రకారం రూ.5 లక్షల ఆదాయంపై పన్ను ఉండదు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26) అయితే.. కొత్త విధానంలో రూ. 12 లక్షలకు మించకుండా ఆదాయం ఉంటే సెక్షన్ 87ఏ కింద రూ.60,000 పన్ను రాయితీ లభిస్తుంది. పాత విధానంలో ఎలాంటి మార్పు లేకుండా రూ.5 లక్షలకే రాయితీ పరిమితం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కొత్త పన్ను కింద రూ.12లక్షల ఆదాయం మించని వారికి పన్ను లేదు. కానీ, ఆదాయం రూ.12,01,000 ఉంటే ఈ రాయితీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుంది. ఇక్కడ స్వల్ప ఉపశమనం అంటే.. ఆదాయం నిర్దేశిత పరిమితి దాటి కొంచెమే ఉంటే అప్పుడు భారీగా పన్ను చెల్లించే పరిస్థితి లేకుండా.. నికరంగా రూ.1,000పైనే పన్ను చెల్లిస్తే సరిపోతుంది.

నా బంగారం ఆభరణాలను విక్రయించాలనుకుంటున్నాను? మూలధన లాభానికి ఇండెక్సేషన్ ప్రయోజనం లభిస్తుందా? – జోసెఫ్ ఎరింజేరీ



ఇండెక్సేషన్ అంటే ద్రవ్యోల్బణానికి తగినట్టుగా కొనుగోలు ధరను సర్దుబాటు చేయడం. కానీ, బంగారు ఆభరణాలకు ఇండెక్సేషన్ ప్రయోజనం ఇప్పుడు లేదు. ఆభరణాలను విక్రయించగా వచ్చిన లాభంపై పన్ను ఎంత చెల్లించాలన్నది.. వాటిని ఎంత కాలం పాటు కొని ఉంచుకున్నారన్న దానిపై ఆధారపడి ఉంటుంది. రెండేళ్లకుపైగా ఉంచుకుంటే అప్పుడు దీర్ఘకాల మూలధన లాభంపై 12.5% పన్ను పడుతుంది. రెండేళ్లలోపు విక్రయిస్తే ఆ మొత్తం స్వల్పకాల మూలధన లాభం అవుతుంది. ఇది మీ వార్షిక ఆదాయానికి కలుస్తుంది. అప్పుడు మీ మొత్తం ఆదాయం ఏ శ్లాబు పరిధిలోకి వస్తే, ఆ మేరకు పన్ను చెల్లించాలి. ఆభరణాలు వారసత్వంగా మీకు సంక్రమించినా లేక బహుమతి రూపంలో వచ్చినా.. అప్పుడు ఆ ఆభరణం కొన్న అసలు తేదీ, అప్పటికి ఉన్న ధరను పరిగణనలోకి తీసుకుంటారు.

పెట్టుబడులపై..?

గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో 2023 ఏప్రిల్ 1, ఆ తర్వాత ఇన్వెస్ట్ చేసి.. 2025 మార్చి 31లోపు విక్రయిస్తే.. లాభం మొత్తం వార్షికాదాయానికి కలుస్తుంది. 2025 ఏప్రిల్ 1, ఆ తర్వాత విక్రయిస్తే.. హోల్డింగ్ పీరియడ్ (ఉంచిన కాలం) ఏడాదికి మించితే లాభంపై 12.5% పన్ను పడుతుంది. ఆభరణాల హోల్డింగ్ పీరియడ్ ఏడాదిలోపు ఉంటే లాభం మొత్తం వార్షిక ఆదాయానికి కలుస్తుంది. గోల్డ్ ఫండ్స్‌లో 2023 ఏప్రిల్ 1, ఆ తర్వాత ఇన్వెస్ట్ చేసి.. 2025 మార్చి 31లోపు విక్రయిస్తే, వచ్చిన లాభం వార్షికాదాయానికి కలుస్తుంది. 2025 ఏప్రిల్ 1 తర్వాత విక్రయిస్తే, హోల్డింగ్ పీరియడ్ రెండేళ్లకు పైన ఉంటే లాభంపై 12.5% పన్ను చెల్లించాలి. ఆలోపు ఉంటే లాభం వార్షిక ఆదాయానికి కలుస్తుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

మార్కెట్లకు విదేశీ జోష్	రెండింటిలోనూ పెట్టుబడులు కోటక్ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్

సుందరం ఫైనాన్స్ | బ్రోకరేజ్: ఐడీబీఐ క్యాపిటల్ | కొనొచ్చు

స్టాక్ స్కోప్

ప్రస్తుత ధర: రూ. 4,905 టార్గెట్: రూ. 5,570

ఎందుకంటే: ప్రయివేట్ రంగ ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం సుందరం ఫైనాన్స్ ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. రుణ విడుదలలో వృద్ధి ప్రభావంతో వార్షికంగా, త్రైమాసికవారీగా నిర్వహణలోని ఆస్తుల విలువ(ఏయూఎం) 20 శాతం జంప్‌చేసింది. రుణ మంజూరీ 19 శాతం పుంజుకోవడంతో వివిధ రుణ విభాగాలలో మార్కెట్ వాటా బలపడింది. అయితే ఆస్తుల(రుణాలు) నాణ్యత స్వల్పంగా బలహీనపడింది. అయినప్పటికీ పరిశ్రమలోనే అత్యుత్తమ రుణ నాణ్యతను కలిగి ఉంది. ప్రస్తుత రుణ వసూళ్లు 91 శాతంగా నమోదయ్యాయి. ఆస్తులపై రాబడి(ఈల్డ్) పుంజుకోవడంతో త్రైమాసికవారీగా నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం) 0.4 శాతం మెరుగుపడ్డాయి. దీంతో నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) వార్షికంగా 28 శాతం జంప్‌చేసింది. భవిష్యత్‌లో వడ్డీ రేట్లు దిగివస్తే ఎన్ఐఎం మరింత బలపడవచ్చని భావిస్తున్నాం. వార్షికంగా నిర్వహణ వ్యయాలు 9 శాతానికే పరిమితంకావడంతో ప్రొవిజన్లకు ముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) 36 శాతం ఎగసింది. మూడు రెట్లు అధిక ప్రొవిజన్ల నేపథ్యంలో నికర లాభం వార్షికంగా 16 శాతం వృద్ధి చూపింది. ఈ నేపథ్యంలో త్రైమాసికవారీగా ఆర్‌వోఏ స్థిరత్వాన్ని ప్రదర్శిస్తూ 2.5 శాతంగా నమోదైంది. బడ్జెట్‌లో మౌలికసదుపాయాలకు కేంద్ర ప్రభుత్వ కేటాయింపుల కారణంగా వాణిజ్య వాహన విభాగానికి మద్దతు లభించనుంది. వెరసి ఆటో విడిభాగాల దిగ్గజ గ్రూప్ టీఎస్ఎఫ్‌కు చెందిన సుందరం ఫైనాన్స్ దీంతో లబ్ధి పొందే అవకాశముంది. మరోపక్క వాణిజ్య వాహనేతర విభాగాలలో విస్తరించడంతోపాటు అనుబంధ సంస్థల ప్రోత్సాహకర పనితీరు కంపెనీ షేరుకి ప్రీమియాన్ని ఆపాదిస్తున్నాయి.



పీఐ ఇండస్ట్రీస్ | బ్రోకరేజ్: కీనోట్ క్యాపిటల్స్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,457 టార్గెట్: రూ. 4,477

ఎందుకంటే: ప్రయివేట్ రంగ ఆగ్రో కెమికల్స్ దిగ్గజం పీఐ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో అంచనాలకు అటూఇటుగా ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో ఆదాయం వార్షిక ప్రాతిపదికన నామమాత్ర(0.2 శాతం) వృద్ధి సాధించింది. ఇందుకు ఎగుమతులు 0.7 శాతం క్షీణించడం కొంతమేర ప్రభావం చూపింది. అయితే దేశీ బిజినెస్ 5 శాతం పుంజుకోవడం కొంతమేర ఆదాయంలో వృద్ధికి మద్దతిచ్చింది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు వార్షికంగా 2.24 శాతం నీరసించాయి. ముడిసరుకులతోపాటు.. నిర్వహణా సంబంధ వ్యయాలు మార్జిన్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. అయితే వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ కంపెనీ ఎగుమతి మార్కెట్లలో 2 కొత్త ప్రొడక్టులను వాణిజ్య ప్రాతిపదికన ప్రవేశపెట్టింది. ఈ బాటలో దేశీయంగానూ మరో 2 ప్రొడక్టులను బ్రాండెడ్ బిజినెస్‌లో విడుదల చేసింది. సవాళ్లు విసురుతున్న స్థూల ఆర్థిక వాతావరణంలోనూ అమ్మకాలలో 8–9 శాతం వృద్ధిని కంపెనీ యాజమాన్యం అంచనా వేస్తోంది. భవిష్యత్‌లో పటిష్ట బిజినెస్ మిక్స్ నేపథ్యంలో 26–27 శాతం ఇబిటా మార్జిన్లు సాధించే వీలున్నట్లు విశ్వసిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆగ్రోకెమికల్స్ పరిశ్రమ సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ పటిష్ట మార్జిన్లను అంచనా వేస్తోంది. ఈ ఏడాది క్యూ3లో అంతంతమాత్ర పనితీరు ప్రదర్శించినప్పటికీ సమర్థవంతంగా ప్రణాళికలను అమలు చేయగలదని భావిస్తున్నాం. ఫార్మా విభాగానికి జోష్‌నివ్వడంతోపాటు.. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా చేపట్టే కస్టమ్ సింథసిస్ తయారీ(సీఎస్ఎం) బిజినెస్‌ను క్రమంగా పెంచుకోనుంది. ఈ విభాగంలో మరింత లోతుగా విస్తరించే అవకాశముంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఏంజెల్ వన్ నిఫ్టీ 1డీ రేట్ లిక్విడ్ ఈటీఎఫ్

ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్‌మెంట్ తాజాగా నిఫ్టీ 1డీ రేట్ లిక్విడ్ ఈటీఎఫ్–గ్రోత్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఇది మార్చి 24 వరకు అందుబాటులో ఉంటుంది. ఇది నిఫ్టీ 1డీ రేట్ సూచీని ప్రతిబింబిస్తుంది. కనీసం రూ. 1,000 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఎక్కువగా రిస్కులను ఇష్టపడక, రోజువారీ కాంపౌండెడ్ రాబడులను అందించే సాధనాలను కోరుకునే ఇన్వెస్టర్లకు ఈ ఈటీఎఫ్ అనువుగా ఉంటుంది. ఇది ఓవర్‌నైట్ మెచ్యూరిటీ ఉండే ప్రభుత్వ సెక్యూరిటీలు లేదా ట్రెజరీ బిల్స్ సంబంధ ట్రై-పార్టీ రెపోస్ (టీఆర్ఈపీఎస్)లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇటు ఆదాయం అటు లిక్విడిటీపరంగా ఇది సురక్షితమైన సాధనంగా ఉంటుంది. దీనికి ఎంట్రీ, ఎగ్జిట్ లోడ్ ఉండవు. యూనిట్ల క్రయ, విక్రయాలపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ ఉండదు.



నివా బూపా 'రైజ్' హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ

మధ్యతరగతి వర్గాల ఆదాయాలు, జీవన విధానాలకు అనుగుణంగా ఉండేలా హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ నివా బూపా 'రైజ్' పేరిట ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. స్వయం ఉపాధి పొందుతున్నవారు, చిన్న వ్యాపారాలు చేసే వారు, స్థిరంగా నెలవారీ ఆదాయం ఉండని వర్గాలకు కూడా ఉపయోగపడే విధంగా అందుబాటు ప్రీమియంలతో ఇది ఉంటుంది. ఫ్లెక్సీ–పే బెనిఫిట్ ఫీచరుతో కస్టమర్లు ముందుగా ప్రీమియంలో 20 శాతమే చెల్లించి పాలసీ తీసుకుని, మిగతా మొత్తాన్ని పాలసీ వ్యవధిలో చెల్లించవచ్చు. ఎంత త్వరగా చెల్లించేస్తే అంత ఎక్కువగా డిస్కౌంటు పొందవచ్చు. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చికిత్స పొందినా స్మార్ట్ క్యాష్ బెనిఫిట్‌తో, చికిత్సానంతర వ్యయాల కోసం నిర్దిష్ట మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. ప్రీమియంలో 50 శాతం మొత్తానికి సరిపడేంతగా సమ్ ఇన్సూర్డ్‌ను పెంచే రిటర్న్ బెనిఫిట్, 16 ప్రాంతీయ భాషల్లో డాక్టర్లతో డిజిటల్ కన్సల్టేషన్లు తదితర ప్రయోజనాలను కూడా దీనితో పొందవచ్చు.



దీర్ఘకాలిక పొదుపు కోసం ఐసీఐసీఐ ప్రూ గిఫ్ట్ సెలెక్ట్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ దీర్ఘకాలిక పొదుపు ప్రొడక్టు అయిన ఐసీఐసీఐ ప్రూ గిఫ్ట్ సెలెక్ట్‌ను ప్రవేశపెట్టింది. ఒకవైపు పెట్టుబడిని సంరక్షిస్తూనే మరోవైపు గ్యారంటీ రాబడిని అందించే విధంగా ఇది ఉంటుంది. ఏటా 5 శాతం చొప్పున పెరిగే ఆదాయం ఫీచరును జోడించడం వల్ల ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనడంలో ఇది సహాయకరంగా ఉంటుందని సంస్థ చీఫ్ ప్రొడక్ట్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పల్టా తెలిపారు.



టాటా ఏఐఏ ట్యాక్స్ బొనాంజా కన్జంప్షన్ ఫండ్

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా రెండు ఫండ్స్‌ను ఆవిష్కరించింది. ట్యాక్స్ బొనాంజా కన్జంప్షన్ ఫండ్, ట్యాక్స్ బొనాంజా కన్జంప్షన్ పెన్షన్ ఫండ్ వీటిలో ఉన్నాయి. ఇందులో మొదటిది సంపద సృష్టికి అలాగే ఆర్థిక భద్రతకు తోడ్పడుతుంది. రెండోది, రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక అవసరాల కోసం పొదుపు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. ఈ రెండు న్యూ ఫండ్ ఆఫర్లు మార్చి 31తో ముగుస్తాయి. యూనిట్ ధర రూ. 10గా ఉంటుంది. పెరుగుతున్న వినియోగం వల్ల లబ్ధి పొందే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా వచ్చే ప్రయోజనాలను మదుపరులకు అందించే విధంగా ఈ ఫండ్స్ ఉంటాయి. ప్రధానంగా ఎఫ్ఎంసీజీ, రిటైల్..ఈ–కామర్స్, ఆటోమొబైల్స్.. ప్రీమియం ఉత్పత్తుల రంగాల సంస్థల్లో ఇవి ఇన్వెస్ట్ చేస్తాయి.



మాకూ సైబర్ ముప్పుంది

- భారతీయ ఎగ్జిక్యూటివ్‌లలో 96 శాతం మంది భయం
- ఏఐ వాడకమే ఇందుకు ప్రధాన కారణమని అభిప్రాయం
- క్రోల్ సంస్థ సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సైబర్ ముప్పునకు గురవుతున్న వారిలో అన్ని రంగాల్లోని ప్రముఖులు సైతం ఉంటున్నారు. సాధారణ వ్యక్తులను టార్గెట్ చేయడం కంటే పెద్ద కంపెనీల్లోని కీలక వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు కొట్టేయొచ్చన్న ధోరణిలో ఆన్‌లైన్ మోసగాళ్లు ఉంటున్నారు. దీంతో తమకూ ఆర్థిక నేరాల ముప్పు (ఫైనాన్షియల్ క్రైం రిస్క్) తప్పదన్న ఆందోళనలో భారతీయ కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు ఉంటున్నారు. క్రోల్ సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో ఇదే విషయం వెల్లడైంది. ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 96 శాతం మంది భారతీయ ఎగ్జిక్యూటివ్‌లు ఈ ఏడాది ఫైనాన్షియల్ క్రైం రిస్క్ తప్పదన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా ఈ తరహా దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. ఏఐ ఆధారిత దాడులకు తాము లక్ష్యంగా ఉన్నామని భారత్‌లోని 76 శాతం మంది, ప్రపంచవ్యాప్తంగా 68 శాతం మంది పేర్కొన్నారు. భారతీయ ఎగ్జిక్యూటివ్‌లలో 36 శాతం మంది తమ కంపెనీలు సైబర్ దాడులను ఎదుర్కొనే పటిష్ట వ్యవస్థలు కలిగి ఉన్నట్టు తెలిపారు. కంపెనీల వద్ద సరైన సాంకేతికత లేకపోవడం సైబర్ దాడుల ముప్పు పెరిగేందుకు కారణమని 36 శాతం మంది వెల్లడించారు. అయితే, ఏఐ, మెషీన్ లెర్నింగ్‌తో సానుకూల ప్రభావం ఉంటుందని 32 శాతం మంది.. వీటితో ముప్పు పెరిగిందని 52 శాతం మంది చెప్పారు. కంపెనీలు సైబర్ భద్రత ముప్పును తప్పించుకునే పటిష్ట వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని సర్వేలో పాల్గొన్న 59 శాతం మంది అభిప్రాయపడ్డారు.

'ఇబస్'తో తొలిదశలోనే లంగ్ కేన్సర్ గుర్తింపు

యశోద గ్రూప్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ జి.ఎస్.రావు



సదస్సును ప్రారంభిస్తున్న జీఎస్ రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఊపిరితిత్తుల కేన్సర్‌ను ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఇబస్) విధానం ద్వారా తొలిదశలోనే గుర్తించవచ్చని యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.రావు అన్నారు. హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో ఆదివారం ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్, శ్వాసకోశ (లంగ్) కేన్సర్‌లపై అంతర్జాతీయ శిక్షణ సదస్సు, వర్క్‌షాప్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా పల్మనాలజిస్టులకు శిక్షణ అందించేందుకు అంతర్జాతీయ నిపుణులతో యశోద హాస్పిటల్స్ గ్రూప్ ఈ సదస్సును ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జి.ఎస్.రావు మాట్లాడుతూ.. లంగ్ కేన్సర్‌ను ప్రాథమిక దశలో తెలుసుకోవడానికి 'ఇబస్' అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన చికిత్సా పద్ధతి అని, దేశంలో కొన్ని ఆస్పత్రుల్లోనే ఈ సాంకేతికత అందుబాటులో ఉందని వెల్లడించారు. సీనియర్ పల్మనాలజిస్ట్ వి.నాగార్జున మాట్లాడుతూ దేశంలో పురుషుల మరణాలకు కారణమయ్యే కేన్సర్లలో శ్వాసకోశ కేన్సర్ రెండో స్థానంలో ఉందన్నారు. శ్వాసకోశ వ్యాధులను వెంటనే గుర్తించడం గతంలో కష్టంగా ఉండేదని కానీ, 'ఇబస్' ద్వారా ఈ సమస్యలను వేగంగా పరిష్కరించవచ్చన్నారు. 'ఇబస్' విధానంలో శరీరంపై కోత పెట్టాల్సిన అవసరం లేదని వివరించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన 500 మందికిపైగా పల్మనాలజిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్టీసీ నెత్తిన 'రాయితీ' బండ

బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.4,305.48 కోట్లు ● ఈ మొత్తం మహాలక్ష్మి పథకానికే సరి

రాయితీ బస్‌పాస్‌ల రీయింబర్స్‌మెంట్‌కు నిధులు నిల్ ● ఏటా దాదాపు రూ.400 కోట్ల వరకు ఈ భారం

ఇప్పటివరకు చెల్లిస్తూ వస్తున్న ప్రభుత్వం ● ఇకపై ఈ భారం కూడా ఆర్టీసీ మోయాల్సిందే

సాక్షి, హైదరాబాద్: రాయితీ బస్‌పాస్.. విద్యార్థులు, నాన్ గెజిటెట్ ఉద్యోగులు, వికలాంగులు, పాత్రికేయులు వంటి వారికి ఆర్టీసీ తక్కువ మొత్తానికి జారీచేసే కార్డు. కొంతమందికి ఉచితంగా కూడా ఇస్తోంది. ఈ బస్‌పాస్‌లు ఇకపై ఉంటాయో ఉండవో తెలియని పరిస్థితి నెలకొంది. ఇంతకాలం ఈ పాస్‌ల ద్వారా ఆర్టీసీ కోల్పోతున్న ఆదాయాన్ని ప్రభుత్వం తిరిగి ఆర్టీసీకి చెల్లిస్తూ వస్తోంది. ఇప్పుడు ఆ భారాన్ని ప్రభుత్వం వదిలించుకున్నట్టు కనిపిస్తోంది. ఫలితంగా దాన్ని ఆర్టీసీ మోయాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి ఇది పెద్ద భారమే కాబోతోంది. తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం ఆర్టీసీకి రూ.4,305.48 కోట్లు కేటాయించింది. ఇందులో నేరుగా రూ.3,082.53 కోట్లు, ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి రూ.852.09 కోట్లు, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.370.86 కోట్లు ప్రతిపాదించింది. రాయితీ బస్‌పాస్‌లకు తిరిగి చెల్లించే (రీయింబర్స్‌మెంట్) మొత్తంపై ప్రస్తావనే లేదు.

అన్నింటికీ మహాలక్ష్మి నిధులే..

రీయింబర్స్‌మెంట్ విషయాన్ని ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆర్థిక శాఖ వద్ద వాకబు చేస్తే, మహాలక్ష్మి పథకానికి కేటాయించిన నిధుల నుంచే వాడుకోవాలని సూచించినట్టు తెలిసింది. బడ్జెట్‌లో కేటాయించిన మొత్తాన్ని బట్టి నెలకు రూ.358 కోట్లు ఆర్టీసీకి అందుతున్నట్టు లెక్క. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ కోల్పోతున్న ఆదాయం సగటున నెలకు రూ.350 కోట్లు ఉంటోంది. అంటే ప్రభుత్వం ఇచ్చే మొత్తం దానికే సరిపోతుంది. కానీ, రాయితీ బస్‌పాస్‌ల ద్వారా ఏటా ఆర్టీసీ కోల్పోతున్న ఆదాయం దాదాపు రూ.400 కోట్లు. గతంలో ఈ మొత్తం రూ.680 కోట్ల వరకు ఉండేది. మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చాక వారికి బస్‌పాస్‌లు అవసరం లేకుండా పోయాయి. దీంతో ఆమేర తగ్గింది. గతంలో బస్‌పాస్‌ల రాయితీ మొత్తంతోపాటు కొత్త బస్సుల కొనుగోలుకు కొద్దిగా గ్రాంటు కూడా బడ్జెట్‌లో కేటాయించే పద్ధతి ఉండేది. ఇప్పుడు ఆ గ్రాంటు కూడా మాయమైంది.

నిధులు పెరిగినా కష్టాలే..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీకి బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో పోలిస్తే ప్రస్తుతం మూడు రెట్లు పెరిగాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం తన చివరి రెండు బడ్జెట్‌లలో రూ.1,500 కోట్ల చొప్పున కేటాయించింది. ఇప్పుడు నిధులు భారీగా పెరిగినా.. అదనంగా ఉపయోగపడే వీలు లేకుండా పోయింది. గతంలో ఆర్టీసీ 15 లక్షల వరకు రాయితీ బస్‌పాస్‌లు జారీ చేసేది. మహాలక్ష్మి పథకంతో వాటి సంఖ్య 10 లక్షలకు తగ్గినట్టు అంచనా. పాస్‌లు కొనేవారు బస్‌పాస్ ధరలో 40% చెల్లిస్తుండగా, ఆర్టీసీ 60 శాతం భరిస్తోంది. ఇప్పుడు ఆ 60 శాతం ప్రభుత్వం నుంచి రాకపోతే ఆర్టీసీనే భరించాల్సి ఉంటుంది. అంటే దాదాపు రూ.400 కోట్లు ఆర్టీసీకి అదనపు భారంగా మారబోతోంది. దీన్ని తప్పించుకోవాలంటే సంస్థ రాయితీ వాటాను తగ్గించటమో, క్రమంగా బస్‌పాస్‌లను ఉపసంహరించటమో చేయాల్సి ఉంటుందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. అసలే నష్టాల్లో ఉన్న ఆర్టీసీపై ఇలా భారం మోపటం సరికాదని, బస్‌పాస్ రాయితీ ప్రభుత్వమే భరించాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కాచారంలో ఉన్న నిలువురాళ్లు

ఇక్కడా నిలువు రాళ్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల ఆదిమ మానవుడి ఆనవాళ్లు

- చారిత్రక సంపదను ప్రభుత్వం పరిరక్షించాలంటున్న పరిశోధకులు
- రియల్ దెబ్బకు మాయమవుతున్న నిలువురాళ్లు, రాకాసి గుళ్లు

ఆదిమ కాలపు ఆనవాళ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. చరిత్ర గొప్పదనం తెలియక, తమ అవసరాల కోసం కొందరు చారిత్రక కట్టడాలను తొలగించి చదును చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిలువురాళ్లు, రాకాసిగుళ్లు వంటి ఆదిమ మానవుడి సమాధులు, చరిత్ర పూర్వ యుగపు ఆనవాళ్లు కనిపించకుండా పోతున్నాయి. ఇటీవల నారాయణపేట జిల్లా ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం పంపనున్న తాత్కాలిక జాబితాలో చోటు దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముడుమల్‌లో ఉన్న నిలువు రాళ్లను పోలిన రాళ్లు యాదాద్రి భువనగిరిజిల్లాలో ఉన్నాయి. వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇక్కడి ఆదిమానవుల సమాధులను రైతులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పెద్దఎత్తున తొలగించారు. ఏళ్ల చరిత్రను తెలిపే అరుదైన సంపదను రక్షించాలని చరిత్ర పరిశోధకులు ప్రభుత్వాలను కోరుతున్నారు.


– సాక్షి, యాదాద్రి

4 వేల సంవత్సరాల క్రితం నాటివి..

ఆదిమ మానవుని సమాధులు పలు చోట్ల ఇప్పటికీ కనిపిస్తున్నాయి. వ్యవసాయ భూముల సేద్యం, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రైల్వే ట్రాక్‌లు, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, ఇతర ప్రజాప్రయోజనకర నిర్మాణాల నేపథ్యంలో అవి కనుమరుగు అవుతున్నాయి. భువనగిరి, రాయిగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, ఇక్కుర్తి, చల్లూరు, కొలనుపాక, గొలనుకొండ, లక్ష్మక్కపల్లి, బచ్చన్నపేట, కొడవటూరు, కొల్లూరు, రాచకొండ గుట్టల్లో రాకాసి గుళ్లు ఉన్నాయి. వీటి వయసు 4 వేల సంవత్సరాల క్రితం నాటివని తెలుస్తోంది.

కొత్త రాతియుగం నాటి నిలువురాళ్లు

ముడుమల్‌లో బయటపడిన నిలువు రాళ్లవంటివి యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కాచారం, వలిగొండ గుట్ట ప్రాంతంలో ఉన్నాయి. ఆదిమ మానవుని సమాధులతోపాటు ఇవీ ఉన్నాయి. ప్రస్తుత కాలానికి 8 వేల సంవత్సరాల క్రితమే వీటిని ఏర్పాటు చేశారు. ఇది ఆదిమ మానవుని సమాధికి సూచిక. ఆది మానవుల సమాధులను 12 రకాలుగా వర్గీకరించారు. అందులో ఇదొకటి. ఆలేరు దగ్గరలో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాచారం వద్ద నిలువురాళ్లు ఉన్నాయి. ఇతర రకాల (డోలమైన్, కైరన్లు, సిస్టులు)సమాధులు ఉన్నాయి. కొత్త రాతియుగం మధ్యరాతి యుగం, పాతరాతియుగం నాటి రాతి పనిముట్ల ఆనవాళ్లు ఉమ్మడి జిల్లాలోని మూసీనది వెంట వాడపల్లి వరకు, రాచకొండ గుట్టల్లో, భువనగిరి మండలం వడపర్తి, జనగామ, వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లలో మధ్య యుగాల నాటి యుద్ధాల దృశ్యాలు ఉన్నాయి. వీటితోపాటు ఆనాటి జీవన విధానం, వేటను తెలిపే రాతి చిత్రాలు ఉన్నాయి.



ఆలేరు మండలం ఇక్కుర్తిలో నిలువురాళ్లు, ఆదిమ మానవుని సమాధులు

నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాలి

ముడుమల్ నిలువు రాళ్లను పోలిన రాళ్లు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్నాయి. నిజాం కాలంలో హైదరాబాద్ నుంచి ఖాజీపేట రైల్వే మార్గం వేసే సమయంలో వందలాది రాకాసిగుళ్లు తవ్వేశారు. నిజాం ఆర్కిటెక్టర్ గులాం యజ్దీ ఈ విషయాన్ని వెల్లడించారు. దక్కన్ ప్రాంతంలో 10 లక్షల సమాధులు తొలగించారని 1920లో ఫ్రెంచ్ శాస్త్రవేత్త డాక్టర్ హంట్ తన పుస్తకంలో పేర్కొన్నారు. సమాధులు పూర్వ యుగపు చరిత్ర ఆనవాళ్లు. ప్రభుత్వం పురా మానవుల చరిత్రను చెరిపి వేయకుండా భద్రపర్చాలి.

– శ్రీరామోజు హరగోపాల్, కొత్త తెలంగాణ చరిత్ర పరిశోధకుడు

కాలాలు, వాతావరణ మార్పుల గుర్తింపునకు..

కాలాలను గుర్తించడానికి ఆదిమ మానవులు నిలువురాళ్లను ఓ క్రమంలో ఏర్పాటు చేసినట్టు చారిత్రక పరిశోధకులు, ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఎలాంటి సాంకేతికత లేని 4 వేల ఏళ్ల క్రితమే రాళ్ల ద్వారా తెలుసుకోవడం అనేది అబ్బురపరిచే విషయం.

భూటాన్ అభివృద్ధిలో భారత్ పాత్ర మరువలేనిది

భూటాన్‌లో భారత రాయబారి సుధాకర్ దలైలా

సాక్షి, హైదరాబాద్: భారత్, భూటాన్ దేశాల మధ్య గొప్పగా సత్సంబంధాలు కొనసాగుతున్నాయని భూటాన్ ప్రభుత్వ భారత రాయబారి సుధాకర్ దలైలా అన్నారు. ఇంటర్నేషనల్ హ్యాపీనెస్ డే సందర్భంగా భూటాన్ రాజధాని థింపులో జరిగిన సదస్సుకు భారత ప్రతినిధుల బృందం హాజరైంది. అనంతరం ఈ బృందం భూటాన్ రాయబారితో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా భారత్, భూటాన్ దేశాల సత్సంబంధాలు, ఇతర అంశాలపై చర్చించారు. భూటాన్ భారత రాయబారి సుధాకర్ దలైలా మాట్లాడుతూ ప్రతి మనిషి సంతోషంగా ఉండే విధంగా భూటాన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. భూటాన్ అభివృద్ధిలో భారత్ పాత్ర మరువలేనిదన్నారు. అసోసియేషన్ ఆఫ్ బుద్దిస్ట్ టూర్ ఆపరేటర్స్ (ఏబీటీవో) అంతర్జాతీయ అధ్యక్షుడు మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే బుద్దిస్ట్ పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. భూటాన్ అభివృద్ధిలో భాగంగా పౌర సమాజాన్ని భాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూజీసీ మాజీ చైర్మన్ ఎస్.కె.తోరట్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆర్.లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.




భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్సవం కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



ఆదివారం కేరళ రాజధాని తిరువనంతపురంలో జరిగిన దళిత ప్రగతి సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క, ఇతర నేతలు

అయ్యో పాపం

- యథేచ్ఛగా భ్రూణహత్యలు..
- కడుపులోనే కరిగించేస్తున్నారు
- ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు.. అమ్మాయిలు 932 మందే..
- ఏడు జిల్లాల్లో 915 కంటే దిగువన బాలికలు
- నగరాలు, పట్టణాల్లోనే బాలికల పుట్టుక తక్కువ
- మారుమూల, గిరిజన ప్రాంతాల్లోనే ఆడశిశువులు ఎక్కువ
- ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు



సాక్షి ప్రతినిధి, వరంగల్: పుట్టబోయేది అమ్మాయో, అబ్బాయో చెప్పడమే కాకుండా.. ఆడపిల్ల వద్దనుకుంటే అబార్షన్ చేయించే ముఠాలు వరంగల్‌లో పుట్టుకొచ్చాయి. హనుమకొండ ఆసుపత్రిలో ఏఎన్ఎంగా పనిచేసే ఒకరు, వరంగల్ కాశీబుగ్గలో ల్యాబ్ టెక్నీషియన్, మరో స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు కలిసి ఓ మహిళకు అబార్షన్ చేయగా హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు.

- కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని ఓ నర్సింగ్‌హోంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన ఓ మహిళకు ఆరు నెలల కిందట అబార్షన్ చేశారు. అబార్షన్‌కు కారణం కేవలం ఆమె కడుపులో ఆడ శిశువు పెరుగుతోందని స్కానింగ్‌లో తేలడం. ఈ విషయం బయటకు పొక్కడంతో పోలీసులు ఇందుకు కారణమైన ఒక ఆర్ఎంపీ, ఆసుపత్రి నిర్వాహకులు, కాంపౌండర్, నర్సులపై కేసు నమోదు చేసి నర్సింగ్‌హోంను సీజ్ చేశారు.
- సూర్యాపేట జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణపై ఇటీవల తనిఖీలు నిర్వహించి.. 94 ప్రైవేటు ఆసుపత్రులను తాత్కాలికంగా మూసివేశారు. 50 అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపైనా నిఘా పెట్టారు. రెండు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తున్న వైద్యులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసులు నమోదు చేసి అరెస్టు కూడా చేయించారు.

ఇలా తెలంగాణ వ్యాప్తంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో అనేకం జరుగుతున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తున్నా.. ఆడపిల్లలపై వివక్ష మాత్రం తగ్గడం లేదు. ఆడపిల్లల పుట్టుక మాత్రం ఇంకా పోరాటమే అవుతోంది. రాష్ట్రంలో యథేచ్ఛగా భ్రూణహత్యలు కొనసాగుతున్నాయి. జిల్లా, మండల కేంద్రాల్లోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లలో అడ్డగోలుగా సాగుతున్న లింగ నిర్ధారణ పరీక్షలు ఆడపిల్లల సంతతిని ఎదగనివ్వడం లేదు. ఇటీవల విడుదల చేసిన తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ – 2024 గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో ప్రతి 1000 మంది మగ శిశువులకు.. 932 మంది మాత్రమే ఆడ శిశువులున్నారు. 2017 నాటి ఈ సంఖ్య పెరగాల్సి ఉండగా ఏడేళ్లు గడిచినా 932గానే ఉంది.

అక్కడ అలా... ఇక్కడ ఇలా..

తాజా గణాంకాలను పరిశీలిస్తే.. అక్షరాస్యత, సామాజిక బాధ్యత తెలిసిన నగరాలు, పట్టణాల్లో ఆడపిల్లల రేషియో అత్యంత తక్కువగా ఉంది. అదే గిరిజన, మారుమూల ప్రాంతాలు, జిల్లాల్లో మాత్రం ఆడపిల్లల సగటు ఎక్కువగానే ఉంది. ఆడ శిశువుల సంఖ్య తక్కువగా (ప్రతి 1000 మంది మగ శిశువులకు...) ఉన్న ఐదు జిల్లాల జాబితాలో హైదరాబాద్ (914) కూడా ఉంది. వనపర్తి, మహబూబాబాద్‌లలో ఆడపిల్లల సగటు 903 కాగా.. ఆ తర్వాత నాగర్‌కర్నూల్ (909), మంచిర్యాల (911) జిల్లాలున్నాయి. ఆడపిల్లలు ఎక్కువగా ఉన్న ఐదు జిల్లాల్లో ములుగు (971), భద్రాద్రి కొత్తగూడెం (964), సంగారెడ్డి (955), నిజామాబాద్ (953), సిద్దిపేట (952)లు నిలిచాయి. ఆడపిల్లల సగటు 915 లోపున్న జిల్లాల జాబితాలో మహబూబాబాద్, వనపర్తి, నాగర్‌కర్నూల్, మంచిర్యాల, హైదరాబాద్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి తదితర ఏడు జిల్లాలున్నాయి. ఈ జిల్లాల్లో గర్భస్థ ఆడ శిశువులను పిండదశలోనే విచ్ఛిన్నం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

పుట్టగొడుగుల్లా స్కానింగ్ కేంద్రాలు..

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను బహిర్గతం చేయడం, పిండ దశలోనే హత్య చేయడం చట్ట విరుద్ధం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే బాధ్యులకు జైలుశిక్ష, జరిమానా విధించేందుకు చట్టం అవకాశం కల్పిస్తున్నా.. అది అమలు కావడం లేదు. రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా వందల సంఖ్యలో స్కానింగ్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పెద్ద మండల కేంద్రాల నుంచి పట్టణాలు, జిల్లా కేంద్రాలతోపాటు హైదరాబాద్‌లో వేల సంఖ్యలో ఇవి పుట్టగొడుగుల్లా వెలిశాయి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో కొన్ని నర్సింగ్‌హోమ్‌లు లింగ నిర్ధారణ, అబార్షన్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీలను తమకు అనుకూలంగా మలచుకుంటున్నాయి. ఆడ బిడ్డ అని తేలితే నిర్దాక్షిణ్యంగా భ్రూణ హత్యకు తెగబడుతున్నారు. స్కానింగ్ చేయడానికి రూ.10 వేలు, ఆడపిల్ల అని తేలితే అబార్షన్ చేయడానికి మరో రూ.30 వేలు.. ఆపైన వసూలు చేస్తున్నారు. స్కానింగ్, ఫెర్టిలిటీ సెంటర్లపై నియమించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పెక్షన్ అండ్ మానిటరింగ్ కమిటీలు ఇటీవల ముమ్మరంగా పర్యటిస్తున్నా దందా ఆగడం లేదు. అయితే ఇప్పటికైనా గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం–1994, రూల్స్ 1996లను కఠినంగా అమలయ్యేలా చూడాల్సి ఉంది.

లింగనిర్ధారణ పరీక్షలపై సీరియస్..

కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్‌ల విషయంలో సీరియస్‌గా ఉంది. పీసీ, పీఎన్‌డీటీ, ఎంటీపీ యాక్ట్‌ల ప్రకారం తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. చట్టం ఉల్లంఘిస్తున్న వారి వివరాలను 181, 104, 1098 లేదా డయల్ 100కి తెలియజేయాలి.

– డాక్టర్ అప్పయ్య, డీఎంహెచ్‌వో, హనుమకొండ

రాష్ట్రంలో మొత్తం జనాభా: **3,50,03,674**

పురుషులు **1,76,11,633**

మహిళలు **1,73,92,041**

0-6 ఏళ్లలోపు పిల్లలు **38,99,166**

ఆడ శిశువుల సంఖ్య, (సగటు) **18,81,231 (932)**

ఆడ శిశువుల సంఖ్య తక్కువగా ఉన్న ఐదు జిల్లాలు

(ప్రతి 1000 మంది మగ శిశువులకు)

జిల్లా	ఆడ శిశువుల నిష్పత్తి
వనపర్తి	903
మహబూబాబాద్	903
నాగర్‌కర్నూలు	909
మంచిర్యాల	911
హైదరాబాద్	914

ఆడ శిశువుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఐదు జిల్లాలు

(ప్రతి 1000 మంది మగ శిశువులకు..)

జిల్లా	ఆడ శిశువుల నిష్పత్తి
ములుగు	971
భద్రాద్రికొత్తగూడెం	964
సంగారెడ్డి	955
నిజామాబాద్	953
సిద్దిపేట	952

ఉమ్మడి వరంగల్‌లో ఆడ శిశువుల నిష్పత్తి...

1991	977
2001	955
2011	912
2024 ('అట్లాస్'గణాంకాల ప్రకారం)	910.83



కోదాడలో ఘనంగా ఇఫ్తార్ విందు

ఆదివారం కోదాడలోని స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ జబ్బార్ నివాసంలో జరిగిన ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఎమ్మెల్యే పద్మావతి తదితరులు



హైకోర్టు తీర్పును అమలు చేయాలి : ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం

సాక్షి, అమరావతి : ప్రాజెక్టుల పేరుతో భూములు సేకరించిన ప్రాంతాల్లో 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారంతో పాటు.. వ్యవసాయ కార్మికులకు పునరావాసం, పునర్నిర్మాణం చేపట్టాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం హర్షం వ్యక్తం చేసింది. శనివారం హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలంటూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

చలువ పందిళ్లు.. అరటి ఆకులు.. మట్టి గ్లాసులు



కొబ్బరి కొమ్మలతో వేసిన పందిళ్లు



అరటి ఆకులో భోజనం, మట్టి గ్లాసుల్లో తాగునీరు

చీపురుపల్లి : ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టాలని, పర్యావరణ హిత వస్తువులనే వాడాలని చాలామంది చెబుతుంటారు. కానీ ఆచరించేవారు మాత్రం తక్కువమందే. విజయనగరం జిల్లా చీపురుపల్లి పట్టణంలోని వంగపల్లిపేటకు చెందిన మిరియా రాంబాబు, అనురాధ దంపతులు వారి నివాసంలో నూతన వస్త్రాలంకరణ మహోత్సవం పేరిట ఓ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బంధువులు, స్నేహితులను పెద్ద సంఖ్యలో పిలిచారు. వచ్చిన వారందరూ ఆశ్చర్యపడేలా ఆదర్శప్రాయంగా వేడుక నిర్వహించారు. వేడుకలో ఎక్కడా ప్లాస్టిక్ వినియోగించకుండా అందరి మన్ననలు పొందారు. కొబ్బరి కమ్మలతో చలువ పందిళ్లు వేశారు. అరటి ఆకుల్లో భోజనం వడ్డించారు. మట్టి గ్లాసుల్లో నీరు అందించారు. ఓ వస్త్రంపై వేడుక ఆహ్వానాన్ని రాయించారు. ఇలా సాంప్రదాయ పద్ధతిలో వేడుక నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు.

పడిపోతే.. ఫట్

మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. ముఖ్యంగా శరీర నిర్మాణానికి ఆధారంగా నిలిచే ఎముకలు చాలా త్వరగా పటుత్వాన్ని కోల్పోతున్నాయి. చిన్నగా కాలు తడబడి కింద పడితే చాలు.. ఫట్‌మంటూ విరిగిపోతున్నాయి. ఇక ద్విచక్ర వాహనాల పైనుంచి పడితే మల్టిపుల్ ఫ్రాక్చర్లు అవడం అనేది సర్వసాధారణంగా మారిపోతోంది. చిన్నారుల నుంచి మూడు పదుల వయస్సు కూడా నిండని యువతలో సైతం ఎముకలు పటుత్వం తగ్గుతోంది. ఎముకలు గుల్లబారడం, బలహీనపడటం, తేలికగా విరిగిపోయే స్థితిని వైద్య పరిభాషలో (ఆస్టియోపారోసిస్) అంటారు. పౌష్టికాహార లోపం, వయోభారం, కాల్షియం, డి-విటమిన్ లోపం దీనికి ప్రధాన కారణాలని ఆర్థోపెడిక్ సర్జన్లు (ఎముకల శస్త్రచికిత్స నిపుణులు) చెబుతున్నారు. వీటికి తోడు హార్మోన్ల అసమతుల్యత, వారసత్వ (జెనిటిక్) ప్రభావం, మద్య పానం, ధూమపానం, శారీరక వ్యాయామం లేకపోవడం కూడా ఎముకల ఆరోగ్యంపై ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

-సాక్షి ప్రతినిధి, కాకినాడ

- గుల్లబారుతున్న ఎముకలు
- వృద్ధులే కాదు.. యువతలోనూ సమస్య
- ఆస్టియోపారోసిస్‌తో ప్రమాద ఘంటికలు
- ప్రతి ఐదుగురు మహిళల్లో ఇద్దరికి ముప్పు
- పోషకాహార లోపం, మారుతున్న జీవనశైలి కారణం



కాకినాడ ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ వార్డులో రోగులు



ఎముక పటుత్వాన్ని పరీక్షిస్తున్న నిపుణులు

అప్రమత్తతే ఆయుధం

చిన్నచిన్న గాయాలైనప్పుడు తక్కువ ఒత్తిడితో కూడా ఎముకలు విరిగిపోతుంటాయి. నడుము, వెన్నెముక, కాళ్లలో దీర్ఘకాలిక నొప్పులు, వెన్నెముక దెబ్బతినడం, ఎముకలు కుచించుకుపోయి ఎత్తు, పొడవు తగ్గడం, నడుము, మోకాళ్లు, భుజాల జాయింట్లలో నొప్పి, నిస్సత్తువ వంటి లక్షణాలున్న వారు వైద్యుల సూచనల మేరకు తప్పనిసరిగా తగిన పరీక్షలు చేయించుకోవాలి. ముఖ్యంగా బోన్ మినరల్ డెన్సిటీ (బీఎండీ), ఎముకల క్షీణతను గుర్తించే ఎక్స్‌రే, ఎంఆర్‌ఐ స్కాన్, కాల్షియం, విటమిన్–డి స్థాయి అంచనా వేసేందుకు రక్త, మూత్ర పరీక్షల వంటివి తప్పనిసరి అని వైద్యులు చెబుతున్నారు. 50 ఏళ్ల వయస్సు దాటిన మహిళలు, 65 ఏళ్లు పైబడిన పురుషులు ఆరు నెలలకోసారి వైద్యులను సంప్రదించి, ఈ పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబంలో ఎవరికైనా ఆస్టియోపారాసిస్ ఉన్నా, నీడ పట్టున, ఏసీలలో ఎక్కువ సమయం గడిపే ఉద్యోగులు, ఇతర వర్గాలు, ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్న వారు, హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపంతో వివిధ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు కచ్చితంగా తగిన పరీక్షలు చేయించుకుకోవాలి.

యువతలో సైతం..

ఒకప్పుడు ఆరు పదుల వయస్సు మీద పడినా చాలా మందిలో ఎముకలు బలహీన పడట మనే సమస్య ఉండేది కాదు. మారిన జీవన విధానంతో ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా ఆహార విధానంలో వస్తున్న మార్పులు ఎముకల పటుత్వాన్ని దెబ్బ తీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. అందువల్లనే ఈ సమస్య ఇప్పుడు అన్ని వయస్సుల వారిలోనూ కనిపిస్తోందని అంటున్నారు. యువతలో ఈ సమస్య ఉంటే జువైనల్ ఆస్టియోపారోసిస్ అని వైద్య పరిభాషలో పిలుస్తారు. ఆహారంలో పోషకాల లోపం ఉండటం, రోడ్డు పక్కన ఆహారం, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, హార్మోన్లు అవసరమైన స్థాయిలో ఉత్పత్తి కాకపోవడం, స్టెరాయిడ్ల వంటి మందులు అధికంగా వినియోగించడం, రుమటాయిడ్ ఆర్థరైటిస్, లూపస్ వంటి వ్యాధుల బారిన పడిన యువతీయువకులు ఎముకల పటుత్వం కోల్పోతున్నారని వైద్యులు నిర్ధారించారు. కాల్షియం లోపంతో పుట్టడం వలన కూడా ఎముకలు గుల్లబారుతుండటం ఇటీవల ఎక్కువైందని ఇటీవల కాకినాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగ వైద్యుల పరిశీలనలో తేలింది.

మహిళల్లో సైతం..

యువత తరువాత ఈ సమస్య మహిళల్లో తీవ్రంగా కనిపిస్తోందని వైద్యులు నిర్ధారించారు. ప్రతి ఐదుగురు మహిళల్లో కనీసం ఇద్దరు ఆస్టియోపారోసిస్‌తో బాధ పడుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా 50 సంవత్సరాలు దాటిన మహిళల్లో రుతుచక్రం ఆగిపోయే (మెనోపాజ్) దశలో ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతూంటుంది. దీనివలన ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. అదే పురుషుల్లో అయితే 60 సంవత్సరాలు దాటిన వారిలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. మహిళల్లోనే ఎక్కువగా ఎముకలు గుల్లబారడానికి హార్మోన్ల లోపం, శారీరక నిర్మాణం, జీవనశైలి ప్రధాన కారణాలని వైద్యులు చెబుతున్నారు. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఎముకలు సన్నగా, సున్నితంగా ఉండటం కూడా మరో కారణమని అంటున్నారు. గర్భిణుల్లో ఉండే కొద్దిపాటి కాల్షియాన్ని గర్భంలో ఉండే బిడ్డకు కూడా అందుతుంటుంది. దీనివల్ల కూడా వారిలో ఎముకల పటుత్వం తగ్గుతుంది. అలాగే, పిల్లలకు పాలిచ్చే సమయంలో పోషకాహారం లేకపోవడంతో శరీరంలో కాల్షియం నిల్వలు తగ్గిపోయి, ఎముకలు గుల్లబారుతుంటాయి. పాలిసిస్టిక్ ఓవరీ డిజార్డర్ (పీసీఓడీ), థైరాయిడ్, గర్భాశయ తొలగింపు (హిస్టరెక్టమీ) వంటి వాటి వలన హార్మోన్లలో విపరీతమైన అసమతుల్యత ఏర్పడి, మహిళల్లో ఎముకలు గుల్లబారుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ప్రతి నెలా 3 వేల మంది పైనే..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి (జీజీహెచ్) ఎంతో ప్రధానమైనది. ఇక్కడకు కోనసీమ, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచే కాకుండా పొరుగున ఉన్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం అనేక మంది చికిత్స కోసం వస్తుంటారు. కేవలం ఈ ఒక్క ఆసుపత్రికే ప్రతి నెలా 3 వేల మందికి పైగానే రోగులు ఎముకల సంబంధిత సమస్యలతో వస్తున్నారు. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కూడా కలిపితే ఈ సంఖ్య మరింత అధికంగా ఉంటుంది. దీనినిబట్టి సమస్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



నిర్లక్ష్యం చేయకండి



ఎముకల బలహీనత ఉందనే అనుమానం ఎవరికైనా ఉంటే తక్షణం కాకినాడ జీజీహెచ్‌కు రావాలి. బీఎండీ పరీక్షలు జీజీహెచ్‌లో ఉచితంగా చేస్తున్నాం. మందులు ఉచితంగా అందిస్తున్నాం. బీఎండీ పరీక్షల కోసం ప్రత్యేక క్యాంపులు కూడా నిర్వహిస్తున్నాం. ఆస్టియోపారాసిస్ చిన్న సమస్య అని నిర్లక్ష్యం చేయకండి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల జీవిత కాలాన్ని కూడా ఇది ప్రభావితం చేస్తుంది. కాల్షియం, విటమిన్–డి ఉన్న పోషకాహారం తీసుకోవాలి. అధిక ప్రొటీన్ ఉండే ఆహారంతో పాటు సూర్యరశ్మిలో గడపడం, తగినంత నిద్ర మేలు చేస్తాయి. వయస్సును బట్టి కనీసం ఏడు గంటల నిద్ర ఉండాలి. వయస్సుతో సంబంధం లేకుండా వ్యాయామాలు కచ్చితంగా చేయాలి.

- డాక్టర్ ఎం.పాండురంగ విఠల్, ఆర్థోపెడిక్ విభాగాధిపతి, జీజీహెచ్, కాకినాడ

ఏడు నెలలుగా ఎముకల సమస్యలతో కాకినాడ జీజీహెచ్‌కు వచ్చిన రోగులు

నెల	రోగులు
2024 ఆగస్టు	2,891
సెప్టెంబర్	3,001
అక్టోబర్	3,169
నవంబర్	2,929
డిసెంబర్	3,315
2025 జనవరి	3,474
ఫిబ్రవరి	3,602

విద్యారంగ ఆర్థిక సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే బకాయిలు చెల్లించాలి
- రాజమహేంద్రవరంలో యూటీఎఫ్ పోరుబాట



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: విద్యారంగంలో పేరుకుపోతున్న ఆర్థిక సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ తలపెట్టిన పోరుబాటలో భాగంగా రాజమహేంద్రవరంలోని శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం విద్యా సదస్సు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిల చెల్లింపులపై సరైన శ్రద్ధ చూపించడం లేదని అన్నారు. 29 శాతం ఐఆర్ ప్రకటించి, 12వ పీఆర్‌సీ వేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రకటన ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు తక్షణమే పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు డీఏలు, పీఆర్‌సీ ఎరియర్లు, సరెండర్ లీవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఎప్పటిలోగా చెల్లిస్తారో రోడ్ మ్యాప్ తెలియజేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరుబాట ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ పాఠశాలలు ఉనికి కోల్పోతున్నాయన్నారు. భవిష్యత్తులో మోడల్ పాఠశాలల పేరుతో గ్రామాల్లోని చాలా పాఠశాలలను ఎత్తివేసే యోచనతో ప్రభుత్వం ఉందన్నారు. గ్రామాల్లో కామన్ పాఠశాలలు ఉండాలని, విద్యారంగానికి జీడీపీలో 6 శాతం నిధులు ఖర్చు చేయాలని ఎన్నో సూచనలు చేసిన కొఠారి కమిషన్ నివేదికను ప్రభుత్వాలు ఆచరించటం లేదన్నారు. ఊరి బడిని బతికించుకోవటానికి ఉపాధ్యాయులంతా నడుం కట్టాలన్నారు. అందుకోసం పిల్లలు, పిల్లల తల్లిదండ్రులతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా విధానానికి పాలకులు పెద్దపీట వేయాలన్నారు. పోరాటాల ద్వారా మాత్రమే ఉపాధ్యాయుల హక్కుల సాధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తోటకూర చక్రవర్తి, అరుణకుమారి, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో విద్యుత్ కనెక్షన్లు కట్




పోట్లమర్రి ఎస్సీ కాలనీలో విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తున్న అధికారులు

బత్తలపల్లి: ఎస్సీ కాలనీల్లో గృహావసరాలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం. అయితే.. 200 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించారంటూ అధికారులు కనెక్షన్లు కట్ చేసిన సంఘటన శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని పోట్లమర్రి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోట్లమర్రి ఎస్సీ కాలనీవాసులు తెలిపిన సమాచారం మేరకు..కాలనీలో 20 మందికి పైగా లబ్దిదారుల ఇళ్లకు 200 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగం జరిగిందని, వీరంతా రూ.5 వేల నుంచి రూ.8వేల వరకు బకాయిలు పడ్డారని ఆదివారం విద్యుత్ అధికారులు దాదాపు 12 మంది గ్రామానికి చేరుకుని కనెక్షన్లు కట్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2020 సంవత్సరంలో కూడా ఇలాగే సమస్య ఎదురైతే అప్పటి అనంతపురం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించుకున్నామన్నారు. అప్పటి నుంచి ఎటువంటి ఇబ్బందులూ లేవని, ఇప్పుడు మరోసారి అదేవిధంగా అధిక బిల్లులు వచ్చాయని విద్యుత్ అధికారులు కనెక్షన్లు కట్ చేశారని వాపోయారు. అప్పటి విద్యుత్ బిల్లులు కూడా ఇప్పుడు చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నారని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి సోమవారం తీసుకువెళతామని తెలిపారు.

గోడౌన్లను కూల్చేసిన టీడీపీ శ్రేణులు

వైఎస్సార్ జిల్లాలో ఘటన



టీడీపీ వర్గం వారు కూల్చివేసిన గోడౌన్లు

గోపవరం : వైఎస్సార్ జిల్లా గోపవరం మండలం గోపవరం ప్రాజెక్టు సైట్ కో-ఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీలో ఉన్న గోడౌన్‌లను టీడీపీ శ్రేణులు ఆదివారం జేసీబీలతో కూల్చివేశాయి. అడ్డుకునేందుకు ప్రయత్నించి స్థానికులపై కేసులు పెడతామంటూ బెదిరించాయి. దీంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వారు ఉండిపోయారు. గోపవరం ప్రాజెక్టు సైట్ కో-ఆపరేటివ్ ఫార్మింగ్ సొసైటీ పరిధిలో 1200 ఎకరాల భూములున్నాయి. దాదాపు 200 మంది సభ్యులున్నారు. పంటలను ఈ గోడౌన్‌లలో నిల్వ చేసుకునేందుకు అప్పట్లో నిర్మించారు. దాదాపు 60 ఏళ్లు గడిచిపోయాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 2021లో సొసైటీని రద్దు చేసి ఏపీఐఐసీకి 500 ఎకరాలకు కేటాయిస్తూ.. మిగిలిన భూములను సొసైటీ పరిధిలోని 200 మంది సభ్యులకు రెండెకరాలు చొప్పున, నాన్ సభ్యులకు ఎకరా చొప్పున కేటాయించారు. ఇదే కాలనీలో వైఎస్సార్‌సీపీ, టీడీపీకి చెందినవారూ ఉన్నారు. గతంలో టీడీపీ వర్గానికి చెందిన వారు ఇలానే గోడౌన్లను కూల్చివేసి అందులో ఉన్న మెటీరియల్‌ను కాజేసేందుకు ప్రయత్నించగా.. మరో వర్గం వారు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో నిలిపివేశారు. అయితే తిరిగి ఆదివారం సెలవు దినం కావడంతో జేసీబీని ఉపయోగించి గోడౌన్లను పూర్తిగా కూల్చివేశారు.

నేడు జైన్ మందిరం చేరుకోనున్న సీఐఎస్‌ఎఫ్ సైక్లోథాన్



తీరప్రాంతాల భద్రత అనే అంశంపై సీఐఎస్‌ఎఫ్ భద్రతా సిబ్బంది చేపట్టిన సైక్లోథాన్ యాత్ర

సూళ్లూరుపేట : కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సైక్లోథాన్ యాత్ర సోమవారం ఉదయం సూళ్లూరుపేటకు చేరుకోనుంది. అక్కడి నుంచి 9 గంటలకు తడ మండలం అండగుండాల, కారిపాకం వెళ్లే రోడ్డులో వున్న జైన్ మందిరం వద్దకు చేరుకుంటుంది. జాతీయ తీరప్రాంతాల భద్రత, సమాజ నిబద్ధత అనే అంశంపై జనానికి అవగాహన కల్పించేందుకు సుమారు వందమంది సీఐఎస్‌ఎఫ్ భద్రతా సిబ్బంది 9 రాష్ట్రాల మీదుగా 6,553 కిలోమీటర్ల సైకిల్ యాత్రను చేపట్టారు. యాత్రను ఈ నెల 7న కోలకత్తాలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఏప్రిల్ 1 నాటికి కన్యాకుమారిలో యాత్ర ముగిస్తుంది. సోమవారం ఉదయం సూళ్లూరుపేటకు చేరుకోనున్న సైక్లోథాన్ యాత్రకు స్వాగతం పలికేందుకు శ్రీహరికోట రాకెట్ కేంద్రంలోని సీఐఎస్‌ఎఫ్ భద్రతా సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి తడ మండలం అక్కంపేట నుంచి అండగుండాల, కారిపాకం వెళ్లేరోడ్డు అత్యంత దారుణంగా వుండడంతో షార్ భద్రతా సిబ్బంది ఆదివారం గుంతలు పూడ్చారు. జైన్ మందిరం వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు షార్ సీఐఎస్‌ఎఫ్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ కౌశిక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి షార్ డైరెక్టర్, కంట్రోలర్, సీఐఎస్‌ఎఫ్ ఐజీ సౌత్ సెక్టార్, డీఐజీ, స్థానిక పోలీస్ అధికారులు, ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

టీడీపీ నాయకుడి దాష్టీకం

చెల్లెలు పనికి రాలేదని అన్నపై దాడి.. మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తన ఇంట్లోకి పనికి రాలేదని, పనిమనిషి అన్నపై టీడీపీ నాయకుడు కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేసి కొట్టాడు. మనస్థాపం చెందిన వ్యవసాయ కూలీ టీడీపీ నాయకుడి ఇంటి వద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆదివారం రాత్రి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన ఘటనపై బాధితుడు తెలిపిన వివరాల మేరకు... అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వేంపల్లి పంచాయతీ గుట్టకిందపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు శంకర (50) వ్యవసాయ కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నాడు. అతడి చెల్లెలు లక్ష్మీదేవి మదనపల్లె పట్టణంలోని కమ్మ వీధిలో నివాసం ఉంటున్న కొత్తపల్లె మాజీ సర్పంచ్ టీడీపీ నాయకుడు బోయపాటి గోపాల్రెడ్డి ఇంట్లో పనిచేస్తుంది. ఆదివారం లక్ష్మీదేవి బంధువులకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఆమె గోపాల్ రెడ్డి ఇంటికి పనికి వెళ్లలేదు. ఈ విషయమై గోపాల్ రెడ్డి శంకరకు ఫోన్ చేసి, మీ చెల్లెలు ఎందుకు పనికి రాలేదని ప్రశ్నించాడు. తమ కుటుంబ సభ్యులకు అనారోగ్యంగా ఉందని, అలాంటి స్థితిలో కూడా మీకు పనికి రావాలా అంటూ శంకర ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో గోపాల్ రెడ్డి నీతో మాట్లాడే పని ఉంది ఇంటికి రమ్మని పిలిచాడు. సాయంత్రం శంకర గోపాల్ రెడ్డి ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులతో కలిసి, అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేసి తీవ్రంగా వైర్లతో కొట్టాడు. దీంతో మనస్థాపం చెందిన శంకర పురుగులమందు తీసుకొని వచ్చి గోపాల్ రెడ్డి ఇంటికి సమీపంలోనే తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి వెంటనే తరలించారు.

ఆధ్యాత్మిక సమాచారం



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏపీజీహెచ్ వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 75,428 మంది స్వామిని దర్శించుకున్నారు. 31,920 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.40 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేప చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.



గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు గోవిందమాంబ ఆరాధన మహోత్సవం

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రబోధకర్త మద్విరాట్ శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ



కై కలూరు: ఏలూరు జిల్లా కై కలూరు మండలం కొల్లేటి కోట గ్రామంలోని పెద్దింట్లమ్మ దేవస్థానానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఈ నెల 13తో అమ్మవారి జాతర మహోత్సవాలు ముగిసినప్పటికీ ఈ నెల చివరి వరకు భక్తులు ఎక్కువగా అమ్మవారిని దర్శించుకుంటారు. ఆదివారం కావడంతో సమీప జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మను దర్శించుకున్నారు. జాతరకు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో భక్తులు వంటలు చేసుకుని భోజనాలు చేశారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో దేవస్థానంలో క్యూ లైన్లు నిండిపోయాయి.

విద్యా సమాచారం



వ్యాసాశ్రమం అభివృద్ధికి అండగా నిలుద్దాం

తిరుపతి అర్బన్: ఏర్పేడులోని శ్రీవ్యాసాశ్రమం అభివృద్ధికి అండగా నిలుద్దామని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. తిరుపతి బైరాగిపట్టెడలోని జగ్జీవన్ రావు భవనంలో ఆదివారం ఏర్పేడులోని శ్రీవ్యాసాశ్రమంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల అసోషియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ ఆశ్రమంలో ఆధ్యాత్మిక భావాలతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. గతంలో 4వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఆశ్రమంలో బాలురు, బాలికలు విద్యాభ్యాసం చేసుకునే వెసులుబాటు ఉండేదని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం 10 నుంచి ఇంటర్ వరకు కేవలం బాలికలు చదువుకోవడానికి మాత్రమే అవకాశం ఉందన్నారు.

ఆద్యంతం.. ఆసక్తికరం.. కవి సమ్మేళనం



తిరుపతి కల్చరల్: ఉగాది ప్రాశస్త్యాన్ని ఆవిష్కరిస్తూ కవులు ఆలపించిన కవితలు, పద్యాలు, గేయాలు ఆద్యాంత ఆసక్తికరంగా సాగుతూ ఆకట్టుకున్నాయి. తిరుపతి తెలుగు సంఘాల ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు గార్లపాటి దామోదర నాయుడు ఆధ్వర్యంలో కార్యనిర్వాహక కార్యదర్శి తోట వెంకటేశ్వర్లు నిర్వహణలో సాగిన ఈ కవి సమ్మేళనంలో 50 మంది కవులు పాల్గొని వారి కవితలు వినిపించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా శతావధాని ఆముదాల మురళి, ఆకుల మల్లేశ్వరరావు, అంకమనాయుడు వ్యవహరించారు. ఈ కవి సమ్మేళనంలో ఐదు కవితలను ఎంపిక చేసి వారికి ఉగాది వేడుకల రోజున ఘనంగా సత్కరించనున్నారు.



వండర్స్ ఆఫ్ వయనాడ్
ఐఆర్‌సీటీసీ ట్రైన్ ప్యాకేజ్
హైదరాబాద్ నుంచి కేరళలోని వయనాడ్ తిరిగి హైదరాబాద్

పాతరాతియుగాన్ని చదువుకున్నాం... శిలాయుగాన్ని కూడా తెలుసుకున్నాం.
ఆ కాలంలో ఏమేమి ఉన్నాయి? బ్రహ్మ కట్టిన తిరునెల్లి ఆలయం ఉంది.
ఇంకా ఇంకా చాలా చాలా ఉన్నాయి. వాటిని చూడాలంటే...
అరక్కల్... అంబల్‌వాయల్ మ్యూజియాలకు కళ్లప్పగించాలి.
ఎడక్కల్ గుహల్లో ఎనిమిదివేల ఏళ్ల నాటి బొమ్మలను తాకి చూడాలి.
మోడరన్ హిస్టరీ చెప్పిన పాఠాలకు ఆనవాళ్లుగా... ఏమేమి ఉన్నాయి?
డచ్ కట్టడాలు... పోర్చుగీసు నిర్మాణాలు... బ్రిటిష్ కాలపు టెలిఫోన్‌లు.
వాటిని చూడాలంటే ఏం చేయాలి?... వయనాడుకు ప్రయాణమవ్వాలి.
ఎరుపెక్కిన కళ్లతో కప్పడ్ బీచ్‌లో వాస్కోడిగామా స్మారకాన్ని చూడాలి.
గాంధీజీ జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించిన కాల్పెట్టలో బస చేయాలి.
ఫారెస్ట్‌కు అర్థవంతమైన నిర్వచనం చెప్తున్న కురువద్వీపంలో అడుగుపెట్టాలి.
పూకోద్ సరస్సులో కలువల మధ్య పడవ ప్రయాణం చేయాలి.
భవిష్యత్తు తరాల కోసం ప్రకృతిని గౌరవిస్తూ ముందుకుసాగాలి.
'వండర్స్ ఆఫ్ వయనాడ్' ఐఆర్‌సీటీసీ ప్యాకేజ్ సిద్ధంగా ఉంది.
సెలవులు వస్తున్నాయి... కేరళలో పర్యటనకు ప్లాన్ చేసుకోండి.

వండర్స్ ఆఫ్ వయనాడ్
కొండకోనల్లో పడవ ప్రయాణం

1 రోజు

ఉదయం ఆరుగంటల సమయంలో 12789 నంబరు కాచిగూడ-మంగళూరు సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ కాచిగూడ నుంచి బయలుదేరుతుంది.

రోజు 2

ఉదయం ఆరు గంటల సమయంలో రైలు కన్నూరుకు చేరుతుంది. రైలు దిగి రైల్వే డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన హోటల్‌కు చేరుకుని ఫ్రెష్ అప్ అయ్యి ఉపాహారం తిన్న తర్వాత సైట్ సీయింగ్‌కి బయలుదేరాలి. ఏంజిలో ఫోర్ట్, అరక్కల్ మ్యూజియం చూసుకున్న తర్వాత ప్రయాణం వయనాడు వైపు సాగుతుంది. దారిలో అందమైన ప్రకృతి దృశ్యాలను ఆస్వాదిస్తూ వయనాడు, కాల్పెట్టలోని హోటల్‌లో చెక్ ఇన్ అవ్వాలి. రాత్రి బస అక్కడే.





ఇక్కడికి గాంధీజీ వచ్చాడు!

కన్నూర్ కోట (సెయింట్ ఏంజిలో ఫోర్ట్) పోర్చుగీసు, డచ్‌వాళ్ల పాలన సాగించిన ప్రదేశం. అరక్కల్ మ్యూజియం కన్నూరు సిటీకి మూడు కిలోమీటర్ల దూరాన ఉంది. అరక్కల్ రాజవంశం నివసించిన ప్యాలెస్ అది. వాళ్లు ఉపయోగించిన ఫర్నిచర్ డిజైన్‌లు ఇప్పుడు లేటెస్ట్ ఫ్యాషన్‌గా సంపన్నవర్గాల ఇళ్లలో కనిపిస్తున్నాయి. బ్రిటిష్‌పాలన కాలంనాటి టెలిఫోన్ కూడా ఉంది. రాత్రి బస చేస్తున్న కాల్పెట్ట అందమైన హిల్‌స్టేషన్. దట్టమైన అటవీ ప్రదేశం కూడా. కేరళలో భారత జాతీయోద్యమం పురుడుపోసుకున్న ప్రదేశం ఇది. ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తినింపడానికి గాంధీజీ 1934లో ఈ ప్రదేశాన్ని సందర్శించాడు.





3 రోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత సైట్ సీయింగ్‌కి బయలుదేరాలి. కురువ ద్వీప్, తిరునెల్లి ఆలయం, బాణాసుర సాగర్ డ్యామ్ చూసుకుని హోటల్‌కి చేరాలి. ఆ రాత్రి బస కూడా కాల్పెట్టలోనే.









బ్రహ్మ కట్టిన ఆలయం

కురువద్వీపంలో విహారం మరో ప్రపంచంలోకి వెళ్లినట్లు ఉంటుంది. కబిని నది ఉపనదుల ప్రవాహం మధ్యలో ఏర్పడిన వెయ్యి ఎకరాల దీవి ఇది. పచ్చదనాన్ని పుష్పగుచ్ఛంగా ఒకచోట రాశిపోసినట్లుంటుంది. ఇక్కడ అరుదైన పక్షులు కనిపిస్తాయి. తిరునెల్లి ఆలయం ఓ విశిష్టత. దీని గురించి చారిత్రక ఆధారాలేవీ దొరకట్లేదు. పౌరాణిక ఆధారాల ప్రకారం వేదవ్యాసుడు రాసిన పురాణాల్లో విష్ణువు కోసం బ్రహ్మ భూమ్మీద నిర్మించిన ఆలయం అని తెలుస్తోంది. లొకేషన్ సెలెక్ట్ చేయడానికి బ్రహ్మదేవుడు తన వాహనం హంస మీద భూమండలం అంతా పర్యటిస్తూ ఈ ప్రదేశాన్ని చూసి ముచ్చటపడ్డాడని, ఇక్కడే ఆలయాన్ని నిర్మించాడని, ఈ కొండకు బ్రహ్మగిరి అనే పేరు రావడానికి కారణం అదేనని చెబుతారు. ఆలయాన్ని నిర్మించే వరకు తనతో తెచ్చిన విగ్రహాన్ని ఉసిరి చెట్టులో దాచడంతో ఈ ఆలయానికి నెల్లి అనే పేరుతో తిరునెల్లి ఆలయం అనే పేరు వచ్చింది. పది-పదకొండు శతాబ్దాల్లో చేరరాజు భాస్కర రవివర్మ పాలించిన నాటికే ఇది గొప్ప యాత్రాస్థలంగా ప్రాచుర్యంలో ఉంది. ఇక్కడ ప్రాచీన కాలం నాటి గ్రామాల ఆనవాళ్లను కూడా చూడవచ్చు. ఆ తర్వాత చూడాల్సిన బాణాసుర సాగర్ డ్యామ్ రెండువేల అడుగుల పొడవుతో దేశంలోనే అతి పెద్ద ఎర్త్ డ్యామ్. జల విద్యుత్ తయారీ కేంద్రాన్ని కూడా చూడవచ్చు.

4 రోజు

బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత అంబలవాయల్ హెరిటేజ్ మ్యూజియం, సూచిపారా జలపాతం, ఎడక్కల్ గుహలు, పూకోద్ సరస్సులో విహారం తర్వాత తిరిగి హోటల్‌కు చేరాలి. ఆ రాత్రి బస కూడా కాల్పెట్టలోనే.





రాతియుగాన్ని చూసొద్దామా!

ఇది వయనాడ్ హెరిటేజ్ మ్యూజియం, అంబలవాయల్ అనే ప్రదేశంలో ఉండడంతో ఆ పేరు వచ్చింది. ఇందులో రాతియుగం నాటి పదునైన రాతి ఆయుధాలు, 14 నుంచి 16వ శతాబ్దం నాటి శిల్పాలు, మృణ్మయపాత్రలు, టెర్రకోట శిల్పాలు ఉంటాయి. ఇక ఎడక్కల్ గుహలు కాల్పెట్టకు 25 కి.మీ.ల దూరంలో ఉన్నాయి. వీటి వింత ఏమిటంటే... ఇవి నేలమీద విస్తరించిన గుహలు కావు. ఎవరూ పనిగట్టుకుని తొలిచినవీ కాదు. దాదాపు నాలుగు వేల అడుగుల ఎత్తులో సహజంగా ఏర్పడిన గుహలు. ఈ గుహల్లో కనిపించే బొమ్మలు క్రీస్తు పూర్వం ఆరువేల ఏళ్ల నాటివని అంచనా. ఈ రోజు చివరగా పూకోద్ సరస్సులో పడవ విహారంతో సేదదీరడమే. ఈ సరస్సు దాదాపు ఎనిమిది వందల మీటర్ల ఎత్తులో కొండల మీద ఏడెనిమిది ఎకరాల్లో విస్తరించి ఉంది. వర్షపునీరు కొండ కోనల నుంచి ఇక్కడికి చేరుతుంది. సరస్సు నిండిన తర్వాత నీరు కిందకు ప్రవహించి పనమారమ్ నదిగా మారుతుంది. ఈ నది కబిని నదిలో కలుస్తుంది. ఈ సరస్సులో కలువలు విరివిగా ఉంటాయి. అందుకే దీనికి పూలతీరం అనే అర్థంలో పూకోద్ అనే పేరు వచ్చింది.





రోజు 5

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పూర్తయిన తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. ప్రయాణం కోళికోడ్ వైపు సాగుతుంది. దారిలో కప్పడ్ బీచ్ విహారం. సాయంత్రం ఎస్ఎమ్ స్ట్రీట్‌లో షాపింగ్ కోసం సమయం ఉంటుంది. షాపింగ్ తర్వాత కోళికోడ్ రైల్వే స్టేషన్‌కి వెళ్లి రైలెక్కాలి. 12790 నంబరు మంగళూరు సెంట్రల్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.35 నిమిషాలకు బయలుదేరుతుంది. 24 గంటల తర్వాత ఆరవ రోజు రాత్రి 11.40కి కాచిగూడకు చేరుతుంది.





వాస్కోడిగామా అడుగుపెట్టాడు!

కప్పడ్ బీచ్ అంటే పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా మన దేశానికి సముద్ర మార్గాన్ని అన్వేషించి మన నేల మీద పాదం మోపిన ప్రదేశం. ఇది 1498లో జరిగింది. భారతీయుల్లో జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించడానికి గాంధీజీ 1934లో కాల్పెట్టలో అడుగుపెట్టడానికి కారణమైన సంఘటన అన్నమాట. కష్టంగా అయినా నిష్ఠూరంగా అయినా ఈ ప్రదేశాన్ని చూడాల్సిందే, వదిలేయడానికి వీల్లేదు. గుడ్లు పెట్టి పిల్లలను పొదగడానికి ఇక్కడికి వచ్చే తాబేళ్లను చూడడానికైనా కప్పడ్ బీచ్‌ని కవర్ చేయాలి. అలాగే సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తూ ప్రశాంతంగా సముద్రతీరాన గడపడానికి ఇది మంచి ప్రదేశం. ఇక చివరగా కోళికోడ్ పట్టణంలోని ఎస్ఎమ్ స్ట్రీట్‌లో షాపింగ్ కోసం సమయం ఇస్తారు. వాహనం దిగి మార్కెట్ అంతటా కాలి నడకన తిరగాలి. ఏం కొన్నా కొనకపోయినా కోళికోడ్ హల్వా తప్పకుండా రుచి చూడాలి. బంధువులు, స్నేహితుల కోసం ఇంటికి తెచ్చుకోవాలి. దీంతో ఈ టూర్ తీపి జ్ఞాపకపు రుచి కలకాలం గుర్తుంటుంది.

వండర్స్ ఆఫ్ వయనాడ్ (ఎస్‌హెచ్‌ఆర్ 098) ప్యాకేజ్‌లో...

● ఇవి ఉంటాయి

స్టాండర్డ్ ప్యాకేజ్‌లో స్లీపర్ క్లాస్‌లో ప్రయాణం. కంఫర్ట్ ప్యాకేజ్‌లో థర్డ్ ఏసీలో ప్రయాణం. రైలు దిగిన తరవాత లోకల్ జర్నీ ఏసీ వాహనంలో ఉంటుంది. ట్రావెల్ ఇన్సూరెన్స్, టోల్ ఫీజ్, పార్కింగ్ ఫీజులు ప్యాకేజ్‌లోనే. రాత్రి బస చేసిన హోటల్‌లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ ఉంటుంది.

● ఇవి వర్తించవు


మధ్యాహ్నం, రాత్రి భోజనాలు. రైలు ప్రయాణంలో భోజనాలు. సైట్ సీయింగ్ ప్రదేశాల ఎంట్రీ టికెట్ చార్జీలు, బోటింగ్, హార్స్ రైడింగ్ వంటి రిక్రియేషనల్ టికెట్ ఫీజులు, గైడ్ చార్జీలు, ఇతర సర్వీసులు పర్యాటకులే భరించాలి. కొన్ని ప్రైవేట్ టూర్ ప్యాకేజ్‌లు ట్రీ హౌస్‌లో రాత్రి బస ఏర్పాటు చేస్తున్నాయి.

వండర్స్ ఆఫ్ వయనాడ్ టికెట్ ధరలిలా

- సింగిల్ ఆక్యుపెన్సీలో (ఒక్కొక్కరికి ఒక్కో గది) కంఫర్ట్ ప్యాకేజ్ 37, 640 రూపాయలు, స్టాండర్డ్ ప్యాకేజ్‌కి 34, 840 రూపాయలు.
- డబుల్ ఆక్యుపెన్సీలో (ఇద్దరికి ఒక గది) ఒక్కొక్కరికి కంఫర్ట్ ప్యాకేజ్ 21,220 రూపాయలు, స్టాండర్డ్ ప్యాకేజ్‌లో 18,430 రూపాయలు.
- ట్రిపుల్ ఆక్యుపెన్సీలో (ముగ్గురికి ఒక గది) ఒక్కొక్కరికి కంఫర్ట్ ప్యాకేజ్ 17,740 రూపాయలు, స్టాండర్డ్ ప్యాకేజ్‌లో 14,950 రూపాయలు.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి





నీవు అలస్యం చేయవచ్చు. కానీ కాలం అలస్యం చేయదు
- బెంజమిన్ ఫ్రాంక్లిన్, అమెరికన్ రచయిత, శాస్త్రవేత్త

బిజినెస్ రీల్

కోటక్ మహీంద్రా ఏఎంసీ 'ఛోటీ సిప్'



తొలిసారిగా ఇన్వెస్ట్ చేస్తున్న వారి కోసం కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (కేఎంఏఎంసీ) 'ఛోటీ సిప్'ను ప్రవేశపెట్టింది. నెలవారీగా అత్యంత తక్కువగా రూ. 250తో కూడా సిప్ రూపంలో పెట్టుబడులు పెట్టొచ్చు. దీని కింద కనీసం 60 నెలల పాటు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధికి దోహదపడేలా ఇది గ్రోత్ ఆప్షన్‌తో మాత్రమే లభిస్తుంది. కొత్త ఇన్వెస్టర్లలో క్రమశిక్షణతో కూడుకున్న పొదుపు అలవాటును పెంపొందించేందుకు ఇది తోడ్పడుతుందని సంస్థ ఎండీ నీలేష్ షా తెలిపారు.

చౌక దిగుమతులపై యాంటీ డంపింగ్ సుంకం

- అల్యూమినియం ఫాయిల్ సహా ఐదింటిపై విధింపు
- చైనా, దక్షిణ కొరియా, తైవాన్, థాయిలాండ్‌కు వర్తింపు



న్యూఢిల్లీ: చైనా సహా పలు ఆసియా దేశాల నుంచి చౌకగా వచ్చి పడుతున్న దిగుమతుల నుంచి దేశీ పరిశ్రమలను కాపాడేందుకు కేంద్రం కఠిన చర్య తీసుకుంది. వ్యాక్యూమ్ ఇన్సులేటెడ్ ఫ్లాస్కులు, అల్యూమినియం ఫాయిల్ సహా ఐదు ఉత్పత్తులపై యాంటీ డంపింగ్ సుంకాలను విధిస్తున్నట్టు ప్రకటించింది. సాఫ్ట్ ఫెరైట్ కోర్స్, ట్రిక్లోరో ఇసోసైనారిక్ యాసిడ్, పాలీ వినిల్ క్లోరైడ్ పేస్ట్ రెజిన్‌పై యాంటీ డంపింగ్ సుంకాలు మోపింది. చైనా సహా పలు దేశాలు సాధారణ ధరలకంటే చౌకగా ఈ ఉత్పత్తులను భారత మార్కెట్లోకి కుమ్మరిస్తున్నట్టు పేర్కొంది. ఇందుకు సంబంధించి ప్రత్యేక నోటిఫికేషన్లను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీఐటీ) అండ్ కస్టమ్స్ (రెవెన్యూ విభాగం) జారీ చేసింది. సాఫ్ట్ ఫెరైట్ కోర్స్, వ్యాక్యూమ్ ఇన్సులేటెడ్ ఫ్లాస్క్, ట్రిక్లోరో ఇసోసైనారిక్ యాసిడ్‌పై ఐదేళ్లపాటు యాంటీ డంపింగ్ సుంకాలు అమలవుతాయని పేర్కొంది.

ఐదేళ్ల పాటు అమల్లో..: ఎలక్ట్రిక్ వాహనాలు, చార్జర్లు, టెలికం పరికరాల్లో సాఫ్ట్ ఫెరైట్ కోర్స్‌ను వినియోగిస్తుంటారు. వీటిపై 35 శాతం అదనపు సుంకాన్ని సీబీఐటీ కస్టమ్స్ విధించింది. వ్యాక్యూమ్ ఇన్సులేటెడ్ ఫ్లాస్కులపై టన్నుకు 1,732 డాలర్ల యాంటీ డంపింగ్ సుంకం అమలు కానుంది. పాలీ వినిల్ క్లోరైడ్ పేస్ట్ రెజిన్‌పై టన్నుకు 89 డాలర్ల నుంచి 707 డాలర్ల మధ్య చైనా, దక్షిణ కొరియా, మలేషియా, నార్వే, తైవాన్, థాయిలాండ్ నుంచి వచ్చే దిగుమతులకు ఐదేళ్లపాటు వర్తిస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-3-2025

విశాఖ	420-00
చిత్తూరు	470-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	420-00
వరంగల్	422-00
రిటైల్ ధర	4.80

మార్కెట్లకు విదేశీ జోష్

- ఫెడ్, ఎఫ్‌పీఐ పెట్టుబడుల బూస్ట్
- మార్చి ఎఫ్అండ్‌వో ముగింపుపై కన్ను
- మార్కెట్లో ట్రెండ్‌పై విశ్లేషకుల అంచనాలు

ఈ వారం సైతం లాభాల పరుగు!

యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత సంకేతాలకుతోడు ఉన్నట్టుండి విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్ల యూటర్న్ తీసుకోవడంతో గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు టర్న్‌అరౌండ్ బాట పట్టాయి. ఈ జోష్ స్వల్ప కాలానికి కొనసాగవచ్చని పలువురు నిపుణులు భావిస్తున్నారు. దీంతో ఎన్ఎస్ఈ నిఫ్టీ సాంకేతికంగా 23,600 వద్ద తొలుత రెసిస్టెన్స్ ఎదుర్కొనే వీలున్నట్లు అంచనా వేశారు. వివరాలు చూద్దాం..



ముంబై: సెంటిమెంటుపై ప్రభావం చూపగల అంశాలు కొరవడిన నేపథ్యంలో ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు లాభాల బాటలో సాగే వీలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇందుకు ప్రధానంగా విదేశీ అంశాలు దోహదపడనున్నట్లు తెలియజేశారు. గత వారం మార్కెట్లు నష్టాల నుంచి బయటపడి ఒక్కసారిగా స్పీడందుకోవడంతో స్వల్ప కాలానికి లాభాల పరుగు కొనసాగనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు. అయితే ఈ వారం మార్చి నెల డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగియనుంది. దీంతో సెంటిమెంటు సానుకూలంగా ఉన్నప్పటికీ కొంతమేర ఆటుపోట్లకు అవకాశమున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా అభిప్రాయపడ్డారు.

గణాంకాలపై దృష్టి

2024 చివరి త్రైమాసిక (అక్టోబర్-డిసెంబర్) యూఎస్ జీడీపీ త్రైమాసికవారీ గణాంకాలు గురువారం(27న) వెల్లడికానున్నాయి. ముందస్తు అంచనాల ప్రకారం గతేడాది క్యూ4లో రియల్ జీడీపీ 2.3 శాతం పుంజుకుంది. ఫిబ్రవరి నెలకు యూఎస్ మన్నికైన వస్తువుల (డ్యూరబుస్) ఆర్డర్ల వివరాలు బుధవారం(26) వెలువడనున్నాయి. ఈ బాటలో శుక్రవారం(28న) ఫిబ్రవరి నెలకు కీలక పీసీఈ ధరల ఇండెక్స్‌ను ప్రకటించనుంది. జనవరిలో 0.3% పెరిగింది.

23,100 వద్ద సపోర్ట్

ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీకి తొలుత 23,100 పాయింట్ల వద్ద సపోర్ట్ లభించే వీలున్నట్లు టెక్నికల్ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం జోరందుకున్న నేపథ్యంలో 100 రోజుల చలన సగటు 23,522 పాయింట్ల వద్ద రెసిస్టెన్స్ ఎదురుకావచ్చని అంచనా వేశారు. 23,600 స్థాయి కీలకంకాగా.. 23,700, 23,800ను అధిగమిస్తే మరింత బలపడవచ్చని భావిస్తున్నారు. స్వల్ప కాలంలో 24,069 వద్ద తీవ్ర అవరోధం ఎదురుకావచ్చని అంచనా.

ఇతర అంశాలు

యూఎస్ టారిఫ్ వార్తలు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు లేదా అమ్మకాలతోపాటు.. డాలరు ఇండెక్స్, ముడిచమురు ధరల కదలికలపై ఈ వారం ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నారు. గత వారం అమ్మకాల బాట వీడి విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు దిగారు. అయితే దేశీ ఫండ్స్ విక్రయాలవైపు చూపు సారించాయి. ఇటీవల ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు కొంతమేర బలహీనపడింది. దీంతో రూపాయి 1 శాతంమేర బలపడింది. ఈ నేపథ్యంలో గత వారం మార్కెట్లు జోరందుకున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ తెలియజేశారు. యూఎస్ మార్కెట్లు సైతం పుంజుకున్నప్పటికీ రానున్న రోజుల్లో హెచ్చుతగ్గులు ఎదురుకావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

ఎఫ్‌పీఐల యూటర్న్

కొద్ది నెలలుగా దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే అధిక ప్రాధాన్యమిస్తున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) గత వారం చివర్లో కొనుగోళ్ల యూటర్న్ తీసుకున్నారు. ఉన్నట్టుండి పెట్టుబడుల బాట పట్టారు. చివరి రెండు రోజుల్లో నగదు విభాగంలో రూ. 11,000 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. దీంతో గత వారం నికరంగా 19.4 కోట్ల డాలర్లు(రూ. 1,700 కోట్లు) విలువైన అమ్మకాలు నమోదయ్యాయి. అంతకుముందు వారం 4 రోజుల ట్రేడింగ్‌లోనే 60.4 కోట్ల(రూ. 5,230 కోట్లు) డాలర్ల పెట్టుబడులు వెనక్కి తీసుకోవడం గమనార్హం! కాగా.. మార్చిలో ఇప్పటివరకూ ఎఫ్‌పీఐలు రూ. 31,719 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. అంతకుముందు ఫిబ్రవరిలో రూ. 34,574 కోట్లు, జనవరిలో రూ. 78,027 కోట్లు చొప్పున పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు.

గత వారమిలా

గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు ఉన్నట్టుండి జోరందుకోవడంతో సెన్సెక్స్ 77,000 మైలురాయికి చేరువైంది. నిఫ్టీ కీలకమైన 23,300ను అధిగమించింది. నికరంగా సెన్సెక్స్ 3,077 పాయింట్లు(4.2 శాతం) జంప్‌చేసి 76,906 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 953 పాయింట్లు(4.3 శాతం) ఎగసి 23,350 వద్ద ముగిసింది. ఇదేవిధంగా బీఎస్ఈ మిడ్‌క్యాప్ 7 శాతం జంప్‌చేయగా.. స్మాల్ క్యాప్ మరింత వేగంగా 8 శాతం జోరు చూపింది.

టాప్-10 కంపెనీల స్పీడ్

రూ. 3 లక్షల కోట్ల విలువ ప్లస్

గత వారం మార్కెట్ల జోరుతో మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)రీత్యా టాప్-10 లిస్టెడ్ కంపెనీలు భారీగా బలపడ్డాయి. ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే వీటి మార్కెట్ విలువ రూ. 3 లక్షల కోట్లకుపైగా పెరిగింది. ప్రయివేట్ రంగ దిగ్గజాలు ఐసీఐసీఐ, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రధానంగా బలపడగా.. ఐటీసీ మాత్రమే డీలాపడింది. ప్రామాణిక ఇండెక్స్‌లు సెన్సెక్స్, నిఫ్టీ 4.2 శాతం చొప్పున ఎగశాయి. ఈ నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ అత్యధికంగా రూ. 64,426 కోట్లకుపైగా పుంజుకుని 9,47,628 కోట్లను అధిగమించింది. ఈ బాటలో మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ. 53,286 కోట్లు జంప్‌చేసి రూ. 9,84,354 కోట్లను దాటింది. ఇక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువకు రూ. 49,105 కోట్లు జమయ్యింది. దీంతో బ్యాంక్ విలువ రూ. 13,54,275 కోట్లను తాకింది.



రిలయన్స్ సైతం

టాప్-10 దిగ్గజాలలో రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ దాదాపు రూ. 39,312 కోట్లు బలపడి రూ. 17,27,340 కోట్లకు చేరింది. ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ విలువ సుమారు రూ. 30,954 కోట్లు ఎగసి రూ. 5,52,846 కోట్లను అధిగమించింది. టీసీఎస్ మార్కెట్ క్యాప్ రూ. 24,259 కోట్లు పెరిగి రూ. 12,95,058 కోట్లను తాకింది. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ విలువ రూ. 22,535 కోట్లు మెరుగుపడి రూ. 6,72,024 కోట్లకు చేరింది. ఎఫ్ఎంసీజీ బ్లూచిప్ హిందుస్తాన్ యూనిలీవర్ క్యాపిటలైజేషన్ రూ. 16,823 కోట్లు ఎగసింది.

ఫ్యామిలీ వెల్త్ ప్రణాళికల్లో మహిళలకు ప్రాధాన్యం



అరుణిమ నయన్
హెడ్ - ఫ్యామిలీ ఆఫీస్ - ప్రైవేట్ వెల్త్, యాక్సిస్ ఏఎంసీ

వెల్త్ మేనేజ్‌మెంట్‌లో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్న నేపథ్యంలో మహిళలు కుటుంబ సంపదకు కేవలం లబ్ధిదారులుగానే ఉండిపోకుండా, సంపద సృష్టి, నిర్వహణ, బదలాయింపులోను కీలకంగా మారుతున్నారు. కుటుంబానికి సంబంధించిన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో వారు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ ధోరణి ప్రధానంగా ఫ్యామిలీ ఆఫీసులు, ప్రైవేట్ వెల్త్ మేనేజ్‌మెంట్‌లో కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ప్రకారం,



ప్రపంచ సంపదలో మూడో వంతు భాగాన్ని మహిళలు నిర్వహిస్తున్నారు. ఇవి అంకెలు మాత్రమే కావు. సాంస్కృతిక, ఆర్థిక అంశాల్లో చోటు చేసుకుంటున్న గణనీయమైన మార్పులను సూచిస్తున్నాయి. చాలా మంది మహిళలు సంపదను కేవలం వారసత్వంగా పొందడమే కాకుండా, దాన్ని జాగ్రత్తపర్చుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఎంట్రప్రెన్యూర్‌షిప్, పెట్టుబడులు లేదా ఫ్యామిలీ ఆఫీసులు.. ఇలా ఏ రూపంలోనైనా కావచ్చు భవిష్యత్తులో కుటుంబ సంపదపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే శక్తివంతమైన స్థాయిల్లోకి వారు చేరుకుంటున్నారు. తరతరాలుగా సంపద నిర్వహణలో వస్తున్న ఫండమెంటల్ మార్పును ఇది సూచిస్తోంది. బార్క్లేస్ ప్రకారం సంపన్న కుటుంబాలకు చెందిన ప్రతి 10 మంది మహిళల్లో ఎనిమిది మందికి, వచ్చే రెండు దశాబ్దాల్లో గణనీయమైన స్థాయిలో సంపద వారసత్వంగా వచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆర్థిక నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ విషయానికొస్తే వారిలో సగం మంది కూడా ఇందులో పాలుపంచుకోవడం లేదు. దీన్ని సత్వరం పరిష్కరించాల్సి ఉంది.

చివరిగా..

వెల్త్ మేనేజ్‌మెంట్‌లో, ముఖ్యంగా ఫ్యామిలీ ఆఫీస్‌లు, ప్రైవేట్ వెల్త్‌లో మహిళలు మరింతగా పాలుపంచుకోవడమనేది ట్రెండ్ మాత్రమే కాదు. కుటుంబ వారసత్వం, సంపద సృష్టి, సంపద బదలాయింపును మనం చూసే దృష్టి కోణంలో వస్తున్న మార్పులను ప్రతిబింబిస్తోంది. ఫ్యామిలీ ఆఫీస్‌లలో నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతున్న మహిళలు, వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగం భవిష్యత్తును నిర్దేశించనున్నారు. సంపద సృష్టి, సంరక్షణ, దీర్ఘకాలిక పెట్టుబడులు లేదా భవిష్యత్ తరాలకు సంపద బదలాయింపులో మార్గదర్శకత్వం వహించడం.. ఇలా కుటుంబ సంపదకు సంబంధించిన ఏ అంశంలోనైనా మహిళలు మరింత కీలక పాత్ర పోషించనున్నారు. కుటుంబ సంపద నిర్వహణ విషయంలో మహిళలు మరిన్ని బాధ్యతలు తీసుకుంటున్న నేపథ్యంలో, మారుతున్న క్లయింట్ల అవసరాలను పరిష్కరించేలా వెల్త్ మేనేజర్లు తమను తాము మార్చుకోవాలి. కుటుంబానికి సంబంధించిన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో చురుకైన పాత్ర పోషించేలా మహిళలకు సాధికారత కల్పించడమనేది ఒక వ్యూహాత్మక అవసరం కూడా.


భవిష్యత్తు కోసం ఆర్థిక ప్రణాళికలు వేసుకోవడం..

భవిష్యత్ ఆర్థిక ప్రణాళికల్లో మహిళలు కూడా పాలుపంచుకోవడం మరింతగా పెరుగుతోంది. ముఖ్యంగా సంపద బదలాయింపు, వారసత్వ ప్రణాళికల్లో ఇది ఎక్కువగా ఉంటోంది. వారు ఆర్థిక భద్రత, భవిష్యత్ తరాలకు స్థిరత్వం కల్పించడానికి అధిక విలువనిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంక్లిష్టమైన ఆర్థిక కాన్సెప్టులను అర్థం చేసుకోవడంలో మహిళలకు సాధికారత కల్పించే అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం నుంచి మహిళల లక్ష్యాలు, విలువలకు అనుగుణమైన కస్టమైజ్డ్ సొల్యూషన్స్ అందించే వరకు వారి ప్రాధాన్యతలకు అనుగుణమైన సర్వీసులను వెల్త్ మేనేజర్లు అందించాల్సి ఉంటుంది. ఫ్యామిలీ ఆఫీసుల విషయానికొస్తే, సంపద సృష్టి, నిర్వహణలో మారుతున్న మహిళల పాత్రలకు అనుగుణంగా తోడ్పాటు అందించేలా వెల్త్ మేనేజ్‌మెంట్ రంగం మారాలి. నిర్ణయాల్లోనూ వారికి చోటు లభించేలా చూడాల్సిన ఆవశ్యకత ఉంది. పూర్తి సమాచారంతో తగిన నిర్ణయం తీసుకోవడంలో మహిళలకు అవసరమైన పరిజ్ఞానం, సాధనాలు, ఆత్మవిశ్వాసం లభించే విధంగా ఆర్థిక అంశాలపై సంప్రదింపుల్లో ఫ్యామిలీ ఆఫీసులు తప్పనిసరిగా మహిళలను కూడా భాగం చేయాలి.

హెచ్‌ఆర్‌డీఎస్ ఇండియాతో కాల్కులస్ గ్రూప్ జట్టు

ఏఐ ఆధారిత టూల్స్ కోసం రూ.1,000 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: టెక్నాలజీ సొల్యూషన్లను అందించే కాల్కులస్ గ్రూప్.. ఎన్‌జీవో అయినా హెచ్‌ఆర్‌డీఎస్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఏకోసిస్టమ్ ఏర్పాటుకు వీలుగా కావాల్సిన ఏఐ ఆధారిత టూల్స్‌ను కాల్కులస్ గ్రూప్ అభివృద్ధి చేయనుంది. ఇందుకోసం రూ.1,000 కోట్లతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. గ్రామీణాభివద్ధికి సంబంధించి హెచ్‌ఆర్‌డీఎస్ చేపట్టే ప్రాజెక్టుల పూర్తికి గాను టెక్నాలజీ పరమైన సహకారాన్ని కాల్కులస్ గ్రూప్ అందించనుంది. ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్‌లు, టెలికమ్యూనికేషన్ కంపెనీలకు టెక్నాలజీ ఏకోసిస్టమ్‌ను తాము అభివృద్ధి చేసి ఇస్తుంటామని కాల్కులస్ గ్రూప్ వ్యవస్థాపకుడు, సీఈవో సూరజ్ వాసుదేవన్ తెలిపారు. హెచ్‌ఆర్‌డీఎస్‌తో చేసుకున్న ఈ రూ.1,000 కోట్ల ఎంవోయూ కింద కావాల్సిన టెక్నాలజీ పరిష్కారాలను తాము అందించనున్నట్టు చెప్పారు.



నిజంగా వ్యవసాయ ఆదాయం ఉందా?



కె.సీహెచ్. ఏ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

మీ అందరికీ తెలిసిందే. వ్యవసాయం మీద ఆదాయం చేతికొస్తే, ఎటువంటి పన్ను భారం లేదు. ఈ వెసులుబాటు 1961 నుంచి అమల్లో ఉంది. చట్టంలో నిర్వచించిన ప్రకారం వ్యవసాయ భూమి ఉంటే, అటువంటి భూమి మీద ఆదాయం /రాబడికి ఆదాయపు పన్ను లేదు. కేవలం వ్యవసాయం మీదే ఆధారపడి ఎటువంటి ఏ ఇతర ఆదాయం లేకపోతే, వచ్చిన ఆదాయం ఎటువంటి పరిమితులు, ఆంక్షలు లేకుండా మినహాయింపులోనే ఉంటుంది. ఎటువంటి పన్నుకి గురి కాదు. భూమి, ఆదాయం ఈ రెండూ, తూ.చా. తప్పకుండా ఆదాయపు పన్ను చట్టంలో నిర్వచించిన ప్రకారం ఉండాలి. ఎటువంటి తేడాలు ఉండకూడదు. అలాంటప్పుడు మాత్రమే మినహాయింపు ఇస్తారు.

కొంత మందికి అటు వ్యవసాయ ఆదాయం, ఇటు వ్యవసాయేతర ఆదాయం రెండూ ఉండొచ్చు. వారు రిటర్న్ వేసేటప్పుడు రెండు ఆదాయాలను జోడించి వేయాలి. దానికి అనుగుణంగా ఆ ఆదాయాలపై పన్ను లెక్కించి, అందులో మినహాయింపులు ఇవ్వడమనేది .. ఇదంతా ఒక రూలు. దాని ప్రకారం లెక్క చెప్తే పన్నుభారం పూర్తిగా సమసిపోదు కానీ ఎక్కువ శాతం రిలీఫ్ దొరుకుతుంది.

పై రెండు కారణాల వల్ల, రెండు ఉపశమనాల వల్ల ట్యాక్స్ ఎగవేసే వారు.. ఎప్పుడూ ఎలా ఎగవేయాలనే ఆలోచిస్తుంటారు. ట్యాక్స్ ప్లానింగ్‌లో ప్రతి ఒక్కరికి అనువుగా దొరికేది వ్యసాయ ఆదాయం. అక్రమంగా ఎంతో ఆర్జించి, దాని మీద ట్యాక్స్ కట్టకుండా బైటపడే మార్గంలో అందరూ ఎంచుకునే ఆయుధం 'వ్యవసాయ ఆదాయం'. దీన్ని ఎలా చూపిస్తారంటే..

- తమ పేరు మీదున్న పోరంబోకు జాగా, ఎందుకు పనికిరాని జాగా.
- వ్యవసాయ భూమి కాని జాగా
- సాగుబడి చేయని జాగా
- తమ పేరు మీద లేకపోయినా చూపెట్టడం
- కౌలుకి తీసుకోకపోయినా దొంగ కౌలు చూపడం
- కుటుంబంలో తాత, ముత్తాతల పొలాలను తమ పేరు మీద చూపెట్టుకోవడం
- బహుమతులు, ఇనాముల ద్వారా వచ్చిన జాగా
- దురాక్రమణ చేసి స్వాధీనపర్చుకోవడం

మరికొందరు నేల మీదే లేని జాగాని చూపెడతారు. ఇలా చేసి ఈ జాగా.. చక్కని మాగణి అని.. బంగారం పండుతుందని బొంకుతారు. కొంత మంది సంవత్సరానికి రూ. 50,00,000 ఆదాయం వస్తుందంటే ఇంకొందరు ఎకరానికి రూ. 5,00,000 రాబడి వస్తుందని చెప్పారు. ఈ మేరకు లేని ఆదాయాన్ని చూపించి, పూర్తిగా పన్ను ఎగవేతకు పాల్పడ్డారు.

ఈ ధోరణి అన్ని రాష్ట్రాల్లోకి పాకింది. మన రెండు తెలుగు రాష్ట్రాల్లో బాగా కొనసాగింది. హైదరాబాద్, విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో భూముల మీద లెక్కలేనంత ఆదాయం చూపించారు. అధికారులు, మామూలుగానే, వారి ఆఫీసు రూమ్‌లో అసెస్‌మెంట్ చేస్తేనే అసెస్సీలకు పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి. అధికారులు అడిగే ప్రశ్నలకు, ఆరా తీసే తీరుకు కళ్లు బైర్లు కమ్ముతాయి. అలాంటిది, ఈసారి అధికారులు శాటిలైట్ చిత్రాల ద్వారా వారు చెప్పిన జాగాలకు వెళ్లారు. అబద్ధపు సర్వే నంబర్లు, లేని జాగాలు, బీడు భూములు, అడవులు, చౌడు భూములు, దొంగ పంటలు, దొంగ కౌళ్లు, లేని మనుషులు, దొంగ అగ్రిమెంట్లు.. ఇలా ఎన్నో కనిపించాయి. ఇక ఊరుకుంటారా.. వ్యసాయ ఆదాయాన్ని మామూలు ఆదాయంగా భావించి, అన్ని లెక్కలూ వేశారు.

ఇరుగు-పొరుగువారు ఎన్నో పనికిమాలిన సలహాలు ఇస్తారు. వినకండి. ఫాలో అవ్వకండి. ఒక వేళ ఫాలో అయినా తగిన జాగ్రత్తలు తీసుకోండి. ఎగవేతకు ఒక మార్గమే ఉంది. కానీ ఇప్పుడు ఎగవేతలను ఏరివేసి, సరిచేసి, పన్నులు వసూలు చేసే మార్గాలు వందలాది ఉన్నాయి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రెండింటిలోనూ పెట్టుబడులు

కోటక్ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్

ఇటీవలి కాలంలో మన మార్కెట్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇది చూసి దీర్ఘకాలానికి ఈక్విటీలు బ్రహ్మాండమైన రాబడులు ఇస్తాయన్న ప్రచారంలో వాస్తవం ఎంత? అన్న సందేహాలు కూడా కొందరు ఇన్వెస్టర్లలో ఏర్పడ్డాయి. ఈ సమయంలో ఈక్విటీ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలా? లేక డెట్‌లో పెట్టుబడులు పెట్టుకోవాలన్న సంశయం కూడా ఎదురుకావచ్చు. కానీ, పెట్టుబడుల ప్రయాణం చాలా సుదీర్ఘమైనది. దీర్ఘకాల లక్ష్యాల కోసం నిధిని సమకూర్చుకోవాలని కోరుకునే ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో ఈక్విటీలకు తప్పకుండా చోటు ఉండాలి. అదే సమయంలో పెట్టుబడినంతా ఈక్విటీల్లోనే పెట్టేయడం సరికాదు. డెట్‌కు సైతం కొంత కేటాయింపులు అవసరం. ఈక్విటీ, డెట్ పెట్టుబడులకు వీలు కల్పించే పథకాల్లో కోటక్ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ ఒకటి.



రాబడులు

గడిచిన ఏడాది కాలంలో కోటక్ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ డైరెక్ట్ ప్లాన్‌లో రాబడి 7.30 శాతంగా ఉంది. గత ఐదు నెలలుగా మార్కెట్లు తీవ్ర కుదుపులను చూస్తున్నాయి. అలాంటి తరుణంలోనూ ఏడాది కాలంలో రాబడి సానుకూలంగా ఉండడం గమనార్హం. ఏడాది కాల పనితీరు విషయంలో ఈక్విటీ ఆధారిత హైబ్రిడ్ విభాగంలో ఈ పథకం రెండో స్థానంలో నిలిచింది. మూడేళ్ల కాలంలో ఈ పథకం ఏటా 14 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. ఇక ఐదేళ్లలో చూస్తే 21 శాతం, ఏడేళ్లలో 14 శాతం, 10 ఏళ్లలో 12.75 శాతం చొప్పున వార్షిక రాబడిని అందించింది. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్ విభాగంతో పోల్చి చూస్తే అన్ని కాలాల్లోనూ ఈ పథకంలోనే రాబడి అధికంగా ఉండడాన్ని గమనించొచ్చు.



పెట్టుబడుల విధానం

ఈ పథకం అగ్రెస్సివ్ అలోకేషన్ విధానాన్ని అనుసరిస్తుంది. 75 శాతం వరకు ఈక్విటీలకు, 25 శాతం వరకు డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటుంది. వివిధ మార్కెట్ క్యాప్‌ల మధ్య తగినంత వైవిధ్యాన్ని పాటిస్తుంది. అధిక వేల్యూషన్లకు చేరితే లాభాలు స్వీకరించి, అదే సమయంలో చౌక విలువల వద్ద అందుబాటులో ఉన్న స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ఈ పథకం పెట్టుబడుల విధానంలో భాగంగా గుర్తించొచ్చు. ఇందుకు నిదర్శనం గత ఆరు నెలల్లో క్యాపిటల్ గూడ్స్, ఆటోల్లో అమ్మకాలు చేయగా, అదే సమయంలో టెక్నాలజీ, కెమికల్స్, ఫార్మా, హెల్త్‌కేర్‌లో ఎక్స్‌పోజర్ పెంచుకుంది. ఈ విధానంతో నష్టాలను పరిమితం చేసి లాభాలను పెంచుకునే వ్యూహాన్ని ఫండ్ నిర్వహణ బృందం అమలు చేసింది. ఈ తరహా విధానాలతో రిస్క్ తగ్గించి, రాబడులు పెంచుకునే విధంగా పథకం పనిచేస్తుంటుంది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.6,324 కోట్ల పెట్టుబడులున్నాయి. ఇందులో 73 శాతం వరకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సాధనాల్లో 25 శాతం పెట్టుబడులు పెట్టగా, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లలో 0.43 శాతం మేర ఇన్వెస్ట్ చేసింది. 1.64 శాతం మేర నగదు నిల్వలు ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులను గమనిస్తే 68 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 30 శాతం ఇన్వెస్ట్ చేస్తే, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 1.92 శాతం కేటాయించింది. ఈక్విటీల్లో టెక్నాలజీరంగ కంపెనీల్లో అత్యధికంగా 18 శాతం మేర ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత 15 శాతం మేర బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ కంపెనీలకు, 9.68 శాతం మెటీరియల్స్ కంపెనీలకు, 8 శాతం హెల్త్‌కేర్ కంపెనీలకు కేటాయించింది. డెట్ పెట్టుబడుల్లో రిస్క్ దాదాపుగా లేని ఎస్‌వోవీల్లో (ప్రభుత్వ బాండ్లు) 20 శాతం ఇన్వెస్ట్ చేయగా, మెరుగైన క్రెడిట్ రేటింగ్‌కు నిదర్శనంగా ఉండే ఏఏఏ సెక్యూరిటీల్లో 3.41 శాతం పెట్టుబడులు ఉండడాన్ని గమనించొచ్చు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
భారతీ ఎయిర్‌టెల్	4.49
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	3.89
ఇన్ఫోసిస్	3.18
ఫోర్టిస్ హెల్త్	2.90
అల్ట్రాటెక్ సిమెంట్	2.88
విప్రో	2.74
ఎన్‌టీపీసీ	2.39
పవర్‌ఫైనాన్స్	2.25
ఒరాకిల్ ఫైనాన్స్	1.96
ఐసీఐసీఐ బ్యాంక్	1.89



35 కిలోమీటర్ల రేస్‌వాక్‌లో ప్రియాంక జాతీయ రికార్డు

న్యూఢిల్లీ: భారత అథ్లెట్ ప్రియాంక గోస్వామి... మహిళల 35 కిలోమీటర్ల రేస్‌వాక్‌లో జాతీయ రికార్డు నెలకొల్పింది. స్లొవేకియాలోని డుడిన్స్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో ప్రియాంక గోస్వామి 2 గంటల 56 నిమిషాల 34 సెకన్లలో లక్ష్యాన్ని చేరింది. గతంలో ఈ రికార్డు మంజు రాణి (2 గంటల 57 నిమిషాల 54 సెకన్లు) పేరిట ఉండగా... తాజాగా ప్రియాంక దాన్ని బద్దలు కొట్టింది. ప్రపంచ అథ్లెటిక్స్ రేస్ వాకింగ్ టూర్ గోల్డ్ లేబుల్ మీట్‌లో భాగంగా జరిగిన ఈ రేసులో ప్రియాంక 11వ స్థానంలో నిలిచింది. ఈక్వెడార్‌కు చెందిన పౌలా మిలెనా టారెస్ (2గం:44ని:26 సెకన్లు) అగ్రస్థానంలో నిలవగా... పెరూకు చెందిన కింబర్లీ గార్సా (2గం:45ని:59 సెకన్లు), పోలాండ్‌కు చెందిన క్యాటరీనా జైబ్లో (2గం:46ని:59 సెకన్లు) వరుసగా రెండో, మూడో స్థానాలు దక్కించుకున్నారు. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల 10 కిలోమీటర్ల విభాగంలో రజత పతకం సాధించిన ప్రియాంక... ఇప్పటివరకు రెండు ఒలింపిక్స్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఈ విభాగంలో ప్రియాంక తన గత వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్ (3 గంటల 13 నిమిషాల 19 సెకన్లు)ను 17 నిమిషాలకు పైగా మెరుగు పరుచుకోవడం విశేషం. 29 ఏళ్ల ప్రియాంక గతంలో 20 కిలోమీటర్ల రేస్‌వాక్‌లోనూ జాతీయ రికార్డు (1గం:28ని:45 సెకన్లు) నెలకొల్పింది. ఇక ఇదే పోటీల పురుషుల 20 కిలోమీటర్ల రేస్‌వాక్‌లో ఆకాశ్‌దీప్ సింగ్ 1 గంట 24 నిమిషాల 13 సెకన్ల టైమింగ్‌తో ఆరో స్థానంలో నిలిచాడు.



దూసుకెళుతున్న పియాస్త్రి

సూపర్ పియాస్త్రి

చైనా గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



విన్నర్స్ ట్రోఫీతో పియాస్త్రి



- ఆద్యంతం ఆధిపత్యం కనబరిచిన మెక్‌లారెన్ డ్రైవర్
- వరుసగా రెండో రేసులోనూ మెక్‌లారెన్ జట్టుకే అగ్రస్థానం
- హామిల్టన్, లెక్‌లెర్క్, పియరీ గ్యాస్లీలపై అనర్హత వేటు
- ఏప్రిల్ 6న తదుపరి రేసు జపాన్ గ్రాండ్‌ప్రి

షాంఘై: గత ఏడాది ఫార్ములావన్ సీజన్ ఆరంభంలో రెడ్‌బుల్ జట్టు అదరగొట్టగా... ఈసారి మెక్‌లారెన్ జట్టు మెరిపిస్తోంది. ఈ సీజన్‌లోని తొలి రేసు ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ విజేతగా నిలువగా... రెండో రేసు చైనా గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్‌కే చెందిన రెండో డ్రైవర్ ఆస్కార్ పియాస్త్రి టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ఆరంభించిన 23 ఏళ్ల పియాస్త్రి రేసు ముగిసే వరకు తన ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నాడు. నిర్ణీత 56 ల్యాప్‌ల రేసును ఆస్ట్రేలియా జాతీయుడైన పియాస్త్రి అందరికంటే వేగంగా, అందరి కంటే ముందుగా 1 గంట 30 నిమిషాల 55.026 సెకన్లలో ముగించి చాంపియన్‌గా అవతరించాడు. 2023లో మెక్‌లారెన్ జట్టు తరఫునే ఫార్ములావన్‌లో అరంగేట్రం చేసిన పియాస్త్రి వరుసగా మూడో ఏడాది అదే జట్టుతో ఉన్నాడు. గత ఏడాది హంగేరి గ్రాండ్‌ప్రి, అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలలో అగ్రస్థానాన్ని దక్కించుకున్న పియాస్త్రి తాజా గెలుపుతో తన కెరీర్‌లో మూడో విజయాన్ని అందుకున్నాడు. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానంలో నిలిచాడు. నోరిస్ 1 గంట 31 నిమిషాల 04.774 సెకన్లలో గమ్యానికి చేరాడు. ఫార్ములావన్ రేసులో ఓవరాల్‌గా 1–2 స్థానాలు మెక్‌లారెన్ డ్రైవర్లే సొంతం చేసుకోవడం ఇది 50వ సారి కావడం విశేషం. మెర్సిడెస్ డ్రైవర్ జార్జి రసెల్ మూడో స్థానంలో నిలువగా... ప్రస్తుత ప్రపంచ చాంపియన్, రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

ఆ ముగ్గురిపై వేటు

ఫెరారీ జట్టు డ్రైవర్లు చార్లెస్ లెక్‌లెర్క్, లూయిస్ హామిల్టన్ వరుసగా ఐదు, ఆరు స్థానాల్లో నిలువగా... పియరీ గ్యాస్లీ (ఆల్పైన్) 11వ స్థానంలో నిలిచారు. అయితే సాంకేతిక కారణాలరీత్యా రేసు ముగిశాక ఈ ముగ్గురిపై అనర్హత వేటు వేశారు. లెక్‌లెర్క్ 10 పాయింట్లను, హామిల్టన్ 8 పాయింట్లను చేజార్చుకున్నారు. 11వ స్థానంలో నిలిచినందుకు గ్యాస్లీకి ఎలాంటి పాయింట్లు లభించలేదు. ఫార్ములావన్ నిబంధనల ప్రకారం రేసు ముగిసిన తర్వాత డ్రైవర్ల కారు కనిష్ట బరువు 800 కేజీలు ఉండాలి. అయితే లెక్‌లెర్క్, హామిల్టన్, గ్యాస్లీల కార్ల బరువు 799 కేజీలు చూపించింది. దాంతో ఈ ముగ్గురిపై రేసు నిర్వాహకులు వేటు వేసి వారి ఫలితాలను రద్దు చేశారు. సీజన్‌లోని తదుపరి రేసు జపాన్ గ్రాండ్‌ప్రి ఏప్రిల్ 6న సుజుకా సర్క్యూట్‌లో జరుగుతుంది. సీజన్‌లోని తొలి రెండు రేసులు ముగిశాక డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో లాండో నోరిస్ 44 పాయింట్లతో తొలి స్థానంలో ఉండగా... 36 పాయింట్లతో వెర్‌స్టాపెన్ రెండో స్థానంలో, 35 పాయింట్లతో జార్జి రసెల్ మూడో స్థానంలో నిలిచారు. కన్‌స్ట్రక్టర్స్ చాంపియన్‌షిప్‌లో మెక్‌లారెన్ 78 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.

చైనా గ్రాండ్‌ప్రి ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	టైమింగ్	వ్యత్యాసం	పాయింట్లు
1	ఆస్కార్ పియాస్త్రి	మెక్‌లారెన్	1:30:55.026	–	25
2	లాండో నోరిస్	మెక్‌లారెన్	1:31:04.774	9.748 సెకన్లు	18
3	జార్జి రసెల్	మెర్సిడెస్	1:31:06.123	11.097 సెకన్లు	15
4	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:31:11.682	16.656 సెకన్లు	12
5	ఎస్టెబన్ ఒకాన్	మనీగ్రామ్ హాస్	1:31:44.995	49.969 సెకన్లు	10
6	ఆంటోనెలి	మెర్సిడెస్	1:31:48.774	53.748 సెకన్లు	8
7	ఆల్బోన్	విలియమ్స్	1:31:51.347	56.321 సెకన్లు	6
8	ఒలివెర్ బేర్మన్	మనీగ్రామ్ హాస్	1:31:56.329	61.303 సెకన్లు	4
9	లాన్స్ స్ట్రోల్	ఆస్టన్ మార్టిన్	1:32:05.230	70.204 సెకన్లు	2
10	కార్లోస్ సెయింజ్	విలియమ్స్	1:32:11.413	76.387 సెకన్లు	1



కాస్టనెడా

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టును గట్టెక్కించిన కాస్టనెడా

పనాజీ: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఆరో 'డ్రా' నమోదు చేసుకుంది. చర్చిల్ బ్రదర్స్ ఎఫ్‌సీ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టు 1–1 గోల్స్‌తో 'డ్రా' చేసుకుంది. ఇంటర్ కాశీ జట్టుతో జరిగిన గత మ్యాచ్‌లో స్టాపేజ్ టైమ్‌లో గోల్ సమర్పించుకొని గెలవాల్సిన మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు 'డ్రా'తో సరిపెట్టుకోగా... చర్చిల్ బ్రదర్స్ జట్టుతో స్టాపేజ్ టైమ్‌లో (90+11వ నిమిషంలో) గోల్ సాధించి ఓడిపోవాల్సిన మ్యాచ్‌లో 'డ్రా'తో గట్టెక్కింది. స్టాపేజ్ టైమ్‌లో లభించిన పెనాల్టీ కిక్‌ను శ్రీనిధి డెక్కన్ జట్టు స్టార్ ప్లేయర్ డేవిడ్ కాస్టనెడా గోల్‌గా మలిచాడు. ఈ లీగ్‌లో 'టాప్ గోల్‌స్కోరర్'గా కొనసాగుతున్న కాస్టనెడాకిది 15వ గోల్ కావడం విశేషం. అంతకుముందు 29వ నిమిషంలో పాపె గసామా చేసిన గోల్‌తో చర్చిల్ బ్రదర్స్ జట్టు 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 13 జట్లు పోటీపడుతున్న ఐ–లీగ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 20 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. ఇందులో 7 మ్యాచ్‌ల్లో గెలిచి, 7 మ్యాచ్‌ల్లో ఓడి, 6 మ్యాచ్‌లను 'డ్రా'గా ముగించి 27 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. శ్రీనిధి జట్టు తమ తదుపరి మ్యాచ్‌లో ఈనెల 30 గోకులం కేరళ ఎఫ్‌సీ జట్టుతో ఆడుతుంది.

కివీస్‌దే టి20 సిరీస్

- నాలుగో మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై 115 పరుగుల తేడాతో ఘనవిజయం
- మెరిసిన అలెన్, సీఫెర్ట్, డఫీ
- బుధవారం చివరి టి20

మౌంట్ మాంగనీ (న్యూజిలాండ్): బ్యాటర్ల దూకుడు... బౌలర్ల క్రమశిక్షణ తోడవడంతో... పాకిస్తాన్‌తో నాలుగో టి20లో న్యూజిలాండ్ ఘనవిజయం సాధించింది. ఆదివారం ఏకపక్షంగా సాగిన పోరులో ఆతిథ్య న్యూజిలాండ్ 115 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై గెలుపొందింది. ఫలితంగా 5 మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే 3–1తో సొంతం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్ (22 బంతుల్లో 44; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫిన్ అలెన్ (20 బంతుల్లో 50; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. బ్రేస్‌వెల్ (26 బంతుల్లో 46 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా... మార్క్ చాప్‌మన్ (24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిచెల్ (29; 1 ఫోర్, 1 సిక్స్) ఉన్నంతసేపు దూకుడు కనబర్చారు. పాకిస్తాన్ బౌలర్లలో హారిస్ రవూఫ్ 3, అబ్రార్ అహ్మద్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ పూర్తిగా తడబడింది. 16.2 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. మొత్తం జట్టులో అబ్దుల్ సమద్ (30 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇర్ఫాన్ ఖాన్ (24; 4 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. గత మ్యాచ్ సెంచరీ హీరో హసన్ నవాజ్ (1), కెప్టెన్ ఆఘా సల్మాన్ (1), మొహమ్మద్ హారిస్ (2), షాదాబ్ ఖాన్ (1), ఖుష్‌దిల్ షా (6) విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ 4, ఫోల్క్స్ 3 వికెట్లు పడగొట్టారు. కివీస్ ఓపెనర్ అలెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన చివరి టి20 బుధవారం వెల్లింగ్టన్‌లో జరుగుతుంది.

బాదుడే బాదుడు...

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు సీఫెర్ట్, అలెన్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. బౌలర్‌తో సంబంధం లేకుండా ఈ జోడీ ఎడాపెడా బౌండరీలతో చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఇన్నింగ్స్ ఆరంభ ఓవర్‌లో 2 సిక్స్‌లు బాదిన సీఫెర్ట్... అబ్రార్ వేసిన నాలుగో ఓవర్‌లో 6, 4, 6 కొట్టాడు. దీంతో 4 ఓవర్లు ముగిసేసరికి న్యూజిలాండ్ 54 పరుగులు చేసింది. మరో భారీ షాట్‌కు యత్నించి సీఫెర్ట్ అవుట్ కాగా... ఆ తర్వాత బాదే బాధ్యత అలెన్ తీసుకున్నాడు. బంతి తన పరిధిలో ఉంటే చాలు దానిపై విరుచుకుపడిన అలెన్... అబ్రార్ వేసిన ఏడో ఓవర్‌లో 2 ఫోర్లు, ఒక సిక్స్ కొట్టాడు. ఫలితంగా 8 ఓవర్లలోనే కివీస్ వంద పరుగుల మార్క్ దాటింది. షాదాబ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6, 6 కొట్టిన అలెన్ 19 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా... 10 ఓవర్లు ముగిసేసరికి న్యూజిలాండ్ 134/2తో నిలిచింది. ఈ దూకుడు చూస్తుంటే కివీస్ మరింత భారీ స్కోరు చేయడం ఖాయమే అనిపించినా... ఆ తర్వాత తేరుకున్న పాక్ బౌలర్లు ఒత్తిడి పెంచి కివీస్‌ను కాస్త కట్టడి చేశారు. చివర్లో బ్రేస్‌వెల్ కొన్ని చక్కటి షాట్లతో జట్టుకు మంచి స్కోరు అందించాడు.

పెవిలియన్‌కు 'క్యూ'

భారీ లక్ష్యఛేదనలో పాకిస్తాన్ ఏ దశలోనూ ఆకట్టుకోలేకపోయింది. ఇన్నింగ్స్ రెండో బంతికే హారిస్ క్లీన్‌బౌల్డ్ కాగా... గత మ్యాచ్‌లో సెంచరీతో జట్టుకు చక్కటి విజయాన్ని అందించిన హసన్ నవాజ్ రెండో ఓవర్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. బాధ్యతగా ఆడాల్సిన కెప్టెన్ సల్మాన్ కూడా కీపర్ క్యాచ్‌గా వెనుదిరగగా... ఇర్ఫాన్ ఖాన్ కాసేపు పోరాడాడు. షాదాబ్, ఖుష్‌దిల్ షా, అబ్బాస్ అఫ్రిది (1), షాహీన్ షా అఫ్రిది (6) ఇలా వచ్చి అలా వెళ్లారు. ఫలితంగా ఒక దశలో పాకిస్తాన్ 56 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి మరింత ఘోరం పరాజయం మూటగట్టుకునేలా కనిపించినా... ఆఖర్లో సమద్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టును వంద పరుగుల మైలురాయి దాటించాడు. కివీస్ బౌలర్లలో జాకబ్ డఫీ (4/20), ఫోల్క్స్ (3/25) కలిసి 7 వికెట్లు ఖాతాలో వేసుకున్నారు.



అలెన్

డఫీ

క్వార్టర్ ఫైనల్లో జైస్మీన్



గ్రేటర్ నోయిడా: జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో హరియాణాకు చెందిన జైస్మీన్ లంబోరియా క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గ్రేటర్ నోయిడా వేదికగా జరుగుతున్న ఈ టోర్నమెంట్ రెండో రౌండ్‌లో జైస్మీన్ రిఫరీ స్టాప్స్ ద కాంటెస్ట్ (ఆర్‌ఎస్‌సీ) పద్ధతిలో చండీగఢ్‌కు చెందిన రుచికపై విజయం సాధించింది. జైస్మీన్ ధాటికి రుచిక నిలవలేకపోవడంతో రిఫరీ బౌట్‌ను మధ్యలోనే నిలిపి వేశారు. గతంలో లైట్ వెయిట్ (59 కేజీల) విభాగంలో జాతీయ చాంపియన్‌గా నిలవడంతో పాటు 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్యం గెలిచిన జైస్మీన్... గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో ఫెదర్‌వెయిట్ (55 కేజీలు)కు మారింది. ఇతర బౌట్‌లలో రైల్వేస్‌కు చెందిన యూత్ వరల్డ్ చాంపియన్, జాతీయ చాంపియన్ సనమచా చాను... మణిపూర్‌కు చెందిన బింద్యాదేవిపై ఏకపక్ష విజయం సాధించింది. చాను పంచ్‌లకు బింద్యాదేవి నిలవలేకపోవడంతో రిఫరీ బౌట్‌ను నిలిపివేశారు.



ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించిన అనంతరం సంబరంలో భారత పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు

హారిక గేమ్ 'డ్రా'



నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి చెస్ నాలుగో అంచె టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్‌కు చెందిన ద్రోణవల్లి హారిక ఐదో 'డ్రా' నమోదు చేసుకుంది. అలెగ్జాండ్రా గొర్యాక్‌చినా (రష్యా)తో ఆదివారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌ను హారిక 37 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. 10 మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఎనిమిదో రౌండ్ తర్వాత హారిక 4.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా రెండో స్థానంలో ఉంది. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ 3.5 పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. నేడు జరిగే చివరిదైన తొమ్మిదో రౌండ్ గేముల్లో అనా ముజిచుక్ (ఉక్రెయిన్)తో హారిక; ఎలిజబెత్ పాట్జ్ (జర్మనీ)తో దివ్య తలపడతారు.



కమ్ముకుంటున్న చీకట్ల నడుమ ఠీవిగా నుంచున్న రియో డిజనిరో నగరంలోని ప్రఖ్యాత 'క్రైస్ట్, ద రిడీమర్' విగ్రహం. గ్లోబల్ అర్త్ అవర్ సందర్భంగా గంటపాటు లైట్లను ఆర్పేస్తున్న క్రమంలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

ప్రపంచంలోనే తొలి 3డీ ప్రింటెడ్ రైల్వేస్టేషన్


త్వరలో జపాన్‌లో నిర్మాణం

టోక్యో: ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా 3డీ ప్రింటెడ్ రైల్వేస్టేషన్ నిర్మాణానికి జపాన్‌లోని ఓ రైల్వే ఆపరేటింగ్ సంస్థ శ్రీకారం చుట్టింది. ఈ స్టేషన్ చుట్టుకొలత 108 చదరపు అడుగులు. జపాన్‌లో జనాభా పరంగా మూడో అతిపెద్ద నగరమైన ఒసాకా నుంచి 60 మైళ్ల దూరంలోని దక్షిణ వకయామ ప్రావిన్స్‌లో ఈ స్టేషన్‌ను నిర్మించబోతున్నట్లు వెస్ట్ జపాన్ రైల్వే(జేఆర్ వెస్ట్) సంస్థ తాజాగా ప్రకటించింది. ప్రస్తుతం ఇక్కడ కలపతో నిర్మించిన రైల్వే కాంప్లెక్స్ ఉంది. అది చాలావరకు దెబ్బతినడంతో పూర్తిగా కూల్చివేసి 3డీ ప్రింటెడ్ స్టేషన్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ కొత్త స్టేషన్ చిత్రాలను ఇప్పటికే విడుదల చేశారు. ఈ నెల 25వ తేదీ తర్వాత నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. సెరెండిక్స్ అనే నిర్మాణ సంస్థ సైతం ఇందులో భాగస్వామిగా మారుతోంది. 3డీ ప్రింటింగ్ టెక్నాలజీలో ఈ సంస్థకు మంచి అనుభవం ఉంది. కొత్త టెక్నాలజీతో రైల్వే స్టేషన్‌నిర్మాణం కేవలం ఆరు గంటల్లో పూర్తి కానుంది. జపాన్‌లో ప్రస్తుతం పనిచేసే సామర్థ్యం కలిగిన యువత సంఖ్య తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో శ్రామిక శక్తి అందుబాటులో లేకుండాపోతోంది. అందుకే తక్కువ సమయంలో నిర్మాణాలు పూర్తయ్యే టెక్నాలజీపై జపాన్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ సాయంతో తక్కువ మంది కార్మికులతో నిర్మాణాలు చకచకా పూర్తి చేయొచ్చు. ఇందులో భవనం విడిభాగాలను ముందుగానే తయారు చేస్తారు. నిర్మాణ స్థలానికి తీసుకెళ్లి వాటిని బిగించేస్తారు.



3డీ ప్రింటెడ్ రైల్వేస్టేషన్ నమూనా చిత్రం

న్యాయ వ్యవస్థపై... నమ్మకం పోతోంది



సీనియర్ న్యాయవాది, ఎంపీ సిబల్

న్యూఢిల్లీ: దేశ న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం తగ్గుతోందంటూ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయమూర్తుల నియామకం వంటి అంశాలు పద్ధతి ప్రకారం జరగడం లేదన్నారు. ఈ వాస్తవాన్ని న్యాయ వ్యవస్థతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించినప్పుడే మెరుగైన ప్రత్యామ్నాయం దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూడా అయిన సిబల్ శనివారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై తన మనోగతాన్ని వెల్లడించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నగదు దొరికిందన్న వార్తలపై స్పందించేందుకు నిరాకరించారు. ''దీనిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరుగుతోంది. ఇలాంటప్పుడు వాస్తవాలు తెలియకుండా మాట్లాడటం బాధ్యతాయుత పౌరుని లక్షణం కాదు'' అన్నారు. సిబల్ ఇంకా ఏం చెప్పారంటే...

ఈసీ ఓ విఫల వ్యవస్థ

కేంద్ర ఎన్నికల కమిషన్ ఓ విఫల వ్యవస్థ. రాజ్యాంగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేని ఈసీపై ప్రజలకు విశ్వాసం లేదు. వారి నమ్మకాన్ని తిరిగి ఎంత త్వరగా పొందగలిగితే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు అంతే అవకాశముంటుంది. ఈవీఎంలతోపాటు ఎన్నికల ప్రక్రియ కలుషితమైందని ప్రతిపక్షాలకు చెప్పాలనుకుంటున్నా. ఈసీ వెలువరించే ఫలితాలు అనేక దశల్లో ఎన్నికల ఫలితాలను తారుమారు చేశాక విడుదల చేసేవి అయి ఉండొచ్చు. ఇలాంటి వాటిని కలిసికట్టుగా పరిష్కరించుకోవాలి. విపక్ష ఇండియా కూటమి పార్టీలు కూటమిగా ఒకే అజెండాతో సాగాలి. సైద్ధాంతిక ప్రాతిపదిక, విధానాలు రూపొందించుకోవాలి. కూటమి అభిప్రాయాల వ్యక్తీకరణకు సమర్థుడైన ప్రతినిధి ఉండాలి. అప్పుడే కూటమి ప్రభావం చూపే అవకాశముంటుంది.

న్యాయవ్యవస్థలో అవినీతి మూడు రకాలు

మన న్యాయవ్యవస్థ పనితీరుపై ఏళ్లుగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అందులో ఒకటి అవినీతి. ఈ అవినీతికి అనేక కోణాలున్నాయి. వీటిలో ఒకటి న్యాయమూర్తి ప్రతిఫలం ఆశించి తీర్పులివ్వడం. రెండోది భయం, స్వార్థం లేకుండా తీర్పులిస్తామన్న ప్రమాణానికి భిన్నంగా తీర్పులివ్వడం. దీనికో ఉదాహరణ చెబుతాను. ప్రస్తుతం జిల్లా కోర్టు, సెషన్స్ కోర్టులు 95 శాతం కేసుల్లో బెయిల్‌ను తిరస్కరిస్తున్నాయి. ఇక్కడే తేడా జరుగుతోంది. బెయిలిస్తే అది వారి కెరీర్‌పై ప్రభావం చూపుతుందని భయపడుతున్నారేమో! మూడో రకం అవినీతి న్యాయమూర్తులు మెజారిటీ సంస్కృతిని బాహాటంగా ఆమోదిస్తుండటం, రాజకీయపరమైన వైఖరిని వ్యక్తం చేస్తుండటం. పశ్చిమ బెంగాల్‌లో ఓ న్యాయమూర్తి ఒక రాజకీయ పార్టీకి అనుకూల వైఖరిని వ్యక్తపరిచారు. తర్వాత రాజీనామా చేసి అదే పార్టీలో చేరిపోయారు. మరో జడ్జి తాను ఆర్ఎస్ఎస్ మద్దతుదారునంటూ బహిరంగంగానే ప్రకటించేశారు. భారత్‌లో మెజారిటీ సంస్కృతిదే పైచేయిగా ఉండాలని అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ యాదవ్ వీహెచ్‌పీకి సంబంధించిన కార్యక్రమంలోనే వ్యాఖ్యలు చేశారు. హిందువులు మాత్రమే ఈ దేశాన్ని విశ్వగురువుగా మార్చగలరనడమే గాక మైనారిటీ సమాజాన్ని అవమానించేలా మాట్లాడారు. ఆయనపై జరిపిన రహస్య విచారణ ఫలితం ఏమైందో ఎవరికీ తెలియదు. ఇలాంటి వ్యవహారాలను సరైన గాడిలో పెట్టాలి. ఇలాంటి వివాదాంశాలపై సుప్రీంకోర్టు తక్షణం స్పందించి ఎందుకు పరిష్కరించలేకపోతోందో అర్థం కావడం లేదు!

ప్రత్యామ్నాయమే లేదు!

అవినీతికి పాల్పడిన న్యాయమూర్తులపై రాజ్యాంగంలోని 124వ అధికరణం కింద చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు 50 మందికి మించిన రాజ్యసభ సభ్యుల సంతకాలతో పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెడతారు. ఇదంత త్వరగా తెమిలేది కాదు. గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై పెట్టిన తీర్మానం వీగిపోయింది. న్యాయమూర్తులపై రాజ్యాంగ ప్రక్రియ ద్వారా ముందుకు వెళ్లలేనప్పుడు ఇతర ప్రభావవంతమైన ప్రత్యామ్నాయ మార్గాలు లేనే లేవు. ఇలాంటప్పుడు ఏం చేయాలి? ఈ ప్రశ్న న్యాయవ్యవస్థ తనకు తాను వేసుకోవాలి. ఇక్కడే న్యాయ వ్యవస్థపై నమ్మకం క్షీణిస్తున్నట్టు కనిపిస్తోంది. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తులను నియమించే కొలీజియం వ్యవస్థపై విమర్శలు పోవాలంటే ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కలిసి ప్రత్యామ్నాయం ఆలోచించాలి. కొలీజియం ఆశించినట్టుగా పనిచేయడం లేదని సుప్రీంకోర్టు గ్రహించాలి. కేవలం నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ)తో సమస్య పరిష్కారం కాదని కేంద్రం కూడా అర్థం చేసుకోవాలి. అప్పుడే ఇది సాధ్యం.

మణిపూర్‌లో శాంతికి కట్టుబడి ఉన్నాం

ఇంఫాల్: మణిపూర్‌లో తిరిగి శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో పురోగతి సాధించామని, మరింత ముందుకు సాగాల్సిన అవసరముందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్ చెప్పారు. మణిపూర్ హైకోర్టు 12వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రపతి పాలన విధించాక, రాష్ట్రంలో శాంతి నెలకొల్పడంపై పార్లమెంట్ ఉభయసభల్లోనూ చర్చ జరిగిందన్నారు. త్వరలో తిరిగి ప్రశాంత వాతావరణాన్ని సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు దొరికాయంటూ వస్తున్న వార్తలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావిస్తూ.. ఈ అంశంపై సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో వేసిన కమిటీ నివేదిక అందాకే దీనిపై స్పందిస్తామని చెప్పారు. జస్టిస్ యశ్వంత్ వర్మకు న్యాయపరమైన విధులేవీ అప్పగించవద్దని కోరామని చెప్పారు. కార్యక్రమంలో గవర్నర్ అజయ్ భల్లా, సుప్రీంకోర్టు జడ్జీలు పాల్గొన్నారు. బీఆర్ గవాయ్ సారథ్యంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మణిపూర్‌లో పర్యటన జరుపుతున్న విషయం తెలిసిందే.

యూఎస్ మాజీ అటార్నీ అనుమానాస్పద మృతి

ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాజీనామా చేసిన జెస్సికా అబెర్

వర్జీనియా: అమెరికాలో మాజీ అటార్నీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వర్జీనియా ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ (ఈడీవీఏ) అటార్నీగా పనిచేసిన జెస్సికా అబెర్ శనివారం తన నివాసంలో అపస్మారక స్థితిలో కనిపించారు. ఉదయం 9.18 గంటలకు సమాచారం అందుకున్న పోలీసులు నివాసానికి చేరుకుని.. అబెర్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మరణానికి గల కారణాలు తెలియరాలేదు. 2021లోఅప్పటి అధ్యక్షుడు జో బైడెన్ నామినేట్ చేసిన జెస్సికా అబెర్.. ట్రంప్ అధికారం చేపట్టిన మరుసటి రోజే రాజీనామా చేశారు. 2009లో ఈడీవీఏలో అసిస్టెంట్ యూఎస్ అటార్నీగా తన వృత్తిని ప్రారంభించిన 43 ఏళ్ల అబెర్.. తన 15 ఏళ్ల కెరీర్‌లో అసాధారణ సేవలందించారు.

జైల్లో ఉన్నా నమాజు చేసుకోవచ్చు

జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తికి అలహాబాద్ హైకోర్టు ఊరట

లక్నో: జైలు అధికారులు నమాజు చేసుకోనివ్వడం లేదని, ఖురాన్‌ను స్వాధీనం చేసుకున్నారని పేర్కొంటూ హత్య కేసులో జీవిత కారాగారం అనుభవిస్తున్న ఓ వ్యక్తి వేసిన పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు సానుకూలంగా స్పందించింది. రంజాన్ నెలలో మతాచారం ప్రకారం ఐదుసార్లు అతడు నమాజు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని, ఖురాన్‌ను తిరిగి ఇచ్చేయాలని ఎటావా సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. మతాచారాల విషయంలో జోక్యం చేసుకోవద్దని సూచించింది. రంజాన్ నెలలో ఆచారం ప్రకారం తన భర్త నమాజు చేసుకోకుండా అడ్డుకుంటున్నారంటూ జీవిత ఖైదీ భార్య వేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈ నెల 17న ఈ మేరకు తీర్పు వెలువరించింది. అదే సమయంలో, హై సెక్యూరిటీ కలిగిన ఖైదీకి సంబంధించిన భద్రతా పరమైన ఇతర రోజువారీ చర్యల అమలును కొనసాగించవచ్చని అధికారులకు సూచించింది.

బెంగళూరులో భారీ వర్షం

చెట్టు కూలి పడి మూడేళ్ల చిన్నారి మృతి

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరు ఆదివారం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షంతో అతలాకుతలమైంది. చెట్టు కూలి పడిన ఘటనలో మూడేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. విపరీతమైన ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న జనానికి వాన ఉపశమనం కలిగించినా నగరంలోని రోడ్లు, లోతట్టు ప్రాంతాలు వరదతో నిండిపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. దాదాపు అరగంట సమయంలోనే బెంగళూరు ఉత్తర ప్రాంతంలో 53 మిల్లీమీటర్లు, మిగతా చోట్ల 40 మిల్లీమీటర్ల వర్షం పడిందని వాతావరణ విభాగం తెలిపింది. ఈ సీజన్‌లో ఇదే మొదటి వర్షమని చెప్పారు. వర్షానికి ఈదురుగాలులు తోడు కావడంతో 30 చోట్ల చెట్లు నేల కూలగా మరో 48 చోట్ల చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడినట్లు అధికారులు తెలిపారు. చెట్టు విరిగిపడిన ఘటనలో ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. అననుకూల వాతావరణం కారణంగా బెంగళూరు రావాల్సిన 10 విమానాలను చెన్నైకి దారి మళ్లించామన్నారు.

షాక్ కాలర్‌తో పిల్లాడి నిర్బంధం

తల్లి, అమ్మమ్మ అరెస్టు

వాషింగ్టన్: చెబితే వినడం లేదని.. కుక్కల మెడకు తగిలించే షాక్ కాలర్‌ను పిల్లాడికి తగిలించింది తల్లి. బాలుడిని నిర్బంధించిన తల్లిని, వివరాలు బయటికి చెప్పకుండా ఉన్నందుకు అమ్మమ్మను అరెస్టు చేశారు పోలీసులు. ఈ ఘటన అమెరికాలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ బాలుడు మార్చి 17న పాఠశాలకు వచ్చాడు. పిల్లాడి మెడ చుట్టూ ఎలక్ట్రిక్ షాక్ వల్ల కలిగిన కమిలిన గాయాలు కనిపించాయి. అది గమనించిన పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు బాలుడి ఇంటిని తనిఖీ చేశారు. అతని పడక గదిలో కుక్క షాక్ కాలర్ దొరికింది. పోలీసులు ప్రశ్నించగా.. అది చనిపోయిన తమ కుక్కదని, తను ఇంట్లో ఉన్నప్పుడు తన తల్లి కింబర్లీ క్రూజ్–ఫెలిసియానో (30) దానితో తనను నిర్బంధిస్తారని, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని బెదిరించారని చెప్పాడు. దీంతో కింబర్లీని, ఈ విషయాలు దాచినందుకు, కింబర్లీ తల్లి 59 ఏళ్ల సోనియా ఫెలిసియానోను పోలీసులు అరెస్టు చేశారు. అవాంఛితంగా ప్రవర్తించకుండా నిరోధించడానికి కుక్క మెడకు ఈ షాక్ కాలర్‌ను కడతారు. రిమోట్‌తో నడిచే ఈ పరికరం ఎలక్ట్రికల్ షాక్ ఇస్తుంది.

సంభాల్ అల్లర్ల కేసులో మసీదు కమిటీ చీఫ్ అరెస్ట్

సంభాల్: సంభాల్ అల్లర్ల కేసులో షాహీ జామా మసీదు కమిటీ అధ్యక్షుడు జాఫర్ అలీని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. హింసాకాండకు సంబంధించి వాంగ్మూలం నమోదు చేసేందుకు మసీదు కమిటీ చీఫ్‌ను స్థానిక పోలీసు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అదుపులోకి తీసుకుంది. కోర్టు ఆదేశాల మేరకు జాఫర్ అలీని అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. అంతకుమించిన వివరాలు వెల్లడించలేదు. అయితే సోమవారం త్రిసభ్య జ్యుడీషియల్ కమిషన్ ముందు తన వాంగ్మూలాన్ని సమర్పించకుండా అడ్డుకోవడానికే అలీని అరెస్టు చేశారని ఆయన సోదరుడు తాహిర్ అలీ ఆరోపించారు. ''ఉదయం 11:15 గంటలకు, ఒక ఇన్‌స్పెక్టర్, కేసు దర్యాప్తు అధికారి మా ఇంటికి వచ్చారు. సీఓ (సర్కిల్ ఆఫీసర్) కుల్దీప్ సింగ్ మాట్లాడాలనుకుంటున్నారని చెప్పారు. నిజానికి నిన్న రాత్రి కూడా ఆయన మాతో మాట్లాడారు. మళ్లీ మాట్లాడాల్సిన అవసరం లేదు. జాఫర్ సోమవారం కమిషన్ ముందు సాక్ష్యం చెప్పాల్సి ఉంది. దాన్ని అడ్డుకోవడానికి కావాలనే ఆయనను జైలుకు పంపుతున్నారు' అని మీడియాకు తెలిపారు. జాఫర్ ఇప్పటికే విలేకరుల సమావేశంలో తన వాంగ్మూలం ఇచ్చారని, దానిని వెనక్కి తీసుకోబోమని ఆయన స్పష్టం చేశారు. పోలీసుల కాల్పుల్లోనే వారు చనిపోయారని ఆయన స్పష్టంగా చెప్పారు. పోలీసులు తీసుకెళ్లేముందు 'నో ప్రాబ్లమ్, నేను జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను' అని అన్నారు.

కుమారునికి డిస్నీలాండ్ చూపించి... గొంతు కోసి చంపేసింది!

- అమెరికాలో భారత సంతతి మహిళ ఘాతుకం
- అనంతరం ఆత్మహత్యాయత్నం



సరితా రామరాజు

న్యూయార్క్: పిల్లలకు తల్లి ఒడిని మించిన స్వర్గం లేదంటారు. కానీ అమెరికాలో ఓ కన్నతల్లే కొడుకు ప్రాణాలు తీసింది. సరితా రామరాజు అనే భారత సంతతికి చెందిన మహిళ ఈ ఘాతుకానికి పాల్పడింది. తన 11 ఏళ్ల కొడుకు యతిన్‌కు మూడు రోజుల పాటు డిస్నీలాండ్ తిప్పి చూపించింది. తర్వాత హోటల్ గదిలో గొంతు కోసి చంపేసింది. తానూ ఆత్మహత్య చేసుకుంటున్నట్టు 911కు ఫోన్ చేసి చెప్పింది. వాళ్లు వచ్చేసరికే బాలుడు శవమై కనిపించాడు. అపస్మారక స్థితిలో ఉన్న సరితను ఆస్పత్రికి తరలించారు. బాలుడు చనిపోయాకే ఆమె 911కు ఫోన్ చేసినట్లు పోస్టుమార్టంలో తేలింది. వంటకు ఉపయోగించే పెద్ద కత్తి హోటల్ గదిలో దొరికింది. దాంతోనే పొడిచి చంపినట్టు భావిస్తున్నారు. ఆమెకు 26 ఏళ్ల నుంచి యావజ్జీవ శిక్ష దాకా పడవచ్చని కాలిఫోర్నియాలోని ఆరెంజ్ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం తెలిపింది. సరితది బెంగళూరు. భర్త ప్రకాశ్ రాజుతో 2018లో విడాకులు తీసుకుంది. కొడుకు యతిన్ రాజును కోర్టు తండ్రి సంరక్షణలో ఉంచింది. సరితకు సందర్శన హక్కులు మాత్రమే లభించాయి. విడాకుల తర్వాత సరిత కాలిఫోర్నియా నుంచి వర్జీనియాలోని ఫెయిర్‌ఫాక్స్‌కు మారింది. యతిన్‌ను తనకు అప్పగించాలంటూ గత నవంబర్‌లో పిటిషన్ దాఖలు చేసింది. ''కొడుకు వైద్యం, స్కూలింగ్ వంటి నిర్ణయాలు తన ప్రమేయం లేకుండానే తీసుకుంటున్నారు. నా మాజీ భర్తకు మాదక ద్రవ్యాల వ్యసనముంది. మద్యం, ధూమపానం మత్తులో ఉంటాడు'' అని ఆరోపించింది. ఇటీవల కొడుకును చూసేందుకు సరిత శాంటా అనాకు వచ్చింది. తనను మూడు రోజులూ డిస్నీల్యాండ్‌కు తీసుకెళ్లింది. ఈ నెల 19న కొడుకును తండ్రికి అప్పగించాల్సి ఉంది. ఆ రోజు ఉదయం 9.12కు ఈ ఘాతుకానికి పాల్పడింది. తనపై సరిత ఆరోపణలన్నీ అవాస్తవమని ప్రకాశ్ అన్నాడు. ''ఆమెకు తీవ్రమైన మానసిక సమస్యలున్నాయి. తనతో మాట్లాడేందుకే యతిన్ భయపడేవాడు'' అని ఆరోపించారు.

తిండి వద్దు.. డ్రగ్సే ముద్దు

మీరట్ హత్యకేసు నిందితులు ముస్కాన్, సాహిల్ డిమాండ్



మీరట్: ప్రేమికుడితో కలిసి భర్తను చంపిన కేసులో నిందితులుగా ఉన్న ముస్కాన్, సాహిల్ ఆహారం తీసుకోవడం లేదని, డ్రగ్స్ కావాలని అడుగుతున్నారని జైలు వర్గాలు వెల్లడించాయి. మాదకద్రవ్యాలకు బానిసలైన ఇద్దరూ ప్రస్తుతం మీరట్‌లోని చౌదరి చరణ్‌సింగ్ జిల్లా జైల్లోని డీ అడిక్షన్ సెంటర్‌లో అబ్జర్వేషన్‌లో ఉన్నారు. మహిళల బ్యారక్‌లో ఉన్న ముస్కాన్ జైలులో అడుగుపెట్టినప్పటి నుంచి తీవ్ర మనోవేదనతో ఉంది. ఏమీ తినడం లేదు. జైలు అధికారులు ఆమెకు నచ్చజెప్పి భోజనం చేయించారు. మౌనంగా ఉంటున్న సాహిల్ డ్రగ్స్ కావాలని అడుగుతున్నాడు. వారు డ్రగ్స్ సైడ్ ఎఫెక్టులతో బాధపడుతున్నారని సీనియర్ జైలు సూపరింటెండెంట్ డాక్టర్ వీరేశ్ రాజ్ శర్మ తెలిపారు. మర్చంట్ నేవీ మాజీ అధికారి అయిన సౌరభ్ రాజ్‌పుత్‌ను ఎలా హత్య చేశారనే విషయం ఇప్పటికే వెల్లడి కాగా, ఎంత క్రూరంగా చంపారేనే విషయాన్ని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. రాజ్‌పుత్ గుండెపై ముస్కాన్ మూడుసార్లు పొడిచింది. తరువాత తలను తెగనరికింది. చేతులను మణికట్టు దగ్గర కోసేసింది. కాళ్లను వెనక్కు వంచి డ్రమ్ములో ఇరికించింది. షాక్, రక్తస్రావంతో ప్రాణాలు పోయినట్టు పోస్టుమార్టం చేసిన వైద్యులు తెలిపారు. సౌరభ్, ముస్కాన్ పాఠశాల దశ నుంచి మిత్రులు. 2016లో పెళ్లి చేసుకున్నారు. వారికి ఆరేళ్ల కుమార్తె ఉంది. ముస్కాన్ తీరు నచ్చని సౌరభ్ కుటుంబం పెళ్లిని వ్యతిరేకించింది. దాంతో వాళ్లు బయటికొచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నారు. కొంతకాలం దూరంగా ఉన్న వాళ్లు 2019లో వాట్సాప్ గ్రూప్ ద్వారా మళ్లీ కలిశారు. ముస్కాన్ తన ప్రియుడు సాహిల్‌తో కలిసి మార్చి 4న సౌరభ్‌కు మత్తుమందు ఇచ్చి హత్య చేసింది. మృతదేహాన్ని ముక్కలు చేసి డ్రమ్ములో వేసి సిమెంట్‌తో సీల్ చేశారు. తర్వాత ఆరు రోజులు హిమాచల్ ప్రదేశ్‌లో హోటల్లో గడిపారు. సౌరభ్ కుటుంబ సభ్యులకు అనుమానం రాకుండా అతని ఫోన్ నుంచే వారికి మెసేజ్‌లు పంపుతూ వచ్చారు. మార్చి 18న కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముస్కాన్, సాహిల్ అరెస్టుతో ఘోరం బయట పడింది.

రద్దీ నియంత్రణకు రైల్వే శాఖ కొత్త ఫార్ములా

రైలు సామర్థ్యాన్ని బట్టి టికెట్ల విక్రయం

సాక్షి, న్యూఢిల్లీ: రైళ్లతోపాటు రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీని నియంత్రించడం కోసం రైల్వేశాఖ కొత్త విధానాన్ని అమలు చేయనుంది. రైలు సామర్థ్యాన్ని బట్టి టికెట్లు విక్రయించడంతోపాటు పరిమిత సంఖ్యలోనే ప్రయాణికులు ప్రయాణించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అపరిమితంగా టికెట్లు విక్రయించే ఆనవాయితీకి ఇకపై రెడ్ సిగ్నల్ వేయనుంది. రైలు నంబర్‌ను జనరల్ టికెట్ మీద కూడా స్పష్టంగా ముద్రించనుంది. ప్రస్తుతం సీట్ల సంఖ్యతో సంబంధం లేకుండా జనరల్ టికెట్లు విక్రయిస్తున్నారు. ఫలితంగా జనరల్ బోగీల్లో సామర్థ్యానికి మించి ప్రయాణిస్తున్నారు. ఆన్‌లైన్‌తో పాటు రైల్వే స్టేషన్ కౌంటర్లలో అమ్ముడైన టికెట్ల సంఖ్య ఎంతనే విషయం రియల్ టైమ్‌లో తెలియని పరిస్థితి. కొత్త ఫార్ములాలో టికెట్ల విక్రయాల రియల్ టైమ్ డేటాను కూడా అందుబాటులో ఉంచనున్నారు. టికెట్ల అమ్మకాలను పూర్తిగా నియంత్రించే అధికారాన్ని ఇకపై స్టేషన్ మాస్టర్‌కు ఇవ్వాలని రైల్వే శాఖ భావిస్తోంది. మొత్తం రైళ్ల సంఖ్య, అందులో ప్రయాణీకుల సామర్థ్యం ఆధారంగా టికెట్ విక్రయాలను కొనసాగించడం లేదా నిలిపివేసేలా స్టేషన్ మాస్టర్ నిర్ణయం తీసుకుంటారు. ఈ వ్యవస్థ 4 నుంచి 6 నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ ప్రయత్నాలు చేపట్టింది.

వ్యాధులకు ఆర్ట్ థెరపీ

స్విట్జర్లాండ్‌లో వినూత్న ప్రయత్నం

సంగీతం మనసుకు ఆనందాన్ని ఇవ్వడమే కాదు, ఆ సందర్భంగా విడుదలయ్యే హార్మోన్లు రోగాలను నయం చేస్తాయని కూడా చెబుతారు. దాన్నే మ్యూజిక్ థెరపీగా పిలుస్తారు. అలాంటిదే మరో వినూత్న చికిత్స స్విట్జర్లాండ్ అందుబాటులోకి తెచ్చింది. అదే ఆర్ట్ థెరపీ. తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారా? అనారోగ్యంతో బాధపడుతున్నారా? జబ్బుతో పోరాడటానికి కొంచెం ఎనర్జీ కావాలా? లేదంటే ఏదైనా సర్జరీకి వెళ్లేందుకు సన్నద్ధమవ్వాలా? అయితే మీరు న్యూచాటెల్ పట్టణానికి వెళ్లాలి. ఈ ఆర్ట్ థెరపీ కోసం మీరు డబ్బులు కట్టాల్సిన పనిలేదు.. అక్కడి డాక్టర్లు అందించే 'మ్యూజియం ప్రిస్క్రిప్షన్' ఉంటే చాలు...!

కళలు మానసిక ఆరోగ్యాన్ని పెంచుతాయని, గాయాలను మాన్పుతాయని, బలహీనత, అకాల మరణాలను తగ్గిస్తాయని 2019లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించింది. కళ ఏదైనా సరే.. మనస్సుకు విశ్రాంతి ఇస్తుందని చెప్పింది. ఈ నివేదిక ఆధారంగా రెండేళ్ల పైలట్ ప్రాజెక్టు కింద న్యూచాటెల్ అధికారులు నాలుగు మ్యూజియంలను ఈ చికిత్సకు అందుబాటులోకి తెచ్చారు. అది కూడా ఉచితంగా. వైద్యులు మ్యూజియం ప్రిస్క్రిప్షన్లు ఇస్తే చాలు.. ఈ నాలుగు మ్యూజియంలలోకి ఉచితంగా అనుమతిస్తారు. ఇక్కడికి వచ్చిన రోగులు వివిధ రకాల కళాఖండాలను చూడటం, అనుభూతి చెందడం వల్ల వారి ఆరోగ్యం మెరుగుపడుతుందని చెబుతున్నారు. ఇప్పటివరకు 500 ప్రిస్క్రిప్షన్లను పట్టణంలోని వైద్యులకు అధికారులు పంపిణీ చేశారు. దీని కోసం 11,300 డాలర్ల బడ్జెట్‌ను కేటాయించారు. ఇది విజయవంతమైతే ఈ కార్యక్రమాన్ని థియేటర్, నృత్యం వంటి ఇతర కళాత్మక కార్యకలాపాలకు విస్తరించాలనే ఆలోచనల్లో ఉన్నారు. ఫలితాలు సానుకూలంగా ఉంటే.. ఏదో ఒకరోజు ఈ చికిత్స ఖర్చు స్విస్ జాతీయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో కూడా చేరుతుందని ఆశిస్తున్నారు. ఇది గొప్ప ఆలోచనని, ప్రపంచంలోని అన్ని మ్యూజియంలకు ఇలాంటి ప్రిస్క్రిప్షన్లు ఉంటే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

మ్యూజియంల సందర్శన వల్ల రోగులు డిప్రెషన్ నుంచి బయటపడొచ్చని వైద్యులు కూడా అంటున్నారు. నడవడానికి ఇబ్బంది పడేవారు, దీర్ఘ కాలిక అనారోగ్యంతో ఉన్నవారికి ఈ చికిత్స మేలు చేస్తుందని చెబుతున్నారు. దీనివల్ల రోగులు ఇంటినుంచి బయటకు రావడమేకాదు.. ఎక్కువ సేపు నడుస్తారని, ఈ రెండూ వారికి అదనపు ప్రయోజనం చేకూరుస్తాయంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

50 మైళ్ల విస్తీర్ణంలో... చైనాలో మెగా ఫ్యాక్టరీ!

బీజింగ్: వినూత్న, భారీ ప్రాజెక్టులకు పెట్టింది పేరైన చైనా దేశం మరోమారు తన భారీతనాన్ని చాటుకుంటోంది. ఏకంగా ఒక నగరం కంటే పెద్ద స్థాయిలో నూతనంగా ఫ్యాక్టరీని నిర్మిస్తోంది. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో సిటీ కంటే ఎక్కువ విస్తీర్ణంలో అంటే దాదాపు 32,000 ఎకరాల విస్తీర్ణంలో ఈ కర్మాగారం నిర్మాణ పనులు చకచకా పూర్తవుతున్నాయి. హెనాన్ ప్రావిన్సులోని ఝెన్‌ఝూ నగరం శివారు ప్రాంతంలో బీవైడీ సంస్థ ఈ ఫ్యాక్టరీని నిర్మిస్తోంది. అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలను ఈ కర్మాగారంలో తయారుచేయనున్నారు. తాజాగా ఈ ఫ్యాక్టరీకి సంబంధించిన ఒక డ్రోన్ వీడియో ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమవడంతో సామాజిక మాధ్యమాల్లో దీని గురించి చర్చ మొదలైంది. ఉత్పత్తి యూనిట్లు, పెద్ద భవనాలు, టెన్నిస్ కోర్టు, ఫుట్‌బాల్ మైదానాలతో సకల సదుపాయాలతో కర్మాగార పనులు కొనసాగుతున్నాయి. రోజు ఇక్కడ పనిచేసే కార్మికులతో ఇప్పటికే ఈ ప్రాంతం కొత్త సిటీలా మారిపోయిందని డ్రోన్ వీడియోను చూస్తే అర్థమవుతోంది. ఇప్పటికే ఇదే ప్రాంత సమీపంలో బీవైడీ కంపెనీకి ఒక ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీ.. అమెరికాలో నెవడా రాష్ట్రంలో విద్యుత్‌కార్ల దిగ్గజం టెస్లాకు చెందిన ఫ్యాక్టరీ కంటే విస్తీర్ణంలో పెద్దదికావడం విశేషం. కొత్త ఫ్యాక్టరీని ఎనిమిది బ్లాకులుగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే బీవైడీ కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా 9,00,000 మంది సిబ్బంది ఉన్నారు. మరో మూడు నెలల్లో 2,00,000 మంది సిబ్బందిని కొత్తగా నియమించుకోనున్నారు. ఝెన్‌ఝూ నగరంలో నిర్మిస్తున్న కొత్త కర్మాగారంలో రోజు 60,000 మంది కార్మికులు పనిచేస్తుండటంతో ఇప్పుడు అదొక కొత్త సిటీలా కనిపిస్తోందని ఒక నెటిజన్ అన్నారు.

విద్య, ఉద్యోగ సమాచారం

టీజీ ఐసెట్-2025

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీజీ ఐసెట్)-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం(ఎంజీయూ) నిర్వహించనుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సులు:** మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ)/మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ).
- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఎంబీఏ కోర్సుకు బీఏ, బీకాం,బీఎస్సీ, బీబీఏ, బీబీఎం, బీసీఏ, బీఈ, బీటెక్, బీఫార్మసీ, ఎంసీఏ కోర్సుకు బీసీఏ, డిగ్రీ(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్), బీఎస్సీ, బీకాం, బీఏ(ఇంటర్/డిగ్రీ స్థాయిలో గణితం సబ్జెక్టు చదివి ఉండాలి) ఉత్తీర్ణులై ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.05.2025
- **రూ.250 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 17.05.2025.
- **రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 26.05.2025.
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ తేది:** 28.05.2025 నుంచి
- **పరీక్షల తేదీలు:** 08.06.2025, 09.06.2025.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://icet.tgche.ac.in

ఐఎంయూ, చెన్నైలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

చెన్నైలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్శిటీ (ఐఎంయూ)2025-25 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ,పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఐఎంయూ సెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- **యూజీ కోర్సులు:** నాలుగేళ్ల బీటెక్(మెరైన్ ఇంజనీరింగ్), నాలుగేళ్ల బీటెక్(నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్), నాలుగేళ్ల బీటెక్ (నావల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్‌బిల్డింగ్), మూ డేళ్ల బీఎస్సీ (నాటికల్ సైన్స్), మూడేళ్ల బీబీఏ (లాజిస్టిక్స్, రిటైలింగ్ అండ్ ఈ-కామర్స్), మూడేళ్ల అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ బీబీఏ (మారిటైమ్ లాజిస్టిక్స్)
- **పీజీ కోర్సులు:** రెండేళ్ల ఎంబీఏ(ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్), రెండేళ్ల ఎంబీఏ(పోర్ట్ అండ్ షిప్పింగ్ మేనేజ్‌మెంట్), రెండేళ్ల ఎంటెక్(మెరైన్ టెక్నాలజీ), రెండేళ్ల ఎంటెక్(నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్), రెండేళ్ల ఎంటెక్(డ్రెడ్జింగ్ హార్బర్ ఇంజనీరింగ్), రెండేళ్ల ఎంటెక్(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్), రెండేళ్ల ఎంబీఏ(పోర్ట్ అండ్ షిప్పింగ్ లాజిస్టిక్స్).
- **అర్హత:** యూజీ ప్రోగ్రామ్‌లకు 10+2/సంబంధిత విభాగంలో బీఎస్సీ/బీఈ/బీటెక్ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు వ్యాలిడ్ ఐఎంయూ సెట్ స్కోరు కలిగి ఉండాలి. పీజీ కోర్సుకు సంబంధిత విభాగాల్లో డిగ్రీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు ఐఎంయూ సెట్/ గేట్/సీయూఈటీ(పీజీ)స్కోరు కలిగి ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, మెడికల్ సర్టిఫికేట్‌ల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **కోర్సులను అందించే క్యాంపస్‌లు:** చెన్నై, కోల్‌కతా,ముంబై, విశాఖపట్నం, కొచ్చి, నవీ ముంబై, గతిశక్తి, ఇండియన్ మారిటైమ్ యూనివర్శిటీ.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.05.2025
- **ఐఎంయూ సెట్ పరీక్ష తేది:** 24.05.2025.
- **వెబ్‌సైట్:** https://www.imu.edu.in

డీసీహెచ్‌ఎస్ ప్రకాశం జిల్లాలో 16 పోస్టులు

ప్రకాశం జిల్లా డీసీహెచ్‌ఎస్ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఏరియా ఆసుపత్రుల్లో ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
- **పోస్టుల వివరాలు:** ఆడియోమెట్రిక్ టెక్నీషియన్-01, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2-02, థియేటర్ అసిస్టెంట్-03, ఆఫీస్ సబార్డినేట్-02, పోస్ట్‌మార్టమ్ అసిస్టెంట్-02, జనరల్ డ్యూటీ అటెండెంట్-06.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో బీఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. డీఎంఎల్‌టీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏడాది అప్రెంటిస్‌షిప్ చేసి ఉండాలి.
- **వయసు:** 01.07.2024 నాటికి 42 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** ఆడియోమెట్రిక్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2 పోస్టులకు రూ.32,670, ఇతర పోస్టులకు రూ.15,000.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ ఆఫ్ ది డీసీహెచ్‌ఎస్ ప్రకాశం చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 24.03.2025.
- **వెబ్‌సైట్:** https://prakasam.ap.gov.in

సత్వర ఉపాధికి పాలిటెక్నిక్ డిప్లొమా

పదో తరగతి నుంచే ఇంజనీరింగ్ కోర్సుల వైపు అడుగుపెట్టాలనుకునే వారికి సరైన వేదికలుగా పాలిటెక్నిక్స్‌ను పేర్కొనొచ్చు. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకుంటే.. ఉద్యోగ అవకాశాలతోపాటు ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో అడుగుపెట్టే అవకాశం లభిస్తుంది. పాలిసెట్(పాలిటెక్నిక్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)లో ర్యాంకు ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ పాలిసెట్ 2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. పాలిసెట్ పరీక్ష, అందుబాటులో ఉన్న కోర్సులు, ఈ డిప్లొమా కోర్సులతో ఉన్నత విద్య, ఉపాధి మార్గాలపై ప్రత్యేక కథనం..



» ఏపీ పాలిసెట్-2025 నోటిఫికేషన్ విడుదల
» పాలిసెట్‌లో ర్యాంకుతో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం
» తక్షణమే ఉపాధి, ఉన్నత విద్య అవకాశాలకు మార్గం

ఏపీలో 279 పాలిటెక్నిక్స్

ఏపీ పాలిసెట్ ద్వారా ఏపీ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలోని 88 ప్రభుత్వ, 191 ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌లో 30 బ్రాంచ్‌లలో డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. వీటిలో ప్రభుత్వ పాలిటెక్నిక్స్‌లో 18,141 సీట్లు, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌లో దాదాపు 70 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. పాలిటెక్నిక్స్‌లోని డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి పాలిటెక్నిక్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహిస్తారు.

అర్హతలు

పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి. 2025లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

120 మార్కులకు పరీక్ష

ఏపీ పాలిసెట్‌ను మూడు సబ్జెక్ట్‌లలో 120 మార్కులకు ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్(50 ప్రశ్నలు-50 మార్కులు), ఫిజిక్స్(40 ప్రశ్నలు-40 మార్కులు), కెమిస్ట్రీ (30 ప్రశ్నలు-30 మార్కులు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 120 ప్రశ్నలతో రెండు గంటల వ్యవధిలో పరీక్ష జరుగుతుంది.

ఉమ్మడి కౌన్సెలింగ్‌తో సీట్లు భర్తీ

పాలిసెట్‌లో అర్హత ఆధారంగా ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశం కల్పిస్తారు. సీట్ అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు సంబంధిత పాలిటెక్నిక్ కళాశాలలో నిర్దేశిత తేదీలోగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

డిప్లొమా కోర్సులు ఇవే

సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఈసీఈ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, 3-డి యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, అపరెల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మెటలర్జికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్(ఆయిల్ టెక్నాలజీ), కెమికల్ ఇంజనీరింగ్ (పెట్రో కెమికల్స్), కెమికల్ ఇంజనీరింగ్ (ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్), కెమికల్ ఇంజనీరింగ్ (షుగర్ టెక్నాలజీ), సెరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ, లెదర్ అండ్ గూడ్స్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజనీరింగ్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, ప్రింటింగ్ టెక్నాలజీ, హోమ్ సైన్స్, మైనింగ్ ఇంజనీరింగ్ తదితర కోర్సులు అందుబటులో ఉన్నాయి.

స్కాలర్‌షిప్ సదుపాయం

- పాలిసెట్ ర్యాంకుతో డిప్లొమా కోర్సుల్లో చేరిన వారికి స్కాలర్‌షిప్ సదుపాయం కూడా అందుబాటులో ఉంది.
- ఏఐసీటీఈ-ప్రగతి స్కాలర్‌షిప్ పేరుతో.. దేశ వ్యాప్తంగా అయిదు వేల మంది మహిళా విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేలు చొప్పున స్కాలర్‌షిప్‌ను అందిస్తారు.
- అదే విధంగా సాక్షమ్ స్కాలర్‌షిప్ పేరుతో దివ్యాంగ విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేల స్కాలర్‌షిప్ లభిస్తుంది.

ఉజ్వల అవకాశాలు

- ఆయా డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉజ్వల అవకాశాలు లభిస్తున్నాయి. వీరు పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ఈ సమయంలో నెలకు రూ.20 వేల వరకు వేతనం లభిస్తుంది. అదే విధంగా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే ఏఈఈ పోస్ట్‌లకు, రాష్ట్ర స్థాయిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే ఏఈఈ పోస్ట్‌లకు పోటీ పడొచ్చు.
- ఉన్నత విద్య కోణంలో పాలిటెక్నిక్ డిప్లొమా అర్హతగా నిర్వహించే ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఈసెట్)లో ర్యాంకు ఆధారంగా లేటరల్ ఎంట్రీ పేరుతో నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో అడుగుపెట్టే అవకాశం లభిస్తుంది.

ఎంట్రెన్స్ టెస్ట్‌లో రాణించేలా

మ్యాథమెటిక్స్

- పదో తరగతి పాఠ్య పుస్తకాల్లోని ప్రతి చాప్టర్‌ను అధ్యయనం చేసి.. వాటికి సంబంధించిన ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యా వ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖాగణితం, పేపర్-2లో రేఖాగణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రంపై పట్టు సాధించడం ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది.
- పాఠ్యపుస్తకంలో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం, త్రికోణమితి, క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలపై పట్టు సాధించాలి.

ఫిజిక్స్

ఈ సబ్జెక్ట్‌కు సంబంధించి ప్రయోగాలు-క్షేత్ర పర్యటనలు, సమాచార నైపుణ్యాలు -ప్రాజెక్ట్ పనులు, పటాలు-వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా కృషి చేయాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై కొంత ఎక్కువ శ్రద్ధతో చదవాలి. అదే విధంగా మూలకాల ధర్మాలు-వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

కెమిస్ట్రీ

ఆమ్లాలు-క్షారాలు, లవణాలు, పరమాణు నిర్మాణం, పి-బ్లాక్ ఎలిమెంట్స్, పిరియాడిక్ టేబుల్, మూలకాల వర్గీకరణ, అయోనైజేషన్ ఎనర్జీ, ఎలక్ట్రోనెగెటివిటీ, మెటాలిక్, నాన్-మెటాలిక్ ప్రాపర్టీస్, కెమికల్ బాండింగ్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ మెటలర్జీ, కార్బన్ కాంపౌండ్స్ తదితర ముఖ్యమైన యూనిట్లలోని అన్ని అంశాలను అధ్యయనం చేయాలి.

ముఖ్య సమాచారం


- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, ఏప్రిల్ 15
- **పాలిసెట్ పరీక్ష తేదీ:** 2025, ఏప్రిల్ 30 (ఉదయం 11 నుంచి 1 వరకు)
- **ఫలితాల వెల్లడి:** 2025, మే 10
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://polycetap.nic.in/BROCHURE.pdf

తెలంగాణ పాలిసెట్-2025

తెలంగాణ రాష్ట్రంలో పాలిటెక్నిక్ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అందించే డిప్లొమా కోర్సులు, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ అందించే డిప్లొమా కోర్సులు, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ అందించే డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ పాలిసెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది.

- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. 2025లో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.04.2025.
- **రూ.100 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 21.04.2025.
- **రూ.300 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 23.04.2025.
- **ప్రవేశ పరీక్ష తేది:** 13.05.2025.
- **వెబ్‌సైట్:** https://polycet.sbtet.telangana.gov.in

విద్య పరమావధి.. సమాజాభివృద్ధి



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఎస్‌జీటీ - సైన్స్ మెథడ్స్

బోధన సామగ్రి, బోధనాభ్యసన సామగ్రి, సైన్స్‌లో వనరుల వినియోగం

- వ్యవహారిక సత్తావాది అయిన జాన్ డ్యూయీ విద్యను త్రిధ్రువ ప్రక్రియగా వర్ణించారు.
- ఉపాధ్యాయుడు, విద్యార్థి, సమాజం.. త్రిధ్రువాలు.
- విద్య పరమావధి.. సమాజాభివృద్ధి.

సామాజిక వనరుల నిర్వచనం - వినియోగ లక్ష్యాలు - వినియోగించే పద్ధతులు

- **భౌతిక వనరులు:** ప్రకృతిలోని సరస్సులు, చెరువులు, పరిశ్రమలు.
- **సహజ వనరులు:** జంతువులు, వృక్షాలు, జంతు ప్రదర్శనశాలలు.
- **బౌద్ధిక వనరులు:** సమాజంలో వివిధ రంగా ల్లో నిష్ణాతులు, నిపుణులు, ప్రొఫెసర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు.

సామాజిక వనరులను ఎందుకు ఉపయోగించాలి?

- బోధనకు కావాల్సిన వస్తు సంపద లభిస్తుంది.
- ప్రత్యక్ష అనుభవాలుంటాయి.
- అమూర్త విషయాలను, మూర్త విషయాలు గా చేయొచ్చు.
- ప్రాతిపదిక అనుభవాల గురించి చక్కని అవగాహన ఏర్పడుతుంది.
- పాఠశాల - సమాజం మధ్య చక్కని సంబంధాలను ఏర్పర్చవచ్చు.

సామాజిక వనరుల వినియోగం- ప్రయోజనాలు

- నేర్చుకునే అంశంపై అవగాహన ఏర్పడుతుంది.
- పాఠశాల బోధనకు కావాల్సిన సామగ్రి, వనరులు సేకరించడం.
- పరిశీలన శక్తి, అన్వేషణ శక్తిని పెంపొందించే సన్నివేశాలు కల్పించడం.

సామాజిక వనరుల ఉపయోగంలో ఉపాధ్యాయుడి పాత్ర

- విద్యార్థులకు ప్రేరణ కలిగించాలి.
- మనిషికి-సమాజానికి-ప్రకృతికి గల సంబంధాన్ని వివరించాలి.
- సామాజిక కృత్యాలు - క్షేత్ర పర్యటనలు నిర్వహించాలి.
- పాఠశాలను సమాజంలోకి, సమాజాన్ని పాఠశాలలోనికి తీసుకురావాలి.

ఎడ్గార్ డేల్ అనుభవాల శంఖువు

- విద్యలో అనుభవాలను వాటి మూర్త, అమూర్త మితిని బట్టి డాక్టర్ ఎడ్గార్ డేల్ ఒక శంఖువు ఆకారక్రమాన్ని వివరించారు. అవి..
  - ప్రత్యక్ష ప్రాయోజిత అనుభవాలు
  - ప్రాతినిధ్య అనుభవాలు
  - నాటకీకరణ అనుభవాలు
  - ప్రత్యక్ష నిరూపణలు
  - అధ్యయన పర్యటనలు
  - ప్రదర్శన వస్తువులు
  - దూరదర్శన్ విద్యా కార్యక్రమాలు
  - రికార్డింగ్, రేడియో, చలన రహిత చిత్రాలు
  - దృశ్య సాంకేతికాలు
  - శాబ్దిక సాంకేతికాలు

బోధనోపకరణాలు-నిర్వచనాలు-బోధనాభ్యసన ప్రక్రియలో వాటి ప్రాముఖ్యత

- అభ్యసన క్రియలో ముఖ్యమైన ప్రేరణ, వర్గీకరణ, సన్నివేశ కల్పనలను పరిపూర్ణం చేసేవే బోధనోపకరణాలని కార్టర్ వి. గుడ్ అభిప్రాయం.
- దృష్టి, శ్రవణం అనే సంవేదనాత్మక మార్గాల ద్వారా అభ్యసనాన్ని ప్రోత్సహించే సాధ నాలే దృశ్యశ్రవ్య ఉపకరణాలు.

  \- విద్యా నిఘంటువు

బోధనోపకరణాలు - ప్రాముఖ్యత

- సంవేదనాత్మక శక్తుల సమగ్ర వినియోగం
- బోధన సిద్ధాంతాల ప్రాతిపదిక
- విద్యార్థుల అవధానాన్ని నిలిపి ఉంచడం
- ప్రత్యక్ష అనుభవాల ప్రత్యామ్నాయాలు
- వైవిధ్యత కలిగిన వివిధ అనుభవాల కూడళ్లు
- క్రమశిక్షణ సమస్యకు పరిష్కారాలు
- పునర్బలన కారకాలు

సమాచార, సాంకేతిక విజ్ఞానం

1. ఇంటర్‌నెట్ 2. రేడియో
3. టేప్ రికార్డర్ 4. టెలివిజన్

విజ్ఞానశాస్త్ర ప్రయోగశాల - ప్రయోజనాలు

- నిజ నిరూపణ జరుగుతుంది.
- ప్రక్రియా నైపుణ్యాల అభివృద్ధి
- శాస్త్రీయ నైపుణ్యాల అభివృద్ధి
- మానసిక సంతృప్తి కలుగుతుంది.
- విరామ సమయం సద్వినియోగం
- ఆర్థిక ప్రయోజనం
- జ్ఞానం ఒక సముద్రం వంటిది. దీన్ని పుస్తకాల ద్వారా మాత్రమే కాకుండా స్వీయ అనుభవాల ద్వారా కూడా సంపాదించొచ్చు.
  - వైజ్ఞానిక మ్యూజియాలు
  - వైజ్ఞానిక సంఘాలు
  - వైజ్ఞానిక కేంద్రాలు
  - వైజ్ఞానిక విద్యా అనుభవం
  - క్షేత్ర పర్యటనలు
  - విజ్ఞాన ప్రయోగశాల
  - హెర్బేరియం
  - వైవేరియం
  - అక్వేరియం
  - టెర్రేరియం
  - నక్షత్రశాల
- మ్యూజియం అనే పదం mouseion అనే గ్రీకు పదం నుంచి ఉద్భవించింది. mous eion అంటే విద్యార్థి దేవతల నిలయం.
- వైజ్ఞానిక ప్రదర్శనలను రాష్ట్రస్థాయిలో SCERT, జాతీయస్థాయిలో NCERT నిర్వహిస్తున్నాయి.

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రధాన కమిటీలు

1. వనరుల కమిటీ 2. సావనీర్ కమిటీ
3. ఆతిథ్య కమిటీ 4. క్రమశిక్షణ కమిటీ
5. మేనేజింగ్ కమిటీ
6. ప్రచారం ప్రెస్ కమిటీ 7. ప్రదర్శన కమిటీ
8. వసతి కమిటీ 9. ఆహార కమిటీ
10. చర్చ, క్విజ్, సాంస్కృతిక కమిటీ
11. ప్రాజెక్టు పుస్తక కమిటీ
12. న్యాయనిర్ణేతల కమిటీ

ఉత్తమ ప్రదర్శనకు కావాల్సిన అంశాలు

1. శాస్త్రీయ దృక్పథం
2. సహజత్వం - పనితనం
3. మన్నిక 4. ఆర్థికపరమైన విలువ
5. వ్యక్తిగత ఇంటర్వ్యూ

- **క్షేత్ర పర్యటనలు:** విద్యార్థి క్షేత్ర పర్యటన ద్వారా మొక్కలు, పక్షులు, పంటచేలు, వాగులు, కొండలు మొదలైన వాటి గురించి ఆహ్లాదంగా, స్వేచ్ఛగా ప్రత్యక్షానుభూతి ద్వారా విషయాన్ని నేర్చుకోగలుగుతాడు.
- **హెర్బేరియం:** ఎండబెట్టి భద్రపరిచిన మొక్క ల ఆల్బంను హెర్బేరియం అనొచ్చు.
- **వైవేరియం:** దీని ఏర్పాటు వల్ల మొక్కల సహజ సిద్ధమైన వాతావరణాన్ని తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది.
- **అక్వేరియం:** ఇది జలచర జీవులను తెలిపే ప్రదర్శనాంశం. ప్రపంచంలో జీవులు ఆహా రం కోసం ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నాయి.
- **టెర్రేరియం:** దీని ద్వారా సహజసిద్ధమైన వాతావరణంలో ఉభయచరాలు, భూచరా లైన జీవుల జీవన విధానాన్ని ప్రత్యక్ష అనుభవం ద్వారా పరిశీలించొచ్చు.
- **నక్షత్రశాల:** సామాన్య మానవుడికి ఖగోళం లోని నక్షత్ర మండలాలు, నక్షత్రరాశులు, నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు. తోక చుక్కల ఉనికి, గమనాలు మొదలైన విషయాలను విశదపరిచి ప్రత్యక్ష అనుభూతిని కలిగించవచ్చు.
- ప్రాచీన నక్షత్రశాలను ఒర్రేరి (Orrery) అంటారు. దీని ద్వారా విద్యార్థుల్లో స్వయం పరిశీలనశక్తి, శాస్త్రీయ దృక్పథం పెంపొందుతాయి.

క్షేత్ర పరిశీలనలకు ఉదాహరణ

1. పరిసరాలలోని మొక్కలు, జంతువులు
2. నేలలు - రకాలు 3. నీటివనరులు
4. పంట పొలాలు 5. చేపల పెంపకం
6. కోళ్ల పెంపకం
7. జంతుప్రదర్శనశాల
8. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
9. పురావస్తు ప్రదర్శనశాల
10. పరిశ్రమలు మొదలైనవి.

వైజ్ఞానిక ప్రదర్శనలు-నిర్వహణ: ప్రదర్శనకు అవసరమైన ప్రాంగణం - సదస్సు - వసతులు - బహుమతులు - సమయం. విద్యార్థుల్లోని వైజ్ఞానిక తృష్ణను, భావ వ్యక్తీకరణ విధానాన్ని, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడానికి తోడ్పడతాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఒర్రేరి అంటే?
   ఎ) నవీన నక్షత్రశాల
   బి) ప్రాచీన నక్షత్రశాల
   సి) చేపల పెంపకం డి) ఏదీకాదు
2. జాతీయ స్థాయిలో సైన్స్ ఫెయిర్‌ను తొలిసారి ఏర్పాటు చేసిన సంవత్సరం?
   ఎ) 1952 బి) 1954 సి) 1953 డి)1959
3. వైజ్ఞానిక సంఘానికి అధ్యక్షుడు?
   ఎ) సైన్స్ టీచర్ బి) ల్యాబ్ అసిస్టెంట్
   సి) ప్రధానోపాధ్యాయుడు డి) విద్యార్థి
4. టెర్రేరియంలో ఉండే జీవాలు?
   ఎ) ఉభయచరాలు బి) జలచరాలు
   సి) పక్షులు డి) మొక్కలు
5. నీటి మొక్కలను, జలచరాలను పెంచడానికి వాడే గాజుతొట్టి?
   ఎ) అక్వేరియం బి) హెర్బేరియం
   సి) వైవేరియం డి) టెర్రేరియం
6. ఎయిడ్స్ డే ఏ తేదీన నిర్వహిస్తారు?
   ఎ) అక్టోబర్ 26 బి) డిసెంబర్ 1
   సి) నవంబర్ 12 డి) సెప్టెంబర్ 8
7. మ్యూజియం అనే పదం ఏ భాష నుంచి ఉద్భవించింది?
   ఎ) గ్రీకు బి) అరబిక్
   సి) ఫ్రెంచ్ డి) లాటిన్
8. విద్యను త్రిధ్రువ ప్రక్రియగా వర్ణించినవారు?
   ఎ) ప్లేటో బి) అరిస్టాటిల్
   సి) డార్విన్ డి) డ్యూయీ
9. త్రిధ్రువ ప్రక్రియలో భాగం కానిది?
   ఎ) సమాజం బి) సంస్కృతి
   సి) విద్యార్థి డి) ఉపాధ్యాయుడు
10. స్థానిక వనరులు ఎన్ని?
    ఎ) 4 బి) 5 సి) 6 డి) 3
11. ఆంధ్రప్రదేశ్‌లో టెలీ స్కూల్ కార్యక్రమాలను ప్రసారం చేసేవారు?
    ఎ) NCERT బి) SCERT
    సి) APET డి) SIET
12. ప్రఖ్యాతిగాంచిన విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ మ్యూజియం ఎక్కడ ఉంది?
    ఎ) బెంగళూరు బి) మద్రాసు
    సి) ముంబై డి) ఢిల్లీ
13. ఎండబెట్టి భద్రపరిచిన మొక్కల ఆల్బం?
    ఎ) అక్వేరియం బి) హెర్బేరియం
    సి) ఒర్రేరి డి) వైవేరియం
14. ప్రైమరీ సైన్స్ కిట్‌లోని వస్తువుల రకాలు?
    ఎ) 4 బి) 5 సి) 3 డి) 6
15. శంఖువులో అగ్రభాగాన ఉన్న అనుభవాలు
    ఎ) కల్పిత అనుభవాలు
    బి) శాబ్దిక చిహ్నాలు
    సి) ప్రయోగాలు డి) చలనచిత్రాలు

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) ఎ; 5) ఎ; 6) బి; 7) ఎ; 8) డి; 9) బి; 10) డి; 11) డి; 12) ఎ; 13) బి; 14) సి; 15) బి

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ, హైదరాబాద్‌లో 19 సైంటిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 19.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 21.04.2025 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.1,37,907.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేది:** 21.04.2025.
- **వెబ్‌సైట్:** https://www.ngri.res.in

ఎస్‌బీఐలో మేనేజర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ (రీటైల్ ప్రొడక్ట్స్)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ, పీజీడీఎం, పీజీపీఎం, ఎంఎంఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 31.12.2024 నాటికి 28 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు మేనేజర్‌కు రూ.85,920 నుంచి రూ.1,05,280, డిప్యూటీ మేనేజర్‌కు రూ.64,820 నుంచి రూ.93,960.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేది:** 26.03.2025
- **వెబ్‌సైట్:** https://sbi.co.in

పీజీసీఐఎల్, న్యూఢిల్లీలో 28 ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్).. ఒప్పంద ప్రాతిపదికన ఫీల్డ్ సూపర్‌వైజర్(సేఫ్టీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 28.
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్శిటీ/సంస్థ నుంచి సంబంధిత విభాగంలో డిప్లొమా ఇంజనీరింగ్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 25.03.2025 నాటికి 29 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2025
- **వెబ్‌సైట్:** https://www.powergrid.in

ఆఫ్రికాలోని గడ్డి భూములను ఏమంటారు?



పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భూమి ఆవరణాలు

వాతావరణం

వాతావరణాన్ని ప్రధానంగా అయిదు భాగాలుగా వర్గీకరించవచ్చు.

ట్రోపో ఆవరణం: ధ్రువాల వద్ద 8 కి.మీ. భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు ఉంటుంది. సగటు ఎత్తు 13 కి.మీ. ఈ ఆవరణంలో సంవహన ప్రవాహాలు వీస్తాయి. వాతావరణంలోని మొత్తం వాయువుల్లో 75 శాతం వరకు ఈ పొరలోనే ఉంటాయి. శీతోష్ణస్థితులు, వర్షపాతం ఈ ఆవరణంలోనే సంభవిస్తాయి.

స్ట్రాటో ఆవరణం: దీని ఎత్తు 50 కి.మీ. ఈ ఆవరణంలో మబ్బులు ఉండవు. జెట్ విమానాలు ఇందులోనే ఎగురుతాయి. ఓజోన్ పొర ఈ ఆవరణంలోనే ఉంటుంది.

మీసో ఆవరణం: దీని ఎత్తు 80 కి.మీ. విశ్వం నుంచి ఉల్కలు ఈ ఆవరణంలోకి ప్రవేశించగానే కాలిపోతాయి.

థర్మో ఆవరణం (అయనో ఆవరణం): దీని ఎత్తు 400 కి.మీ. ఆయాన్లు అనే విద్యుదావేశ కణాలు ఈ ఆవరణంలోనే ఉంటాయి. వీటి కారణంగా రేడియో తరంగాలు భూమికి పరావర్తనం చెందుతాయి.

ఎక్సో ఆవరణం: దీని ఎత్తు 400 కి.మీ.పైన ఉంటుంది. తేలికైన హైడ్రోజన్, హీలియం పరమాణువులు ఈ ఆవరణంలో అధికంగా ఉంటాయి. ఇందులో వ్యోమనౌకలు, కృత్రిమ ఉపగ్రహాలు సంచరిస్తాయి.

మాదిరి ప్రశ్నలు

1. వాతావరణంలో నీటి ఆవిరి ఘనపరిమాణం ఎంతశాతం ఉంటుంది?
ఎ) 0.03 బి) 0.4
సి) 1.04 డి) 0.71

2. సమరూప ఆవరణంలో ఉండని ఆవరణం?
ఎ) ట్రోపో బి) స్ట్రాటో
సి) మీసో డి) థర్మో

3. 90 కి.మీ. కంటే పైన ఉన్న వాతావరణ పొరను ఏమంటారు?
ఎ) ఏకరూప ఆవరణం
బి) బహురూప ఆవరణం
సి) సమరూప ఆవరణం
డి) మీసో ఆవరణం

4. 'సాధారణ క్షీణతా క్రమం' అంటే ఏమిటి?
ఎ) ఎత్తుకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రత పెరుగుతూ, తగ్గుతూ ఉండటం
బి) ఎత్తుకు వెళ్లే కొద్దీ ఉష్ణోగ్రతల్లో విపరీతమైన మార్పులు సంభవించడం
సి) ఎత్తుకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతూ ఉండటం
డి) ఎత్తుకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రత పెరుగుతూ ఉండటం

5. 'అంతర అయన రేఖ అభిసరణ ప్రాంతం' అంటే ఏమిటి?
ఎ) అధిక పీడనం ఉన్న ప్రాంతం
బి) తక్కువ పీడనం ఉన్న ప్రాంతం
సి) పవనాల వేగం అధికంగా ఉన్న ప్రాంతం
డి) పవనాల వేగం తక్కువగా ఉన్న ప్రాంతం

6. 'కొరియాలిస్ ప్రభావం' వల్ల జరిగే ప్రధాన పరిణామం ఏమిటి?
ఎ) ఉత్తరార్ధ గోళంలోని పవనాల దిశలు, దక్షిణార్ధ గోళంలోని పవనాల దిశలు వ్యతిరేకంగా ఉంటాయి
బి) దక్షిణార్ధ గోళంలోని ఈశాన్య వ్యాపార పవనాలు, ఉత్తరార్ధ గోళంలోని నైరుతి వ్యాపార పవనాలు సమదిశలో వీస్తాయి
సి) పవనాలు ఉత్తరార్ధ గోళంలో ఎడమ వైపునకు, దక్షిణార్ధ గోళంలో కుడి వైపునకు వీస్తాయి
డి) పవనాలు ఉత్తరార్ధ గోళంలో కుడివైపునకు, దక్షిణార్ధ గోళంలో ఎడమ వైపునకు వీస్తాయి

7. భూమధ్య రేఖ వద్ద కొరియాలిస్ ప్రభావం ఏవిధంగా ఉంటుంది?
ఎ) శూన్యం బి) స్వల్పం
సి) అత్యధికం డి) అత్యల్పం

8. ప్రపంచ పీడన మేఖలలో నిరంతరాయంగా, క్రమబద్ధంగా వీచే గాలులను ఏమంటారు?
ఎ) రుతుపవనాలు
బి) స్థానిక పవనాలు
సి) ప్రపంచ పవనాలు
డి) వ్యాపార పవనాలు

ఉష్ణ స్థానిక పవనాలు..

- **చినూక్:** ఉత్తర అమెరికాలోని రాకీ పర్వతాల కింది భాగంలో వీస్తాయి.
- **ఫోన్:** యూరప్‌లోని ఆల్ప్స్ పర్వతాల ఉత్తర వాలుల మీదుగా వీస్తాయి.
- **లూ:** ఉత్తర భారతదేశంలో మే – జూన్ మధ్య వీచే వేడి గాలులు.
- **సిమ్మూన్:** అరేబియా ఎడారిలో వీస్తాయి.
- **యోమా:** జపాన్‌లో వీస్తాయి.
- **నార్వెస్టర్:** న్యూజిలాండ్‌లో వీస్తాయి.

శీతల స్థానిక పవనాలు..

- **మిస్ట్రాల్:** యూరప్‌లోని ఆల్ప్స్ పర్వతాల నుంచి ఫ్రాన్స్ మీదుగా రోమ్ లోయ ద్వారా మధ్యధరా సముద్రం వైపు వీస్తాయి.
- **ప్యూనా:** దక్షిణ అమెరికాలో ఆండీస్ ప్రాంతంలో వీస్తాయి.
- **పాంపెరో:** దక్షిణ అమెరికాలోని పంపా గడ్డి మైదాన ప్రాంతంలో వీస్తాయి.

అగాధం పేరు	మహా సముద్రం	లోతు (మీటర్లలో)
చాలెంజర్/ మెరియానా	పసిఫిక్	11,022
ప్యూర్టోరికో/ నేర్స్	అట్లాంటిక్	10,475
జావా	హిందూ	7,450

9. వాణిజ్య పవనాలు, పశ్చిమ పవనాలు వరుసగా ఏయే ప్రాంతాల్లో వీస్తాయి?
ఎ) ధ్రువ ప్రాంతం, భూమధ్యరేఖా ప్రాంతం
బి) సమశీతోష్ణ ప్రాంతం, ధ్రువ ప్రాంతం
సి) భూమధ్యరేఖా ప్రాంతం, ఉష్ణ మండలం
డి) ఉష్ణమండలం, సమశీతోష్ణమండలం

10. మాన్‌సూన్ (రుతుపవనాలు) అనేది 'మౌసమ్' అనే ఏ భాషా పదం నుంచి వచ్చింది?
ఎ) ఇంగ్లిష్ బి) లాటిన్
సి) గ్రీక్ డి) అరబిక్

11. ఒక ప్రాంతంలోని వాతావరణ పరిస్థితుల దీర్ఘకాల సగటు వివరాలను ఏమని పిలుస్తారు?
ఎ) శీతోష్ణస్థితి బి) ఉష్ణోగ్రత
సి) వాతావరణ సగటు నిష్పత్తి
డి) సమ ఉష్ణోగ్రత క్షీణత

12. వాతావరణంలోని నీటి ఆవిరిని దేని సహాయంతో కొలుస్తారు?
ఎ) వాతావరణ మాపకం
బి) ఆర్ద్రతా మాపకం
సి) పీడన మాపకం
డి) అవపాత మాపకం

13. గాలి సంతృప్త స్థాయికి చేరే ఉష్ణోగ్రతను ఏమని పిలుస్తారు?
ఎ) సాపేక్ష ఆర్ద్రత
బి) సాపేక్ష ఉష్ణోగ్రత
సి) ద్రవీభవన ఉష్ణోగ్రత
డి) నిర్దిష్ట ఆర్ద్రత

14. ద్రవీభవనం చెందినప్పుడు నీటి బిందువులు బరువెక్కి భూమి మీదకు పడటాన్ని 'ప్రెసిపిటేషన్' (Precipitation) అంటారు. ఇది ప్రెసిపిటేషియా అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. దీని అర్థం ఏమిటి?
ఎ) ఎత్తుకు ఎగరడం బి) కిందికి పడటం
సి) వేగంగా విస్తరించడం
డి) ఆలస్యంగా చలనంలోకి రావడం

15. దక్కన్ పీఠభూమి మధ్య భాగంలో వర్షచ్ఛాయా ప్రాంతం ఏర్పడటానికి కారణం?
ఎ) పర్వతీయ వర్షపాతం
బి) సంవహన వర్షపాతం
సి) చక్రీయ వర్షపాతం
డి) రుతుపవన వర్షపాతం

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) సి;
5) బి; 6) డి; 7) ఎ; 8) సి;
9) డి; 10) డి; 11) ఎ; 12) బి;
13) సి; 14) బి; 15) ఎ.

జీవావరణం

ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల అడవులు విస్తరించి ఉన్నాయి.

ఉష్ణమండల సతత హరిత అడవులు: భూమధ్య రేఖా ప్రాంతం, ఉష్ణమండలంలో విస్తరించి ఉన్నాయి. ఈ అడవులు దట్టంగా ఉంటాయి. ఇక్కడ వర్షాలు బాగా కురుస్తాయి. రోజ్‌వుడ్, ఎబోని, మహాగని లాంటి కఠిన దారు వృక్షాలు పెరుగుతాయి.

ఉష్ణమండల ఆకురాల్చే అడవులు: భారతదేశం, ఉత్తర ఆస్ట్రేలియా, మధ్య అమెరికాలో విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో సాల్, టేకు, వేప, శీషం లాంటి గట్టి చెట్లు పెరుగుతాయి.

సమశీతోష్ణ సతత హరిత అడవులు: వాయవ్య అమెరికా, దక్షిణ చైనా, వాయవ్య బ్రెజిల్‌లో విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో ఓక్, పైన్, నీలగిరి చెట్లు పెరుగుతాయి.

సమశీతోష్ణ ఆకురాల్చే అడవులు: ఈశాన్య అమెరికా, చైనా, న్యూజిలాండ్, చిలీ, పశ్చిమ యూరప్ తీర ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ ఓక్, యాష్, బిర్చ్ లాంటి చెట్లు పెరుగుతాయి.

మధ్యధరా అడవులు: మధ్యధరా సముద్రం చుట్టూ, కాలిఫోర్నియా (యూఎస్ఏ), నైరుతి ఆఫ్రికా, నైరుతి దక్షిణ అమెరికా, నైరుతి ఆస్ట్రేలియాలో విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో నిమ్మ, అంజూర, ఆలివ్, ద్రాక్ష తదితర చెట్లు పెరుగుతాయి.

శృంగాకార అడవులు (టైగా అడవులు): ఎత్తైన కొండలు, హిమాలయాల్లో విస్తరించి ఉన్నాయి. మెత్తటి కలపనిచ్చే చిర్, పైన్, సెడార్ తదితర వృక్షాలు పెరుగుతాయి.

టండ్రా అడవులు: ధ్రువ ప్రాంతాల్లో ఉన్నాయి. ఇందులో నాచు, లిచెన్, చిన్న చిన్న పొదల లాంటివి పెరుగుతాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఆఫ్రికాలోని గడ్డి భూములను ఏమని పిలుస్తారు?
ఎ) సవన్నాలు బి) స్టెప్పీలు
సి) టైగాలు డి) పంపాలు

2. ఆమ్ల వర్షాలు కురవడానికి ప్రధాన కారణం?
ఎ) అడవులను నరకడం
బి) వాతావరణంలో దుమ్ము, ధూళి కణాలు పెరగడం
సి) శిలాజ ఇంధనాలను అధికంగా ఉపయోగించడం
డి) ఓజోన్ పొర దెబ్బతినడం

3. 'క్యోటో ప్రోటోకాల్' ప్రధాన ఉద్దేశం ఏమిటి?
ఎ) హరిత గృహ వాయువుల ఉద్గారాలను పరిశీలించడం
బి) ఓజోన్ పొర దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించడం
సి) వాతావరణ కాలుష్య కారకాలను గుర్తించడం
డి) హరిత గృహ వాయువుల విడుదలను తగ్గించడం

4. 'క్యోటో ప్రోటోకాల్ (1997)' లక్ష్యాన్ని ఏయే సంవత్సరాల మధ్య చేరుకోవాలని నిర్ణయించారు?
ఎ) 1997-2010 బి) 2008-2012
సి) 2000-2020 డి) 2005-2015

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) బి.

It denotes the simple quality

BANK EXAMS

GENERAL ENGLISH

Degrees of Comparison

There are three Degrees of Comparison. The adjective which denotes the simple quality is said to be in the *Positive Degree*. It is used when no comparison is made. The adjective used to tell when two persons or things of the same class are compared together is said to be in *Comparative Degree*. When two or more persons or things of the same class are compared it is said to be in *Superlative Degree*. A few rules to remember:

1. The comparative degree is generally followed by the conjunction ***than***.

E.g.: Anil is wiser than Suresh.

Note: But the comparative can be used without ***than***.

E.g.: Ashok is the taller of the two boys.

2. The superlative degree is preceded by ***the*** and followed by ***of***.

E.g.: Raman is the ablest of all the boys.

3. The comparative is usually formed by adding ***–er*** to the positive and the superlative by adding ***–est*** to the positive.

E.g.:

Positive	*Comparative*	*Superlative*
Bold	bolder	boldest
Deep	deeper	deepest
Strong	stronger	strongest

4. When the positive ends in **-e**, only ***–r*** and **–st** are added to form the comparative and superlative.

E.g.:

Positive	*Comparative*	*Superlative*
Able	abler	ablest
Brave	braver	bravest
True	truer	truest

5. When the positive ends in one consonant and the consonant is preceded by a short vowel, the final consonant is preceded by a short vowel, the final consonant is doubled, and ***–er*** and ***–est*** are added to form the comparative and superlative.

E.g.:

Positive	*Comparative*	*Superlative*
Big	bigger	biggest
Fit	fitter	fittest
Wet	wetter	wettest

6. If the positive ends in ***y***, and the ***y*** is preceded by a consonant, the ***y*** is changed into ***-i***, and ***–er*** and ***–est*** are added to form the comparative and superlative.

E.g.:

Positive	*Comparative*	*Superlative*
Dry	drier	driest
Heavy	heavier	heaviest
Pretty	prettier	prettiest

7. But if the ***-y*** is preceded by a vowel, the ***–y*** is not changed into ***–i***, when ***–er*** and ***–est*** are added.

E.g.:

Positive	*Comparative*	*Superlative*
Grey	greyer	greyest

8. All adjectives of more than one syllable and many adjectives of two syllables, form the comparative by adding the word ***more*** to the positive, and the superlative by adding the word ***most*** to the positive.

E.g.:

Positive	*Comparative*	*Superlative*
Beautiful	more beautiful	most beautiful

9. Double comparatives and double superlatives should be avoided.

E.g.: He is more happier than you. (Incorrect)
He is happier than you. (Correct)

10. The word ***superior, inferior, senior, junior*** are followed by ***to*** instead of ***than***.

E.g.: This cloth is superior to that.

PRACTICE TEST

Choose the right option from the 4 options given below each sentence and indicate your answer choice.

1. Ramesh is the tallest in his family - means:
1) All are as tall as Ramesh
2) No one else is as tall as Ramesh
3) Some members are taller than Ramesh
4) Few members are tall as Ramesh.

2. Keats is greater than any other English poet (Change into Superlative Degree)
1) Keats is of the greatest English poets.
2) Keats is not the greatest English poet.
3) Keats is the greatest English poet.
4) No other English poet is so great as Keats.

3. Some rivers are at least as long as the Godavari. (Change into Superlative Degree)
1) The Godavari is not the longest of all rivers in India.
2) The Godavari is the longest river in India.
3) The Godavari is one of the longest rivers in India.
4) No Superlative degree.

4. Meena's house is more spacious than Veena's (Change into Positive Degree)
1) Meena's house more spacious
2) Veena's house is as spacious as Meena's house
3) Veena's house is more spacious than Meena's house
4) Veena's house is not as spacious as Meena's house

5. Gandhiji is one of the most famous Indian leaders (Change into Comparative Degree)
1) Gandhiji is not most famous Indian leaders
2) Gandhiji is not more than any other Indian leaders
3) Gandhiji is more famous than many other Indian leaders
4) Gandhiji is not more famous than any other Indian leaders

6. Everest is the highest peak in the world (Change into Comparative Degree)
1) Everest is higher than many other peaks in the world
2) Everest is higher than any other peaks in the world
3) A few peaks in the world are as high as Everest
4) No other peak in the world is so high an Everest

7. The pacific is deeper than any other Ocean (Change into Superlative Degree)
1) Pacific is not the deepest Ocean
2) Pacific is the deepest Ocean
3) Pacific is one of the deepest Oceans
4) No other Ocean is so deep as pacific.

8. No other girl in the college is so charming as Vasanthi. (Change into Superlative Degree)
1) Vasanthi is one of the most charming girls in our college.
2) Vasanthi is not one of the most charming girls in our college
3) Vasanthi is the most charming girl in our college
4) Vasanthi is more charming girl in our college

9. Mohith sharma bowls faster than Mohd. Shami (Change into Positive Degree)
1) Mohd. Shami bowls as fast Mohith Sharma
2) Mohd. Shami doesn't bowl so fast as Mohith Sharma
3) Mohd. Shami can bowl as fast as Mohith Sharma
4) Mohith Sharma bowls as fast as Mohd. Shami

10. Platinum is the most expensive metal (Change into Positive Degree)
1) No other metal is so expensive as platinum
2) Some other metals are at least as expensive as platinum
3) Very few metal are as expensive as platinum
4) Platinum is expensive metal.

11. Harshitha is the most beautiful girl in the class - means:
1) All the girls in the class are more beautiful than Harshitha
2) All the girls are as beautiful as Harshitha
3) No girl is so beautiful as Harshitha
4) Harshitha is not more beautiful than any other girl in the class.

12. Kashmir is cooler than many other places in India (Change into Positive Degree)
1) Kashmir is the coolest places in India.
2) No other place in India is so cool as Kashmir
3) Very few places in India are as cool as Kashmir.
4) Some places are at least as cool as Kashmir.

13. Raman is braver than Ashok. (Change into Positive Degree)
1) Ashok is braver than Raman.
2) Ashok is brave to Raman.
3) Raman is as brave as Ashok.
4) Ashok is not as brave as Raman.

ANSWERS

1) 2; 2) 3; 3) 3; 4) 4;
5) 3; 6) 2; 7) 2; 8) 3;
9) 2; 10) 1; 11) 3; 12) 3;
13) 4.

విద్య, ఉద్యోగ సమాచారం

పవర్‌గ్రిడ్‌లో 28 ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులు

మహారాష్ట్రలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ .. ఒప్పంద ప్రాతిపదికన ఫీల్డ్ సూపర్‌వైజర్(సేఫ్టీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, పవర్ సిస్టమ్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్, సివిల్, మెకానికల్, ఫైర్ టెక్నాలజీ అండ్ సేఫ్టీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25.03.2025 నాటికి 29 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.23,000 నుంచి రూ.1,05,000.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2025.
» **వెబ్‌సైట్:** www.powergrid.in

మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్, నాగ్‌పూర్‌లో 75 పోస్టులు

నాగ్‌పూర్‌లోని మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్(ఎంఓఐఎల్)లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 75.
» **పోస్టుల వివరాలు:** మైన్ ఫోర్‌మెన్1-12, సెలెక్ట్ గ్రేడ్ మైన్ ఫోర్‌మెన్-05, మైన్ మేట్ గ్రేడ్1-20, బ్లాస్టర్ గ్రేడ్2-14, వైండింగ్ ఇంజన్ డ్రైవర్2-24.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిప్లొమా, బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సెలెక్టెడ్ గ్రేడ్ మైన్ ఫోర్‌మెన్, మైన్ ఫోర్‌మెన్‌కు 45 ఏళ్లు, వైండింగ్ ఇంజన్ డ్రైవర్, మైన్‌మేట్ గ్రేడ్-1కు 40 ఏళ్లు, బ్లాస్టర్ గ్రేడ్ 2కు 35 ఏళ్లు నిండి ఉండాలి.
» **వేతనం:** నెలకు వైండింగ్ ఇంజన్ డ్రైవర్, మైన్ మేట్ గ్రేడ్ 1కు రూ.24,800 నుంచి రూ.44,960, బ్లాస్టర్‌కు రూ.24,100 నుంచి రూ.43,690, సెలెక్టెడ్ గ్రేడ్ మైన్ ఫోర్‌మెన్‌కు రూ.27,600 నుంచి రూ.50,040, మైన్ ఫోర్‌మెన్‌కు రూ.26,900 నుంచి రూ.48,770.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.03.2025.
» **వెబ్‌సైట్:** https://moil.nic.in/

ఎస్ఆర్ఎఫ్‌టీఐ, కోల్‌కతాలో 28 పోస్టులు

కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఆర్ఎఫ్‌టీఐ).. వివిధ విభాగాల్లో భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-07, అసిస్టెంట్ ప్రొఫెసర్-12, బ్రాడ్‌కాస్ట్ ఇంజనీర్-01, ప్రొడక్షన్ మేనేజర్-01, ప్రొడక్షన్ మేనేజర్(ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా)-01, అసిస్టెంట్ బ్రాడ్‌క్యాస్ట్ ఇంజనీర్-01, ఎడిటర్(ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా)-01, సౌండ్ రికార్డిస్ట్(ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా)-01, వీడియోగ్రాఫర్(ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా)-01, అసోసియేట్ ప్రొఫెసర్(డైరెక్షన్, ఎడిటింగ్)-02.
» **విభాగాలు:** సినిమాటోగ్రఫీ, రైటింగ్, ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా, డైరెక్షన్, ప్రొడ్యూసింగ్, ఎడిటింగ్, మేనేజ్‌మెంట్, యానిమేషన్ సినిమా, ఎస్ఆర్‌డీ, యానిమేషన్, మేనేజర్ మొదలైనవి.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ డిప్లొమా, డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 63 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,55,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,34,900, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,13,600, ప్రొడక్షన్ మేనేజర్(ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా)కు రూ.87,675, సౌండ్ ఇంజనీర్, వీడియోగ్రాఫర్, ఎడిటర్, అసిస్టెంట్ బ్రాడ్‌క్యాస్ట్ ఇంజనీర్‌కు రూ.70,200.
» **ఎంపిక విధానం:** ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.03.2025.
» **వెబ్‌సైట్:** https://srfti.ac.in/

